

'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 183

సోమవారం 23-9-2024


SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



జ్ఞాపక శక్తికి ఏడు సూత్రాలు

ఉరుకులు పరుగుల జీవితంలో ప్రతి పనికి ఏదో ఒక వస్తువుపై ఆధారపడటం సాధారణంగా మారింది. ఇది మోతాదుకు మించటంతో జ్ఞాపక శక్తిపైనా ప్రభావం చూపుతోంది. అందుకే జ్ఞాపక శక్తిని పెంచుకోవటానికి కొన్ని సూత్రాలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.

- వివరాలు 16లో



Cheil-22539/24


'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 183

సోమవారం 23-9-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



280 పరుగుల తేడాతో...

తొలి టెస్టులో బంగ్లాదేశ్‌పై భారత్ ఘనవిజయం - 14లో



ఎన్నారైలకు ఫండ్స్ రూట్!

స్వదేశంలో పెట్టుబడి అవకాశాలు.. దీర్ఘకాలంలో మంచి రాబడులు - 15లో



కశ్మీరీల హక్కులు కాపాడుతాం

జమ్మూకశ్మీర్ ప్రజల రాజ్యాంగ హక్కుల రక్షణకు కాంగ్రెస్ కట్టుబడి ఉంటుందని ఆ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే పునరుద్ఘాటించారు.

- వివరాలు 6లో▶



ఇరాన్ గనిలో పేలుడు

ఇరాన్‌లోని టబాస్ గనిలో భారీ పేలుడు సంభవించి 50 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా.. 20 మంది గాయపడ్డారు.

- వివరాలు 6లో▶



మోదీకీ రిటైర్మెంట్ ఇస్తారా?

75 ఏళ్లు దాటిన నేతలు పదవుల నుంచి తప్పుకోవాలన్న నిబంధనను మోదీకీ వర్తింపజేస్తారా? అని ఆరెస్సెస్‌ను కేజ్రీవాల్ ప్రశ్నించారు.

- వివరాలు 6లో▶



ఇజ్రాయెల్‌పై యుద్ధమే..

లెబనాన్‌కు చెందిన హెజ్బొల్లా ఇజ్రాయెల్‌పై ప్రతీకార దాడులకు పూనుకుంది. లక్ష్యాలపైకి 100కుపైగా రాకెట్లను ప్రయోగించింది.

- వివరాలు 6లో▶



మనమే ప్రపంచ సారథులం


▲ ఆదివారం న్యూయార్క్‌లో ప్రవాస భారతీయులతో సమావేశంలో అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ

అనుసరించే రోజులకు చెల్లు

భారతీయ అమెరికన్లను ఉద్దేశించి ప్రసంగంలో ప్రధాని మోదీ

- కిక్కిరిసిపోయిన న్యూయార్క్‌లోని నాసా కొలోజియం
- 42కుపైగా రాష్ట్రాల నుంచి తరలివచ్చిన ఎన్నారైలు
- ఎన్నారైలకు ప్రపంచమంతా జేజేలు కొడుతోందన్న మోదీ
- భారత కీర్తి పతాకను ఎగరేస్తున్నారని కితాబు

స్వేచ్ఛాయుత ఇండో పసిఫిక్

అదే క్వాడ్ లక్ష్యం: మోదీ 6లో

ఎమ్మెల్యేలూ.. జర జాగ్రత్త..!

కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

అవినీతికి తావివ్వకండి.. పోస్టింగుల విషయంలో జోక్యం చేసుకోకండి

గత ప్రభుత్వంలో అలా చేయడం వల్లే ఓటమిపాలయ్యారు

జాగ్రత్తగా పనిచేస్తే రెండోసారి కూడా అధికారం మనదే..

ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి చేర్చే బాధ్యత తీసుకోవాలి

- 9 నెలల్లో ఒక్కరోజూ సెలవు తీసుకోకుండా పనిచేశా
- మహేశ్‌గౌడ్ నిబద్ధత వల్లే పీసీసీ చీఫ్ పదవి వరించింది
- పార్టీలో కష్టపడి పనిచేస్తే కచ్చితంగా అవకాశాలు 2లో
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఎమ్మెల్యేలకు వివరించిన సీఎం
- కొత్త రేషన్‌కార్డుల గురించి వివరించిన మంత్రి ఉత్తమ్
- కార్యకర్తల రుణం తీర్చుకోవాలి.. వారి కోసం ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పనిచేయాలి: మహేశ్‌గౌడ్


సీఎల్పీ భేటీలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డి

చంద్రబాబు స్వార్థ రాజకీయం..

జరగని తప్పుపై రాద్ధాంతం

కల్తీ నెయ్యిని వాడనే లేదు.. ఇక అపచారానికి తావెక్కడ?

తిరుమల శ్రీవారి లడ్డూ తయారీపై సీఎం చంద్రబాబు నిరాధార ఆరోపణలు

ప్రధాని నరేంద్ర మోదీకి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ లేఖ

- ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల విశ్వాసాలను దెబ్బతీశారు
- ఇలా చేయడం దుర్మార్గమని, అన్యాయమని చంద్రబాబును మందలించండి
- ఆలయ పవిత్రతను దెబ్బ తీయొద్దని గట్టిగా చీవాట్లు పెట్టండి
- టీటీడీ ఔన్నత్యం దెబ్బతీనేలా నిస్సిగ్గుగా వ్యవహరించడం తగదని బుద్ధి చెప్పండి



సాక్షి, అమరావతి : పచ్చి అబద్ధాలు చెప్పే అలవాటున్న సీఎం చంద్రబాబునాయుడు రాజకీయ స్వార్థ రాజకీయాల కోసం పరమ పవిత్రమైన తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంపై తప్పుడు ప్రచారం చేస్తూ కోట్లాది మంది భక్తుల విశ్వాసాలను దెబ్బ తీసే స్థాయికి దిగజారారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. జరగని తప్పుపై రాద్ధాంతం చేస్తున్న చంద్రబాబుకు బుద్ధి చెప్పాలని కోరారు. లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ అయిన నెయ్యిని ఉపయోగించనప్పుడు తప్పు జరిగే అవకాశమే

మిగతా 12వ పేజీలో ▶

శ్రీలంక అధ్యక్షుడిగా దిస్సనాయకే

నేడు ప్రమాణం చేయనున్న మార్క్సిస్ట్ నేత

- మొదటిసారిగా రెండో రౌండ్ ఓట్ల లెక్కింపులో తేలిన ఫలితం
- తొలి రౌండ్‌లోనే నిష్క్రమించిన ప్రస్తుత అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే
- దెబ్బతిన్న దేశ ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టడమే దిస్సనాయకే ముందున్న కర్తవ్యం 6లో

ప్రజలకు అభివాదం చేస్తున్న దిస్సనాయకే ▶



న్యూస్‌రీల్


శంకర్‌బాబుని పిలవండి... డ్యాన్స్ చేస్తాడనేవారు



156 చిత్రాలు.. 537 పాటలు.. 24 వేల డ్యాన్స్ మూమెంట్స్... ఈ అరుదైన ఫీట్ సాధించినందుకుగాను మెగాస్టార్ చిరంజీవి పేరు గిన్నిస్ వరల్డ్ రికార్డుల్లో చేరింది.

వివరాలు 13లో▶

పీజీ మెడికల్ సీట్లపై కత్తి!



కొత్త మెడికల్ కాలేజీలు తేవాలన్న తాపత్రయంతో ఉన్న కాలేజీల్లోని ప్రొఫెసర్లను, అసోసియేట్ ప్రొఫెసర్లను బదిలీ చేయడంతో కథ అడ్డం తిరిగింది. డీఎంఈ నిర్వాకంతో రాష్ట్రంలో పీజీ మెడికల్ సీట్లకు గండిపడే ప్రమాదం నెలకొంది.

వివరాలు 3లో▶

నేడు బంగాళాఖాతంలో అల్పపీడనం



పశ్చిమ, మధ్య బంగాళాఖాతంలో సోమవారం అల్పపీడనం ఏర్పడొచ్చని వాతావరణ శాఖ పేర్కొంది. దాని ప్రభావంతో రాష్ట్రంలో 3 రోజులపాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవొచ్చని అంచనా వేసింది.

వివరాలు 2లో▶

కాలకృత్యం.. నిత్య నరకం!



రాష్ట్రంలోని సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో కనీస వసతులు లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. విద్యార్థుల సంఖ్యకు తగినట్టుగా టాయిలెట్లు, బాత్రూమ్‌లు లేక.. ఉన్న కాసిన్ని కూడా సరిగా లేక నానా తంటాలు పడుతున్నారు.

వివరాలు 16లో▶

ఇదండీ జాతర



ఇది.. మనం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాట్లాడాల్సిన మాటేమో సార్!



బంగారం.. మన చదరంగం

ప్రతిష్టాత్మక చెస్ ఒలింపియాడ్‌లో భారత పురుషుల, మహిళల జట్లు తొలిసారి చాంపియన్స్‌గా అవతరించాయి. బుడాపెస్ట్‌లో ముగిసిన ఈ మెగా ఈవెంట్‌లో గ్రాండ్‌మాస్టర్లు ఇరిగేశి అర్జున్ (తెలంగాణ), గుకేశ్, ప్రజ్ఞానంద (తమిళనాడు), విదిత్ (మహారాష్ట్ర), పెంటేల హరికృష్ణ (ఆంధ్రప్రదేశ్)లతో కూడిన భారత పురుషుల జట్టు 21 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. గ్రాండ్‌మాస్టర్లు ద్రోణవల్లి హారిక (ఆంధ్రప్రదేశ్), వైశాలి (తమిళనాడు)... అంతర్జాతీయ మాస్టర్లు దివ్య (మహారాష్ట్ర), వంతిక, తానియా (ఢిల్లీ)లతో కూడిన భారత మహిళల జట్టు 19 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో నిలిచింది. 14లో



సిట్టింగ్ జడ్జితో విచారణ


మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్

అమృత్ టెండర్లలో అక్రమాలపై కేటీఆర్ డిమాండ్

- తేదీ, సమయం చెబితే సీవీసీ దగ్గరకైనా వెళదాం
- అవినీతి జరగలేదని వారు తేలిస్తే నేను రాజకీయ సన్యాసం తీసుకుంటా
- సింగరేణి కార్మికులకు ఇచ్చింది బోగస్ అని ధ్వజం

సాక్షి, హైదరాబాద్: అమృత్ టెండర్లలో అక్రమాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు విజ్ఞప్తి చేసేందుకు హైకోర్టు సిట్టింగ్ జడ్జి లేదా కేంద్ర విజిలెన్స్ కమిషనర్ దగ్గరికైనా వెళ్దామని అన్నారు. అమృత్ టెండర్లలో తప్పు జరిగిందని తేలిస్తే మంత్రి పదవికి రాజీనామా చేస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సవాల్ విసిరిన నేపథ్యంలో ఆదివారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. పొంగులేటి సవాల్‌ను స్వీకరిస్తున్నానని స్పష్టం చేశారు. 'ఒక మంత్రి తప్పు జరిగిందని నిరూపిస్తే రాజీనామా చేస్తానని బిల్డప్ ఇచ్చారు. మీకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఇద్దరం కలిసి హైకోర్టు సీజే దగ్గరకి పోదాం. వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించమని కోరదాం. సిట్టింగ్ జడ్జి గనుక ఇందులో తప్పు జరగలేదని అంటే.. నేను రాజకీయ సన్యాసం చేస్తా. హైకోర్టు సీజే దగ్గరికి రావడానికి మంత్రిగారికి ఇబ్బంది ఉందంటే డేట్, టైం ఫిక్స్ చేస్తే ఇద్దరం కలిసి కేంద్రంలో ఉండే సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ (సీవీసీ) దగ్గరికి పోదాం. ఒకవేళ మీరు రాకపోయినా వచ్చే వారంలో సీవీసీకి ఆధారాలు సమర్పిస్తా. సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రికి ఒకటే చెప్తున్నా.. ఇప్పటికైనా టెండర్లు రద్దు చేయాలి..' అని కేటీఆర్ అన్నారు.

సోదరుడు, బావమరిది ఆ స్థాయికి ఎలా ఎదిగారో సీఎం చెప్పాలి

'సీఎంను పొంగులేటి ఇరకాటంలో పెట్టే ప్రయత్నం చేస్తున్నట్లు కనిపిస్తోంది. వాస్తవానికి పొంగులేటి రాజీనామా చేయాల్సిన అవసరం లేదు. సీఎం రేవంత్ రాజీనామా చేయాలి. ఈ ప్రభుత్వంలోని మంత్రులకు చట్టాలు మాత్రమే కాదు చుట్టరికాలు కూడా తెలిసినట్టు లేదు. భార్య తమ్ముడు

మిగతా 3వ పేజీలో ▶

దసరాకు 'కేబినెట్' ధమాకా!

వచ్చే నెల ఐదో తేదీ తర్వాత ఎప్పుడైనా రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ!

పీసీసీ అధ్యక్ష నియామకం పూర్తయిన నేపథ్యంలో.. కేబినెట్ విస్తరణకు అధిష్టానం గ్రీన్ సిగ్నల్

- డిప్యూటీ సీఎం భట్టి విదేశీ పర్యటన పూర్తికాగానే.. ఢిల్లీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉత్తమ్, మున్షీ, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్
- మరోమారు చర్చల తర్వాత బెర్తుల ఖరారు.. సామాజిక సమతుల్యత ప్రాతిపదికగానే భర్తీ
- ప్రస్తుతం సీఎం సహా 11 మంది మంత్రులు.. కొత్తగా మరో ఆరుగురికి అవకాశం 2లో

8 ఎకరాల్లోని 44 నిర్మాణాలు కూల్చివేత

- మూడు ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగించిన హైడ్రా
- కూకట్‌పల్లి నల్లచెరువు ఎఫ్‌టీఎల్‌లోని 16 షెడ్లు
- మరో రెండు చోట్ల సర్కారు భూమిలోని విల్లాలు..
- వివరాలు వెల్లడించిన కమిషనర్ ఏవీ రంగనాథ్


5లో కూకట్‌పల్లిలోని నల్లచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలను కూల్చేస్తున్న దృశ్యం

మళ్లీ హైడ్రా పంజా

కిష్టారెడ్డిపేట్, పటేల్‌గూడల్లో అక్రమ నిర్మాణాల కూల్చివేత

రాత్రి వరకు కొనసాగిన కూల్చివేత ప్రక్రియ

5లో



ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.కోటి విరాళం అందజేస్తున్న గీతం యూనివర్సిటీ అధ్యక్షుడు, ఏపీ ఎంపీ శ్రీభరత్

దసరాకు 'కేబినెట్' ధమాకా!

వచ్చే నెల ఐదో తేదీ తర్వాత ఎప్పుడైనా రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ!



- పీసీసీ అధ్యక్ష నియామకం పూర్తయిన నేపథ్యంలో.. కేబినెట్ విస్తరణకు అధిష్టానం గ్రీన్ సిగ్నల్
- డిప్యూటీ సీఎం భట్టి విదేశీ పర్యటన పూర్తికాగానే.. ఢిల్లీకి రేవంత్, ఉత్తమ్, మున్షీ, మహేశ్‌గౌడ్
- మరోమారు చర్చల తర్వాత బెర్తుల ఖరారు.. సామాజిక సమతుల్యత ప్రాతిపదికగానే భర్తీ
- ప్రస్తుతం సీఎం సహా 11 మంది మంత్రులు.. కొత్తగా మరో ఆరుగురికి అవకాశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు ఎట్టకేలకు ముహూర్తం కుదిరింది. దసరా పండుగ సమయంలో కొత్త మంత్రులను నియమించేందుకు కాంగ్రెస్ అధిష్టానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది. టీపీసీసీ అధ్యక్షుడి నియామక ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో.. కేబినెట్ విస్తరణకు అడ్డంకులు తొలగినట్టేనని, ఈసారి మంత్రివర్గ విస్తరణ ఖాయమని గాంధీ భవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వచ్చే నెల 5వ తేదీ తర్వాత ఎప్పుడైనా కొత్త మంత్రులు కొలువుదీరనున్నారని నేతలు చెబుతున్నారు. ఎవరెవరికి చాన్స్ ఇవ్వాలన్న దానిపై మరోమారు చర్చలు జరిపి ఖరారు చేయనున్నట్టు వివరిస్తున్నారు.

బెర్తుల కోసం పోటాపోటీ

నిబంధనల ప్రకారం.. రాష్ట్రంలో గరిష్టంగా సీఎం సహా 18 మందికి మంత్రివర్గంలో చోటు ఉంటుంది. ప్రస్తుతం సీఎంతోపాటు 11 మంది మంత్రులు ఉన్నారు. దీనితో మరో ఆరుగురికి మంత్రివర్గంలో చోటు కల్పించే వెసులుబాటు ఉంది. వీటి కోసం తీవ్ర పోటీ నెలకొంది. పదేళ్ల తర్వాత పార్టీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో.. తమకంటే తమకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని ఎమ్మెల్యేలు పట్టుబడుతున్నారు. ప్రస్తుతం కేబినెట్లో ప్రాతినిధ్యం లేని జిల్లాల నుంచే కాకుండా.. మిగతా జిల్లాల నుంచి కూడా డజను మందికి పైగా ఎమ్మెల్యేలు తమకు కేబినెట్ బెర్త్‌పై ఆశతో ఉన్నారు. ఇప్పటివరకు ప్రాతినిధ్యం లేని జిల్లాల నుంచి పరిశీలిస్తే.. మల్‌రెడ్డి రంగారెడ్డి, టి.రామ్మోహన్‌రెడ్డి (రంగారెడ్డి), జి.వివేక్, జి.వినోద్, కె.ప్రేమ్‌సాగర్‌రావు (ఆదిలాబాద్), పి.సుదర్శన్‌రెడ్డి (నిజామాబాద్), దానం నాగేందర్, అమీన్ అలీఖాన్ (హైదరాబాద్) మంత్రి పదవులు ఆశిస్తున్నారు. ఇక కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, బాలు నాయక్ (నల్లగొండ), వాకిటి శ్రీహరి (మహబూబ్‌నగర్), టి.జీవన్‌రెడ్డి (కరీంనగర్) కూడా కేబినెట్ బెర్త్ కోసం ఒత్తిడి చేస్తున్నారు. వీరికితోడు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎమ్మెల్యే కె.మదన్‌మోహన్‌రావు, ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య, వేముల వీరేశం తదితరులు కూడా సామాజిక వర్గాల ప్రాతిపదికన చాన్స్ ఇవ్వాలని విజ్ఞప్తులు చేస్తున్నారు.

సామాజిక సమీకరణాలే ప్రాతిపదికగా..

కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో ఎవరెవరిని మంత్రివర్గంలోకి తీసుకోవాలన్న దానిపై అధిష్టానం ఇప్పటికే పలుమార్లు రాష్ట్ర నాయకత్వంతో చర్చలు జరిపింది. పీసీసీ అధ్యక్ష పదవికి, కేబినెట్ విస్తరణకు మధ్య సామాజిక వర్గాల వారీగా లెక్కలు కుదరకపోవడంతో నిర్ణయం వాయిదా పడుతూ వచ్చింది. తాజాగా పీసీసీ అధ్యక్షుడిగా బీసీ నేతను నియమించడంతో మిగతా సామాజిక వర్గాలకు మంత్రివర్గంలో స్థానం కల్పించే విషయంలో ఓ నిర్ణయం తీసుకునే వెసులుబాటు కలిగింది. ప్రస్తుతం మంత్రిమండలిలో ఏడుగురు ఓసీ వర్గానికి చెందినవారు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇద్దరు ఎస్సీలు, ఇద్దరు బీసీలు, ఒక ఎస్టీ నేత ఉన్నారు. కులాల వారీగా చూస్తే నలుగురు రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారు. ప్రస్తుతం రెడ్లకే చెందిన మరో నేతకు మంత్రివర్గంలో అవకాశం ఇవ్వనున్నట్టు అంచనా. మాదిగ, ఎస్టీ (లంబాడా), బీసీ సామాజిక వర్గాలకు కూడా ఒక్కో బెర్త్ కేటాయించాల్సి ఉంటుందని చెబుతున్నారు. మిగతా రెండు పదవులు ఎవరికన్నది పార్టీ వెసులుబాటు ప్రకారం కేటాయించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.

ఇతర పదవుల భర్తీ కూడా..

వివిధ వర్గాలకు మంత్రివర్గంలో స్థానంతోపాటు అసెంబ్లీలో చీఫ్ విప్, విప్ పదవులు కూడా ఇచ్చే చాన్స్ ఉంది. వీటితోపాటు కీలకమైన ఆర్టీసీ, మైనింగ్, ఎంఐడీసీ, మూసీ డెవలప్‌మెంట్ వంటి కీలక కార్పొరేషన్లకు ఎమ్మెల్యేలను చైర్మన్లుగా నియమిస్తారనే చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో ఏ పదవి ఎవరికి ఇవ్వాలన్న దానిపై సామాజిక వర్గాల కోణంలో నిర్ణయం ఉంటుందని అంటున్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విదేశీ పర్యటన నుంచి వచ్చిన తర్వాత.. ఆయనతోపాటు సీఎం రేవంత్, సీనియర్ మంత్రి ఉత్తమ్, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ తదితరులు ఢిల్లీ వెళ్లి.. అధిష్టానంతో చర్చించనున్నట్టు సమాచారం. మొత్తమ్మీద దసరా పండుగకు మంత్రివర్గ విస్తరణ ఉంటుందనే చర్చ.. రాష్ట్ర కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో ఆసక్తి రేకెత్తిస్తోంది.

క్లుప్తంగా...

సీపీఏ ఇండియా రీజియన్ సదస్సుకు స్పీకర్



సాక్షి, హైదరాబాద్: ఢిల్లీలో సోమవారం నుంచి జరగనున్న 10వ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీపీఏ) ఇండియా రీజియన్ సదస్సులో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొంటారు. ఈ మేరకు ఆదివారం ఢిల్లీకి వెళ్లారు. సోమ, మంగళవారాల్లో జరగనున్న ఈ సదస్సుకు తెలంగాణ రాష్ట్రం నుంచి స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయనతో పాటు శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ ముదిరాజ్, లెజిస్లేటివ్ సెక్రటరీ డాక్టర్ వి.నరసింహాచార్యులు, జాయింట్ సెక్రటరీ ఉపేందర్ రెడ్డిలు సైతం ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొంటారు.

చిరంజీవికి సీఎం రేవంత్, కిషన్‌రెడ్డి అభినందనలు

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ నటుడు కొణిదెల చిరంజీవికి డ్యాన్స్‌లో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఇది తెలుగువారు గర్వించదగ్గ విషయమని ముఖ్యమంత్రి ఎక్స్ వేదికగా అభినందించారు. డాన్స్ అంటే మెగాస్టార్ అని, గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ చిరంజీవికి అవార్డును అందజేయడం తెలుగువారందరికీ గర్వకారణమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. స్వయంకృషితో అత్యున్నత శిఖరాలను చేరుకున్న చిరంజీవి ఆరు పదుల వయసులోనూ ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తున్నారని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అభినందించారు. వందలాది సినిమాల్లో అత్యుత్తమ నటనను ప్రదర్శించిన చిరంజీవిని గిన్నిస్ బుక్ గుర్తించడం హర్షణీయమని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ పేర్కొన్నారు.

సింగరేణి భాగస్వామ్యాన్ని ఒప్పుకోం

సాక్షి, హైదరాబాద్: రామగుండంలో నిర్మించనున్న థర్మల్ ప్లాంట్‌లో సింగరేణి భాగస్వామ్యాన్ని ఒప్పుకునేది లేదని తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ స్పష్టం చేసింది. హైదరాబాద్‌లోని జెన్‌కో ఆడిటోరియంలో ఆదివారం అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశంలో పలు తీర్మానాలు చేసినట్టు అధ్యక్ష, కార్యదర్శులు రత్నాకర్ రావు, సదానందం వెల్లడించారు. టీజీ జెన్‌కో –సింగరేణి ఆధ్వర్యంలో జాయింట్ వెంచర్‌గా 800 మెగావాట్ల ప్లాంట్ నిర్మించాలన్న నిర్ణయాన్ని సమావేశం తీవ్రంగా వ్యతిరేకించింది. ప్రభుత్వ రంగ సంస్థ టీజీ జెన్‌కో ద్వారానే రామగుండం ప్లాంట్ నిర్మించాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. రెగ్యులర్ సీఎండీలు, డైరెక్టర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, జాబ్ క్యాలెండరు ప్రకటించాలని, అవసరమైన పోస్టులను సృష్టించాలని, ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని సమావేశం డిమాండ్ చేసింది. సమావేశంలో అసోసియేట్ ప్రెసిడెంట్ వెంకటనారాయణ రెడ్డి, అడిషనల్ సెక్రటరీ జనరల్ అంజయ్య, ముఖ్య సలహాదారు ఎం.శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు టీజేఏసీ కార్యనిర్వాహక కమిటీ సమావేశం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ తొలి భేటీ మంగళవారం ఉదయం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనుంది. టీజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి.. అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల ప్రతినిధులు హాజరు కానున్నారు. సమావేశం అనంతరం పూర్తిస్థాయి కమిటీతో పాటు.. జిల్లా కమిటీలను సైతం ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఎమ్మెల్సీగా ఎన్నికైన ప్రొఫెసర్ కోదండరామ్‌ను టీజేఏసీలోని 205 సంఘాల ప్రతినిధులు సన్మానించనున్నారు.

ఎమ్మెల్యేలూ.. జర జాగ్రత్త!

కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

- జాగ్రత్తగా పనిచేస్తే రెండోసారి కూడా అధికారం మనదే..
- ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి చేర్చే బాధ్యత తీసుకోవాలి
- గత 9 నెలల్లో ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేశా..
- కాంగ్రెస్‌లో కష్టపడి పనిచేస్తే కచ్చితంగా అవకాశాలు లభిస్తాయని వ్యాఖ్య
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఎమ్మెల్యేలకు వివరించిన ముఖ్యమంత్రి



సీఎల్పీ సమావేశానికి ముందు సంతకం చేస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రి ఉత్తమ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో జాగ్రత్తగా పనిచేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అవినీతికి తావు ఇవ్వొద్దని, ముఖ్యంగా అధికారుల పోస్టింగ్‌ల విషయంలో జోక్యం చేసుకోకుండా ఉంటే మంచిదని స్పష్టం చేసినట్టు తెలిసింది. గత ప్రభుత్వంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు విచ్చలవిడిగా అవినీతికి పాల్పడటం, పోస్టింగుల విషయంలో జోక్యం చేసుకోవడం వల్లే ఓటమి పాలయ్యారని వ్యాఖ్యానించినట్టు సమాచారం. అందువల్ల ఎలాంటి ఆరోపణలు, విమర్శలకు అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తగా పనిచేసుకుంటే.. రెండోసారి కూడా అధికారంలోకి వస్తామని పేర్కొన్నట్టు తెలిసింది. టీపీసీసీ నూతన అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్‌గౌడ్ బాధ్యతల స్వీకారం నేపథ్యంలో.. ఆయనకు అభినందనలు తెలిపేందుకు ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో సీఎల్పీ సమావేశమైంది. ఈ కార్యక్రమంలో మహేశ్ కుమార్‌గౌడ్‌ను పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు సన్మానించారు. మహేశ్‌గౌడ్ నియామకంపై పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ధన్యవాదాలు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించారు. అనంతరం రాష్ట్ర రాజకీయాలు, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీలో సమన్వయం తదితర అంశాలపై చర్చించారు.

సమన్వయంతో ముందుకు వెళ్లాలి

సమావేశంలో సీఎం రేవంత్ మాట్లాడుతూ.. పార్టీ, ప్రభుత్వం సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం గత తొమ్మిది నెలల్లో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజలకు తీసుకెళ్లే బాధ్యతలను పార్టీ నేతలు తీసుకోవాలని కోరారు. ''పీసీసీ అధ్యక్షుడిగా నా ఆధ్వర్యంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాం. లోక్‌సభ సీట్లు గెలిచాం. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పనిచేసిన వారికి పదవులు ఇచ్చాం. కష్టపడి పనిచేసిన వారికి కాంగ్రెస్ పార్టీలో కచ్చితంగా అవకాశాలు వస్తాయి. నిబద్ధత కలిగిన నాయకుడు కాబట్టే మహేశ్ గౌడ్‌కు పీసీసీ అధ్యక్ష పదవి వచ్చింది. బీసీల కులగణన చేయాలన్నది రాహుల్ గాంధీ బలమైన ఆలోచన. ఆయన ఆలోచన మేరకు రాష్ట్రంలో బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులను నియమించాం. బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలంటే వారి జనాభాను లెక్కించాల్సిందే. ఎస్సీ వర్గీకరణ అమలుపై ఉత్తమ్ నాయకత్వంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశాం. ఈ కమిటీ సుప్రీం తీర్పును పూర్తిగా అధ్యయనం చేసి నివేదిక ఇస్తుంది. దేశంపై నాలుగోసారి పట్టు సాధించడానికి మోదీ ప్రయత్నాలు చేస్తున్నారు. నాలుగోసారి గెలవడం కోసమే జమిలి ఎన్నికలు తీసుకువస్తున్నారు. ఈ ప్రతిపాదన పట్ల ఎమ్మెల్యేలు అప్రమత్తంగా ఉండాలి..'' అని రేవంత్ పేర్కొన్నారు.

ప్రజల్లో ఉండేవారికే డీసీసీల బాధ్యతలు

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఈ తొమ్మిది నెలల కాలంలో తాను ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేశానని సీఎం రేవంత్ చెప్పారు. అధికారం కోల్పోయిన అసహనంతో ప్రతిపక్షం తప్పుడు ప్రచారాలు చేస్తోందని, ఆ ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా 27 రోజుల్లో రూ.18 వేల కోట్ల రైతు రుణమాఫీ చేయలేదని.. తెలంగాణలో చేసి చూపించామని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ హెల్త్ ప్రొఫైల్ డిజిటల్ కార్డు ఇస్తామని, రాష్ట్రంలో ఎక్కడున్నా రేషన్ తీసుకునే అవకాశం కల్పిస్తామని చెప్పారు. ప్రజల్లో ఉన్న వారికే కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవులు వస్తాయన్నారు. ఇన్‌చార్జ్ మంత్రులు వారానికి రెండు సార్లు తమ జిల్లాలో పర్యటించాలని సూచించారు.

కార్యకర్తల రుణం తీర్చుకోవాలి: మహేశ్‌గౌడ్

తాను పీసీసీ అధ్యక్ష పదవిని బాధ్యతగా భావిస్తానని.. పార్టీకి, ప్రభుత్వానికి మధ్య సమన్వయకర్తగా ఉంటానని పీసీసీ చీఫ్‌ మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. పార్టీని ముందుకు నడపడంలో సమష్టి బాధ్యత అవసరమన్నారు. కార్యకర్తలు, నేతలకు నిత్యం అందుబాటులో ఉంటానని చెప్పారు. క్షేత్రస్థాయి కార్యకర్తలు కష్టపడి పనిచేసినందుకే అధికారంలోకి రాగలిగామన్న విషయాన్ని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు గుర్తించాలని.. ఆ కార్యకర్తల రుణం తీర్చుకోవాలని పేర్కొన్నారు. అధికారాన్ని కట్టబెట్టిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేయాలని పార్టీ ప్రజాప్రతినిధులను కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 90% స్థానాలను గెలిపించుకోవడం ద్వారా పార్టీ కార్యకర్తలను గ్రామం నుంచి జిల్లాస్థాయి వరకు పదవుల్లో కూర్చోబెట్టాలన్నారు. సీఎం రేవంత్ నాయకత్వంలోని ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అందిస్తోందని.. కార్యకర్తలను సమాయత్తం చేసి వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లడమే తన లక్ష్యమని మహేశ్‌గౌడ్ చెప్పారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే ధ్యేయంగా అంతా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలను ఎమ్మెల్యేలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. పార్టీని మరింత బలోపేతం చేయడం కోసం పని చేయాలని కోరారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వివరించిన సీఎం

సీఎం రేవంత్ సీఎల్పీ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి ఎమ్మెల్యేలకు వివరించారు. రాష్ట్ర ఖజానాకు నెలకు సగటున రూ.18 వేలకోట్ల ఆదాయం వస్తోందని.. అందులో రూ.6 వేలకోట్లు ప్రభుత్వ ఉద్యోగుల జీతాలకే పోతాయని, మరో రూ.6 వేలకోట్లు గత ప్రభుత్వం చేసిన అప్పులు, వాటి వడ్డీలకు చెల్లిస్తున్నామని చెప్పారు. మిగతా రూ.6 వేలకోట్లలో రూ.3 వేలకోట్లు ప్రభుత్వ పథకాల అమలు కోసం ఖర్చవుతున్నాయని, ఇంకో రూ.3 వేల కోట్లతో కొత్త పథకాల అమలు, ప్రభుత్వ నిర్వహణ జరుగుతోందని వివరించారు. ఆర్థిక పరిస్థితి కష్టతరంగా ఉండటంతో దుబారా ఖర్చులు తగ్గించుకుని ప్రభుత్వాన్ని నడుపుతున్నామని చెప్పారు.

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ, ఫ్యామిలీ హెల్త్ కార్డుల అంశాలను ఎమ్మెల్యేలకు సుదీర్ఘంగా వివరించారు. పాత రేషన్‌కార్డులు తొలగించడం లేదని.. ఈ విషయంలో ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలను తిప్పి కొట్టాలని సూచించారు.
- రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పార్టీ కార్యాలయాలు నిర్మించేలా చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యేలకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సూచించారు.
- ఇక ఈ సమావేశంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు బాలూ నాయక్, పర్ణికారెడ్డి, అమీర్ అలీఖాన్ తదితరులు మాట్లాడారు.

సీఎల్పీ సమావేశానికి 'ఫిరాయింపు' ఎమ్మెల్యేలు!

ఆదివారం రాత్రి జరిగిన సీఎల్పీ సమావేశానికి బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు కూడా హాజరవడం గమనార్హం. పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీతోపాటు ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలంతా సమావేశంలో పాల్గొన్నారు. ఇక మంత్రి సీతక్క, ఇద్దరు, ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అనివార్య కారణాలవల్ల సీఎల్పీ సమావేశానికి హాజరుకాలేకపోయారు.

గాంధీ నియోజకవర్గమనే వచ్చారు: మంత్రి శ్రీధర్‌బాబు

పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ బీఆర్‌ఎస్ నేత అయినప్పుడు సీఎల్పీ సమావేశానికి ఎందుకు వచ్చారనే ప్రశ్నలకు.. సమావేశం అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు సమాధానమిచ్చారు. ఏదైనా నియోజకవర్గానికి సీఎం వచ్చినప్పుడు స్థానిక ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలవడం సాధారణమేనని చెప్పారు. సీఎల్పీ సమావేశం జరిగిన హోటల్ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఉందని.. స్థానిక ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మర్యాదపూర్వకంగా సీఎంను కలిసేందుకు వచ్చారని పేర్కొన్నారు. సిద్దిపేటలో సీఎం కార్యక్రమం జరిగితే హరీశ్‌రావు వెళ్లరా? అని ప్రశ్నించారు.

యువతతోనే మార్పు సాధ్యం

మంత్రి జూపల్లి కృష్ణారావు



మొక్క నాటి నీరు పోస్తున్న మంత్రి జూపల్లి

నందిగామ: దేశాభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా శాంతి వనంలో నిర్వహిస్తున్న 'అంతర్జాతీయ యూత్ కైండ్‌నెస్' సదస్సు ముగింపు కార్యక్రమానికి ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయి సదస్సును శ్రీ రామచంద్ర మిషన్ అధ్యక్షుడు కమ్లేష్ పటేల్ నిర్వహించడం అభినందనీయమన్నారు. అంతకు ముందు ఆశ్రమం ఆవరణలో మొక్క నాటి, ధ్యానం చేశారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, శ్రీరామచంద్ర మిషన్ గురూజీ కమ్లేష్ పటేల్, జాయేద్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఫర్ ది ఎన్విరాన్‌మెంట్ డిప్యూటీ చైర్మన్ డాక్టర్ హమ్దాన్ అల్‌షార్, ప్రపంచ బ్యాంకు దక్షిణాసియా ప్రాంత ఉపాధ్యక్షుడు మార్టిన్ రైజర్, కామన్‌వెల్త్ సెక్రటేరియట్ సుశీల్‌రాం, పాలా పాడ్రినో విలేలా, హీరోయిన్ కృతిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోని అన్ని దేవాలయాలకు విజయ నెయ్యి

పాడి రైతులకు త్వరలో పాల బిల్లులు చెల్లిస్తాం: గుత్తా అమిత్‌రెడ్డి



లాలాపేట (హైదరాబాద్): రాష్ట్రంలోని అన్ని దేవాలయాలకు అవసరమైన నెయ్యిని విజయ డెయిరీ ద్వారానే సరఫరా చేయాలని ఆదేశాలిచ్చామని తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య (విజయ డెయిరీ) నూతన చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి అన్నారు. విజయ డెయిరీ పాలు, పాల ఉత్పత్తుల అమ్మకాలను మరింత పెంచడానికి ముఖ్యమంత్రి ఆదేశాలతో అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు, సంక్షేమ హాస్టళ్లకు, పాఠశాలలకు, జైళ్లు, హాస్పిటల్స్‌కు అవసరమైన పాలు, పాల పదార్థాలు సరఫరా చేయాలని ఆయన సూచించారు. పాడి రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ సహకారంతో పెండింగ్ పాల బిల్లులను త్వరలో చెల్లించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం లాలాపేటలోని విజయ భవన్‌లో ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న విజయ డెయిరీ పాలు, పాల ఉత్పత్తులను ఆదరించి తెలంగాణ రాష్ట్ర పాడి రైతులను, పాడిపరిశ్రమను బలపరచాలని కోరారు.

పాల సేకరణ ధరను మూడు పర్యాయాలు పెంచాం

రాష్ట్రంలోని 32 జిల్లాలోని 40,445 పాడి రైతుల నుంచి 6,148 పాల సేకరణ కేంద్రాల ద్వారా ప్రతి రోజూ సుమారు 4.20 లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నట్టు అమిత్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో నెలకొన్న పాల కొరతను అధిగమించేందుకు 2022 ఫిబ్రవరి నుంచి 2023 సెప్టెంబర్ వరకు పాల సేకరణ ధరను దేశంలో ఎక్కడాలేని విధంగా 3 పర్యాయాలు రూ. 12.48 పైసలు పెంచామన్నారు. దీంతో పాల సేకరణ గణనీయంగా పెరిగిందన్నారు. అయినప్పటికీ కొన్ని పొరుగు రాష్ట్రాలకు చెందిన కోఆపరేటివ్ డెయిరీలు, ప్రైవేట్ డెయిరీలు పాల సేకరణ ధరలు తగ్గించడంతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి ఆవు పాలను తక్కువ ధరకు రూ. 26 నుంచి రూ. 34లకే కొని ఇక్కడ తక్కువ ధరకు అమ్మకాలు చేపట్టాయని, దీంతో తెలంగాణ విజయ డెయిరీ ఉత్పత్తులకు గిరాకీ తగ్గిందన్నారు. అందుకే పాడి రైతుల బిల్లులు చెల్లింపులో కొంత జాప్యం జరిగిందని, దీన్ని నివారించేందుకు చర్యలు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు.

వణికించిన పిడుగులు!

వేర్వేరు ప్రాంతాల్లో పిడుగుపాటుకు ముగ్గురు మహిళల మృతి



నాగమ్మ (ఫైల్)

నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి)/వనపర్తి రూరల్/ న్యాల్‌కల్ (జహీరాబాద్): రాష్ట్రంలో పిడుగుల ధాటికి ముగ్గురు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని మమ్మాయిపల్లి గ్రామానికి చెందిన పాడి రైతు నక్క నీలమ్మ (40) తన అక్క నాగేంద్రమ్మతో కలిసి గేదెలను మేత కోసం తీసుకెళ్లారు. మధ్యాహ్నం వర్షం పడుతుండటంతో నీలమ్మ చెట్టు కిందికి వెళ్లగా.. పిడుగుపడింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. నీలమ్మ అక్క నాగేంద్రమ్మ పిడుగుపాటుకు స్పృహ కోల్పోయింది. మరో ఘటనలో వనపర్తి మండలం చిమనగుంటపల్లికి చెందిన పద్మమ్మ (40) ఆదివారం ఉదయం గొర్లను మేతకు తీసుకొని నల్లగుట్టకు వెళ్లింది. సాయంత్రం పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందింది. కాగా, సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం న్యామతాబాద్ గ్రామానికి చెందిన ఏసప్ప భార్య బూచినెల్లి నాగమ్మ (42) శనివారం పొలానికి వెళ్లింది. సాయంత్రం గాలి వాన రావడంతో ఇంటికి బయలుదేరగా, గ్రామ సమీపంలో పెద్ద శబ్దంతో పిడుగుపడింది. దీంతో నాగమ్మ స్పృహ తప్పి కింద పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు బీదర్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

'ఆయుష్మాన్' అమలుకు సిద్ధం

రాష్ట్రంలో 70 ఏళ్లు పైబడిన వారు 5 లక్షల మంది

- వారందరికీ ప్రత్యేకంగా ఆయుష్మాన్ కార్డుల అందజేత
- పేద, ధనిక సంబంధం లేకుండా రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం

సాక్షి, హైదరాబాద్: డెబ్బై ఏళ్లు ఆపైబడిన వారందరికీ పేద, ధనిక తేడా లేకుండా ఉచిత వైద్యం అందించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని అమలు చేసేందుకు తెలంగాణలో రంగం సిద్ధమైంది. ఆ వయస్సు వారు తెలంగాణలో దాదాపు 5 లక్షల మంది ఉంటారని రాష్ట్ర వైద్య ఆరోగ్య వర్గాలు అంచనా వేస్తున్నాయి. వారందరికీ ఆయుష్మాన్ భారత్ పథకం కింద దేశవ్యాప్తంగా ఎక్కడైనా ఉచిత వైద్యం అందించనున్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ పథకం వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదు చేసుకున్న వారికి ప్రత్యేకంగా ఆయుష్మాన్ కార్డులు అందజేస్తారు. ఆధార్ కార్డును ఆధారం చేసుకుని వయస్సును లెక్కించి కార్డులు ఇస్తారు. అలా కార్డులు పొందినవారు ఏదైనా అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చేరితే రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తారు. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్‌కు పథకాల పేర్లలో తేడాలు ఉన్నా ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్యం అందించడమే రెండింటి ప్రధాన ఉద్దేశమని అంటున్నారు. ఆరోగ్యశ్రీలో 77.19 లక్షల కుటుంబాలకు వైద్యం అందుతోంది. ఇందుకు ఏటా సగటున రూ.700 కోట్లు ఖర్చు అవుతున్నాయి. ఆయుష్మాన్ భారత్ అమలు చేస్తే, దీని కింద కవర్ అయ్యే 26.11 లక్షల కుటుంబాల కోసం సుమారు రూ.200 కోట్ల వరకూ కేంద్రమే భరిస్తుంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వంపై కొంత భారం తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు ప్రత్యేకంగా 5 లక్షల మంది 70 ఏళ్లు పైబడిన వారికి కూడా వైద్యం అందితే అందుకు అవసరమైన నిధులను కేంద్రమే భరిస్తుందని వైద్యాధికారులు చెబుతున్నారు.

కలిపి అమలు చేయాలి

ప్రస్తుతం ఆరోగ్యశ్రీలో 972 రకాల వ్యాధులకు చికిత్స అందుతుండగా, ఆయుష్మాన్ భారత్‌లో 1,350 చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఆయుష్మాన్‌లోలేని 540 వ్యాధులు ఆరోగ్యశ్రీలో ఉండగా, ఆరోగ్యశ్రీలో లేని 685 వ్యాధులు ఆయుష్మాన్‌లో ఉన్నాయి. దీంతో ఈ రెండింటినీ కలిపి అమలు చేయాలని వైద్య వర్గాలు అంటున్నాయి. ఉదాహరణకు డెంగీ, మలేరియా వంటి వాటికి ఆరోగ్యశ్రీ వర్తించదు. కానీ ఆయుష్మాన్ భారత్ పథకం వాటికి వర్తిస్తుంది. కిడ్నీ, లివర్ మార్పిడులు ఆరోగ్యశ్రీలో ఉండగా... ఆయుష్మాన్‌లో లేవు. ఈ రెండు స్కీంలు కలిపితే అన్ని చికిత్సలు ఒకే గొడుగు కిందకి వస్తాయి. ఈ రెండు పథకాల ద్వారా రాష్ట్రంలో అర్హులైన వారికి 1,887 రకాల చికిత్సలకు ఉచిత వైద్యం లభిస్తుంది. ఆయుష్మాన్‌లో చికిత్సల ప్యాకేజీల ధరలు, ఆరోగ్యశ్రీ ప్యాకేజీల కంటే తక్కువగా ఉన్నాయి. దీంతో ఈ పథకాన్ని అమలు చేసేందుకు కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులు నిరాకరిస్తున్నాయని వైద్య వర్గాలు చెబుతున్నాయి.

నేడు బంగాళాఖాతంలో అల్పపీడనం


రాష్ట్రంలోని పలుచోట్ల మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం

సాక్షి, హైదరాబాద్: పశ్చిమ, మధ్య బంగాళాఖాతం, మయన్మార్ దక్షిణ తీరం పరిసర ప్రాంతాల్లో రెండు ఉపరితల ఆవర్తనాలు కొనసాగుతున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. వాటి ప్రభావంతో పశ్చిమ, మధ్య బంగాళాఖాతంలో సోమవారం అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. అల్పపీడన ప్రభావంతో రానున్న మూడు రోజులు రాష్ట్రంలోని చాలాచోట్ల మోస్తరు వర్షాలు, కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదు కావొచ్చని అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు పలు ప్రాంతాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ప్రధానంగా ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, జనగాం, సిద్దిపేట, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు, ఒకట్రెండు చోట్ల అతిభారీ వర్షాలు కూడా నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది.

31 శాతం అధికంగా వర్షాలు...

నైరుతి సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 70.36 సెం.మీ. సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఏకంగా 91.90 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఇది సాధారణ వర్షపాతం కంటే 31% అధికమని రాష్ట్ర ప్రణాళిక శాఖ అధికారులు తెలిపారు. ఐదు జిల్లాల్లో అత్యధిక వర్షపాతం, 19 జిల్లాల్లో అధిక వర్షపాతం, తొమ్మిది జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. సెప్టెంబర్ నెలాఖరుతో నైరుతి రుతుపవనాల సీజన్ ముగుస్తుంది. సీజన్ ముగిసే నాటికి వర్షపాతం గణాంకాలు మరింత పెరుగుతాయని అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది నైరుతి సీజన్లో ఒక్క జిల్లాలో కూడా లోటు వర్షపాతం నమోదు కాకపోవడం విశేషం. మండలాలవారీగా వర్షపాతం నమోదును పరిశీలిస్తే 108 మండలాల్లో అత్యధిక వర్షపాతం, 283 మండలాల్లో అధిక వర్షపాతం, 216 మండలాల్లో సాధారణ వర్షపాతం, 5 మండలాల్లో మాత్రం లోటు వర్షపాతం ఉన్నట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి.

పీజీ మెడికల్ సీట్లపై కత్తి!



ఉస్మానియా, గాంధీ మెడికల్ కాలేజీల్లోనే 265 సీట్లకు కోత పడే చాన్స్

ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల బదిలీ ఫలితం

కొత్తగా ఏర్పాటు చేస్తున్న కాలేజీలకు పంపించిన డీఎంఈ

ఖాళీలను భర్తీ చేయకపోవడంతో సీట్ల సంఖ్యపై ప్రభావం చూపించే అవకాశం

ప్రతిష్టాత్మక కాలేజీల్లో ప్రొఫెసర్లు లేకపోవడం ఏమిటంటున్న నిపుణులు

సాక్షి, హైదరాబాద్: కొత్త మెడికల్ కాలేజీలు తేవాలన్న తాపత్రయంతో ఉన్న కాలేజీల్లోని ప్రొఫెసర్లను, అసోసియేట్ ప్రొఫెసర్లను బదిలీ చేయడంతో కథ అడ్డం తిరిగింది. వైద్య విద్యా సంచాలకుల (డీఎంఈ) కార్యాలయం నిర్వాకంతో రాష్ట్రంలో పీజీ మెడికల్ సీట్లకు గండిపడే ప్రమాదం నెలకొంది. సాధారణ బదిలీల్లో భాగంగా ఇష్టారాజ్యంగా ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల బదిలీలు చేపట్టడంతో ఈ పరిస్థితి నెలకొంది. గాంధీ, ఉస్మానియా, కాకతీయ వంటి అనేక ప్రముఖ మెడికల్ కాలేజీల నుంచి అత్యంత సీనియర్లను బదిలీ చేశారు. కానీ వారి స్థానాలను భర్తీ చేయకపోవడంతో పెద్ద ఎత్తున పీజీ సీట్లకు కోత పడే ప్రమాదం నెలకొంది. వెనుకా ముందు చూడకుండా బదిలీలు చేపట్టారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఖాళీలు భర్తీ చేసే చాన్సూ లేదు

ఉస్మానియా, గాంధీ, కాకతీయ వంటి ఎంబీబీఎస్, పీజీ సీట్లతో కూడిన వైద్య కళాశాలలకు ఎలాంటి నష్టం వాటిల్లుతుందో అంచనా వేయకుండానే, ఈ ఏడాది 40 శాతం సాధారణ బదిలీల నెపంతో 8 కొత్త మెడికల్ కాలేజీలను సాధించేందుకు ప్రొఫెసర్లను, అసోసియేట్ ప్రొఫెసర్లను బదిలీ చేశారు. ఉస్మానియా, గాంధీ వంటి కాలేజీల్లో ప్రస్తుతం అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ ప్రొఫెసర్లు లేరు. కాకతీయ మెడికల్ కాలేజీలోనూ అదే పరిస్థితి నెలకొంది. దీంతో ఉస్మానియా, గాంధీ, కాకతీయలోని ఓబీజీ, పీడియాట్రిక్స్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, అనస్థీషియా, రేడియాలజీ వంటి విభాగాల్లో పీజీ సీట్లు కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. పదోన్నతులకు అర్హులైన అభ్యర్థులు అందుబాటులో లేకపోవడంతో ఈ ఖాళీలను భర్తీ చేసే అవకాశం కూడా లేదని వైద్య నిపుణులు అంటున్నారు.

బోధనా సిబ్బందిపై ఎప్పటికప్పుడు ఎన్ఎంసీ సమీక్ష

రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో మొత్తం 1,148 పీజీ సీట్లు ఉన్నాయి. ఒక ప్రొఫెసర్‌కు మూడు పీజీ మెడికల్ సీట్లు కేటాయిస్తారు. ఐదేళ్ల బోధనానుభవం ఉన్న అసోసియేట్ ప్రొఫెసర్‌కు ఒక పీజీ సీటు కేటాయిస్తారు. ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు తగ్గితే ఆ ప్రకారం జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) పీజీ సీట్లకు కోత పెడుతుంది. ప్రతి నెలా, రెండు నెలలకోసారి ఫ్యాకల్టీని ఎన్ఎంసీ సమీక్షిస్తుంది. అంతేకాదు బయోమెట్రిక్ హాజరు విధానంతో ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లోనే టీచింగ్ ఫ్యాకల్టీ సంఖ్యపై అంచనా వేస్తుంది. కాబట్టి పీజీ సీట్లకు గండం తప్పేలా లేదు. ఉదాహరణకు.. ప్రస్తుతం ఉస్మానియా మెడికల్ కాలేజీలో 481 పీజీ మెడికల్ సీట్లు ఉన్నాయి. ఇక్కడ 188 ప్రొఫెసర్ పోస్టుల మంజూరు ఉండగా, ఇటీవల బదిలీల కారణంగా ప్రస్తుతం కేవలం 86 మంది ప్రొఫెసర్లే పనిచేస్తున్నారు. అంటే 102 ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక 178 మంది అసోసియేట్ ప్రొఫెసర్లకుగాను కేవలం 26 మంది మాత్రమే ఉన్నారు. అంటే అసోసియేట్ ప్రొఫెసర్ల పోస్టులు 152 ఖాళీగా ఉన్నాయి. అంటే ప్రస్తుతం ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు 284 పీజీ సీట్లకు సరిపోను మాత్రమే ఉన్నారు. కాగా బదిలీల కారణంగా ఉస్మానియాలోని 197 పీజీ సీట్లకు కత్తెర పడే ప్రమాదం నెలకొంది. ఇక గాంధీ మెడికల్ కాలేజీలో 213 పీజీ మెడికల్ సీట్లు ఉన్నాయి. అయితే బదిలీల కారణంగా అక్కడ 60 మంది ప్రొఫెసర్లకుగాను 35 మందే మిగిలారు. 73 మందిఅసోసియేట్ ప్రొఫెసర్లకుగాను 40 మందే ఉన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్లు 145 పీజీ సీట్లకు మాత్రమే సరిపోతారు. అంటే మిగిలిన 68 పీజీ సీట్లపై కత్తి వేలాడుతోందన్న మాట. ఇలా ఒక్క ఉస్మానియా, గాంధీ మెడికల్ కాలేజీల్లోనే ఏకంగా 265 పీజీ సీట్లకు కోత పడే ప్రమాదం నెలకొంది.

ఉస్మానియా మెడికల్ కాలేజీలో కొన్ని ప్రధాన విభాగాల్లో ఉన్న ప్రొఫెసర్ పోస్టులు, బదిలీ అయినవారి సంఖ్య, ఖాళీల వివరాలు

సబ్జెక్టు	ప్రొఫెసర్ పోస్టులు	బదిలీలు	ప్రస్తుతం ఖాళీలు
ఫిజియాలజీ	3	3	3
బయో కెమిస్ట్రీ	4	4	4
జనరల్ మెడిసిన్	11	7	4
జనరల్ సర్జరీ	8	4	5
పీడియాట్రిక్స్	14	9	6
ఓబీజీ	14	9	8
ఆప్తమాలజీ	11	4	3
అనెస్థీషియా	13	10	3
రేడియాలజీ	6	3	4

గాంధీ మెడికల్ కాలేజీలో కొన్ని ప్రధాన విభాగాల్లో ప్రొఫెసర్ పోస్టులు, బదిలీలు, ఖాళీల పరిస్థితి ఇలా..

సబ్జెక్ట్	ప్రొఫెసర్ పోస్టులు	బదిలీలు	ప్రస్తుతం ఖాళీలు
అనాటమీ	2	1	1
ఫిజియాలజీ	2	2	2
బయో కెమిస్ట్రీ	2	1	1
జనరల్ మెడిసిన్	6	5	1
జనరల్ సర్జరీ	6	6	6
అనెస్థీషియా	3	2	1
ఓబీజీ	5	3	2
రేడియాలజీ	2	2	2

ఇలాగే కాకతీయ, మహబూబ్‌నగర్ మెడికల్ కాలేజీలు, ఆదిలాబాద్‌లోని రిమ్స్ వంటి చోట్ల కూడా పీజీ సీట్లు కోల్పోయే ప్రమాదం నెలకొంది.

సీట్లు కోల్పోయే అవకాశం లేదు

పీజీ సీట్లు కోల్పోయే అవకాశం లేదు. ప్రస్తుతం ఉన్న సీట్లు అలాగే ఉంటాయి. అవసరమైన ఫ్యాకల్టీని కాంట్రాక్ట్ ప్రాతిపదికన, పదోన్నతులపై నియమించాం.

– డాక్టర్ వాణి, డీఎంఈ

క్లుప్తంగా...

ఓయూకు సురవరం పేరు పెట్టాలి

ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా



సుభాష్‌నగర్ (నిజామాబాద్ అర్బన్): ఉస్మానియా యూనివర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలని, తెలుగు యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన నిజామాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ, హ్యాండ్లూమ్ సంస్థకు కొండా లక్ష్మణ్ బాపూజీ పేర్లు పెట్టడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. తెలుగు యూనివర్సిటీ పేరు మార్పు విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలని, పొట్టి శ్రీరాములు రాష్ట్ర నాయకుడు కాదని, ఆయన స్వాతంత్ర్య పోరాటంలో గాంధీతో కలిసి కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. సురవరం ప్రతాపరెడ్డి అంటేనే రాజకీయ, సాంఘిక చైతన్యానికి గుర్తుకొచ్చే పేరన్నారు. ఉస్మానియా యూనివర్సిటీకి ఆయన పేరు పెట్టి గౌరవించాలన్నారు. హైదరాబాద్‌ను భాగ్యనగర్‌గా, నిజామాబాద్‌ను ఇందూరుగా, ఆదిలాబాద్‌ను ఎదులాపురంగా, మహబూబ్‌నగర్‌ను పాలమూరుగా, మహబూబాబాద్‌ను మానుకోటగా, వరంగల్‌ను ఓరుగల్లుగా మార్చాలని డిమాండ్ చేశారు.

మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుల విగ్రహాలను ట్యాంక్‌బండ్ మీద ప్రతిష్ఠించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం సీఎంకు లేఖ రాశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమంటేనే మఖ్దూం మొహియుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి వంటి యోధుల పేర్లు ముందు వరసలో ఉంటాయని పేర్కొన్నారు. వారితో పాటు తొలి అమరుడు దొడ్డి కొమురయ్య తదితర నాయకుల విగ్రహాలు ట్యాంక్‌బండ్ ఏర్పాటు చేయడం ద్వారా.. ఆనాటి పోరాట స్ఫూర్తిని భావి తరాలకు తెలియజేయవచ్చని తెలిపారు. మఖ్దూం మొహియుద్దీన్ విగ్రహం పక్కనే బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి విగ్రహాలు ఏర్పాటు చేయాలని కోరారు. ధర్మభిక్షం, ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం, భీంరెడ్డి నర్సింహ్మారెడ్డి తదితరులకు ఆయా జిల్లాల కూడళ్లలో విగ్రహాలు ఏర్పాటు చేసి స్మరించుకోవడం సముచితంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు.

దోచుకున్న చరిత్ర బీఆర్ఎస్‌దే

సాక్షి, హైదరాబాద్: ప్రజలను వదిలేసి, బంధువులకు ప్రభుత్వ సంపదను దోచిపెట్టిన చరిత్ర బీఆర్ఎస్‌దేనని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు ఆయన స్పందించారు. బావమరుదులు, బంధువులను బాగు చేసిన చరిత్ర కేసీఆర్, కేటీఆర్‌దేనని రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని తెలిపారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు భవిష్యత్తు లేదని తేలిపోవడంతో, కేటీఆర్ నోటికొచ్చిన అబద్ధాలాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు.

తప్పుడు ప్రచారాన్ని తిప్పికొడతాం

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ కోరారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. అమృత్ టెండర్లలో ఆరోపణలపై చర్చకు సిద్ధమా? అని కేటీఆర్‌కు సవాల్ చేశారు. అవినీతికి అవకాశంలేని బిడ్డింగ్ ప్రక్రియలో.. ప్రభుత్వ సొమ్మును దోచుకోవడానికి ప్రయత్నించిన కేటీఆర్ సన్నిహిత బినామీ మిత్రులు నష్టపోయారన్న బాధ తప్ప మరొకటి కాదన్నారు. మొత్తం టెండర్ విలువ రూ.3602 కోట్లు మాత్రమేనని స్పష్టం చేశారు. పదేళ్లపాటు మంత్రిగా ఉన్న కేటీఆర్‌కు లెక్కలు తెలియాల్సి ఉందని వ్యాఖ్యానించారు.

బీమా సొమ్ము.. ఆర్టీసీ సొంత అవసరాలకు

- భవిష్యనిధి అనుబంధ బీమా పథకానికి ఎసరు
- ఉద్యోగి చనిపోతే నామినీకి గరిష్ఠంగా రూ.7 లక్షలు బీమా సొమ్ము
- గతేడాది మార్చి తర్వాత నిలిచిపోయిన చెల్లింపులు?
- ఆ తర్వాత మృతి చెందిన 300 మంది ఉద్యోగులు.. బీమా సాయం కోసం కుటుంబసభ్యుల ఎదురుచూపు



- సాక్షాత్తూ భవిష్యనిధి(పీఎఫ్) సంస్థ కల్పించిన బీమా పథకానికి ఆర్టీసీ గండి కొట్టింది. ఆ పథకం ద్వారా మృతుడి కుటుంబ సభ్యుల(నామినీకి)కు గరిష్ఠంగా రూ.7 లక్షలు అందే ఓ చట్టబద్ధ ప్రయోజనాన్ని ఏడాదిన్నరగా అందించటం లేదని తెలిసింది. ఇప్పుడు ఈ ఆర్థిక ప్రయోజనం కోసం దాదాపు 300కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి.

సాక్షి, హైదరాబాద్: భవిష్యనిధిలో అంతర్భాగంగా ''ఎంప్లాయీస్ డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ (ఈడీఎల్ఐ)''స్కీమ్ ఆర్టీసీలో కొనసాగుతోంది. ఓ సంస్థలో 20 మంది కంటే ఎక్కువ మంది ఉద్యోగులుండి, వారికి ఇంతకంటే మెరుగైన మరే బీమా పథకాన్ని సంస్థ అమలు చేయని పక్షంలో, కచ్చితంగా దీనిని అమలు చేయాల్సి ఉంటుంది. ఇది ఉద్యోగి నుంచి ఎలాంటి ప్రత్యేక కాంట్రిబ్యూషన్ అంటూ లేకుండా సాగుతుంది. ఉద్యోగి బేసిక్ ప్లస్ డీఏ (మూల వేతనం ప్లస్ కరువు భత్యం)మీద 0.5 శాతం లేదా గరిష్ఠంగా రూ.75 చొప్పున ప్రతినెలా సంస్థ ఉద్యోగిపక్షాన అతని/ఆమె భవిష్యనిధి ఖాతాలో జమ చేయాల్సి ఉంటుంది. భవిష్యనిధిలో సభ్యత్వం ఉన్న ప్రతి ఉద్యోగి (అర్హతలను అనుసరించి) దీని ప్రయోజనం పొందవచ్చు. ఉద్యోగి చనిపోతే అతని/ఆమె నామినీకి కనిష్ఠంగా రూ.రెండున్నర లక్షలు.. నెలవారీ వేతనం, భవిష్యనిధి నిల్వ తదితరాల ఆధారంగా గరిష్ఠంగా రూ.ఏడు లక్షల వరకు చెల్లిస్తారు. ఉద్యోగి నయాపైసా కాంట్రిబ్యూషన్ లేకుండా ఇది అందుతుంది.

ఇష్టారాజ్యానికి ఇదే కారణం..

భవిష్యనిధి ఖాతాల నిర్వహణలో ఆర్టీసీకి ప్రత్యేక మినహాయింపు ఉంది. సొంతంగానే పీఎఫ్ ట్రస్టును నిర్వహిస్తుంది. దీనికి ఓ నిర్వహణ కమిటీని కూడా ఏర్పాటు చేస్తుంది (ప్రస్తుతం కమిటీ లేదు). ఈ వెసులుబాటే ఇప్పుడు ఆర్టీసీ ఇష్టారాజ్యానికి కారణమైంది. భవిష్యనిధి చెల్లింపులు పూర్తి చట్టబద్ధమైనవే అయినా, కాంట్రిబ్యూషన్‌ను ట్రస్టుకు జమ చేయకుండా సొంత అవసరాలకు వాడుకుంటోంది. దాదాపు పదేళ్ల క్రితం ఈ కట్టు తప్పే సంప్రదాయం ఆర్టీసీలో మొదలైంది. ఎండీగా సజ్జనార్ బాధ్యతలు తీసుకున్న తర్వాత దాన్ని కొంతమేర తగ్గించి గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నా.. సంస్థ ఆర్థిక అవసరాలు, ప్రభుత్వం నుంచి సకాలంలో సాయం అందకపోవటం లాంటి వాటి వల్ల దానికి పూర్తిగా అడ్డుకట్ట పడలేదు. ఈ క్రమంలోనే ఈ బీమా పథకం కోసం యాజమాన్యం చెల్లించే వాటాను ట్రస్టులో డిపాజిట్ చేయకుండా సొంత అవసరాలకు వాడుకుంటోంది. ఫలితంగా ఏడాదిన్నరగా దీని చెల్లింపులు నిలిచిపోయాయి. గతేడాది మార్చి వరకు భవిష్యనిధి బీమా పథకం చెల్లింపులు జరిగాయి. ఆ తర్వాత నిలిచిపోయినట్టు సమాచారం. ప్రతి మూడు నెలలకోమారు ఈ పథకం కోసం ఆర్టీసీ నిధులు విడుదల చేసే పద్ధతి ఉండేది. ఏడాదిన్నరగా అవి కూడా నిలిచిపోయాయి. అప్పటి నుంచి దాదాపు 300 మందికిపైగా ఉద్యోగులు మరణించారు. వీరి కుటుంబ సభ్యుల(నామినీ)కు ఆ బీమా మొత్తాన్ని చెల్లించటం లేదని తెలిసింది.

కాళేశ్వరం వృథా కాదు..

- కాంగ్రెస్ ప్రభుత్వమే దానిని నిరూపించింది
- మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం అదే ప్రాజెక్టు వ్యవస్థను ఉపయోగించుకుంటోందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ బరాజ్‌లో కుంగిన మూడు పిల్లర్లను చూపుతూ మొత్తం ప్రాజెక్టు మీద రూ.లక్ష కోట్లు వృథా అయినట్లు ప్రజలను తప్పుదోవ పట్టించిందని మండిపడ్డారు. ఇప్పుడు మల్లన్నసాగర్, ఇతర ప్రాజెక్టుల్లో నీటిని నింపుతూ 'కాళేశ్వరం ప్రాజెక్టు వృథా'అని వారు సృష్టించిన సిద్ధాంతాన్ని వారే అబద్ధమని నిరూపిస్తున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు హరీశ్‌రావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాళేశ్వరం పంపింగ్ వ్యవస్థ ద్వారానే ఎల్లంపల్లి నీటిని ఎత్తిపోశారనే నిజాన్ని మంత్రి పొన్నం అంగీకరించాలన్నారు.

ఎల్లంపల్లిని వినియోగంలోకి తెచ్చాం

కాంగ్రెస్ పాలనలో వివక్షకు గురై పెండింగులో ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టు పనులను బీఆర్ఎస్ ప్రభుత్వమే పూర్తి చేసిందని హరీశ్‌రావు వెల్లడించారు. భూసేకరణ, పునరావాస కాలనీలు, కరీంనగర్ – మంచిర్యాల రాజీవ్ రహదారిపై హైలెవెల్ వంతెన.. తదితర పనులు పూర్తి చేసి ఎల్లంపల్లిని తమ హయాంలోనే నింపామన్నారు. గతంలో కాంగ్రెస్ చేపట్టిన ప్రాణహిత– చేవెళ్ల ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం కేవలం 14 టీఎంసీలు కాగా, రీ ఇంజనీరింగ్‌తో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 141 టీఎంసీలకు పెంచామన్నారు. ఎల్లంపల్లి నుంచి నీటిని లిఫ్ట్ చేసినా కూడా వినియోగించింది కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మాణం అయిన వసతుల వల్లే సాధ్యమైందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో లింకు–1 పునరుద్ధరణపై దృష్టిపెట్టి, 2025 వానాకాలం పంటలకు నీరు ఇచ్చేలా మంత్రి పొన్నం ప్రభాకర్ కృషిచేయాలని హరీశ్‌రావు హితవు పలికారు.

సీఎల్పీ భేటీకి అరికెపూడి ఎలా వెళతారు?

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ సమావేశానికి హాజరు కావడంపై మంత్రి శ్రీధర్‌బాబు చేసిన వ్యాఖ్యలు.. నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు అన్నట్లుగా ఉన్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. 'సిద్దిపేట నియోజకవర్గానికి ముఖ్యమంత్రి ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా వస్తే కలుస్తాను. కానీ ఎల్పీ మీటింగ్‌కు వస్తే కలవను. ఏ ఎమ్మెల్యే కలవకూడదు కూడా. పిల్లి కళ్లుమూసుకుని పాలు తాగినట్టుంది శ్రీధర్ బాబు వైఖరి'అని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు.

సీఎంపై నిరాధార ఆరోపణలు

- కేటీఆర్‌కు దమ్ముంటే, ఆరోపణలు రుజువు చేస్తే మేము దేనికైనా సిద్ధం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సవాల్



సాక్షి, యాదాద్రి/సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నాయకులు నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అమృత్ స్కీం టెండర్లలో రూ.8,888 వేల కోట్ల అవినీతి జరిగిందని కేటీఆర్ తప్పుడు ఆరోపణలు చేశారని విమర్శించారు. కేటీఆర్‌కు దమ్ముంటే, ఆరోపణలు రుజువు చేస్తే తాము దేనికైనా సిద్ధమని సవాల్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారతుండడంతో అసహనానికి లోనై సీఎం రేవంత్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తే.. 'ఖబడ్దార్ కేటీఆర్'అని కోమటిరెడ్డి హెచ్చరించారు. ఎమ్మెల్యేలు, మున్సిపల్ చైర్మన్లు పార్టీ వదిలిపెట్టి పోతుండడంతో దిక్కుతోచని స్థితిలో కేటీఆర్ మాట్లాడుతున్నాడన్నారు. కేటీఆర్ పదేళ్ల మున్సిపల్ శాఖ మంత్రిగా పని చేసి రూ.7 లక్షల కోట్లు అప్పులు చేశాడని అందులో రూ.2 లక్షల కోట్లు ఆయనకుటుంబమే దోచుకుందని ఆరోపించారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ రోజురోజుకూ చచ్చిపోతోందని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు.

దోపిడీ దొంగలకు అలాగే కనిపిస్తుంది

హైదరాబాద్‌లో ఆదివారం సీఎల్పీ సమావేశం అనంతరం కూడా ఈ అంశంపై కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు. పచ్చకామెర్ల వాడికి లోకమంతా పచ్చగా కనిపించినట్లు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు లాంటి దోపిడీ దొంగలకు తమ ప్రభుత్వం కూడా అవినీతి చేసినట్లుగా కనిపిస్తుందేమోనని వ్యాఖ్యానించారు. మిషన్ భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్టులలో కేటీఆర్ వేల కోట్ల రూపాయలు దోచుకున్నాడని ఆరోపించారు. సింగరేణి సంస్థలో కవిత ఏం చేసిందో త్వరలో బయటకు వస్తుందని అన్నారు. వారి దోపిడీ ప్రజలకు అర్థమైంది కనుకనే గత ఎన్నికల్లో ఓడించారని చెప్పారు.

రాజీనామాకు భయపడే సిట్టింగ్ జడ్జి అంటున్నారు

కేటీఆర్‌పై ఆది శ్రీనివాస్ విమర్శ

సాక్షి, హైదరాబాద్: అమృత్ టెండర్లలో అవినీతి జరిగితే తాను మంత్రి పదవికి రాజీనామా చేస్తానని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధైర్యంగా చెప్పారని, పొంగులేటి వేసిన ప్రశ్నలకు కేటీఆర్ సమాధానం చెప్పలేకపోయారని అసెంబ్లీలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. ఆదివారం సీఎల్పీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాజీనామా చేయాల్సి వస్తుందన్న భయంతోనే కేటీఆర్ కొత్తగా సిట్టింగ్ జడ్జి విచారణను తెరపైకి తెచ్చారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ రోజుకో ప్రెస్‌మీట్ పెట్టినంత మాత్రాన ప్రజలు ఆయన్ని నమ్మరని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వండి

- సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఎం ప్రతినిధి బృందం విజ్ఞప్తి
- ముఖ్యమంత్రిని కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేత

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొంతమంది జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని.. అయితే కొందరు సీనియర్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు రావడం లేదని సీపీఎం పేర్కొంది. ప్రభుత్వం ఒక సొసైటీకి భూమి ఇచ్చిందని, ఆ సొసైటీలో లేని సీనియర్ జర్నలిస్టులు నష్టపోతున్నారని వారు పేర్కొన్నారు. అందువల్ల రాష్ట్రంలోని జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఎం నేతలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య, చెరుపల్లి సీతారాములు, జూలకంటి రంగారెడ్డితో కూడిన పార్టీ ప్రతినిధి బృందం ఆదివారం ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించింది. ఏ సొసైటీలో ఉన్నప్పటికీ వారి సొసైటీ ద్వారా స్థలాలు పొందేవిధంగా సీనియర్ జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యను పరిశీలించాలంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని సీఎం కోరారు. భూసేకరణలో మొదటి అలైన్‌మెంట్‌ను ప్రభుత్వం మార్చడం వల్ల మధ్య తరగతి ఉద్యోగులు, రైతులు, పేదలు నష్టపోతున్నారని, దాని ప్రకారమే ప్రభుత్వం ముందుకు పోవాలని కోరారు. దీనిపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఇప్పటికే ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పుపై నిర్ణయం జరిగిపోయిందనీ, వెనక్కి వెళ్లడం కష్టమనీ, బాధితులకు నష్ట పరిహారం పెంచే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారని సీపీఎం నేతలు పేర్కొన్నారు. సిరిసిల్లలో పవర్‌లూమ్‌ల కరెంటు చార్జీలను ప్రభుత్వం రూ.2 నుంచి రూ.8.30లకు పెంచడంతో 30 వేల మంది పవర్‌లూమ్ కార్మికులు ఆందోళనలో ఉన్నారని తెలిపారు. పదేళ్ల నుంచి బకాయిలు కట్టాలంటున్నారని పేర్కొన్నారు. దానివల్ల పవర్‌లూమ్‌లు మూతపడ్డాయనీ, కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ

▶ మొదటి పేజీ తరువాయి

బావమరిది కాకుండా ఇంకేమి అవుతాడో పొంగులేటి చెప్పాలి. సొంత బావమరిది కంపెనీకి లాభం చేకూరిస్తే బంధువని అనడమేంటి?. ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్‌తో పాటు అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్లను కూడా నేను ప్రస్తావించిన నేపథ్యంలో పొంగులేటి ఆగమేఘాల మీద ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కానీ రూ.1,137 కోట్ల అవినీతి జరిగినా, ఒక్క రూపాయి అవినీతి జరిగినా ఈ చట్టం వర్తిస్తుందనే విషయం ఆయన తెలుసుకోవాలి.

ఢిల్లీకి కప్పం కట్టేందుకే అవినీతి

కేవలం రూ.2 కోట్ల లాభం ఉన్న బావమరిది కంపెనీకి రూ.1,137 కోట్ల కాంట్రాక్టు ఇచ్చి అవినీతి జరగడం లేదు అంటే ఎవరైనా నమ్ముతారా? కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే సీఎం సోదరుడు జగదీశ్‌రెడ్డి రూ.వెయ్యి కోట్లుం, బావమరిది సూదిని సృజన్ రెడ్డి రూ.వెయ్యి కోట్లు పెట్టుబడి పెట్టే స్థాయికి ఎలా ఎదిగారనే విషయాన్ని రేవంత్‌రెడ్డి చెప్పాలి. పొంగులేటి సంస్థకు దక్కిన కొడంగల్ ఎట్టిపోతల కాంట్రాక్టుల గురించి త్వరలో మాట్లాడతా. ప్రజల తరఫున మంత్రులు, ముఖ్యమంత్రి అవినీతిని నిరంతరం ప్రశ్నిస్తూనే ఉంటాం. ఢిల్లీకి కప్పం కట్టేందుకు ప్రభుత్వం ఈ భారీ అవినీతికి తెగబడుతోంది. కేంద్ర ప్రభుత్వ నిధులకు సంబంధించిన అంశంలో కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ మొదలు ఆ పార్టీకి చెందిన ఏ ఒక్క ఎంపీ కూడా మాట్లాడటం లేదు..'అని కేటీఆర్ విమర్శించారు.

సింగరేణి కార్మికుల పొట్ట కొడుతున్నారు

సింగరేణి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చింది.. 'దసరా బోనస్ కాదు బోగస్'అని కేటీఆర్ విమర్శించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో సింగరేణి ప్రాంత ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'సింగరేణి లాభాల్లో 33 శాతం కార్మికులకు పంచుతున్నట్లు గొప్పలు చెప్పుకుని కేవలం 16.9% మాత్రమే ఇచ్చారు. కార్మికుల కష్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకుంటోంది., పండుగ వేళ ప్రభుత్వం కార్మికుల పొట్ట కొడుతోంది. ప్రతి కార్మికుడికి రూ.1.8 లక్షల నష్టం జరుగుతుంది. సింగరేణి నికర లాభం రూ.4,701 కోట్లు. ఇందులో కార్మికులకు 33 శాతం వాటా కింద రూ.1,551 కోట్లు పంచాలి. ఒక్కో కార్మికుడికి రూ.3.7 లక్షల చొప్పున అందాలి. కానీ కేవలం రూ.796 కోట్లను మాత్రమే కార్మికులకు పంచుతున్నారు..'అని కేటీఆర్ ధ్వజమెత్తారు. సింగరేణి లాభాల్లో వాటాపై కార్మికులు స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో సింగరేణి అద్భుతమైన ప్రగతి సాధించిందని, ఒక్కో కార్మికుడికి అత్యధికంగా 32 శాతం వాటా ఇచ్చామని చెప్పారు.

పార్టీ త్రిసభ్య కమిటీతో భేటీ

రాష్ట్రంలోని ప్రజా ఆరోగ్య పరిస్థితులపై అధ్యయనం కోసం పార్టీ తరఫున నియమించిన త్రిసభ్య కమిటీతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు భేటీ అయ్యారు. రాష్ట్రంలో దిగజారిన వైద్య ఆరోగ్య వ్యవస్థపై అధ్యయనానికి మాజీ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ రాజయ్య అధ్యక్షతన ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌లతో కూడిన కమిటీని పార్టీ నియమించిన విషయం తెలిసిందే. కాగా ఆదివారం నుంచే కార్యాచరణ ప్రారంభించిన కమిటీకి కేటీఆర్ పలు సూచనలు చేశారు. రాష్ట్రంలోని పలు ఆసుపత్రులను సందర్శించి రాష్ట్ర ప్రభుత్వానికి నిర్మాణాత్మకమైన నివేదికను ఈ కమిటీ అందిస్తుంది.



"మనిషి ఊహ కంటే ప్రకృతి కల్పన చాలా గొప్పది. ప్రకృతి గురించి మనకు తెలిసినదంతా పూర్తి సత్యానికి ఒక ఉజ్జాయింపు మేరకైనా కాదు!
– రిచర్డ్ పి. ఫెయిన్‌మాన్

సాక్షి

సోమవారం, 23 సెప్టెంబర్ 2024

చర్చ కాదు, రచ్చ

మాట్లాడగలగడం, మేధ వికసించడం మానవ చరిత్రలో మహత్తర ఘట్టాలంటారు శాస్త్రవేత్తలు. అవి లేకపోతే మనిషి మనుగడా, ఆ మనుగడతో పెనవేసుకున్న ప్రపంచమూ ఇప్పటిలా ఉండేవే కావు. మేధ జ్ఞానాన్ని పెంపొందిస్తే, దానిని నలుగురికీ పంచేది మాటే. మాట నేర్చిన తొలిరోజుల్లో దాని ప్రభావానికి ఆశ్చర్య చకితుడైన మనిషి దానికి మహత్తును ఆపాదించి మంత్రంగా మార్చుకున్నాడు. నిత్య జీవనంలో దాని లౌకికమైన విలువనూ గుర్తించాడు. ఒంటరి మనిషిలో స్వగతంగా ఉన్న మాట, మరో మనిషి జత కాగానే సంభాషణ అయింది; మరికొందరు జత పడితే చర్చ అయింది; శ్రోతలు పెరిగిన కొద్దీ ప్రసంగమైంది. వీటిలో ప్రతి ఒక్కటీ జ్ఞానవ్యాప్తికి వాహిక అయింది.

చర్చనే వాద, ప్రతివాదమనీ; సంవాదమనీ; ఆంగ్లంలో డిబేట్, డిస్కషన్ అనీ అంటున్నాం. చర్చలేని సందర్భం మానవ జీవితంలో ఉండనే ఉండదు. కుటుంబ స్థాయి నుంచి, దేశస్థాయి వరకూ నిరంతరం చర్చ సాగుతూనే ఉంటుంది. చర్చకు వస్తువు కాని విషయమూ ఉండదు. భూమి సూర్యుడి చుట్టూ తిరిగినట్టే మానవ ప్రపంచం చర్చ చుట్టూ తిరుగుతుంది. దేనినైనా సరే చర్చించే అభ్యాసం మనకు కొత్తది కాదంటూ నోబెల్ పురస్కార గ్రహీత అమర్త్యసేన్ 'ది ఆర్గ్యుమెంటేటివ్ ఇండియన్'(సంవాద భారతీయుడు) అనే పుస్తకమే రాశాడు. రామాయణ, మహాభారతాల్లో, భగవద్గీతలో, ఉపనిషత్తుల్లో చర్చలూ, వాదప్రతివాదాలూ ఎలా సాగాయో ఎత్తిచూపాడు. హెచ్చు, తగ్గుల సమాజంలో కిందిమెట్టు మీద ఉన్న స్త్రీ, పురుషవర్గాల గొంతుకూ మన సంవాద సంప్రదాయం ఎంతోకొంత చోటిచ్చిందన్నాడు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామ్యం వేళ్ళు చర్చలోనే పాతుకున్నాయంటూ, ప్రత్యేకించి మన దేశంలోని రకరకాల అసమానతలను ప్రజాస్వామికంగా పరిష్కరించుకోడానికి మనదైన సంవాద సంప్రదాయం స్ఫూర్తినిస్తుందన్నాడు.

రామాయణంలో రాముడికి పట్టాభిషేక నిర్ణయాన్ని దశరథుడు అందిరినీ సంప్రదించే తీసుకుంటాడు. జాబాలికి, రాముడికి జరిగిన సంవాదం మరో ఉదాహరణ. పరలోకం లేదనీ, పితృవాక్పాలన అర్థరహితమనీ, ప్రత్యక్షంగా కనిపించే రాజ్యాన్ని అనుభవించమనీ జాబాలి అన్నప్పుడు రాముడు అతని మాటలు ఖండిస్తూ, నువ్వు చెప్పినట్లు చేస్తే ప్రజలు నన్నే ఆదర్శంగా తీసుకుని విచ్చలవిడిగా సంచరిస్తారంటాడు. విభీషణ శరణాగతి లాంటి ప్రతి సందర్భంలోనూ రాముడు సహచరులతో చర్చించే నిర్ణయం తీసుకుంటాడు. మహాభారతంలో ధర్మరాజు తనను జూదంలో ఒడ్డి ఓడినప్పుడు; తన్నోడి నన్నోడెనా, లేక నన్నోడి తన్నోడెనా అన్న చర్చను ద్రౌపది సభాముఖంగా లేవదీస్తుంది. ధర్మరాజు యుద్ధానికి విముఖుడైనప్పుడు యుద్ధపక్షాన వాదిస్తుంది. బృహదారణ్యకోపనిషత్తులో గార్గి అనే విదుషీమణి యాజ్ఞ్యవల్క్యునితో వాదోపవాదాలు జరిపి ఓటమిని హుందాగా ఒప్పుకుంటుంది. యాజ్ఞ్యవల్క్యునికి, అతని భార్య మైత్రేయికి జరిగిన సంవాదం గురించి కూడా ఉపనిషత్తు చెబుతుంది. ప్రత్యామ్నాయ చింతన నుంచి, ప్రతివాదం నుంచి, ప్రతిపక్షం నుంచే జైన, బౌద్ధ తాత్వికతలు అభివృద్ధి చెందాయి. అద్వైతవాది అయిన శంకరాచార్యుడు, కర్మవాది అయిన మండనమిశ్రునితోనూ, అతని భార్య ఉభయభారతితోనూ రోజుల తరబడి వాదోపవాదాలు జరిపి ఓడిస్తాడు. ఇప్పటిలా ప్రచురణ, ఎలక్ట్రానిక్, ఇంటర్నెట్ ఆధారిత సామాజిక మాధ్యమాలు లేని కాలంలో సైతం మనిషి తనే సంచార మాధ్యమంగా మారి, దూరభారాలను జయించి పండిత పరిషత్తులను మెట్టాడు; వాద, ప్రతివాదాలలో ప్రకర్షను చాటి జ్ఞానవిజ్ఞాన వ్యాప్తికి వేగుచుక్క అయ్యాడు. అలాంటి ఒక పండిత స్పర్ధలోనే శ్రీనాథ మహాకవి ''పగుల గొట్టించి తుద్భటవివాద ప్రౌఢి గౌడడిండమభట్టు కంచుఢక్క'' అని చెప్పుకున్నాడు. నిన్నమొన్నటి వరకూ కాశీ, బెంగాల్‌లోని నవద్వీపం మొదలైనవి విద్వత్పరీక్షలకు పట్టుగొమ్మలుగా ప్రసిద్ధికెక్కాయి. అయల సోమయాజుల గణపతిశాస్త్రి అనే పండితుడు ఆంధ్రదేశం నుంచి నవద్వీపం వెళ్ళి అక్కడి విద్వజ్జనాన్ని మెప్పించి 'కావ్యకంఠ' బిరుదును అందుకొని వచ్చాడు.

పురాతన నాగరికతలన్నీ సంవాద సంప్రదాయాన్ని పెంచి పోషించినవే. ప్రాచీన గ్రీకు తాత్వికుడు సోక్రటీస్ అభివృద్ధి చేసిన ప్రశ్నోత్తరాల సంవాద శైలి 'సోక్రటిక్ డైలాగ్' పేరిట ఒక వచనరచనా ప్రక్రియగా సారస్వతంలో భాగమైంది. సాంస్కృతిక పునరుజ్జీవనం దరిమిలా యూరప్‌లో ఆధునిక చర్చారూపాలు అభివృద్ధి చెంది, సంవాద సమాజాలు ఏర్పడి వైజ్ఞానిక వికాసాన్ని కొత్తపుంతలు తొక్కించాయి. సంవాద ప్రక్రియ నిర్దిష్టమైన రూపురేఖలు తెచ్చుకుని పాఠశాల నుంచి, విశ్వవిద్యాలయ స్థాయి వరకు విద్యలో భాగమైంది. అందులో పోటీపడే విద్యార్థుల తర్ఫీదుకు శిక్షకులు అవతరించారు. ఆల్ఫ్రెడ్ స్నైడర్, మాక్స్ వెల్ ష్రూనర్ అనే ఇద్దరు శిక్షకులు సంవాదకళను అనేక కోణాల నుంచి చర్చిస్తూ, నిర్వచిస్తూ 'మెనీ సైడ్స్– డిబేట్ ఎక్రాస్ కరిక్యులమ్' అనే పుస్తకం వెలువరించారు.

ఈ మొత్తం నేపథ్యం నుంచి చూసినప్పుడు మన పరిస్థితే ఆశ్చర్యకరం. రాచరికపు రోజుల్లోనే మనం తీర్చిదిద్దుకున్న సంవాద సంప్రదాయం ప్రజాతంత్రంలో అక్కరకు రాకుండాపోయింది. ఇన్నేళ్ళ ప్రజాస్వామ్యంలో కీలక సంవాద కేంద్రాలైన శాసనసభలకు వేలసంఖ్యలో ప్రతినిధులను పంపుకున్నా, పంపుతున్నా సంవాద విధివిధానాల శిక్షణ అంచెలంచెల విద్యలో ఇప్పటికీ భాగం కాలేదు. ఎక్కడైనా పాఠ్యేతర అంశంగా కొన ఊపిరితో ఉన్నా కార్పొరేట్ చదువులు దానినీ పాడి ఎక్కించాయి. కొత్తగా సామాజిక మాధ్యమాల వెల్లువ సంవాదపు బరిలో ప్రతి ఒకరికీ అవకాశమిచ్చి మేలు చేసినా విధివిధానాల శిక్షణ లేక చర్చ రచ్చగా మారడం; ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు కావలసిన సంవాదం విషవాయువు కావడం చూస్తున్నాం!

అన్నాడంటే మాటపై ఉన్నాడనే!

కామెంట్



కరణ్ థాపర్

ఇచ్చిన మాటకే కాదు, తామన్న మాటలకూ ఎల్లప్పుడూ కట్టుబడి ఉండే అతి కొద్దిమంది రాజకీయ నాయకులలో సీతారాం ఏచూరి ఒకరు. ఇంటర్వ్యూలలో వెలిబుచ్చిన అభిప్రాయాల పర్యవసానాలను ఆ తర్వాత ఎదుర్కొనే ధైర్యం లేక ప్రసారాలకు ముందే వాటిని తొలగించమని నాయకులు కోరటమన్నది అసాధారణమేమీ కాదు. కానీ ఏచూరి తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉండేవారు. యునైటెడ్ ఫ్రంట్‌కు సీపీఎం మద్దతిస్తున్నప్పటికీ, అప్పటి ప్రధాని దేవె గౌడ మీద ఆయన చేసిన విమర్శ దీనికి నిదర్శనం. రాజకీయ నాయకులు ఏ మాత్రం సంకోచించకుండా తిరస్కరించే విజ్ఞప్తులను సైతం అంగీకరించటం కోసమే ఏచూరి మార్గాలను వెతికేవారు. ఆయన గుణం సావధానం. ఆయన జ్ఞాపకశక్తి అపారం.

సీతారాం ఏచూరిని నేను మొదటిసారి ఎప్పుడు కలిశానో గుర్తుకు రావటం లేదు. బహుశా అది నేను 1990లో ఇండియాకు తిరిగి వచ్చిన కొద్ది రోజులకు కావచ్చు. అయితే నేనెప్పటికీ మర్చిపోలేనిది మాత్రం ఆయనతో సుదీర్ఘమైన నా మొదటి ఇంటర్వ్యూ. అది 1996వ సంవత్సరం. ఇంటర్వ్యూ చేసింది ఆనాటి నూతన ప్రధాని దేవె గౌడ గురించి. అప్పటికి సీతారాంతో నాకు బాగా పరిచయం ఏర్పడి ఉంది.

ఇంటర్వ్యూలో 'సీత' (తనను ఇలా పిలవొచ్చని ఏచూరి నాతో అన్నప్పట్నుంచీ నేనాయన్ని సీత అనటం మొదలుపెట్టాను) దేవె గౌడ తన అధికారిక పర్యటనకు తనతో పాటుగా అనేక మంది తన కుటుంబ సభ్యులను ఇటలీకి వెంటబెట్టుకుని వెళ్లటాన్ని విమర్శించారు. నాటి యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వానికి దేవె గౌడ పార్టీ, సీపీఎం రెండూ కూడా మద్దతు ఇస్తూ ఉన్నందు వల్ల సీత అలా విమర్శించటం అనూహ్యం, దాపరికం లేకపోవడం మాత్రమే కాక వార్తగా కూడా ఎంతో ప్రాముఖ్యమైనది. అది కేవలం ఒక సాధారణ వ్యాఖ్య కాదు. పూర్తి స్థాయి విమర్శ.

ఇంటర్వ్యూ ప్రసారానికి ముందు రోజు సాయంత్రం సీత నాకు ఫోన్ చేశారు. ''ఇంటర్వ్యూలో నేను చెప్పిన దానిని తొలగించమని అడగటానికి నేను మీకు కాల్ చేయలేదు'' అని నవ్వుతూ అన్నారు. అదొక వ్యాప్తి చెందే స్వభావం కలిగిన సహృదయ హాసం. ''నేను దాని గురించి ఇప్పటికే నా సహచరులకు చెప్పి, వారి స్పందనలకు తగిన వివరణ ఇచ్చేశాను కనుక దానిని మీరు తీసేయలేదని నిర్ధారించుకోటానికే మీకు కాల్ చేస్తున్నాను. ఇప్పుడు మీరు దానిని తొలగిస్తే ఇద్దరం కూడా నవ్వులపాలౌతాం'' అన్నారు.

నిజానికి సీత, తామన్న మాటలకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉండే అతి కొద్ది మంది రాజకీయ నాయకులలో ఒకరు. నాయకులు ఇంటర్వ్యూలలో వెలిబుచ్చిన తమ వాస్తవ అభిప్రాయాల పర్యవసానాలను ఎదుర్కొనే ధైర్యం లేక వాటిని తొలగించమని కోరటమన్నది అసాధారణమేమీ కాని ఆ 9వ దశకంలో, 2000–2009 మధ్య కాలంలో సీత అలా నాకు కాల్ చేయటం అత్యంత అసాధారణం. చెప్పాలంటే అభినందనీయం.

అదొక్కటే కాదు, సీత సావధానంగా వినే గుణం కలిగిన వారనీ, ఆయన జ్ఞాపకశక్తి అపారమనీ కనిపెట్టటానికి నాకు మరికొంచెం సమయం పట్టింది. నేను 'ఐ విట్నెస్' వీడియో మేగజీన్‌కు పని చేస్తూ,



కమ్యూనిస్టు యోధుడు సీతారాం ఏచూరి (1952-2024)

తరచు చర్చలు నిర్వహిస్తూ ఉన్న సందర్భంలో ఓసారి నాకు ఢిల్లీ కమానీ ఆడిటోరియం వెలుపలి ప్రాంగణంలో సీత సిగరెట్ తాగుతూ కనిపించారు. ''మీకూ ఒకటి కావాలా?'' అని నన్ను అడిగారు. బహుశా నా ముఖం సిగరెట్టు తాగే రకంలా ఆయనకు కనిపించి ఉండాలి. తన సిగరెట్ వెలిగించుకున్నాక, నాకూ ఒకటి ఇచ్చారు. నేను సిగరెట్ తాగుతానని మీకెలా తెలుసు అని అడిగాను.

''మీరేగా చెప్పారు, మర్చిపోయారా?'' అని ఆశ్చర్యపోయారు. ''జనవరిలో మాత్రమే తాగుతానని, అది కూడా ఇతరులు ఇచ్చే సిగరెట్‌లు మాత్రమే తాగుతానని మీరు నాతో చెప్పారు కదా'' అన్నారు. ఆయన అన్నది నిజమే. అయితే ఎవరికి గుర్తుంటుంది కనుక అని నేను తమాషాగా చెప్పే విషయాలలో ఇది కూడా ఒకటి. కానీ సీత దానిని గుర్తుపెట్టుకున్నారు!

వాస్తవానికి ఆయన జ్ఞాపకశక్తి పరిధి, కచ్చితత్వాలే ఇంటర్వ్యూలలో ఆయనకు శక్తిమంతమైన ఆయుధాలు. ఆయన్ని ఇంటర్వ్యూ చేస్తున్నప్పుడు నా ప్రశ్నల్లో నేను తేదీలను కలిపేసినప్పుడు లేదా వాస్తవాలలో నా వైపు తప్పులు దొర్లినప్పుడు వెంటనే ఆయన నన్ను సరిదిద్దేవారు. అలాగని ఎప్పుడూ కూడా అభ్యంతరకరంగా మాట్లాడే వారు కాదు. నేను మర్చిపోయిన ఒకటీ రెండు పాయింట్లను కూడా జోడించి మరీ విషయాన్ని ముగించేవారు. అలాగుండేది ఏచూరితో.

అయితే ఆయనలో అస్సలు లేనివి ఏమిటంటే ముఖం చిట్లింపు, హాస్య విహీనత. ఆయన చమత్కారం ఉవ్వెత్తున పొంగిన షాంపేన్‌లా మిరిమిట్లతో నురగలు కక్కుతుంది. 2005లో బృందా కారత్ సీపీఎం పొలిట్ బ్యూరోలో చేరారు. అప్పటికే ఆమె భర్త (ప్రకాశ్ కారత్) అందులో ఉన్నారు. బృందా పొలిట్ బ్యూరో సభ్యురాలైన కొత్తల్లో 'సీఎన్ బీసీ' లేట్ నైట్ డిస్కషన్‌లో ఆమె అతిథిగా పాల్గొన్నారు. బృందాతో పాటు మరికొందరు అతిథులు ఉన్నారు. ఆ డిస్కషన్‌కు నాదే యాంకరింగ్. చర్చ సాగుతుండగా అతిథుల్లో ఒకరు... సీపీఎం పొలిట్ బ్యూరోలో స్థానం సంపాదించిన తొలి మహిళ కదా బృందా కారత్ అన్నారు. ''అవును'' అని చిరునవ్వుతో చూస్తూ, ''మాది ఇప్పుడు రెండు క్యారెట్‌ల పార్టీ!'' అన్నారు సీత.

సీత... సల్లాపాల ఉల్లాస ప్రియుడు కూడా. కథలు కథలుగా తన గురించి చెప్పుకుంటున్నప్పుడు... ఆయన కళ్లు దివ్వెలై వెలగటం, ఆయన ముఖం నవ్వులై విరియటం చూసి... ఆయన స్వీయానంద భరితులై ఉన్నట్లు మీరు చెప్పగలుగుతారు. కొన్నిసార్లు ఆయనకు ఒక ఇంటర్వ్యూ నచ్చి, లేదా అంతక్రితమే ఆయన చదివిన ఒక కాలమ్ గురించి చెప్పాలనిపించి, పొద్దుపోయాక నాతో ఫోన్‌లో వృత్తాంత భరితంగా మాట్లాడుతున్నప్పుడు ఆయన ముఖంలోని చిరుమంద హాసం లేదా ఆ గొంతులో తొణికిసలాడే నవ్వు నా గ్రహింపులోనికి వచ్చేవి.

సీత ఎప్పుడో గాని చెప్పిన సమయానికి చేరుకోలేరు. ఒక ఇంటర్వ్యూకి ఫలానా సమయానికి వచ్చేస్తానని మాట ఇచ్చి కూడా దారి మధ్యలో తనను కలవాలని వచ్చిన అనేక మంది కోసం కారును ఆపించేవారు. ''సమస్య చిన్నదే. వాళ్లందరూ ఆయనతో మాట్లాడాలని ఆశపడతారు. అందుకు ఆయన ఎప్పుడూ నిరాకరించరు'' అని ఇంటర్వ్యూకు ఆయను తీసుకువచ్చేందుకు వెళ్లిన నా సహచరులు చెప్పేవారు.

'కాదు' అని సీత ఎప్పుడైనా నాతో అన్నట్లు గుర్తు లేదు. సాధారణంగా జర్నలిస్టులు చేసే విధంగానే, ఇతర రాజకీయ నాయకులు ఏ మాత్రం సంకోచించకుండా తిరస్కరించే అసంభవమైన విజ్ఞప్తులను నేను సీతకు చేసేవాడిని. అందుకు సీత ఎప్పుడూ వాటిని అంగీకరించటం కోసమే మార్గాలను వెతికే ప్రయత్నం చేసేవారు. కొన్నిసార్లు తన భార్య సీమ వైపు నుంచి చేయించే విన్నపాలను మన్నించేవారు. ఇన్ని విధాలుగా ఆయన నాకు ఎల్లప్పుడూ గుర్తుంటారు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

గుర్తుపట్టేస్తాయి!



ఏనుగులు జ్ఞాపకశక్తికి ప్రసిద్ధి. అవి తరచు ఒకే తోవను ఉపయోగిస్తాయి. అటవీ ప్రాంతంలో జాతీయ రహదారిపై ఏనుగులు రోడ్డు దాటుతూ కనిపిస్తే, ఆ సమీపంలోనే వాటి కోసం వేసిన జీబ్రా లైన్స్ కూడా ఉంటాయి చూడండి. ఆ గీతల ఆధారంగా ఏనుగుల పూర్వపు కదలికల చరిత్రను రికార్డు చేయవచ్చు.

– పర్వీన్ కాశ్వాన్, ఐ.ఎఫ్.ఎస్. అధికారి

మన దగ్గరైతేనా!



అమెరికా అధ్యక్షుడు బైడెన్‌ను వ్యతిరేకించే అభ్యర్థితో 'వ్యక్తిగత సంబంధం' కలిగివున్న కారణంగా ప్రసిద్ధ 'న్యూయార్క్ మ్యాగజీన్' తన రిపోర్టర్‌ను ఉద్యోగం నుంచి తొలగించింది! భారతదేశంలో అయితే ప్రతిపక్ష రాజకీయ నాయకులను వివాహం చేసుకున్న జర్నలిస్టులు ఏకంగా ప్రైమ్ టైమ్ యాంకర్‌లు. వారి జర్నలిజాన్ని ఎవరూ ప్రశ్నించరు.

– అభిషేక్ బెనర్జీ, కాలమిస్ట్

చేయనిదే లేదట!



గత ఆరు నెలలుగా అన్ని కృత్రిమ మేధ (ఏఐ) వేదికలను పరిశీలిస్తున్నాను. వాటిని ఎన్ని రకాలుగా వాడొచ్చో జనాలకు ఇంకా తెలియకపోవడం ఆశ్చర్యం కలిగించింది. ఏఐ అత్యుత్తమ ఉద్యోగాలను వెతికి పెట్టడంలో సాయపడుతుంది, ఆదాయాన్ని మూడింతలు చేస్తుంది, జుట్టు రాలడాన్ని అరికడుతుంది, ఆఖరికి కాలేయ నిర్విషీకరణకు కూడా ఉపయోగపడుతుంది.

– అనింద్యో చక్రవర్తి, వ్యంగ్య వ్యాఖ్యాత

ఆలూ మాయం!



మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేయటానికి వెళ్లిన మంత్రి గారికి ఆలుగడ్డ కూర వడ్డించారు. అందులో ఆలుగడ్డ లేదు. నీళ్లు మాత్రమే ఉన్నాయి! ఇదీ మధ్యప్రదేశ్ ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న ఆహారం!

– సుప్రియా శ్రీనేత్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి

ఇప్పుడేమంటారు?



తాజ్‌మహల్ వద్ద కోతుల బెడద లేనే లేదనీ, గత ఏడాది కాలంలో పర్యాటకులు ఎవరూ ఫిర్యాదు చేయలేదనీ 'ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా' సమర్థించుకుంటోంది. కానీ సెప్టెంబర్ 21న తూర్పు ద్వారం వద్ద కోతుల దాడికి గురైన ఈ పర్యాటకురాలిని చూడండి! ఎలాంటి వైద్యం అందకుండానే ఆ మహిళ అక్కడి నుంచి వెళ్లాల్సి వచ్చింది. (వీడియోను జత చేస్తూ)

– దీపక్ లవానియా, జర్నలిస్ట్

ఇదీ తేడా!



'ఏదో ఒకనాటికి ధనవంతుడిని కావాలి' – ఒక పేదవాడు. 'ఫలానా మొత్తాన్ని, ఫలానా తేదీ లోపు, ఫలానా ప్రణాళిక ప్రకారం సంపాదించాలి' – ప్రతి ధనవంతుడు.

– నీతూ ఖండేల్‌వాల్, ఇన్వెస్టర్

గాంధేయ నిర్మాణ కార్యక్రమ సారథి


అనుబంధం



జి.వి. సుబ్బారావు

భారత స్వాతంత్ర్య సమరంలోనే కాక, ఆ తర్వాత దేశ నిర్మాణ కార్యక్రమంలోనూ పాల్గొని సుదీర్ఘ కాలం దేశ సేవ చేసిన అరుదైన మనీషి లవణం. గాంధీజీ నిర్వహించిన ఉప్పు సత్యాగ్రహ సమయంలో (1930 అక్టోబర్ 10) జన్మించినందున ఆయనకు తండ్రి గోపరాజు రామచంద్రరావు (గోరా) 'లవణం' అని పేరు పెట్టారు. నాస్తిక వాదిగా, గాంధేయ వాదిగా; కుల, మత, వర్గ రహిత నవ సమాజ నిర్మాణానికి కంకణం కట్టుకొని ఆధ్యాత్మిక, ఆచార, సంప్రదాయాలను ఎదిరించి జీవితాంతం పని చేశారు లవణం.

జాతీయ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా గోరా పనిచేస్తున్న సమయంలో పదేళ్ల వయసు ఉన్న లవణం సేవాగ్రామ్‌లో ఉండేవారు. ఆశ్రమానికి వచ్చిన అతిథులకు అల్పాహారం, భోజనం ఏర్పాట్లు చేస్తూ ఉండేవారు. హిందీ, ఇంగ్లీష్, తెలుగు భాషల్లో అపారమైన వాగ్ధాటి కలిగిన వ్యక్తి లవణం. చిన్నతనం నుండి ఎన్నో కష్టాలను అనుభవిస్తూ అంచెలంచెలుగా విజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ దేశ విదేశాలలో మానవతా, గాంధేయ వాదాలను ప్రచారం చేస్తూ తన జీవనాన్ని కొనసాగించారు. 1955లో ఆచార్య వినోబా భావే ఆంధ్ర, హైదరాబాద్ రాష్ట్రాల పర్యటనలో చేసిన హిందీ ప్రసంగాలను సరళమైన తెలుగులోకి అనువదించారు. అలాగే సర్వోదయ సాహిత్యాన్ని హిందీ నుండి తెలుగులోకి అనువదించారు. భూదాన పత్రికకు సంపాదకులుగా ఉన్నారు. గుర్రం జాషువా కుమార్తె హేమలతతో వీరికి ఆదర్శ వివాహం జరిగింది. వీరిద్దరూ చంబల్ లోయ బందిపోట్లకు హృదయ పరివర్తన కల్పించే ఉద్యమంలో వినోబా, జయప్రకాశ్ నారాయణ్‌ల ప్రభావంతో మధ్యప్రదేశ్‌లో పనిచేశారు. అలాగే నిజామాబాద్ జిల్లాలో 'జోగిని' వ్యవస్థను రూపుమాపడానికి ఓ స్వచ్ఛంద సంస్థ ద్వారా కృషి చేశారు. స్టూవర్టుపురంలో పునరావాస కేంద్రాన్ని నెలకొల్పి అక్కడ ఖైదీలతో సహజీవనం కొనసాగిస్తూ వారిని దోపిడీలు, దొంగతనాల నుంచి మరల్చారు. ప్రభుత్వంతో మాట్లాడి వారిపై కేసులను ఎత్తివేయించి వాళ్ల కాళ్లపై వారు నిలబడేలా సహాయ సహకారాలు అందించారు. ఆ విషయంలో హేమలత –లవణం దంపతుల సేవలు చిరస్మరణీయం.



లవణం

గాంధేయవాదం, సర్వోదయ, మానవతావాదాలను నమ్మిన వ్యక్తిగా లవణం దేశంలోని అన్ని రాష్ట్రాలలో పర్యటించారు. అనేకమందిలో మార్పు తేవడానికి విశేష కృషిచేశారు. దండకారణ్యం, జార్ఖండ్ అడవులను సైతం ఆరోగ్యం లెక్క చేయక తిరిగారు.

హేమలత మరణానంతరం (2008) లవణం చాలా విచారంతో నిస్సహాయ స్థితికి వెళ్లినా, నేను చేపట్టిన కార్యక్రమాలకు తప్పక హాజరవుతూ ప్రోత్సహించేవారు. గాంధేయ నిర్మాణ కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టి విజయం సాధించినందుకు, గాంధీజీ ఆశయాలను ప్రజలకు... ముఖ్యంగా యువత, విద్యార్థులకు అందిస్తున్నందుకు లవణానికి ప్రతిష్ఠాత్మకమైన 'జాతీయ జమునాలాల్ బజాజ్' అవార్డు లభించింది. అలాగే 2006లో నాగపూర్ విశ్వవిద్యాలయం వారి మహాత్మా గాంధీ అవార్డు ఆయన అందుకున్నారు. సంఘసంస్కర్త, ఆదర్శవాది, నాస్తికవాది, గాంధేయవాది అయిన లవణం చివరికి 2015 ఆగస్టు 14న తుదిశ్వాస విడిచారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆయన ఆశయాల కొనసాగింపు ఆవశ్యకత ఎంతైనా ఉంది.

వ్యాసకర్త తెలంగాణ గాంధీ స్మారక నిధి అధ్యక్షులు I 94402 96710

పట్టనట్లు నెహ్రూ... పంతంతో పటేల్!

అభిప్రాయం



జిల్లా గోవర్ధన్

కొన్ని చారిత్రక సంఘటనలు దశాబ్దాలు దాటినా కూడా చర్చనీయాంశాలుగా కదలాడుతూనే ఉంటాయి. అలాంటి అంశమే 1948లో జరిగిన హైదరాబాద్ యాక్షన్. 'ఇండియా ఇండిపెండెన్స్ యాక్ట్' ద్వారా భారత ఉపఖండాన్ని భారత్, పాక్‌లుగా విభజిస్తున్నట్టు అప్పటి బ్రిటిష్ ప్రధాని క్లెమెంట్ అట్లీ 1948 జూన్ 3న ప్రకటించి ఉపఖండంలోని 562 రాచరిక రాజ్యాలు ఇక నుండి ఏదో ఒక దేశంలో విలీనం అవొచ్చు లేదా, స్వతంత్రంగా ఉండొచ్చు అని తేల్చి చెప్పారు. దీనికి హైదరాబాదు 7వ నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ జూన్ 11న స్పందిస్తూ, హైదరాబాదు సంస్థానం స్వతంత్ర ఇస్లామిక్ దక్కన్ రాష్ట్రంగా ఉంటుందని ప్రకటించారు. వెంటనే ముస్లిం లీగ్ నాయకుడు మహమ్మద్ అలీ జిన్నా, ''నిజాం ప్రతిపాదనకు బేషరతుగా పాకిస్తాన్ మద్దతుంటుంది'' అని తెలిపారు. దాంతో 82,688 చదరపు మైళ్ల విస్తీర్ణంలో, 85 శాతం హిందూ, 13 శాతం ముస్లిం జనాభాతో ఉన్న హైదరాబాదు ముమ్ముందు ప్రజాస్వామ్య, లౌకిక, స్వతంత్ర భారతదేశానికి కొరకరాని కొయ్యగా మారుతుందని అప్పటి రాజకీయ నేతలు ఊహించారు.



పటేల్, నెహ్రూ

ఆ క్రమంలో రాచరిక రాష్ట్రాల రాజులు 'ఛాంబర్ ఆఫ్ ప్రిన్సెస్' కూటమిగా ఏర్పాటై, 1947 ఆగస్టు తర్వాత తమ తమ 'ఇలాఖా'లను భారతదేశంలో విలీనం చేశారు. కశ్మీరు, జునాఘఢ్, హైదరాబాదు రాష్ట్రాలు మాత్రం దీనికి ససేమిరా అన్నాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ హైదరాబాదును భారత్‌లో కలపడానికి వీల్లేదని ప్రకటించిన 'మజ్లిస్–ఎ–ఇత్తెహాదుల్–ముస్లిమీన్' నేత ఖాసీం రిజ్వీ 1948 ఫిబ్రవరి నుండి రెండు వేల మంది ముస్లిం రాడికల్ యువకులను గ్రామీణ ప్రాంతాల్లో హిందువులపై అరాచకాలకు, స్త్రీలపై అనేక అమానుష చర్యలకు పురిగొలిపాడు. ఇదేమీ పట్టనట్టుగా ఉండిపోయాడు మీర్ ఉస్మాన్ అలీ. హైదరాబాదులో హిందువులపై జరుగుతున్న హత్యాచారాలను భారత ప్రభుత్వం అరికట్టాలని ఉపప్రధాని సర్దార్ పటేల్ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ మీటింగులో గళ మెత్తారు. అయినా ప్రధాని నెహ్రూ, ఆయన విధేయులు నోరు మెదప లేదు!

భారత్‌పై మిలిటరీ దాడికి 1948 జూన్ నుండే నిజాం ప్రభుత్వం ఐరోపా నుండి మెషీన్ గన్స్, గ్రెనేడ్లు, ఫైటర్ విమానాలను కరాచీ (పాకిస్తాన్)కి, అటునుండి సముద్రం ద్వారా పోర్చుగీసు ఆధీనంలోని గోవాకు తరలించి, ఆ తర్వాత హైదరాబాదుకు చేరవేయటం ఆరంభించింది. ఇక సమయం 'బర్బాద్' చేస్తే నష్టమే అనుకుని, తన సన్నిహితులు వి.పి.మీనన్, హెచ్.వి. అయ్యంగార్, డిఫెన్స్ సెక్రటరీ హెచ్.ఎం. పటేల్ పర్యవేక్షణతో 'ఆపరేషన్ పోలో' అనే సీక్రెట్ కోడ్‌తో హైదరాబాదుపై విరుచుకుపడటం కోసం పథకం వేశారు వేశారు 'ఉక్కు మనిషి' పటేల్. ఆర్మీ జనరల్ జయంతో నాథ్ చౌధరీ ఇన్‌చార్జిగా పుణె కంటోన్మెంటులో సరిపడా యుద్ధ సామగ్రి, గోర్ఖా రైఫిల్స్, బర్మా బెటాలియన్ ఫౌజీలను ఆగస్టు నెలలోనే సిద్ధం చేశారు. ఆపరేషన్‌కు ముందు సెప్టెంబర్ 8న కేబినెట్ మీటింగులో, ''పరిస్థితి చేయి దాటక ముందే హైదరాబాదును ముట్టడించాలి. దేశం నడి బొడ్డులోని ఈ పుండును ఇలా వదిలేస్తే రాబోయే రోజుల్లో చాలా ప్రమాదకరం'' అని తేల్చేసిన పటేల్‌పై చిందులు తొక్కారు నెహ్రూ! ఆయనతో వాదించదలచుకోలేదు సర్దార్. 1948 సెప్టెంబర్ 12న షోలాపూర్ దగ్గర గంగాపూర్ రైల్వే స్టేషన్‌లో కొందరు హిందువులను రజాకార్లు, భారత భూభాగంలో చొరబడి హతమార్చారు. ఈ వార్త ఢిల్లీ చేరటమే తడవు, ఆపరేషన్ పోలోకు గ్రీన్ సిగ్నల్ పంపారు.


మరుసటి రోజు, సెప్టెంబర్ 13న ఉదయం 4 గంటల నుండి భారత బలగాలు బళ్లారి, షోలాపూర్, అహ్మద్‌నగర్, విజయవాడ మీదుగా నైజాం స్టేట్ నలువైపులా సరిహద్దులను దాటుతూ హైదరాబాదు నగరం వైపు కదిలాయి. ఈ ఆకస్మిక ఆక్రమణకు నీరుగారి పోయాడు నిజాం ఆర్మీ చీఫ్ మహమ్మద్ ఇద్రూస్. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న యుద్ధ సామగ్రిని వాడే శిక్షణ లేక పోవటంతో వారి తుప్పుపట్టిన తుపాకులు, జీపులు భారత సైన్యాన్ని ఎదుర్కోలేక పోయాయి. సెప్టెంబరు 17 మధ్యాహ్నం సికింద్రాబాదు కంటోన్మెంట్‌కు 5 కిలోమీటర్ల దూరానికి చేరుకుంది ఇండియన్ ఆర్మీ. పరిస్థితి క్షీణించటంతో ఉస్మాన్ అలీ ఖాన్, ఆర్మీ చీఫ్ ఇద్రుస్ ద్వారా కాల్పుల విరమణ ఒప్పందం కోసం కాళ్ల బేరానికి వచ్చాడు. అదే రోజు సాయంత్రం 6 గంటలకు నిజాం రాజు ఉస్మాన్ అలీఖాన్ రేడియో ప్రసంగం ద్వారా తన ప్రభుత్వాన్ని రద్దుచేసి, భారత సైనిక బలగాలకు లొంగిపోయినట్టు ప్రకటించారు.

వ్యాసకర్త విశ్రాంత అధికారి, ముంబై
(2023లో విడుదలైన జాన్ జుబ్రిచ్చికి 'దీథ్రోన్డ్: పటేల్, మేనన్ అండ్ ది ఇంటిగ్రేషన్ ఆఫ్ ప్రిన్స్‌లీ ఇండియా' ఆధారంగా.)

'మంత్ర హీనం...'

భక్తుడు ప్రతిరోజూ ఇష్టదేవతా విగ్రహం ముందు కూర్చొని, షోడశోపచార పూజ చేస్తానని ఆర్భాటంగా సంకల్పించి, చివరికి 'మంత్ర హీనం, క్రియా హీనం, భక్తి హీనం...' అని తేల్చేస్తాడు.

''స్వామీ, నేను చేసిన పూజలో వేదమంత్రాలూ, మంత్ర బలం, ఉచ్చారణ శుద్ధీ ఇత్యాదులేవీ లేవు. నా పూజ 'క్రియా హీనం' కూడా. పదహారు ఉపచార క్రియలు చేస్తానన్నాను, కానీ సగం పైగా ఉపచారాలు అక్షతలతో సరిపెట్టేశాను. అంతేకాదు, నా పూజలో నీ మీద చూపవలసినంత భక్తిని కూడా చూపలేక పోయాను. అయినా ఈ అసంపూర్ణమైన పూజనే పరిపూర్ణంగా భావించు!'' అని చేతులు జోడిస్తాడు.



జ్యోతిర్మయం

మరి ఈ గడుసుతనానికి భగవంతుడు లొంగిపోయి, సగం సగం పూజనే సంపూర్ణ మని స్వీకరిస్తాడా?

భక్తుడికి చిత్తశుద్ధీ, శ్రద్ధా, భక్తీ ఉంటే తప్పక స్వీకరిస్తాడు అనే శాస్త్రాల మాట. మంత్రాలూ, ద్రవ్యాలూ ముఖ్యం కాదు. 'పత్రమో, పుష్పమో, ఫలమో, జలమో ఏదయినా సరే, భక్తితో సమర్పిస్తే స్వీకరిస్తాను' అని భగవంతుడిచ్చిన హామీ 'గీత'లో ఉంది.

'ఎంత భక్తి? ఎంత శ్రద్ధ?' అని ప్రశ్న వేస్తే, 'యథా శక్తి' అని జవాబు. అశక్యమైన అనుష్ఠానం చేయమని ఏ శాస్త్రమూ చెప్పదు. శక్తివంచన లేకుండా చేసి ఆపైన 'స్వామీ! ఇంతకు మించి నాకు చేతకాదు!' అని స్వామి చరణాల శరణు వేడమంటుంది. భగవంతుడు తన ఎదుట నిలిచి ఉన్నాడు అని అనుభవిస్తూ, ఆయనను ఆరాధించటం ముఖ్యం అంటుంది.

అయితే శక్తి దాచుకొని, పైపై పూజలు చేస్తే, ఆ పూజల ఫలితం కూడా అంతంత మాత్రంగానే ఉంటుందని అనుభవం. అందుకే కొందరు భక్తుల పూజలు ఫలిస్తాయి. కొందరికి కొంత ఫలం లభిస్తుంది. కొందరి పూజలు నిష్ఫలమౌతాయి.

కానీ, అసలు గడుసుతనం ఆ భగవంతుడిదే. పరిపూర్ణమైన భక్తి ఏర్పడిన వాడికి తీరవలసిన కోరికలే మిగల్చడు. ఆ భక్తుడి పూజల ఫలం అంతా పరమే శ్వరార్పణమే. అతగాడి యోగక్షేమాలన్నీ ఆయన బాధ్యతే.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, **తిథి:** బ.షష్ఠి రా.7.26 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** రోహిణి తె.4.16 వరకు (తెల్లవారితే మంగళవారం), తదుపరి మృగశిర, **వర్జ్యం:** రా.8.35 నుండి 10.07 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.19 నుండి 1.07 వరకు, తదుపరి ప.2.43 నుండి 3.31 వరకు, **అమృతఘడియలు:** రా.1.20 నుండి 2.51 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.52, **సూర్యాస్తమయం:** 5.55.

క్లుప్తంగా...

యాదాద్రిలో భక్తుల రద్దీ



ఆలయ మాడ వీధిలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవు కావడంతో వివిధ ప్రాంతాల భక్తులు యాదాద్రికి అధికంగా వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, మాడ వీధులు, ప్రసాద విక్రయశాల, బస్టాండ్ కిటకిటలాడాయి. శ్రీస్వామి వారి ధర్మ దర్శనానికి సుమారు 3 గంటలు.. వీఐపీ దర్శనానికి గంట పట్టిందని భక్తులు తెలిపారు. శ్రీస్వామిని 30వేల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారు. వివిధ పూజల ద్వారా శ్రీస్వామి వారికి రూ.30,75,287 నిత్యాదాయం వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు.

అప్పులతో రైతు ఆత్మహత్య



మల్లేశం

కొమురవెల్లి(సిద్దిపేట): అప్పుల బాధతో ఒక రైతు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం రాంసాగర్‌లో ఆదివారం జరిగిన ఈ సంఘటన పై ఎస్ఐ రాజుగౌడ్ తెలిపిన వివరాలివి. గ్రామానికి చెందిన తాడూరి మల్లేశం (52) గతేడాది గ్రామంలో నూతన గృహ నిర్మాణానికి సుమారు రూ.5 లక్షల వరకు అప్పులు చేశాడు. తనకున్న రెండెకరాల పొలంలో వ్యవసాయం చేయడం వల్ల అప్పుల తీరడం లేదన్న మనస్తాపంతో.. శనివారం సాయంత్రం పురుగు మందు తాగాడు. గమనించిన భార్య వజ్రమ్మ స్థానికుల సహకారంతో వెంటనే మల్లేశాన్ని చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన వైద్యానికి సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా..చికిత్స పొందుతూ మృతి చెందాడు.

కాస్తయితే గల్లంతే..

- వాగు ప్రవాహంలో చిక్కుకున్న వ్యక్తిని కాపాడిన గ్రామస్తులు



తూర్పుగూడెం వద్ద వాగుపై కల్వర్టు అంచున ఆగిన కారు

టేకులపల్లి: వాగు ప్రవాహ ఉధృతిని అంచనా వేయకుండా ముందుకు వెళ్లిన ఓ వ్యక్తి వరద నీటిలో చిక్కుకోగా.. ఆయన కేకలు విన్న స్థానికులు అక్కడికి చేరుకుని కాపాడారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతానగర్ మండలం సర్వారం గ్రామానికి చెందిన కొమరం బుచ్చయ్య ఆదివారం తెల్లవారుజామున తన కారులో తూర్పుగూడెం, టేకులపల్లి మీదుగా హైదరాబాద్ వెళ్తున్నారు. అయితే, శనివారం రాత్రి కురిసిన వర్షానికి తూర్పుగూడెం సమీపాన ఉన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ విషయం తెలియక బుచ్చయ్య కారులో వెళ్తుండగా కల్వర్టుపై ప్రవాహ వేగానికి అదుపుతప్పి వాగులోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో ఆయన బ్రేక్ వేయడంతో కారు బ్రిడ్జి అంచుపై నిలిచింది. దీంతో బుచ్చయ్య కేకలు వేస్తుండగా తూర్పుగూడెం యువకులు, పొలానికి వెళ్తున్న రైతులు అక్కడికి చేరుకుని ఆయనను కారుతో సహా బయటకు తీసుకువచ్చారు.

సినీ ఫక్కీలో భారీ చోరీ

- రూ.2 కోట్లు, 35 తులాల ఆభరణాలు అపహరణ

పోచారం: పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో సినీ ఫక్కీలో భారీ చోరీ జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలివి. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని మక్తలో నివసిస్తున్న బైనగారి నాగభూషణం (70) ఆదివారం తెల్లవారుజామున నాలుగున్నర గంటల సమయంలో పాలు తీసుకొచ్చేందుకు నారపల్లిలోని ఫామ్ హౌస్‌కు వెళ్లారు. భార్య పద్మ నిద్రపోతుండటంతో.. ఇంటి తలుపు గడియ పెట్టి బయటికొచ్చారు. ఇదే అదనుగా దొంగలు ఆయన ఇంట్లో ప్రవేశించి నగదు, నగలు దోచుకెళ్లారు. కాసేపటి తర్వాత భార్య మేల్కొని చూడగా తలుపులు తెరచి ఉన్నాయి. ఇంట్లోని డ్రెసింగ్ టేబుల్ దగ్గర పెట్టిన రూ.2 కోట్ల నగదు సంచి, డ్రెస్సింగ్ టేబుల్‌లో దాచిన 35 తులాల బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే భర్తకు విషయం తెలియజేసి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. శంకర్‌పల్లిలో నాగభూషణం తన 10 ఎకరాల భూమి విక్రయ ప్రక్రియలో భాగంగా.. ఈ నెల 18వ తేదీన అడ్వాన్సుగా రూ.2 కోట్లు తీసుకున్నారు. అదే డబ్బును సోమవారం మరో వ్యక్తికి ఇవ్వాల్సి ఉండటంతో.. బ్యాంకులో జమ చేయకుండా ఇంట్లోనే ఉంచారు. సంఘటన స్థలానికి మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి, సీఐ రాజు, క్లూస్ టీం చేరుకొని ఆధారాలు సేకరించారు. పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి దుండగుల కోసం గాలిస్తున్నారని ఏసీపీ చెప్పారు. డ్రైవర్ రవితో పాటు పలువురు నిందితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిపారు. బాధితుని ఇద్దరు కొడుకులు, కుమార్తె అమెరికాలో ఉంటున్నారు.

మళ్లీ హైడ్రా పంజా

- కిష్టారెడ్డిపేట్, పటేల్‌గూడల్లో అక్రమ నిర్మాణాల కూల్చివేత
- రాత్రి వరకు కొనసాగిన ప్రక్రియ



కిష్టారెడ్డిపేట్‌లో భవనాల కూల్చివేత

పటాన్‌చెరు: ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేశారంటూ హైడ్రా అధికారులు సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని కిష్టారెడ్డి పేట్, పటేల్‌గూడలలో భవంతులను నేలమట్టం చేశారు. అమీన్‌పూర్ రెవెన్యూ అధికారుల నివేదిక మేరకు హైడ్రా అధికారులు ఆయా నిర్మాణాలను కూల్చివేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి కూల్చివేతల ప్రక్రియను చేపట్టారు. కిష్టారెడ్డిపేట్‌లో మూడు పెద్ద భవనాలను, పటేల్‌గూడలో 22 విల్లాలను కూల్చివేశారు. ఈ ప్రక్రియ ఆదివారం రాత్రి వరకూ కొనసాగుతూనే ఉంది. కూల్చివేతల కోసం భారీ క్రేన్లను వినియోగించారు. అమీన్‌పూర్ రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులు కూల్చివేత ప్రక్రియలో పాల్గొన్నారు. పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పటేల్‌గూడలో విల్లాలు నిర్మించిన యజమాని అధికారులతో వాగ్వాదానికి దిగారు. నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయని చెప్పారు. అయితే తాము ప్రభుత్వ భూమి పరిధిలోకి వచ్చే నిర్మాణాలను మాత్రమే కూల్చివేస్తున్నామని తహసీల్దార్ రాధ ఆయనకు వివరించారు. విల్లాల నిర్మాణానికి సర్వే నంబర్ 6 పరిధిలో అనుమతులు తీసుకొని సర్వే నంబర్ 12లో నిర్మిస్తున్నట్లు గుర్తించామని ఆమె స్పష్టం చేశారు. కాబట్టి ఎలాంటి కోర్టు స్టే ఆర్డర్ కూల్చివేతల ప్రక్రియలకు అడ్డుకాదని చెప్పారు. కిష్టారెడ్డిపేట్‌లో సర్వే నంబర్ 164లో మూడు భవంతుల నిర్మాణాలు జరిగాయని, వాటిని కూడా తొలగిస్తున్నట్లు తెలిపారు. కిష్టారెడ్డిపేట్‌లో సర్వే నంబర్ 164లో ప్రభుత్వ భూములలో నిర్మాణాలు చేశారని వారికి నోటీసులు ఇచ్చి తొలగిస్తున్నామని స్పష్టం చేశారు. కూల్చివేత ప్రక్రియకు ముందే హైడ్రా, రెవెన్యూ అధికారులు ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకుని ప్రభుత్వ భూమి పరిధిలోకి వచ్చే ప్రాంతాన్ని పరిశీలించి కూల్చివేతలకు ఉపక్రమించారు. సామాన్య ప్రజలకు, పరిసర నివాసితులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కూల్చివేతల్లో ఒక డాక్టర్ భవనం కూడా ఉండటం గమనార్హం. మరో భవనం ఏపీలోని ఒక ఎమ్మెల్యేకు సంబంధించిందని చెబుతున్నారు. ఈ సందర్భంగా బాధితులు తాము మోసపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము పాట్లను కొనుగోలు చేసి నిర్మాణాలు చేశామే తప్ప.. కబ్జా చేసి బహుళ అంతస్తులు నిర్మించలేదని వాదిస్తున్నారు.

మరిన్ని కూల్చివేతలు..

కూల్చివేతల ప్రక్రియ కొనసాగుతుందని అధికార వర్గాలు స్పష్టం చేశాయి. కిష్టారెడ్డిపేట్ పరిసర గ్రామాల పరిధిలో ప్రభుత్వ స్థలాల్లో జరిగిన నిర్మాణాల కూల్చివేతకు అధికారులు నివేదిక రూపొందించినట్లు తెలిసింది. పొరుగు గ్రామాల ప్రభుత్వ భూముల్లో కిష్టారెడ్డిపేట్ పంచాయతీ అనుమతులతో జరిగిన నిర్మాణాలపై అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. అదే గ్రామంలో చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న నిర్మాణాలను కూడా రెవెన్యూ అధికారులు గుర్తించి హైడ్రాకు నివేదిక ఇచ్చినట్లు సమాచారం.

8 ఎకరాల్లోని 44 నిర్మాణాలు కూల్చివేత

- మూడు ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగించిన హైడ్రా
- కూకట్‌పల్లి నల్లచెరువు ఎఫ్‌టీఎల్‌లోని 16 షెడ్లు
- మరో రెండు చోట్ల సర్కారు భూమిలోని విల్లాలు..
- వివరాలు వెల్లడించిన కమిషనర్ ఏవీ రంగనాథ్
- సామాన్యుల నివాసాల జోలికి వెళ్లలేదని స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: గణేశ్ ఉత్సవాలు, నిమజ్జనాల నేపథ్యంలో కొంత విరామం తర్వాత హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) తన పని పునః ప్రారంభించింది. ఆదివారం మూడు ప్రాంతాల్లోని అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన అధికారులు నల్లచెరువు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్లతో పాటు రెండు ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములను పరిరక్షించారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న 44 నిర్మాణాలను కూల్చివేయడం ద్వారా 8 ఎకరాలను కబ్జా చెర నుంచి విడిపించినట్లు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రకటించారు. అయితే ఈ మూడు ప్రాంతాల్లోనూ కొన్నింటిలో సామాన్యులు నివసిస్తున్నారని, ఆ నిర్మాణాలను కూల్చివేయకుండా నోటీసులు మాత్రమే జారీ చేశామని ఆయన స్పష్టం చేశారు. కూకట్‌పల్లిలోని సర్వే నం.66, 67, 68, 69లలో విస్తరించి ఉన్న నల్లచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు ఆక్రమణకు గురయ్యాయి. మొత్తం 27 ఎకరాల్లో ఉన్న ఈ చెరువులో నాలుగు ఎకరాల విస్తీర్ణాన్ని ఆక్రమించిన కొందరు.. 16 షెడ్లు, కాంపౌండ్ వాల్స్ నిర్మించారు. షెడ్లలో వంట శాలలు ఏర్పాటు చేసి క్యాటరింగ్ వ్యాపారం చేస్తున్నారు. వాటిలో పనిచేసే వారు కూడా ఆ షెడ్లలోనే నివాసం ఉంటున్నారు. దీనిపై ఫిర్యాదు అందుకున్న హైడ్రా అధికారులు ఆదివారం సంబంధిత అధికారులతో కలసి ఆ షెడ్లను కూల్చేశారు.

అమీన్‌పూర్ మండలంలో..

అలాగే అమీన్‌పూర్ మండలంలోని కిష్టారెడ్డిపేట్ సర్వే నం.164లో ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో ఎకరం కబ్జా చేసిన కొందరు జీ+5 విధానంలో భవనాలు నిర్మించారు. దీనిపై హైడ్రాకు ఫిర్యాదు రావడంతో విచారణ చేసిన అధికారులు, ఈ తరహాకు చెందిన మూడు నిర్మాణాలను కూల్చేసి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. అమీన్‌పూర్ మండలంలోని పటేల్‌గూడలో సర్వే నం.12/2, 12/3లలో సర్కారు భూమి కబ్జాకు గురైంది. మూడు ఎకరాల స్థలంలో కొందరు 25 నిర్మాణాలు చేపట్టారు. వీటిలో గ్రౌండ్ ఫ్లోర్‌తో నిర్మించిన విల్లాలతో పాటు బహుళ అంతస్తులతో నిర్మించినవి ఉన్నాయి. ఈ 25 నిర్మాణాలను కూల్చేసిన హైడ్రా అధికారులు.. మూడు ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్, టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలసి ఈ కూల్చివేతలు చేపట్టినట్లు రంగనాథ్ పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలాలు, జలవనరుల పరిరక్షణ కోసం హైడ్రా ఆపరేషన్లు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. కూకట్‌పల్లిలోని నల్లచెరువులో కూల్చేసిన షెడ్లు అన్నీ ఎలాంటి అనుమతి లేకుండా నిర్మించిన అక్రమ నిర్మాణాలు అని, వాటిని వాణిజ్య అవసరాల కోసం వాడుతున్నారని ఆయన తెలిపారు. అలాగే అమీన్‌పూర్ ప్రాంతంలో కూల్చేసిన మూడు బహుళ అంతస్తుల భవనాలు ప్రభుత్వ స్థలంలో ఉన్నాయన్నారు. అయితే పక్కనే ఉన్న ఓ ప్రభుత్వ భూమికి సంబంధించిన సర్వే నంబర్‌తో అనుమతులు తీసుకున్నట్లు వివరించారు. తాము కూల్చేసిన దాదాపు 27 విల్లాలు బిల్డర్‌తో పాటు ఇద్దరు ఇతరులకు చెందినవని, రెండింటిలో మాత్రమే కుటుంబాలు నివసిస్తున్నాయని, ఆ రెండింటికీ నోటీసులు ఇచ్చి వదిలేశామని వివరించారు. అలాగే కూకట్‌పల్లిలోని నల్లచెరువులోనూ కొన్ని కుటుంబాలు నివసిస్తున్న నిర్మాణాల జోలికి వెళ్లలేదని రంగనాథ్ పేర్కొన్నారు.

ఇప్పటికైతే ప్రత్యేకంగా లేదు!

- ఆరు శాఖల చట్టాల్లో మార్పులు చేర్పులు మాత్రమే
- త్వరలో ఆర్డినెన్స్ ద్వారా హైడ్రాకు ప్రత్యేక అధికారాలు
- ఈ ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసిన కేబినెట్
- అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లోపు ప్రత్యేక చట్టానికి రూపు

సాక్షి, హైదరాబాద్: రాజధానిలో జలవనరులు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం ఏర్పాటైన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కోసం ప్రత్యేక చట్టం అమలులోకి రావడానికి మరికొంత సమయం పడుతుందని తెలుస్తోంది. శాసనసభ శీతాకాల సమావేశాల లోపు దానికి రూపం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈలోపు హైడ్రాకు పూర్తి చట్టబద్ధత కల్పిస్తూ, మరింత బలోపేతం చేయడానికి ఆరు శాఖలకు చెందిన చట్టాలను సవరిస్తున్నారు. దీనికి శుక్రవారం జరిగిన కేబినెట్ సమావేశం కూడా ఆమోదముద్ర వేయడంతో త్వరలో ఆర్డినెన్స్ వెలువడనుంది. ఈ ప్రక్రియను పూర్తి చేయడానికి అధికార విభాగాలు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నాయి. రెవెన్యూ, నీటిపారుదల, పురపాలక, జీహెచ్ఎంసీ, బీపాస్, వాల్టా, ఫైర్ సర్వీసెస్ చట్టాల్లోని కీలకాంశాలను సవరించనున్నారు. వీటి కింద నోటీసులు జారీ సహా వివిధ అధికారాలను సైతం హైడ్రాకు అప్పగించనున్నారు. జీహెచ్ఎంసీ చట్టం–1955 ప్రకారం ఆక్రమణలను పరిశీలించడం, నోటీసులు ఇవ్వడం, ప్రభుత్వ స్థలాల్లో అక్రమ కట్టడాలను తొలగించడం, అనధికార హోర్డింగ్స్‌పై చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే జరిమానాలు విధించడం తదితర అధికారాలు ఇప్పటి వరకు జీహెచ్ఎంసీకి మాత్రమే ఉన్నాయి. కొత్త కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు ఏర్పాటైన తర్వాత అమలులోకి వచ్చిన తెలంగాణ పురపాలక చట్టం–2021 ప్రకారం ఆయా పురపాలికలకూ ఇవి దఖలయ్యాయి. బీపాస్ చట్టం –2020 ప్రకారం జోనల్ కమిషనర్ల నేతృత్వంలోని జోనల్ టాస్క్‌ఫోర్స్, జిల్లా కలెక్టర్ల నేతృత్వంలోని జిల్లా టాస్క్‌ఫోర్స్‌లకు ఇలాంటి అక్రమ కట్టడాలు, కబ్జాలపై చర్యలకు అధికారాలు వచ్చాయి. హెచ్ఎండీఏ చట్టం–2008లో 8, 23 ఏ సెక్షన్ల కింద ఆ విభాగం కమిషనర్‌కు కూడా విశేషాధికారాలు ఉన్నాయి. తెలంగాణ భూ ఆదాయ చట్టంలోని 1317ఎఫ్ సెక్షన్ ప్రకారం అక్రమ కట్టడాల తొలగింపు, ప్రభుత్వ ఆస్తుల సంరక్షణకు సంబంధించి రెవెన్యూ డివిజనల్ అధికారితో పాటు కలెక్టర్‌కు అధికారం ఉంటుంది. తెలంగాణ ఇరిగేషన్ యాక్ట్ 1357ఎఫ్ ప్రకారం నీటిపారుదల శాఖ అధికారి, జిల్లా కలెక్టర్‌కు జలవనరులైన చెరువులు, కుంటలు, నాలాల పరిరక్షణకు ప్రత్యేక అధికారాలు ఉంటాయి. జీవోఎంఎస్ నం.67 ద్వారా 2002లో యూడీఏలతో పాటు ఎగ్జిక్యూటివ్ అధికారులకు, తెలంగాణ భూ ఆక్రమణల చట్టం–1905లోని 3, 6, 7, 7ఏ సెక్షన్ల కింద జిల్లా కలెక్టర్, తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్‌లకూ చర్యలు తీసుకునే అధికారం ఇచ్చారు. ఈ యాక్ట్‌లతో పాటు వాల్టా చట్టం–2002, జీవోఎంఎస్–168 ప్రకారం తెలంగాణ బిల్డింగ్ రూల్స్, తెలంగాణ ఫైర్ సర్వీసెస్ యాక్ట్–1999లకూ సవరణ చేసి హైడ్రాకు అవసరమైన అధికారాలు ఇస్తున్నారు. న్యాయ విభాగం సిఫార్సుల ప్రకారం హైడ్రా గవర్నింగ్ బాడీలో చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్‌కు (సీసీఎల్ఏ) స్థానం కల్పించనున్నారు. ఈ మార్పుచేర్పులతో పాటు మరిన్ని కీలకాంశాలను హైడ్రా యాక్ట్‌లో పొందుపరచనున్నారని తెలిసింది.

రాడార్ స్టేషన్ కోసం మొత్తం చెట్లు తొలగించం

- రాష్ట్ర అటవీ సంరక్షణ ప్రధాన అధికారి డోబ్రియాల్



సాక్షి, హైదరాబాద్: వికారాబాద్ జిల్లాలోని దామగుండం అడవుల్లో తూర్పు నౌకాదళ రాడార్ స్టేషన్‌ను ఏర్పాటు చేసేందుకు 12 లక్షల చెట్లను తొలగించనున్నారని వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని తెలంగాణ అటవీ సంరక్షణ ప్రధానాధికారి రాకేశ్ మోహన్ డోబ్రియాల్ ఒక ప్రకటనలో తెలిపారు. 12 లక్షల చెట్ల తొలగింపు వార్తలన్నీ నిరాధారమైనవనీ, అసంబద్ధమైనవని ఆయన ఖండించారు. 'రాడార్ ప్రాజెక్టు నిర్మాణం కోసం కేటాయించిన మొత్తం అటవీ భూముల్లో 48 శాతం విస్తీర్ణం మాత్రమే రాడార్ స్టేషన్ నిర్మాణానికి ఉపయోగించబడుతుంది. మిగిలిన 52 శాతం విస్తీర్ణంలోని అటవీ సంపదకు ఎలాంటి హానీ జరగకుండా చర్యలు చేపడతాం. 48 శాతం అటవీ భూమిలోనూ కేవలం రాడార్ స్టేషన్ నిర్మాణానికి అవసరమైన కొన్ని చెట్లను మాత్రమే తొలగిస్తాం. స్టేషన్ నిర్మాణానికి 12 లక్షల చెట్లను తొలగించనున్నారని వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవం. మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్, ఫారెస్ట్ అండ్ క్లైమేట్ ఛేంజ్‌కు అనుబంధంగా పనిచేసే ఫారెస్ట్ అడ్వైజరీ అథారిటీ ప్రకారం 1,93,562 చెట్లను మాత్రమే రాడార్ స్టేషన్ నిర్మాణం కోసం తొలగించడం జరుగుతుందని స్పష్టం చేసింది. ఈ ప్రాజెక్టు ఏర్పాటుతో కోల్పోనున్న 1,93,562 చెట్లకు బదులుగా రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల అడవుల్లోని 2,348 హెక్టార్లలో విస్తరించి వున్న 17,55,070 చెట్లను అటవీశాఖ పునరుద్ధరించనుంది' అని డోబ్రియాల్ వివరించారు. ఈ ప్రాంతంలో 500 ఏళ్లుగా కొలువైఉన్న శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానాన్ని ప్రాజెక్టు భూసేకరణలో భాగంగా తరలిస్తున్నారనే వాదనను కూడా డోబ్రియాల్ ఖండించారు.

పునరాలోచించాలి: తమ్మినేని

దామగుండం అటవీ ప్రాంతంలో దాదాపు 3 వేల ఎకరాలలో నిర్మించనున్న రాడార్ స్టేషన్‌పై ప్రభుత్వం పునరాలోచించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కోరారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన జారీచేశారు.

మూసీలో చిక్కుకున్న పశువుల కాపరులు

- అధికారులు ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో పెరిగిన వరద
- కాపాడిన పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది



మూసీ వాగులో చిక్కుకున్న పశువుల కాపరులను కాపాడి బయటకు తీసుకొస్తున్న పోలీసులు

కేతేపల్లి: ఎలాంటి ముందస్తు హెచ్చరికలు జారీ చేయకుండా అధికారులు మూసీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో ఇద్దరు పశువుల కాపరులు వరద నీటిలో చిక్కుకుపోయారు. అయితే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది బాధితులను కాపాడి సురక్షితంగా ఒడ్డుకు తీసుకొచ్చారు. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని భీమారం గ్రామంలో ఆదివారం ఈ ఘటన జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. భీమారం గ్రామానికి చెందిన పశువుల కాపరులు సురుగు బాలస్వామి, బయ్యా గంగయ్య రోజుమాదిరిగానే ఆదివారం పశువులను మేపేందుకు గ్రామ శివారులో ఉన్న మూసీ వాగు ప్రాంతంలోకి తీసుకెళ్లారు. కాగా, హైదరాబాద్ నగరంతో పాటు మూసీ ఎగువన ఉన్న ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలతో మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పెరిగింది. ప్రాజెక్టులో నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరటంతో అధికారులు ఎలాంటి ముందస్తు హెచ్చరికలు జారీ చేయకుండా ప్రాజెక్టు మూడు క్రస్టు గేట్లను పైకెత్తి నీటిని విడుదల చేశారు. దీంతో మూసీ ప్రాజెక్టు దిగువనున్న భీమారం వద్ద మూసీ వాగులో ఒక్కసారిగా వరద ఉధృతి పెరగడంతో బాలయ్య, గంగయ్య వెంటనే తేరుకుని పశువులతో సహా వాగు మధ్యలో ఉన్న పెద్ద రాతిబండపైకి చేరుకున్నారు. అదే సమయంలో వాగు వద్ద ట్రాక్టర్‌లోకి ఇసుక ఎత్తుతున్న కూలీలు వరద ఉధృతి పెరగటం గమనించి వెంటనే దూరంగా వెళ్లి ప్రాణాలు కాపాడుకున్నారు. ట్రాక్టర్ మాత్రం వాగులోని నీటిలో మునిగిపోయింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, కేతేపల్లి ఎస్ఐ శివతేజ, తహసీల్దార్ ఎన్. మధుసూదన్‌రెడ్డి హుటాహుటిన ఘటనా స్థలం వద్దకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మూసీ ప్రాజెక్టు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి గేట్లు మూసివేయించారు. ఒక వైపు సహాయక చర్యలు కొనసాగుతుండగానే పశువులు నీటిలో ఈదుకుంటూ సురక్షితంగా ఒడ్డుకు చేరాయి. పోలీసులు జేసీబీని వాగులోకి దింపి పశువుల కాపరులను బయటకు తీసుకొచ్చేందుకు ప్రయత్నించినప్పటికీ వరద ప్రవాహం ఎక్కువగా ఉండటంతో వీలు కాలేదు. సూర్యాపేట ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని తాళ్లు, సేఫ్టీ జాకెట్ల సహాయంతో వాగులోకి వెళ్లి పశువుల కాపరులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు.

బీసీ రిజర్వేషన్లు పెంచకపోతే ప్రభుత్వంతో యుద్ధమే: ఆర్.కృష్ణయ్య



అఖిలపక్ష, బీసీ, కుల సంఘాల సమావేశంలో ఆర్. కృష్ణయ్య తదితరులు

లక్డీకాపూల్ (హైదరాబాద్): రాష్ట్రంలో స్థానిక సంస్థల రిజర్వేషన్లు పెంచకపోతే ప్రభుత్వంతో యుద్ధానికి సిద్ధమని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. రిజర్వేషన్లు పెంచకుండా ప్రభుత్వం బీసీలతో చెలగాటమాడుతోందన్నారు. ఆదివారం స్థానిక అశోకా హోటల్‌లో అఖిలపక్ష, 30 బీసీ సంఘాలు, బీసీ ఉద్యోగ సంఘాలు, 80 కుల సంఘాల రాష్ట్రస్థాయి సమావేశం తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ లాల్ కృష్ణ అధ్యక్షతన జరిగింది. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, బీఎస్పీ, టీడీపీ తదితర పార్టీల నాయకులు పాల్గొన్న సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల వాగ్దానం ప్రకారం బీసీ రిజర్వేషన్లను 20 శాతం నుంచి 40 శాతానికి పెంచాలన్నారు. ఈ విషయంలో ఇండియా కూటమి ద్వారా ప్రైవేట్ బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. బీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించే అంశంలో రాజ్యాంగ సవరణ చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వరంగ సంస్థలలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ప్రస్తుతం ఉన్న 12 బీసీ కుల ఫెడరేషన్లను బీసీ కార్పొరేషన్లుగా మార్చాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, శాసనసభ మాజీ స్పీకర్ మధుసూదనాచారి పాల్గొన్న సమావేశంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు జగన్‌మోహన్, కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జయంత్‌రావు, జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడు వేముల వెంకటేశ్, నాయీ బ్రహ్మణ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దామగుండంను రక్షించుకుందాం

- నేవీ రాడార్ స్టేషన్‌కు వ్యతిరేకంగా పలువురు వక్తల పిలుపు

కవాడిగూడ (హైదరాబాద్): అడవులను కాపాడుకునే విషయంలో ప్రజలని పాలకులు మళ్లీమళ్లీ మోసం చేస్తున్నారని, దేశంలోనే అతిపెద్ద అటవీ విధ్వంసకాండ జరుగుతుంటే ప్రధాన రాజకీయ పార్టీలు ఎందుకు పట్టించుకోవడం లేదని పలువురు మేధావులు ప్రశ్నించారు. ఆదివారం సేవ్ దామగుండం జేఏసీ ఆధ్వర్యంలో నేవీ రాడార్ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్, ప్రముఖ పర్యావరణవేత్త దుశర్ల సత్యనారాయణ, సినీ దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, మాజీ ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, మెతుకు ఆనంద్, బీఆర్ఎస్ నేత చెరుకు సుధాకర్, పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య, ప్రజా గాయకురాలు విమలక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని, అభివృద్ధిని బ్యాలెన్స్ చేయకపోతే ప్రకృతి విలయాలు చూడాల్సి వస్తుందన్నారు. పర్యావరణవేత్త దుశర్ల మాట్లాడుతూ, పర్యావరణాన్ని ప్రజల ఆస్తిగా భావించాలన్నారు. తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు ఆగిపోయేలా కోర్టుల్లో కార్యాచరణ ఉండాలన్నారు. జేఏసీ కోఆర్డినేటర్ రామన్న మాదిగ మాట్లాడుతూ, దామగుండం అడవుల్లో గొర్రెలు, బర్రెలు తిరుగుతూ అటవీ ప్రాంతాన్ని నాశనం చేస్తున్నాయని ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి మాట్లాడటం బాధాకరమన్నారు.

ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో మాంగళ్య షాపింగ్ స్టోర్



మాంగళ్య షాపింగ్ స్టోర్‌ను ప్రారంభిస్తున్న హీరోయిన్ కీర్తి సురేశ్

చిక్కడపల్లి: ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో ఆదివారం మాంగళ్య షాపింగ్ మాల్ 20వ స్టోర్‌ను సినీ హీరోయిన్ కీర్తి సురేశ్ జ్యోతివెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాంగళ్య షాపింగ్ మాల్ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అధునాతన, నాణ్యమైన కలెక్షన్స్‌తో అతిపెద్ద స్టోర్‌గా అవతరించిందన్నారు. షాపింగ్ మాల్ డైరెక్టర్లు పీఎస్ మూర్తి, కాసం నమఃశివాయ, కాసం మల్లికార్జున్, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పుల్లూరు అరుణ్‌కుమార్‌లు మాట్లాడుతూ, గత 12 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ఇప్పటివరకు 20 స్టోర్‌లను ప్రారంభించామని, త్వరలోనే నార్సింగి, మణికొండలలో నూతన స్టోర్‌లను ప్రారంభించబోతున్నామన్నారు. అధునాతనమైన వస్త్రాలను అందుబాటులో ధరలో వినియోగదారులకు అందిస్తున్నామని చెప్పారు.

ఆఖరి మజిలీకి అంతులేని అవస్థలు



రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి వరద నీటి నుంచి మృత దేహాన్ని తీసుకెళ్తున్న స్థానికులు

తాండూర్: ఆఖరి మజిలీకి సైతం అవస్థలు తప్పడం లేదు. మంచిర్యాల జిల్లా తాండూర్‌లో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి స్థానిక రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి వరద నీటితో నిండిపోయి.. రాకపోకలు సాగించలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. తాండూర్ వాల్మీకి నగర్‌కు చెందిన ముస్కె రాజం (55)ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. మధ్యాహ్నం అంతిమయాత్ర చేపట్టారు. కానీ మరో మార్గం లేక వరద నీటితో నిండిన రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి నుంచి ఇబ్బందులు పడుతూ మృతదేహాన్ని దహన సంస్కారాలకు తీసుకువెళ్లారు.

నల్లచెరువు కట్టకు గండి

- గోపాలపురం, బూరుగడ్డ, కరక్కాయలగూడెంకు నిలిచిపోయిన రాకపోకలు



బూరుగడ్డ నల్లచెరువుకు పెట్టిన గండి

హుజూర్‌నగర్ రూరల్: ఇటీవల కురిసిన వర్షాలకు సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డలోని దెబ్బతిన్న నల్లచెరువు కట్టకు మాజీ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ తన సొంత ఖర్చులతో తాత్కాలికంగా మరమ్మతులు చేసేందుకు ట్రెంచ్ కట్టవేసి నీటిని స్టోరేజీ చేస్తున్నారు. శనివారం కురిసిన భారీ వర్షానికి వరద నీటితో పాటు సాగర్ కాల్వ నీరు ఎక్కువగా రావడంతో పోసిన మట్టి కొట్టుకుపోయే ప్రమాదం ఉన్నందున ప్రత్యామ్నాయ మార్గం కోసం చెరువుకట్టకు గండి పెట్టారు. దీంతో గోపాలపురం, బూరుగడ్డ, కరక్కాయలగూడెం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఇదిలా ఉండగా.. గత నెల 24న కురిసిన భారీ వర్షానికి నల్లచెరువు కట్టకు గండి పడటంతో సుమారు 100 ఎకరాలకు పైగా పంట పొలాలు కొట్టుకుపోవడంతో పంట నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే. సంబంధిత అధికారులు స్పందించి చెరువుకట్టకు మరమ్మతులు చేయడంతో పాటు, రహదారి పునరుద్ధరణ పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

స్వేచ్ఛాయుత ఇండో పసిఫిక్

అదే క్వాడ్ లక్ష్యం: మోదీ • క్వాడ్ శిఖరాగ్రంలో ప్రసంగం



క్వాడ్ శిఖరాగ్రంలో జో బైడెన్, అల్బనీస్, ఫుమియో కిషిదాలతో మోదీ

విల్మింగ్టన్/వాషింగ్టన్/న్యూఢిల్లీ: 'క్వాడ్' కూటమి ఏ ఒక్కరికీ వ్యతిరేకం కాదని, నిబంధనల ఆధారిత అంతర్జాతీయ వ్యవస్థ కోసమే అది కృషి చేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ తేల్చిచెప్పారు. ప్రపంచ దేశాల సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను క్వాడ్ గౌరవిస్తోందని అన్నారు. సంఘర్షణలు, సంక్షోభాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నదే తమ విధానమని స్పష్టం చేశారు. స్వేచ్ఛాయుత, సమగ్ర, శాంతి సౌభాగ్యాలతో కూడిన ఇండో–పసిఫిక్‌కు తాము అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. అమెరికాలో డెలావెర్‌లోని విల్మింగ్టన్‌లో స్థానిక కాలమానం ప్రకారం శనివారం జరిగిన క్వాడ్ దేశాల అధినేతల శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని మోదీ ప్రారంభోపన్యాసం చేశారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆతిథ్యమిచ్చిన ఈ సదస్సులో ఆ్రస్టేలియా, జపాన్ ప్రధానులు ఆంథోనీ అల్బనీస్, ఫుమియో కిషిదా కూడా పాల్గొన్నారు. భిన్న రంగాల్లో క్వాడ్ దేశాలు పరస్పరం చక్కగా సహకరించుకుంటున్నాయని మోదీ అన్నారు. ఆరోగ్య సంరక్షణ, వాతావరణమార్పులు, మౌలిక సదుపాయా కల్పనతోపాటు ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో కలిసి పని చేస్తున్నాయని పేర్కొన్నారు. క్వాడ్ సదస్సులో ఫలవంతమైన చర్చ జరగబోతోందని వ్యాఖ్యానించారు.

వ్యూహాత్మక బంధం బలోపేతం

ప్రపంచమంతటా శాంతియుత పరిస్థితి నెలకొనాలన్నదే క్వాడ్ ఆకాంక్ష అని కూటమి నేతలు స్పష్టం చేశారు. ఇండో–పసిఫిక్ దేశాల బాగు కోసమే కూటమి ఏర్పాటైందన్నారు. 'ఇండో–పసిఫిక్ సంక్షేమానికి కృషి చేస్తున్న శక్తి క్వాడ్' అని ఉద్ఘాటించారు. తమ కూటమి దేశాల మధ్య వ్యూహాత్మక బంధం గతంలో ఎన్నడూ లేనంతగా బలపడిందని వెల్లడించారు. సదస్సు అనంతరం నేతలంతా ఈ మేరకు ఉమ్మడి డిక్లరేషన్ విడుదల చేశారు. ఐరాస భద్రతా మండలి తీర్మానాలను ఉల్లంఘిస్తూ ఇండో–పసిఫిక్ ప్రాంతంలో ఇటీవల జరిగిన మిస్సైల్ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. చైనా తీరుపై పరోక్షంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇండో–పసిఫిక్ విద్యార్థులకు 50 క్వాడ్ స్కాలర్‌షిప్‌లు ఇవ్వనున్నట్లు భారత్ ఈ సందర్భంగా ప్రకటించింది. దీనికింద మొత్తం 5 లక్షల డాలర్లు అందజేయనున్నట్లు వెల్లడించింది.

నేతలతో మోదీ ద్వైపాక్షిక చర్చలు

క్వాడ్ సదస్సు సందర్భంగా ప్రధానులు అల్బనీస్, కిషిదాతో పాటు బైడెన్‌తో కూడా మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ప్రపంచ శాంతి, అభివృద్ధి, భద్రతపై భారత వైఖరిని వివరించారు. ఆయా దేశాలతో బంధాల బలోపేతంపై సంప్రదింపులు జరిపారు.

ఉక్రెయిన్‌లో శాంతికి మోదీ చొరవ ప్రశంసనీయం: బైడెన్

మోదీపై బైడెన్ ప్రశంసల వర్షం కురిపించారు. మోదీ గత నెలలో ఉక్రెయిన్‌లో చరిత్రాత్మక పర్యటన చేపట్టడం, శాంతి సందేశం ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉక్రెయిన్‌లో శాంతికి మోదీ ప్రత్యేకంగా చొరవ తీసుకుంటున్నారని కొనియాడారు. మోదీకి బైడెన్ శనివారం విల్మింగ్టన్‌లోని తన ఇంట్లో ఆతిథ్యం ఇచ్చారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఉక్రెయిన్–రష్యా ఘర్షణతోపాటు అంతర్జాతీయ పరిణామాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. భారత్ గళం బలంగా వినిపించేలా అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలకు తాను మద్దతు ఇస్తానని ఈ సందర్భంగా బైడెన్ చెప్పారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించేందుకు తన మద్దతు ఉంటుందన్నారు. మోదీ–బైడన్ భేటీపై భారత్, అమెరికా ఒక ఫ్యాక్ట్‌షీట్ విడుదల చేశాయి. అమెరికాకు చెందిన జనరల్ అటామిక్స్ సంస్థ నుంచి భారత్ 31 లాంగ్–రేంజ్ ఎండ్యూరెన్స్ ఎంక్యూ–9బీ ఆర్మ్‌డ్ డ్రోన్లు కొనుగోలు చేస్తుండడాన్ని బైడెన్ స్వాగతించారు.

అనుసరించే రోజులు పోయి..

ప్రపంచ సారథులం

భారత అమెరికన్లను ఉద్దేశించి మోదీ ప్రసంగం



ఆదివారం న్యూయార్క్‌లోని నాసా కొలోజియం స్టేడియంలో కిక్కిరిసిన భారత అమెరికన్లను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

న్యూయార్క్: ''అన్ని రంగాల్లోనూ ఇతరులను అనుసరించిన పాత రోజులను దాటుకుని గత పదేళ్లలో భారత్ ఎంతో ప్రగతి సాధించింది. ఇతర దేశాలకు మార్గదర్శకత్వం వహించే స్థాయికి చేరుకుంది. ప్రపంచ సారథిగా ఎదుగుతోంది. అవకాశాల ఇంకెంతమాత్రమూ కోసం ఎదురు చూడటం లేదు. అవకాశాలను సృష్టించుకుంటూ సాగుతోంది. అంతులేని అవకాశాలకు నెలవుగా మారింది. ముఖ్యంగా శాస్త్ర సాంకేతిక పరిశోధనల్లో ఇతర దేశాలను ముందుండి నడిపిస్తోంది'' అని ప్రధాన నరేంద్ర మోదీ అన్నారు. ఈ అద్భుత ప్రగతిలో విదేశాల్లోని భారతీయులది అత్యంత కీలక పాత్ర అంటూ కొనియాడారు. వారి త్యాగాలు వెలకట్టలేనివని అభిప్రాయపడ్డారు. అమెరికాలో మూడు రోజుల పర్యటనలో భాగంగా ఆదివారం న్యూయార్క్‌లో భారతీయ అమెరికన్లతో ప్రధాని భేటీ అయ్యారు. స్థానిక నాసా వెటరన్స్ కొలోజియం స్టేడియంలో జరిగిన ఈ సమావేశానికి ఎన్నారైలు పోటెత్తారు. న్యూయార్క్, పరిసర న్యూజెర్సీ నుంచేగాక మొత్తం 42 రాష్ట్రాలనుంచి 13,000 మందికి పైగా సభకు హాజరయ్యారు. సమావేశం ఆద్యంతం 'మోదీ, మోదీ' అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఆయన వేదికపైకి చేరుకున్న తర్వాత కూడా నిమిషాల పాటు కరతాళ ధ్వనులు ఆగకుండా కొనసాగాయి. అనంతరం మోదీ మాట్లాడుతూ వారి అభిమానం తనను కదిలించివేసిందన్నారు. ప్రపంచంలో ఏ మూలకు వెళ్లినా మన భారతీయులు నాపై ఇలా చెప్పలేనంతటి ఆదరాభిమానాలు, ఆప్యాయత కురిపిస్తూనే ఉన్నారు. దీనికి శాశ్వతంగా రుణపడిపోయాను'' అని చెప్పారు. భారత, అమెరికా సంబంధాలను బలోపేతం చేయడంలో ఇండయన్ అమెరికన్లు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. మోదీ ప్రసంగం గంటా పది నిమిషాల పాటు సాగింది. ప్రసంగం పొడవునా సభికులు పదేపదే చప్పట్లు కొడుతూ, నినాదాలు చేస్తూ సందడి చేశారు. అంతకుముందు వేదికపై 'ద ఎకోస్ ఆఫ్ ఇండియా – అ జర్నీ త్రూ ఆర్ట్ అండ్ ట్రెడిషన్' పేరిట 382 మంది జాతీయ, అంతర్జాతీయ దిగ్గజ కళాకారుల ప్రదర్శనలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. గ్రామీ అవార్డు విజేత చంద్రికా టాండన్, గాయక సంచలనం రెక్స్ డిసౌజా, తెలుగు సినీ దర్శకుడు, గాయకుడు దేవీశ్రీ ప్రసాద్ తదితరులు వీటిలో పాల్గొన్నారు.



సభ అనంతరం మోదీతో భారతీయుల కరచాలనం

భారీ లక్ష్యాలు నిర్దేశించుకున్నాం

ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో నెగ్గి వరుసగా మూడోసారి పాలనా పగ్గాలు చేపట్టడాన్ని మోదీ ప్రస్తావించారు. అమెరికాలో అధ్యక్ష ఎన్నికల ప్రక్రియ చురుగ్గా కొనసాగుతోందన్నారు. భారత ప్రగతి కోసం ఈసారి అత్యంత భారీ లక్ష్యాలు నిర్దేశించుకున్నట్టు చెప్పారు. అతి సాధారణ కుటుంబంలో పుట్టిన తాను ఈ స్థాయికి ఎదుగుతానని ఎప్పుడూ అనుకోలేదన్నారు. ''విధి నన్ను రాజకీయాల్లోకి తీసుకొచ్చింది. అనుకోకుండా గుజరాత్‌కు సీఎం అయ్యాను. ఆ రాష్ట్రానికి అత్యధిక కాలం పాటు సేవలందించిన ముఖ్యమంత్రిగా రికార్డు సృష్టించాను. తర్వాత దేశ ప్రజలు నన్ను ప్రధానిని చేసి మరింత పెద్ద బాధ్యత కట్టబెట్టారు'' అని చెప్పుకొచ్చారు. ''దేశ ప్రగతికి, సుపరిపాలనకు నా జీవితాన్ని అంకితం చేశాను. అధ్యక్షుడు జో బైడెన్ శనివారం నన్ను దగ్గరుండి ఆహ్వానించి మరీ తన ఇంట్లోకి తీసుకెళ్లారు. ఆయన చూపిన గౌరవం నన్నెంతగానో కదిలించింది. అది 140 కోట్ల పై చిలుకు భారతీయులకు దక్కిన గౌరవం. అమెరికాలో నివసిస్తున్న లక్షలాది మంది భారతీయులకు, వారి నిరంతర కృషికి దక్కిన గౌరవం'' అన్నారు. దశాబ్దాల క్రితం తొలిసారి తాను అమెరికాకు వచ్చిన రోజులను మోదీ గుర్తు చేసుకున్నారు.

ప్రపంచ శాంతిలో కీలక పాత్ర

అంతర్జాతీయంగా ఆధిపత్యం సాగించడం భారత అభిమతం కాదని మోదీ అన్నారు. అయితే ప్రపంచ ప్రగతిలో, శాంతి సాధనలో కీలక పాత్ర పోషించేందుకు మాత్రం ఎప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. 'అందరికీ సమ దూరం' అన్నది పాత విధానం. 'అందరితోనూ సమాన సాన్నిహిత్యం' అన్నదే నవభారత నినాదం' అని వివరించారు. ఇది యుద్ధాలకు సమయం కాదని పునరుద్ఘాటించారు. ''భారత్ అంటే ఫైర్ కాదు. ప్రపంచానికి వెలుగు నిచ్చే సూరీడు'' అన్నారు. బోస్టన్, లాస్ ఏంజెలెస్ నగరాల్లో నూతనంగా కాన్సులేట్లను ప్రారంభించనున్నట్టు ప్రధాని ఈ సందర్భంగా ప్రకటించారు. గతేడాది ప్రకటించిన సియాటెల్ కాన్సులేట్ ఇప్పటికే ప్రారంభమైందని గుర్తు చేశారు. అమెరికాకు ఫార్మా, విద్యా రంగాల్లో రాజధానిగా బోస్టన్‌కు పేరుంది. ఇక లాస్ ఏంజెలెస్ హాలీవుడ్‌కు పుట్టిల్లన్నది తెలిసిందే.

అమెరికాను మించిన భారత 5జీ మార్కెట్

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారత్ అద్భుత ప్రగతి సాధిస్తూ దూసుకెళ్తోందని మోదీ అన్నారు. ఫలితంగా కేవలం రెండేళ్ల వ్యవధిలోనే భారత 5జీ మార్కెట్ అమెరికాను కూడా మించిపోయిందని వివరించారు. మేడిన్ ఇండియా 6జీ టెక్నాలజీపై కూడా భారత్‌లో పెద్ద ఎత్తున పరిశోధనలు జరుగుతున్నాయని చెప్పారు. ''ఇప్పుడు ప్రపంచ ప్రఖ్యాత మొబైల్ బ్రాండ్లన్నీ దాదాపుగా భారత్‌లోనే తయారవుతున్నాయి. భారత సెమీ కండక్టర్ చిప్‌లను అమెరికా దిగుమతి చేసుకునే రోజులు ఎంతో దూరంలో లేవు. ప్రపంచమంతా మేడిన్ ఇండియా చిప్‌ల మీదే ఆధారపడి నడవనుంది. ఇది మోదీ గ్యారెంటీ'' అన్నారు.

పుష్ప... వికసిత భారత్!

''వికసిత భారత్ అంటే 'పుష్ప'. ప్రోగ్రెసివ్, అన్‌స్టాపబుల్, స్పిరిచ్యువల్, హ్యూమానిటీ, ప్రాస్పరస్'' అంటూ మోదీ కొత్త నిర్వచనమిచ్చారు. దీనికి సభికుల నుంచి బ్రహ్మాండమైన స్పందన వచ్చింది. అలాగే, ''ఏఐ అంటే కూడా ఆస్పిరేషనల్ ఇండియా. ఏఐ అంటే అమెరికన్ ఇండియన్స్'' అని కొత్త నిర్వచనాలిచ్చారు.

మోదీకీ రిటైర్మెంట్ ఇస్తారా?



ఆదివారం జంతర్ మంతర్ వద్ద జరిగిన జనతా కీ అదాలత్‌లో పార్టీ గుర్తు చీపురుతో కేజ్రీవాల్

భగవత్‌జీ.. బదులివ్వండి!

బీజేపీ ప్రతీకార రాజకీయాలను సమర్థిస్తున్నారా?

అవినీతిపరులకు పార్టీ తీర్థం మీకు సమ్మతమేనా?

ఆరెస్సెస్ అధినేతకు కేజ్రీవాల్ ఐదు ప్రశ్నలు

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ చర్యలకు ఆరెస్సెస్ సమాధానం చెప్పాలని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. ఆదివారం ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద 'జనతా కీ అదాలత్' ర్యాలీలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆరెస్సెస్ సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భగవత్‌కు ఐదు ప్రశ్నలు సంధించారు. ''75 ఏళ్లు దాటిన నేతలు పదవుల నుంచి తప్పుకోవాలని బీజేపీలో నిబంధన ఉంది. ఎల్‌కే అద్వానీ వంటి నేతకు కూడా దీన్ని వర్తింపజేశారు. ఈ నిబంధనను మోదీకి కూడా వర్తింపజేస్తారా? అద్వానీ మాదిరిగానే మరో ఏడాదికి మోదీని కూడా ప్రధాని పదవి నుంచి తప్పిస్తారా?'' అని భగవత్‌ను ప్రశ్నించారు. ఆరెస్సెస్‌ను కూడా మోదీ ఖాతరు చేయడం లేదనే అర్థం ధ్వనించేలా, 'కొడుకు చివరికి తల్లిపైకే తల ఎగరేసేంత పెద్దవాడయ్యాడా?'' అంటూ నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. ''పార్టీలను విచ్ఛిన్నం చేయడానికి, బీజేపీయేతర ప్రభుత్వాలను కూల్చడానికి కేంద్ర దర్యాప్తు సంస్థలను బీజేపీ వాడుకోవడాన్ని ఆర్‌ఎస్‌ఎస్ సమర్థిస్తోందా? నేతలపై అవినీతిపరులనే ముద్రవేసి, చివరికి వారిని బీజేపీలో చేర్చుకోవడం సంఘ్‌కు ఇష్టమేనా? బీజేపీ సాగిస్తున్న ప్రస్తుత రాజకీయాల పట్ల మీరు సంతృప్తికరంగా ఉన్నారా? సైద్ధాంతికంగానూ, అన్ని రకాలుగానూ బీజేపీకి మాతృ సంస్థ అయిన ఆరెస్సెస్ ఇక మీదట పార్టీకి అవసరమే లేదన్న బీజేపీ చీఫ్ జేపీ నడ్డా వ్యాఖ్యలు విన్నాక మీకేమనిపించింది? వీటన్నింటిపై స్పందించండి. బదులివ్వండి'' అని భగవత్‌ను కోరారు. దేశంలో మార్పు కోసమే రాజకీయాల్లోకి వచ్చానని, పదవుల కోసం కాదని స్పష్టంచేశారు.


రాబోయే ఎన్నికలు అగ్నిపరీక్ష

ఏ తప్పూ చేయని తనపై అవినీతి ఆరోపణలు రావడంతో కలత చెంది సీఎం పదవికి రాజీనామా చేశానని కేజ్రీవాల్ అన్నారు. గత పదేళ్లలో గౌరవం సంపాదించుకున్నాను తప్పితే డబ్బు సంపాదించలేదని వ్యాఖ్యానించారు. ''దసరా నవరాత్రుల తర్వాత అధికారిక నివాసం వీడతా. ప్రజలే నాకు వసతి కల్పిస్తారు'' అన్నారు. కేజ్రీవాల్ ప్రశ్నలపై కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. మద్యం కుంభకోణంలో జైలుకు వెళ్లిన ఆయనకు నైతిక విలువలే లేవంటూ ఎక్స్‌లో ధ్వజమెత్తారు. కేజ్రీవాల్‌కు ఐదు ప్రశ్నలు సంధించారు.

కేజ్రీవాల్ రాముడు, నేను లక్ష్మణుడిని

ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌తో తనకున్నది రామలక్ష్మణుల సంబంధమని ఆప్ సీనియర్ నేత మనీశ్ సిసోడియా అభివర్ణించారు. ఏ రావణుడూ తమను విడదీయలేడంటూ బీజేపీనుద్దేశిస్తూ వ్యాఖ్యానించారు. జన్‌తా కీ అదాలత్‌లో సిసోడియా ప్రసంగించారు. అవినీతి రావణుడిపై పోరాటం సాగిస్తున్న రాముడు కేజ్రీవాల్ పక్కన లక్ష్మణుడిలా ఉంటానన్నారు.


కశ్మీరీల హక్కులను కాపాడుతాం: ఖర్గే



జమ్మూ: జమ్మూకశ్మీర్ ప్రజల రాజ్యాంగ హక్కులకు రక్షణ కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంటుందని ఆ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే పునరుద్ఘాటించారు. తాము అధికారంలోకి వస్తే ఈ ప్రాంత సర్వతోముఖాభివృద్ధికి ఏడు గ్యారెంటీలను అమలు చేస్తామని ఆదివారం ఆయన 'ఎక్స్'లో ప్రకటించారు. ఇందులో మొట్టమొదటిది..కేంద్ర పాలిత ప్రాంతం నుంచి తిరిగి రాష్ట్ర హోదా పునరుద్ధరించడం. ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల వరకు ఉచిత వైద్య సౌకర్యం. ప్రతి జిల్లాలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు. కశ్మీరీ పండిట్లకు పునరావాసం, ఓబీసీ వర్గాల హక్కులకు రాజ్యాంగబద్ధత కల్పించడం ఉన్నాయన్నారు.

కశ్మీర్‌లో బీజేపీ ప్రభుత్వమే ఉండాలి

కేంద్ర హోం మంత్రి అమిత్ షా



నౌషెరా: జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని అంతం చేసేదాకా పాకిస్తాన్‌తో చర్చల ప్రసక్తే లేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా కుండబద్దలు కొట్టారు. జమ్మూకశ్మీర్‌లో శాంతి నెలకొనాలన్నా, పాక్‌కు గుణపాఠం చెప్పాలన్నా బీజేపీ అధికారంలోకి రావడం అవసరమని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం జమ్మూకశ్మీర్‌లోని నౌషెరాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో అమిత్ షా మాట్లాడారు. రిజర్వేషన్లను రద్దు చేసేందుకే చేతులు కలిపినట్లు ఎన్సీ, కాంగ్రెస్ చెప్పుకుంటున్నాయి. కానీ, ఆ పని జరగనివ్వం. కశ్మీర్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక.. ఉగ్రవాదులతో కలిసి బిర్యానీలు తిన్న ఆ మూడు కుటుంబాలపై శ్వేతపత్రం విడుదల చేస్తామని చెప్పారు. జమ్మూకశ్మీర్ యువతను సింహాలుగా అభివర్ణిస్తూ ఆయన.. వారితో మాట్లాడాలని తనకు ఉందని చెప్పారు.

కాంగ్రెస్, ఎన్‌సీలది పాక్ అజెండా: నడ్డా



జమ్మూ: కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్సీ)లు జాతీయేతర శక్తులుగా బీజేపీ చీఫ్ జేపీ నడ్డా అభివర్ణించారు. జమ్మూకశ్మీర్‌లో తమ అజెండాను అమలు చేసేవి ఈ రెండు పార్టీలేనని పాక్ రక్షణ మంత్రి స్వయంగా సర్టిఫికెట్ కూడా ఇచ్చారని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ సారథ్యంలో జమ్మూకశ్మీర్‌లో సమూల మార్పులు చోటుచేసుకున్నాయన్నారు. ఉగ్రదాడులు గణనీయంగా తగ్గుముఖం పట్టాయన్న నడ్డా.. ప్రధాని మోదీ నాయకత్వంలో ఉగ్రవాదుల ఆయుర్దాయం ఇంకొన్ని రోజులు మాత్రమేనని స్పష్టం చేశారు. జేపీ నడ్డా ఆదివారం జమ్మూలో జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొని ప్రసంగించారు. ఎన్నికల ద్వారా జమ్మూకశ్మీర్‌లో సుస్థిరత నెలకొంటుందని, భారత్ బలోపేతమవుతుందని నడ్డా చెప్పారు.

కశ్మీర్‌లో ప్రజాస్వామ్యం.. పాక్‌కు కడుపునొప్పి: రాజ్‌నాథ్



పూంచ్: జమ్మూకశ్మీర్‌లో ప్రజాస్వామ్యం పరిఢవిల్లడాన్ని చూసి పాకిస్తాన్ కడుపునొప్పి మొదలైందని బీజేపీ సీనియర్ నేత, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. ఈ నెల 18వ తేదీన జరిగిన మొదటి దశ పోలింగ్‌లో పెద్ద ఎత్తున తరలివచ్చి ఓటేసిన ప్రజలను ఆయన ప్రశంసించారు. లోక్‌సభ ఎన్నికల్లో 58% పోలింగ్ నమోదు కాగా, ఈసారి 61%పైగా ప్రజలు ఓటేయడం 30 ఏళ్లలోనే మొదటిసారని ఆయన చెప్పారు. ఆర్టికల్ 370 రద్దు మంచిదేనన్న విషయాన్ని ప్రపంచం కూడా గుర్తించిందని చెప్పారు. అయితే, ఆర్టికల్ 370ని తిరిగి తెస్తామంటూ కాంగ్రెస్, ఎన్సీ, పీడీపీలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆయన ఆరోపించారు.

ఇజ్రాయెల్‌పై యుద్ధమే

హెజ్బొల్లా ప్రకటన

- 100 రాకెట్ల ప్రయోగం
- ఆరంభం మాత్రమేనని వ్యాఖ్య
- ఫలితం అనుభవిస్తారు: నెతన్యాహూ



నహారియా (ఇజ్రాయెల్): ఇజ్రాయెల్‌పై ఇక యుద్ధమేనని హెజ్బొల్లా ప్రకటించింది! విజయం సాధించేదాకా పోరు కొనసాగుతుందని పేర్కొంది. అన్నట్టుగానే ఇజ్రాయెల్‌పై భారీ ప్రతీకార దాడులకు దిగింది. ఆదివారం వేకువ నుంచే 100కు పైగా రాకెట్లను ఇజ్రాయెల్‌లోని సుదూర లక్ష్యాలపైకి ప్రయోగించినట్టు హెజ్బొల్లా ఉప నాయకుడు నయీమ్ కస్సెమ్ ప్రకటించారు. 'మేమూ మనుషులమే. మాకెంత బాధ కలిగించారో మీరూ అంతే స్థాయిలో బాధపడతారు'' అని హెచ్చరించారు. శుక్రవారం బీరుట్‌పై ఇజ్రాయెల్ క్షిపణి దాడిలో హెజ్బొల్లా టాప్ కమాండర్ ఇబ్రహీం అకీల్ సహా 45 మంది చనిపోవడం తెలిసిందే. ''మేమేంటో యుద్ధక్షేత్రంలో రుజువు చేసుకుంటాం. మీ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తాం. మీరు అనుకున్న లక్ష్యాలను సాధించలేరు' అని ఆదివారం అకీల్ అంత్యక్రియల సందర్భంగా ఇజ్రాయెల్‌ను నయీమ్ హెచ్చరించారు. ఇజ్రాయెల్ ఉత్తర భాగంలోని ప్రజలు వలసపోక తప్పదని హెచ్చరించారు. శనివారం అర్ధరాత్రి దాటాక ఇజ్రాయెల్ ఉత్తర ప్రాంతం ముందస్తు సైరన్లతో మారుమోగింది. వేలాదిగా జనం బాంబు షెల్టర్లలోకి పరుగులు తీశారు. దాడుల్లో నలుగురు గాయపడ్డారని ఇజ్రాయెల్ పేర్కొంది. హెజ్బొల్లా రాకెట్లు ఇంతకు ముందెన్నడూ ఇంత దూరం వరకు రాలేదంది. హైఫాకు దగ్గర్లోని రమత్ డేవిడ్ ఎయిర్‌బేస్‌పైకి ఫాది 1, ఫాది 2 క్షిపణులను ప్రయోగించినట్లు హెజ్బొల్లా ప్రకటించుకుంది. హెజ్బొల్లా ఈ రకం ఆయుధాలను ప్రయోగించడం ఇదే మొదటిసారి. హెజ్బొల్లా యుద్ధ ప్రకటనపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ స్పందించారు. ''వాళ్లిప్పటికీ గుణపాఠం నేర్చుకున్నట్టు లేదు. త్వరలోనే నేర్చుకుంటారు'' అని వ్యాఖ్యానించారు.

అల్ జజీరా కార్యాలయం మూసివేత

ఇలా ఉండగా, ఇజ్రాయెల్ బలగాలు ఆదివారం ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్ ప్రాంతం రమల్లాలో ఉన్న అల్ జజీరా శాటిలైట్ న్యూస్ నెట్‌వర్క్ కార్యాలయాలపై దాడులు జరిపాయి. బలగాలు తమ కార్యాలయాల్లోకి ప్రవేశించడాన్ని ఆ చానెల్ అరబిక్ విభాగం ప్రత్యక్ష ప్రసారం చేసింది. అల్ జజీరా కార్యాలయాలను 45రోజులపాటు మూసివేయాలని హుకుం జారీ చేసింది. అక్కడి సిబ్బందిని తక్షణమే ఖాళీ చేయాలంటూ ఆదేశాలు జారీ చేసింది. హమాస్, హెజ్బొల్లాలకు అధికార ప్రతినిధిగా అల్ జజీరా మారిపోయిందని ఇజ్రాయెల్ ప్రభుత్వం ఆరోపిస్తోంది.

అమెరికాలో కాల్పులు.. నలుగురు దుర్మరణం

మరో 18 మందికి గాయాలు

బిర్మింగ్‌హమ్: అమెరికాలోని అలబామా రాష్ట్రం బిర్మింగ్‌హమ్‌లో జరిగిన కాల్పుల ఘటనలో నలుగురు చనిపోగా, 18 మంది గాయాలపాలయ్యారు. శనివారం అర్ధరాత్రి సమయంలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి ఇప్పటి వరకు ఎవరినీ అరెస్ట్ చేయలేదని పోలీసులు తెలిపారు. నగరంలో రెస్టారెంట్లు, బార్‌లకు నిలయమైన ఫైవ్ పాయింట్స్ సౌత్ ఎంటర్‌టెయిన్‌మెంట్ డిస్ట్రిక్ట్ పరిధిలో ఘటన చోటుచేసుకుందని చెప్పారు. ఆ ప్రాంతంలో గుమికూడిన జనం పైకి కొందరు విచక్షణారహితంగా కాల్పులకు దిగినట్లు గుర్తించామన్నారు.

ఇరాన్ గనిలో పేలుడు.. 51 మంది మృతి

మిథేన్ గ్యాస్ లీకేజీయే కారణమన్న ప్రభుత్వం

టెహ్రాన్: ఇరాన్ తూర్పు ప్రాంతంలోని దక్షిణ ఖొరసాన్ ప్రావిన్స్‌లోని టబాస్ గనిలో భారీ ప్రమాదం సంభవించింది. మిథేన్ గ్యాస్ వెలువడటంతో జరిగిన పేలుడులో 51 మంది ప్రాణాలు కోల్పోగా సుమారు 20 మంది గాయపడ్డారు. మరికొందరి జాడ తెలియడం లేదని అధికారులు తెలిపారు. శనివారం రాత్రి ప్రమాదం జరిగిన సమయంలో 70 మందికి పైగా 700 మీటర్ల లోతులో పనిచేస్తున్నారని చెప్పారు. రక్షణ, సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధ్యక్షుడు పెజెష్కియాన్ అధికారులను ఆదేశించారు.

శ్రీలంక అధ్యక్షుడు దిస్సనాయకే

- విక్రమసింఘెకు మూడో స్థానమే
- తొలిసారి రెండో రౌండ్‌లో ఫలితం
- నేడు ప్రమాణం చేయనున్న మార్క్సిస్ట్ నేత



దిస్సనాయకే

కొలంబో: శ్రీలంకలో అధ్యక్ష ఎన్నికల్లో మార్క్సిస్ట్ నేత అనూర కుమార దిస్సనాయకే (56) విజయం సాధించారు. దేశ ఎన్నికల చరిత్రలోనే తొలిసారిగా రెండో రౌండ్ ఓట్ల లెక్కింపులో ఫలితం తేలడం విశేషం. జనతా విముక్తి పెరమున అధినేత అయిన దిస్సనాయకే తన సమీప ప్రత్యర్థి, ఎస్‌జేబీ నేత సజిత్ ప్రేమదాసపై విజయం సాధించారు. అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే (75) తొలి రౌండ్‌లోనే వైదొలిగారు. తొలి రౌండ్ ఓట్ల లెక్కింపులో దిస్సనాయకే 42.31% ఓట్లతో తొలి స్థానంలో, ప్రేమదాస 32.8 శాతంతో రెండో స్థానంలో నిలవగా విక్రమసింఘే 17.27 శాతంతో మూడో స్థానానికి పరిమితమయ్యారు. అయితే ఏ ఒక్కరికీ విజయానికి కావాల్సిన 50 శాతం రాకపోవడంతో ద్వితీయ ప్రాధమ్య ఓట్ల లెక్కింపు చేపట్టి విజేతను తేల్చారు. శ్రీలంక 9వ అధ్యక్షుడిగా దిస్సనాయకే సోమవారం ప్రమాణం చేస్తారని నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పీపీ) ప్రకటించింది. దిస్సనాయకేకు భారత ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు.

ఏకేడీ.. ఎట్టకేలకు!

ఏకేడీగా పిలుచుకునే అనూర దిస్సనాయకే నార్త్ సెంట్రల్ ప్రావిన్స్‌లోని థంబుట్టెగామలో జన్మించారు. కొలంబో సమీపంలోని కెలనియా యూనివర్సిటీలో డిగ్రీ చదువుకున్నారు. 1987లో జేవీపీలో చేరారు. 1971, 1987, 1990ల్లో ప్రభుత్వాలను కూలదోసేందుకు జేవీపీ హింసా మార్గం తొక్కింది. ఇది భారత వ్యతిరేకి కూడా. అప్పట్లో రాజీవ్ గాంధీ–జయవర్ధనే ప్రభుత్వాల ఒప్పందం శ్రీలంక సార్వభౌమత్వానికి భంగకరమని భావించేది. గత ఫిబ్రవరిలో దిస్సనాయకే భారత్‌లో పర్యటించాక పార్టీ వైఖరిలో మార్పువచ్చింది. 90ల్లో జేవీపీ ప్రజాస్వామ్య విధానాల పట్ల మొగ్గాక పార్టీలో దిస్సనాయకేకు ప్రాధాన్యం పెరిగింది. 2000 ఎన్నికల్లో మొదటిసారి ఎంపీ అయ్యారు. 2014లో పార్టీ అధ్యక్షుడయ్యారు. 2019 ఎన్నికల్లో జేవీపీకి దక్కిన ఓట్లు కేవలం మూడు శాతమే.

సాక్షి హైదరాబాద్

సోమవారం । 23 । సెప్టెంబర్ । 2024



రేటింగ్.. చీటింగ్

సినిమాకు రేటింగ్ ఇస్తే డబ్బులొస్తాయని చెప్పి సైబర్ నేరగాళ్లు సామాన్యులను మోసగిస్తున్నారు. వారిని మభ్యపెట్టి డబ్బులు లాగుతున్నారు. -8లో



జుంబా హోయిరే..

జుంబా ప్రస్తుతం నగరాల్లో ట్రెండింగ్ అవుతున్న పదం.. డ్యాన్స్‌లో ఇదో కొత్త తరహా అనే చెప్పాలి. అయితే సరదా కోసం వేసే డ్యాన్స్ కాదు.. ఆరోగ్యం కోసం, వెయిట్ లాస్ కోసం చేసేదే జుంబా. -సిటీ ప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
32.0/22.0

వాతావరణం

నగర పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు..మెరుపులతో కూడిన గాలులతో వర్షం కురిసే అవకాశముంది.

- 'నల్ల చెరువు-హైడ్రా కూల్చివేతల్లో' మరో కోణం
- తమ పట్టా భూములు లీజుకు ఇచ్చిన యజమానులు
- వాటిల్లో షెడ్లు నిర్మించుకున్న పలువురు వ్యాపారులు
- ఇరిగేషన్ అధికారుల నోటీసుల విషయం తెలియని వైనం
- నిర్మాణాలను ఆదివారం కూల్చేసిన హైడ్రా అధికారులు
- జీవనోపాధి, యంత్రాలు కోల్పోయామంటున్న బాధితులు



నల్ల చెరువు ప్రాంతంలో ఆక్రమణలను తొలగించిన హైడ్రా అధికారులు



విలపిస్తున్న బాధితురాలు

యజమానుల తప్పిదం.. సామాన్యులు బలి!



వ్యాపార సముదాయాలు కూల్చివేయటంతో విలపిస్తున్న బాధితులు



నల్లచెరువు పరిధిలో కూల్చివేతల దృశ్యం



గుమిగూడిన స్థానికులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి పాత గ్రామంలోని నల్ల చెరువుకు సంబంధించిన ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో భూమి ఉన్న పట్టాదారులు చేసిన తప్పులకు సామాన్యులు బలయ్యారు. నిబంధనలకు విరుద్ధంగా ఈ భూముల్ని లీజుకు ఇవ్వడంతో పలువురు నిర్మాణాలు చేపట్టారు. ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన నోటీసుల విషయాన్నీ యజమానులు తమ లీజుదారులకు చెప్పలేదు. దీంతో ఆదివారం హైడ్రా అక్రమ నిర్మాణాలను కూల్చేయడంతో సామాన్యులు నష్టపోయారు. ఇన్నాళ్లు లీజు తీసుకుంటున్న యజమానులు మాత్రం సేఫ్‌గా ఉండిపోయారు. నల్ల చెరువుకు సంబంధించిన ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో దాదాపు 45 మంది స్థానికులకు పట్టా భూమి ఉంది. నిబంధనల ప్రకారం ఈ భూమిని కేవలం వ్యవసాయ అవసరాల కోసం మాత్రమే వినియోగించుకోవాలి. దీనికి విరుద్ధంగా కొందరు యజమానులు తమ భూమిని లీజుకు ఇచ్చారు. దీన్ని లీజుకు తీసుకున్న వ్యక్తులు అందులో 17 షెడ్లను తమ సొంత ఖర్చులతో నిర్మించుకున్నారు. అగ్రిమెంట్ ప్రకారం ప్రతి దఫా చెల్లించే లీజు మొత్తం నుంచి కొంత షెడ్ల నిమిత్తం మినహాయించుకుంటున్నారు. ఇదిలా ఉండగా... ఈ నిర్మాణాలు అక్రమమని గుర్తించిన ఇరిగేషన్, హైడ్రా అధికారులు 15 రోజుల క్రితం నోటీసులు జారీ చేశారు. నిబంధనలను అనుసరించిన పట్టాదారులకే వీటిని ఇచ్చారు. అయితే నోటీసులు వచ్చిన విషయం దాచిన యజమానులు లీజు దారులను తప్పుదోవ పట్టించారు. ఆదివారం ఇరిగేషన్, హైడ్రా అధికారులు అక్కడి అక్రమ నిర్మాణాల్లో 16 కూల్చివేశారు. అయితే నోటీసులు విషయం తెలియని లీజు దారులు తమ యంత్రాలను, ఇతర వస్తువులను కూడా పూర్తిస్థాయిలో బయటకు తీసుకోలేకపోవడంతో అవి ధ్వంసమయ్యాయి. ఇరిగేషన్ అధికారులు తమకు సమాచారం ఇస్తే తామే సామాగ్రిని తీసుకొని వెళ్లిపోయేవారమని క్యాంటీన్ నడుపుతున్న రమేష్, అతని తల్లిదండ్రులు బోరున విలపించారు. కనీసం గంట సమయాన్ని కూడా ఇవ్వకుండా షెడ్లను నేలమట్టం చేయటం ఏమిటని మండిపడ్డారు. భూయజమానులు సైతం ఇది ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోకి రాదంటూ చెప్పటంతోనే తాము లీజుకు తీసుకున్నామంటూ రవి అనే బాధితుడు కన్నీరుమున్నీరయ్యాడు. గతంలో హైడ్రా అధికారులు వ్యాపార సముదాయాలకు నోటీసులు ఇచ్చారని చెప్తున్నారు. ఈ భూమిలో అనేక మంది లీజుదారులు అప్పులు చేసి నిర్మాణాలు చేసుకోవడంతో పాటు వ్యాపారాలు ప్రారంభించారు. కొందరు క్యాంటీన్లు, హోటళ్లు, క్యాటరింగ్ చేస్తుండగా.. మరి కొందరు డెకరేషన్ సామాను, జిరాక్స్ మెషిన్లు ఏర్పాటు చేసుకున్నారు. భూ యజమానులు చేసిన తప్పుకు తాము నష్టపోతున్నామంటూ బాధితులు బోరున విలపించినా హైడ్రా అధికారులు కూల్చివేతలు కొనసాగించారు. అధికారులు నేరుగా తమకు నోటీసులు ఇచ్చానా, తమ నిర్మాణాలకు అంటించినా ఈ పరిస్థితి వచ్చేది కాదని వాపోతున్నారు.

మూసీ నివాసితుల్లో హైడ్రా గుబులు!

- పాత నోటీసుల ఆధారంగానే చర్యలు
- హైడ్రాకు అక్రమ కట్టడాల తొలగింపు బాధ్యత
- నిర్వాసితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు

సాక్షి, సిటీబ్యూరో: మూసీ పరీవాహక నివాసితులకు హైడ్రా భయం పట్టుకుంది. మూసీ సుందరీకరణలో భాగంగా పరీవాహక ప్రాంతాల్లోని ఆక్రమ కట్టడాలను తొలగించేందుకు రంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే రెవెన్యూ యంత్రాంగం అక్రమ కట్టడాలను గుర్తించి నోటీసులు జారీ చేసింది. తాజాగా పాత నోటీసుల ఆధారంగానే కట్టడాలను తొలగించేందుకు ఎలాంటి అడ్డంకులు లేకుండా ఉండేందుకు హైడ్రాకు బాధ్యతలు అప్పగించేందుకు సిద్ధమైంది. దారిద్ర్య రేఖకు దిగువ ఉండి నివాసాలు కోల్పోయే నిర్వాసితులకు ప్రత్యామ్నాయంగా పునరావాసం కల్పించే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఇటీవల రెండు ప్రాంతాల్లో ఇన్‌సిటూ కింద నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ గృహ సముదాయాలను సందర్శించి ఖాళీగా ప్లాట్స్‌పై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి మూసీ నిర్వాసితులకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు ఇచ్చి ఆదుకుంటామని పేర్కొనడాన్నిబట్టి తరలింపు ఖాయమని తెలుస్తోంది. ఇప్పటికే చెరువులు, కుంటలు, నాలాల పరివాహకంలోని అక్రమ కట్టడాలపై కొరడా ఝుళిపిస్తున్న హైడ్రా త్వరలో మూసీ పరివాహకంలో అక్రమ కట్టడాలపై సైతం ఆపరేషన్‌కు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.



12 వేల పైనే అక్రమ కట్టడాలు

మూసీ పరీవాహక సుమారు 55 కిలో మీటర్ల పరిధిలో అక్రమ కట్టడాలున్నట్లు అధికారులు గుర్తించారు. ఇటీవల రెవెన్యూ, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, పోలీసు, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం సంయుక్తంగా సర్వే నిర్వహించగా ఆక్రమణలు 12,184 బయటపడ్డాయి. వాటిని రెండుగా వర్గీకరించి నదీగర్భం, బఫర్ జోన్లుగా విభజించారు. నదీ గర్భంలో 2,166 చోట్లు గుర్తించగా అందులో 288 చోట్ల భారీ నిర్మాణాలున్నాయి. నదీ సరిహద్దు నుంచి రెండు వైపులా 50 మీటర్లు వరకు ఉన్న బఫర్‌జోన్ పరిధిలో 7,851 ఆక్రమణలు, ఇందులో 1032 భారీ నిర్మాణాలున్నట్లు అధికారులు గుర్తించారు. ఎఫ్‌టీఎల్‌లో 3004 అక్రమ కట్టడాలున్నట్లు బయటపడింది. అయితే మొదటి విడతగా నదీగర్భంలో గల కట్టడాలు తొలగించేందుకు సిద్ధమవుతున్నారు

ప్రత్యామ్నాయం సాధ్యమేనా?

మూసీ పరీవాహకంలో మొదటి విడతగా తొలగించే కట్టడాలతో సుమారు రెండు వేలకు పైగా కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొంది. దీనిని పరిగణనలోకి తీసుకున్న ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టిపెట్టింది. వారికి పునరావాసం కింద డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించాలని యోచిస్తోంది. అందులో భాగంగా రెండు రోజుల క్రితం మంత్రి పొన్నం ప్రభాకర్, మున్సిపల్, రెవెన్యూ ఉన్నతాధికారులు సైదాబాద్, వనస్థలిపురం ప్రాంతాల్లో డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయాలను పరిశీలించారు. రెండింటిలో మొత్తం మీద మూడు వందలపైగా ఖాళీగా లేదు. గతంలో కొందరు మూసీ నిర్వాసితులకు శివారు ప్రాంతాల్లో ఇళ్లు కేటాయించినా..తిరిగి వెనక్కి వచ్చినట్లు తెలుస్తోంది.

40 శాతానికి పరిమితం

మూసీ నది పరివాహకం అసలు వెడల్పులో ప్రస్తుతం 40 శాతానికి పరిమితమైంది. ఇప్పటికే మూసీ నది రివర్‌బెడ్ దాదాపు ఆక్రమణల్లో చిక్కుకొని కనుమరుగైంది. భాగ్యనగరానికి మణిహారం లాంటి మూసీనది ఒకప్పుడు నగరవాసుల దాహార్తిని తీర్చి ప్రస్తుతం మురికి కూపంగా తయారై కబ్జాదారుల కోరల్లో చిక్కుకొని కనుమరుగవుతోంది. అడుగడుగునా ఆక్రమణలతో క్రమంగా స్వరూపం కోల్పోతుంది. మూసీ పరిసరాల్లో గతంలో వంద మీటర్ల వరకు బఫర్ జోన్ పరిధి ఉండేది. అంటే ఈ బఫర్ జోన్‌లో ఎలాంటి నిర్మాణాలూ చేపట్టరాదు. ఈ పరిధిని 2016లో ప్రభుత్వం 50 మీటర్లకు కుదిస్తూ, జీవోను జారీ చేసింది. ఆక్రమణదారులకు కుదింపు బాగా కలిసొచ్చింది. రియల్ వ్యాపారులు..మూసీని మూసే పనిలో నిమగ్నమయ్యారు. తాజాగా సుందరీకరణ కోసం అక్రమ కట్టడాలు తొలగించేందుకు రంగం సిద్ధమవుతుండటంతో నివాసం ఉంటున్న పేదల గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి.

పోలీసింగ్ వ్యవస్థలో కీలకంగా 'కృత్రిమ మేధ'



సైబర్ నేరాలు అరికట్టేందుకు ఏఐ సహకారం: డీసీపీ వినీత్

సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుత ఆధునిక సాంకేతిక సమాజంలో పెరిగిపోతున్న సైబర్ నేరాలను అరికట్టడానికి పోలీసు వ్యవస్థ..కృత్రిమ మేధ(ఏఐ) సాంకేతికతతో కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని మాదాపూర్ డీసీపీ వినీత్ తెలిపారు. నగరంలోని టీ-హబ్ వేదికగా సినిక్స్ సంస్థ ఆధ్వర్యంలో ఏఐ సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులపై 'ఏఐ క్లౌడ్ పవర్డ్ డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్' సదస్సును నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ సదస్సులో డీసీపీ వినీత్‌తో పాటు ప్రముఖ ఫిలాంత్రఫిస్ట్ విద్యాసింగ్, సియంట్ సంస్థ సీఈఓ ఆఫీస్ నుంచి కీత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీపీ వినీత్ మాట్లాడుతూ., ప్రస్తుతం పోలీసు శాఖలో కూడా ఏఐ ప్రధాన పాత్ర పోషిస్తుందని అన్నారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరూ మొబైల్ వాడుతుండడం వల్ల రకరకాల సైబర్ నేరాలు పెరిగాయని, గతంతో పోలిస్తే దాదాపు రెండేళ్లలో దాదాపు 500 వందల శాతం సైబర్ నేరాలు పెరిగాయని తెలిపారు. ఇలాంటి తరుణంలో ఏఐ నిపుణులు పోలీసింగ్ వ్యవస్థలో సహాయపడనున్నారని అన్నారు. ప్రస్తుతం అన్ని రంగాల్లో ఏఐ వేగంగా పుంజుకుంటుందని, దీనిని అందుకోవాలంటే దేశంలో ఇంకా ఏఐ కంపెనీలు రావాలని సినిక్స్ సంస్థ వ్యవస్థాపకులు ప్రహంజ్ తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్లను సన్మానించి, వారికి టెక్ గైడెన్స్, ఏఐ సాంకేతికతతో వ్యాపారాలను ఎలా అభివృద్ధి చేసుకోవచ్చో అవగాహన కల్పించామన్నారు.

డాబూ దర్పంతో నగల వ్యాపారులకు టోకరా..

- చెల్లని చెక్కులు ఇచ్చి.. నగలతో పరార్
- జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదు



ఘరానా మోసగాడు సుమన్ గుంటి

బంజారాహిల్స్: సూటు..బూటు వేసుకుని డాబూ దర్పం ప్రదర్శిస్తూ బీఎండబ్ల్యూ కారులో ఖరీదైన ఆభరణాల దుకాణానికి వస్తాడు. టిప్ టాప్‌గా షాపులోకి వచ్చి తనకు ఉన్న పరిచయాలను ఆభరణాల వ్యాపారితో పంచుకుంటాడు. బడా బాబులతో స్నేహం ఉన్నట్లుగా నమ్మబలుకుతాడు. నార్సింగ్‌లోని రాజ్‌పుష్పలో ఖరీదైన విల్లా ఉందని ఆధారాలు చూపిస్తాడు. అంతటితో ఆగకుండా తాను కోటీశ్వరుడినని ఆధారాలు చూపిస్తాడు. మెడలో గొలుసులు, వేళ్లకు ఉంగరాలు, చేతికి బ్రాస్‌లెట్లు ఇలా..ఉన్నతంగా కనిపించి ఆభరణాల వ్యాపారులను బుట్టలో వేసుకుంటాడు. లక్షల ఖరీదు చేసే డైమండ్ నగలు ఎంపిక చేసుకుని దానికి తగిన చెక్కు ఇచ్చి ఆభరణాలతో దర్జాగా కారులో జారుకుంటాడు. తెల్లవారి చెక్కులు బ్యాంకులో వేసిన నగలు వ్యాపారులు చెల్లనవిగా తేలడంతో లోబోదిబోమంటూ సదరు వ్యక్తికి ఫోన్ చేస్తే ఏమాత్రం బెదరకుండా రెండు మూడు రోజుల్లో నగదు తెచ్చిస్తానంటాడు. ఆ తర్వాత ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ అని వస్తుంది. రాజ్‌పుష్పాలోని ప్లాట్‌కు వెళితే తాళం కప్పం వేలాడుతుంది. ఇలా ఈ ఘరానా మోసగాడు సమాజంలో ఉన్నతంగా బతుకుతున్నానని చెప్పి ఎన్నో నగల దుకాణాలకు టోకరా వేశాడు. తాజాగా జూబ్లీహిల్స్‌లోని ప్రముఖ నగల దుకాణంలోనూ ఇలాంటి దర్పమే చూపించి లక్షలాది రూపాయల విలువైన నగలతో జారుకోగా బాధిత వ్యాపారి పోలీసులను ఆశ్రయించాడు. వివరాల్లోకి వెళితే..జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-36లోని ఓ ఆభరణాల దుకాణానికి గత జూన్ 20వ తేదీన సుమన్ గుంటి అనే వ్యక్తి వచ్చి రూ.4.12 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు కొనుగోలు చేశాడు. ఇందుకు సంబంధించి చెక్కు ఇచ్చి ఆభరణాలు తీసుకువెళ్లాడు. ఆభరణాల వ్యాపారి అజయ్‌గుప్తా ఈ చెక్కును బ్యాంక్‌లో వేయగా అకౌంట్ బ్లాక్‌లో ఉందని తిరిగి పంపించారు. దీంతో ఆయన సుమన్‌కు ఫోన్ చేశాడు. రెండు రోజుల్లో డబ్బులు పంపిస్తానని చెప్పిన సదరు వ్యక్తి ఉద్దేశపూర్వకంగా ఈ మోసానికి పాల్పడినట్లుగా గుర్తించిన వ్యాపారి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జూబ్లీహిల్స్ పోలీసులు సుమన్ గుంటిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బంజారాహిల్స్‌లోనూ..

చెల్లని చెక్కులు ఇచ్చి లక్షలాది రూపాయలు విలువ చేసే వజ్రాభరణాలతో ఉడాయించిన ఘరానా కేటుగాడు సుమన్ గుంటిపై ఇటీవల బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కూడా చీటింగ్ కేసు నమోదైంది. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని లుంబినీమాల్‌లో ఉన్న తివారుమల్ నగల షాపు వ్యాపారి సందీప్ అగర్వాల్‌కు టోకరా ఇచ్చి పెద్ద ఎత్తున నగలతో జారుకున్నాడు. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇలా జ్యువెలరీ దుకాణాల్లో ఖరీదైన వజ్రాభరణాలను డోర్ డెలివరీ చేయించుకుని నకిలీ చెక్కులు ఇచ్చి మోసగిస్తున్న సుమన్ గుంటి ఇప్పటికే నార్సింగి, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో రూ.2 కోట్లకు పైగా నగలు కొట్టేశాడు. వజ్రాల హారాలు, బంగారు గాజులు కొట్టేస్తుంటాడు. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడకు చెందిన గుంటి సుమన్ (43) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవాడు. వ్యాపారంలో నష్టాలు వచ్చాయి. ఆర్థిక సమస్యలు చుట్టుముట్టడంతో ఈజీ మనీ కోసం అలవాటుపడ్డాడు. సినిమా తీస్తున్నానని, పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు ఇస్తానని ఓ మహిళ చెప్పడంతో డబ్బు కోసం బంగారు దుకాణదారులను మోసగించాలని లక్ష్యంగా పెట్టుకుని ప్రముఖ ఆభరణాల దుకాణాల ఫోన్ నెంబర్లు తీసుకుని ఇటీవల మార్కెట్లోకి వచ్చిన నగల డిజైన్లు కావాలని చెప్పి నగలను ఇంటికి రప్పించుకోవడం నైజంగా పెట్టుకున్నాడు. ఇలా నగరంలోని పలు దుకాణాల నుంచి ఆభరణాలు కొట్టేశాడు. ఇటీవలనే రాజేంద్రనగర్ ఎస్ఓటీ, నార్సింగ్ పోలీసులకు కూడా చిక్కాడు. సుమన్‌పై ఇప్పటివరకు వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 14 చీటింగ్ కేసులు నమోదు కాగా తాజాగా జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కూడా చోటుచేసుకుంది.

మనం..మన పర్యాటకం

- తెలంగాణ టూరిజం స్పాట్‌లను సందర్శించండి
- వాటికి ప్రాచుర్యం కల్పించండి
- యువతకు మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపు

సనత్‌నగర్/నాగార్జునసాగర్: తెలంగాణలోని పర్యాటక ప్రాంతాల ప్రమోషన్‌లో యువత భాగస్వాములు కావాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. చారిత్రక, వారసత్వ కట్టడాలు, ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, ప్రకృతి-వన్య ప్రాణులు, సాహస కార్యకలాపాలకు అనువైన ఎన్నో ప్రాంతాలు తెలంగాణలో ఉన్నాయని, వాటిని సందర్శించి ప్రాచుర్యం కల్పించాలని యూట్యూబర్స్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్స్‌ను కోరారు. అంతర్జాతీయ పర్యాటక వారోత్సవాల్లో భాగంగా బుద్ధవనం థీమ్ పార్కుకు విస్తృత ప్రచారం కల్పించేందుకు చేపట్టిన 'రైడ్ టు నిర్వాణ' బైక్ ర్యాలీని మంత్రి ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. బేగంపేటలోని టూరిజం ప్లాజా నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ నాగార్జున సాగర్ బుద్ధవనం వద్ద ముగుస్తుంది. తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ-హైదరాబాద్ బైక్ రైడర్స్ సంయుక్తంగా నిర్వహించిన ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున బైక్ రైడర్స్ పాల్గొన్నారు. పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డితో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు టూరిజం ప్లాజా నుంచి తార్నాక వరకు బైక్ నడిపి బైకర్స్‌లో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి విదేశీ పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. పర్యాటక ప్రాంతాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు కార్యాచరణను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా భాగస్వామ్యాన్ని పెంచేందుకు విస్తృత ప్రచారం చేపట్టినట్లు చెప్పారు. ప్రపంచ ప్రఖ్యాత బౌద్ధ క్షేత్రంగా భాసిల్లుతున్న నాగార్జున కొండ, చారిత్రక ప్రాముఖ్యతను మరింత ఇనుమడింపజేసి, బౌద్ధ సంస్కృతి వారసత్వాన్ని ఈ తరానికి తెలియజేయాలన్నది తమ ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. బుద్ధుడి బోధనలు నేటికీ అనుసరణీయమని, నేటి యువత జీవిత లక్ష్యాలను సాధించే క్రమంలో శాంతి, సహనం, కృషి, పట్టుదల వంటివి అలవర్చుకుని రాణించాలన్నారు. కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాష్‌రెడ్డి, పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు



సాగర్ చేరుకున్న బైకర్లు

సాగర్‌లో ఘన స్వాగతం

విఖ్యాంత్‌క్రత్రి ఆధ్వర్యంలో సాగర్‌లోని బుద్ధవనం చేరుకున్న బైక్ రైడర్లకు టీజీటీడీసీ మార్కెటింగ్ జనరల్ మెనేజర్ అంజిరెడ్డి, ట్రాన్స్‌పోర్ట్, వాటర్‌ఫ్లూయిడ్ జనరల్ మేనేజర్ ఇబ్రహీంలు, బుద్ధవనం డిజైన్ ఇంచార్జ్ శ్యాంసుందర్‌రావులు ఘనంగా స్వాగతం పలికారు. తెలంగాణ టూరిజం ఆధ్వర్యంలో ఒగ్గు కళాకారులతో సంప్రదాయ డప్పు వాయిద్యాలతో స్వాగతం పలకడం ఆకర్షణగా నిలిచింది. అనంతరం ఈ బృందం బుద్ధవనంలోని మహాస్తూపం చుట్టూ ఉన్న సర్కిళ్లను బైకులపై మూడు సార్లు పరిక్రమలు నిర్వహించిన అనంతరం బుద్ధుని పాదాలు, బుద్ధ చరితవనం, ధ్యానవనం, స్తూపవనాలను సందర్శించి మహాస్తూపం చుట్టూ పరిక్రమలు చేశారు. మహాస్తూపం అంతర్భాగంలోని జ్ఞానమందిరం వీక్షించి అబ్బురపడ్డారు. ఈ సందర్భంగా నిర్వాణ బైక్ ర్యాలీలో పాల్గొన్న వారికి తెలంగాణ టూరిజం అధికారులు ప్రశంసా పత్రాలు అందించారు.

కలుషిత నీరు, సీవరేజిపై అప్రమత్తం

వర్ష సూచన నేపథ్యంలో జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి జూమ్ మీటింగ్



సాక్షి, సిటీబ్యూరో: రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న నేపథ్యంలో కలుషిత నీటి, సీవరేజి ఓవర్ ఫ్లోపై అప్రమత్తంగా ఉండాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం డైరెక్టర్లు, సీజీఎంలు, జీఎంలతో ఆయన జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..వర్షాల వల్ల కలుషిత నీరు సరఫరా అయ్యే అవకాశమున్న తరుణంలో దానిపై ప్రధానంగా దృష్టి సారించాలని చెప్పారు. రిజర్వాయర్ల నుంచి సరఫరా చేసే నీటిలో తగు మోతాదులో క్లోరిన్ ఉండేలా చూసుకోవాలన్నారు. ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో నీటి నాణ్యతా పరీక్షలు నిర్వహించి, క్లోరిన్ బిళ్లలు పంపిణీ చేయాలని తెలిపారు. అవసరమైతే ఆ ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. వర్షాల కారణంగా సీవరేజీ సమస్యలు తలెత్తకుండా ఇప్పటికే గుర్తించిన వాటర్ లాగింగ్ ప్రాంతాల్లో ఈఆర్టీ, ఎయిర్ టెక్ మిషన్ సేవల కోసం తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తరచూ సీవరేజీ ఓవర్ ఫ్లో అయ్యే మ్యాన్ హోళ్లను గుర్తించి, నివారణ చర్యలు చేపట్టాలన్నారు. మ్యాన్‌హోళ్ల శుభ్రం చేసిన తర్వాత..ఎప్పటికప్పుడు సిల్ట్ తరలించేలా జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. దీంతో పాటు అక్టోబర్ 2 నుంచి చేపట్టే ఇంకుడు గుంతల నిర్మాణం/పునరుద్ధరణ స్పెషల్ డ్రైవ్ కోసం అన్ని రకాలుగా సిద్ధం కావాలని ఆదేశించారు.

రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో సత్తాచాటిన చిన్నారులు



ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన యశ్వంత్, వేదనారాయణ



తృతీయ స్థానం సాధించిన యోషిక శ్రావ్య

బంజారాహిల్స్: స్మార్ట్ కిడ్స్ అబాకస్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో నారాయణగూడకు చెందిన చిన్నారులు సత్తాచాటారు. నారాయణగూడలోని షార్ప్ మైండ్స్ అబాకస్ స్కూల్ చిన్నారులు రాష్ట్ర స్థాయి పతకాలతో మెరిశారు. ప్రథమ స్థానంలో యశ్వంత్ గడ్డం, ద్వితీయ స్థానం వేదనారాయణ, తృతీయ స్థానంలో యోషిక శ్రావ్య నిలిచారు. ముఖ్య అతిథిగా హాజరైన కాకతీయ హాస్పిటల్స్ సీఈవో, డైరెక్టర్ డాక్టర్ టి.హరిప్రకాశ్ విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా మశ్చేందర్‌రెడ్డి



ఘట్‌కేసర్: గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొండాపూర్‌కు చెందిన చిలుకూరి మశ్చేందర్‌రెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మార్కెట్ కమిటీ అభివృద్ధి, రైతుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. డైరెక్టర్ పదవి రావడానికి సహకరించిన పెద్దలందరికీ ధన్యవాదాలు తెలిపారు.

ఉస్మానియా ఆస్పత్రిలో పాముల కలకలం

అఫ్జల్‌గంజ్: ఉస్మానియా జనరల్ ఆసుపత్రి పాత భవనం, పక్కనే ఉన్న డాక్టర్స్ క్యాంటీన్‌లో పాములు కలకలం రేపాయి. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు మూసీనదిలో నుండి కొట్టుకువస్తున్న పాములు తరచూ ఉస్మానియాలోకి వస్తున్నాయి. తాజాగా శనివారం రాత్రి సమయంలో అత్యంత ప్రమాదకరమైన రక్తపింజరి పాము డాక్టర్స్ క్యాంటీన్ వద్ద ప్రత్యక్షం కావడంతో సిబ్బంది భయాందోళనకు గురై స్నేక్ సొసైటీ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న గణేష్ అతని బృందం చాకచక్యంగా పామును సంచిలో బంధించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కొన్ని నెలలుగా ఆసుపత్రిలోని వ్యర్థాలను డాక్టర్స్ క్యాంటీన్ ముందున్న ఖాళీ స్థలంలో వేయడంతోనే తరచు పాములు వస్తున్నాయని, దీంతో అక్కడకు వెళ్లాలంటే భయంగా ఉందని పలువురు వైద్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

హుక్కా సెంటర్ పై దాడి.. ఇద్దరి అరెస్ట్



పోలీసులు దాడి చేసిన హుక్కా సెంటర్

హస్తినాపురం: నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న హుక్కా సెంటర్‌పై ఎస్ఓటీ పోలీసులు, వనస్థలిపురం పోలీసులు దాడి చేసి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు.ఈ సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వనస్థలిపురం పోలీసులు తెలిపిన మేరకు.. చింతల్‌కుంటలోని సుబ్బయ్యగారి హోటల్ భవనంపై ఉన్న ఐదోఅంతస్తులో గుట్టు చప్పుడుకాకుండా నిర్వహిస్తున్న హుక్కాసెంటర్ పై ఆదివారం దాడి చేసి మహ్మద్ సోయబ్(32), సయ్యద్ సైరియాజ్(26) లను అదుపులోకి తీసుకుని వారిని పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రేటింగ్.. చీటింగ్

సినిమాలకు రేటింగ్ ఇస్తే డబ్బులొస్తాయని ఆశ

ఇంట్లో కూర్చొని రోజుకు రూ.వేలల్లో సంపాదన

సామాజిక మాధ్యమాలలో సైబర్ కేటుగాళ్ల ప్రకటనలు

నిరుద్యోగులు, గృహిణులే లక్ష్యంగా మోసాలు



సాక్షి, సిటీబ్యూరో: ''రాచకొండకు చెందిన ఓ గృహిణి వాట్సాప్‌కు 'జవాన్' సినిమాకు రేటింగ్ ఇస్తే డబ్బులొస్తాయని మెసేజ్ వచ్చింది. ఆశ్చర్యపోతూనే నేరస్తులు పంపిన నాలుగైదు సినిమాలకు రేటింగ్, రివ్యూలు ఇచ్చే సరికి ఆమె పేరుతో ఉన్న ప్రత్యేక వ్యాలెట్‌లో రూ.20 వేలు జమ అయ్యాయి. ఇంట్లో కూర్చొని డబ్బు సంపాదించానని తెలిస్తే తన భర్త మెచ్చుకుంటాడని భావించింది. ఈసారికి నేరస్తుల నుంచి ఒకేసారి పది సినిమాలకు రేటింగ్ లింక్‌లు పంపించాలంటే కొంత అమౌంట్ డిపాజిట్ చేయాలని ఆమెకు సందేశం వచ్చింది. దీంతో వాళ్ల మాటలను నమ్మి రూ.2 లక్షలు బదిలీ చేసింది. సినిమాలకు రేటింగ్ ఇచ్చినా ఆమెకు ఎలాంటి డబ్బులు రాలేదు. కమీషన్ రావాలంటే రూ.50 వేలు చార్జీ అవుతుందని కేటుగాళ్ల సూచన మేరకు అవి కూడా పంపించింది. అంతే అప్పట్నుంచి సైబర్ నేరస్తులు సైలెంట్‌ైపోయారు. ఆఖరికి వ్యాలెట్‌లో ఉన్న రూ.20 వేలు డ్రా చేసుకునే అవకాశం కూడా లేకపోయే సరికి తాను మోసపోయానని గ్రహించింది.

- ఇదీ సైబర్ నేరస్తుల రేటింగ్ వలకు చిక్కి విలవిల్లాడిన ఓ గృహిణి ఆవేదన. ఈమె ఒక్కరే కాదు సైబర్ నేరస్తుల సినిమాల రేటింగ్ వలకు చాలా మంది నగరవాసులు చిక్కుతున్నారు. గృహిణిలు, నిరుద్యోగులు, యువతను లక్ష్యంగా చేసుకొని కేటుగాళ్లు సరికొత్త మోసాలకు తెరలేపారు.

ఆశే నేరస్తుల పెట్టుబడి..

''మేము పంపించే సినిమాలకు రేటింగ్‌లు, రివ్యూలు ఇస్తే చాలు.. ఇంట్లో కూర్చొని రోజుకు రూ.వేలల్లో సంపాదించవచ్చు'' ఈ ప్రకటన చూస్తే ఎవరికైనా ఆశ కలుగుతుంది. ఇదే నేరస్తుల పెట్టుబడి. ఫేస్‌బుక్, ట్విట్టర్, టెలిగ్రాం, వాట్సాప్, ఇన్‌స్టాగామ్ వంటి సామాజిక మాధ్యమాలలో ఈ తరహా ప్రకటనలు, పోస్టులు పెడుతూ బాధితులను ఆకర్షిస్తున్నారు.

సోషల్ మీడియాలో వచ్చే పోస్టులను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మకూడదని సైబర్ క్రైమ్ పోలీసులు సూచిస్తున్నారు. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా జేబులు ఖాళీ అవుతాయని హెచ్చరిస్తున్నారు. మనం ప్రమేయం లేకుండా వాట్సాప్, టెలిగ్రాం, ఇన్‌స్టాగామ్ గ్రూప్‌లలో చేరకూడదని సూచిస్తున్నారు.

మోసం ఎలా చేస్తారంటే...

తాము సూచించిన సినిమాలకు రేటింగ్ ఇవ్వాలంటూ సోషల్ మీడియాలలో సందేశాలు పంపిస్తారు. రేటింగ్ ఇవ్వాల్సిన తీరు, కమీషన్ ఎలా చెల్లిస్తారు? ఎన్ని రోజుల్లో ఎంత సంపాదన వస్తుందో వివరంగా ఉంటుంది. ఈ లింకును క్లిక్ చేయగానే ఆటోమెటిక్‌గా సైబర్ నేరగాళ్లు ఏర్పాటు చేసిన వాట్సాప్, టెలిగ్రాం గ్రూప్‌లలో చేరతారు. ముందుగా కొన్ని సినిమాల పేర్లను పంపించి వాటికి రివ్యూ ఇవ్వగానే ప్రత్యేక వ్యాలెట్‌లో కొంత డబ్బు జమ చేస్తారు. మనకు నమ్మకం కుదిరేవరకూ మనం డబ్బు డ్రా చేసే అవకాశం ఇస్తారు. ఆ తర్వాత ఎక్కువ సినిమాలకు రేటింగ్ ఇచ్చే అవకాశం ఇస్తామంటూ డబ్బు వసూలు చేస్తారు.

చేయి తగిలిందని పోలీస్ మార్క్ కేసు!

గచ్చిబౌలి: పబ్‌లో చేయి తగిలిందని ఓ డాక్టర్ మీద కేసు నమోదు చేసిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నాలుగు రోజుల క్రితం ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని తబులా రసా పబ్‌కు ఓ ఐపీఎస్ ఆఫీసర్ భార్యతో కలిసి వెళ్లారు. అదే పబ్‌కు కొంత మంది డాక్టర్లు వెళ్లారు. ఐపీఎస్ భార్య వాష్‌రూమ్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా మదీనాగూడకు చెందిన ఓ డాక్టర్ చేయి తగిలింది. పొరపాటు జరిగిందని సదరు డాక్టర్ ఆమెకు సారీ చెప్పారు. అక్కడి నుంచి వెళ్లిపోయిన ఆమె జరిగిన విషయాన్ని భర్తకు చెప్పింది. ఆ తర్వాత క్షణాల మీద గచ్చిబౌలి పోలీసులు పబ్‌కు చేరుకున్నారు. సదరు డాక్టర్‌ను గచ్చిబౌలి పీఎస్‌కు తరలించారు. నేను కావాలని చేయలేదని, యాదృచ్ఛికంగా జరిగిందని చెప్పినా పోలీసులు శాంతించలేదు. మద్యం ఎక్కువ తాగి అసభ్యంగా ప్రవర్తించాడా అనేది నిర్ధారించుకునేందుకు బ్రీత్ ఎనలైజర్ చేశారు. మద్యం అతిగా తాగలేదని తేలినట్లు సమాచారం. గంటల తరబడి స్టేషన్‌లోనే కూర్చోబెట్టారు. మరుసటి రోజు పబ్ నిర్వాహకులతో ఫిర్యాదు తీసుకొని ఆ డాక్టర్‌పై కేసు నమోదు చేసి, నోటీసు ఇచ్చి పంపించారు. మహిళలను కించపరిచే వ్యవహరించినా, అసభ్యంగా ప్రవర్తించినా చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చు. కాని ఐపీఎస్ భార్య కావడంతో చిన్న విషయానికి పోలీసులు హంగామా చేశారనే ప్రచారం జరుగుతోంది. సామాన్యుల ఫిర్యాదుపైనా పోలీసులు ఇలానే వ్యవహరిస్తే బాగుండేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇంత జరిగినా పోలీసులు మాత్రం తబులా రసా పబ్ కేసుపై నోరు మెదపడం లేదు. కేసు గురించి మాకు తెలియదని, కేవలం పబ్‌లలో తనిఖీలు మాత్రమే చేశామని గచ్చిబౌలి పోలీసులు బుకాయించడం గమనార్హం.

అధిక స్థాయి రేడియేషన్‌తో కేన్సర్ ముప్పు



మెడికల్ ఆంకాలజీ విభాగం వైద్యులతో నిమ్స్ డైరెక్టర్ బీరప్ప

లక్డీకాపూల్: అధిక స్థాయి రేడియేషన్‌తో సంబంధం కలిగి ఉంటే కేన్సర్ వ్యాధి బారినపడే ప్రమాదముందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆహారపు అలవాట్లతో పాటు ధూమపానం, ఇన్‌ఫెక్షన్లతో క్రానిక్ మైలోజెనస్ ల్యుకేమియా(సీఎంఎల్) సమస్య ఉత్పన్నమవుతుందన్నారు. ప్రపంచ సీఎంఎల్ డేను పురస్కరించుకుని నిమ్స్ మెడికల్ అంకాలజీ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప మాట్లాడుతూ.. సీఎంఎల్ అనేది కేన్సర్ వ్యాధి నెమ్మదిగా పెరుగుతున్న రూపమన్నారు. ఈ సమస్యతో చాలా మంది ఎక్కువ కాలం జీవనం సాగించాల్సి వస్తుందన్నారు. అయితే కొంత మంది రోగులకు స్టెమ్ సెల్ మార్పిడితో నయం చేయవచ్చు కానీ ఇది సంక్లిష్టమైన ప్రక్రియ అని చెప్పారు. వ్యాధి నిర్ధారణ, లక్షణాలు, చికిత్స విధానంపై ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆంకాలజీ విభాగం అధిపతి డాక్టర్ మెహెర్ లక్ష్మి, డాక్టర్, సీహెచ్. రచన తదితరులు పాల్గొన్నారు.

కుక్క దాడిలో ఇద్దరు చిన్నారులకు గాయాలు

ఘట్‌కేసర్: పట్టణంలో ఇద్దరు చిన్నారులు ఆదివారం కుక్కల దాడిలో గాయపడ్డారు. రైల్వేగేటు సమీపంలో వెంకటేశ్ కూతురు దియాన్ని, అంబేడ్కర్ చౌరస్తాలో మరొకరిని కుక్క కరిచింది. దీంతో చిన్నారుల తల్లితండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పట్టణంలో కుక్కల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

డీజేలు నిషేధిద్దామా?

- నిర్వాహకులను కోరిన కొత్వాల్ ఆనంద్
- సానుకూలంగా వచ్చిన వారి స్పందనలు
- త్వరలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహణ

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఏ కీలక ఉత్సవం జరిగినా, పండుగ, ఊరేగింపు, సమావేశాల సందర్భాల్లో పోలీసులకు సవాల్‌గా మారిన అంశం డీజేలు. వీటి వల్ల ఏర్పడే శబ్ద కాలుష్యంతో రోగులు, వయోవృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. ఇది నాణేనికి ఒక వైపు మాత్రమే... డీజేల నుంచి వెలువడే అపరిమిత శబ్దాల కారణంగా పోలీసులకు సంబంధించిన కమ్యూనికేషన్ వ్యవస్థ కూడా దెబ్బ తింటుంది. బందోబస్తు నిర్వహణలో అనేక ఇబ్బందులు వస్తుంటాయి. ఈ నేపథ్యంలో అధికారులు ప్రతి సందర్భంలోనూ డీజేలు వద్దంటూ ప్రకటిస్తుంటారు. నిర్వాహకులు మాత్రం ఇవేవీ పట్టనట్లు కొనసాగిస్తుంటారు. ఈ పరిణామాలను దృష్టిలో పెట్టుకున్న సిటీ కొత్వాల్ సీవీ ఆనంద్ ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. నగరంలో డీజేలను పూర్తిగా నిషేధించాలని భావిస్తున్నారు. దీనిపై ఉత్సవాల నిర్వాహకులతో పాటు రాజకీయ పార్టీలతో ఓ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. ఈ అంశంపై సంబంధీకులకు పోలీసు కమిషనర్ ఆనంద్ లేఖ రాశారు. వారి నుంచి సానుకూల స్పందన వచ్చిందని, త్వరలోనే తదుపరి చర్యలు ఉంటాయని ఆయన ఆదివారం తన 'ఎక్స్' ద్వారా ప్రకటించారు.

మద్యం మత్తులో యువకులపై దాడి

బంజారాహిల్స్: యూసుఫ్‌గూడ సమీపంలోని ఎల్ఎన్‌నగర్‌లో నివసించే ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌తో పాటు ఆయన స్నేహితులపై మద్యం మత్తులో ముగ్గురు యువకులు దాడి చేసి గాయపర్చిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేసన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే...ఎన్ఎన్‌నగర్‌లో ఎం. ప్రశాంత్ (29)తో పాటు సురేంద్ర, అమన్ అనే మరో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. రాత్రి ఈ ముగ్గురు తమ గదిలో మాట్లాడుకుంటుండగా ఈ ఇంటి యజమాని బంధువులు శివగౌడ్, సాయిగౌడ్, మోహన్‌గౌడ్‌లు మద్యం మత్తులో తూలుతూ వీరి గదికి వచ్చి అకారణంగా గొడవకు దిగారు. అంతేకాకుండా పిడిగుద్దులతో, కర్రలతో ఇష్టానుసారంగా కొట్టారు. ఇంట్లో వస్తువులన్నీ ధ్వంసం చేశారు. అరగంట పాటు జరిగిన ఈ బీభత్సంలో సురేంద్రతో పాటు మిగతా ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. మోహన్‌గౌడ్, శివగౌడ్, సాయిగౌడ్‌లపై పోలీసులు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు కాంట్రాక్టర్లపై కేసు నమోదు

బంజారాహిల్స్: తన ప్లాట్‌ను ఆక్రమించేందుకు యత్నిస్తున్న కాంట్రాక్టర్లపై ఓ మహిళా డాక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే... జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-5లోని ఉమెన్ కో-ఆపరేటివ్ సొసైటీ కాలనీలో నివసిస్తున్న రిటైర్డ్ మెడికల్ డాక్టర్ ఇందిర గత ఏప్రిల్ 28వ తేదీన తన ఇంటిని చదును చేసేందుకు అన్షూ ఇన్‌ఫ్రా టెక్ కాంట్రాక్టర్ క్రాంతికుమార్ గుండా, సబ్ కాంట్రాక్టర్ అలకుంట్ల అశోక్‌కు ఇచ్చింది. ఈ స్థలంలోనే మిషన్లు, ఇతర మెటీరియల్ ఉంచారు. తనకు చెందిన ప్లాట్ నెంబర్-48లో ఉంచిన ఈ మెటీరియల్, మిషన్లను తొలగించాలని ఆమె పలుమార్లు కోరినా కూడా వారు పట్టించుకోలేదు. దీంతో అక్రమంగా తన ప్లాట్‌ను కబ్జా చేయడమే కాకుండా తన అంతు చూస్తామని బెదిరిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. జూబ్లీహిల్స్ పోలీసులు కాంట్రాక్టర్లు క్రాంతికుమార్ గుండా, అలకుంట్ల అశోక్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు గొలుసు మాయం

వెంగళరావునగర్: బంగారు గొలుసు మాయమైన సంఘటనలో కేర్ టేకర్‌పై ఫిర్యాదు చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... జవహర్‌నగర్‌లో నివసించే టి.జయరాజ్ తన వృద్ధురాలైన తల్లి ప్రమీల ఆలనాపాలనా చూసుకోవడానికి జ్యోతి అనే యువతిని గత నాలుగు రోజుల కిందట ఏర్పాటు చేసుకున్నాడు. ఈనెల 17వ తేదీన జయరాజ్ తల్లికి స్నానం చేయించడానికి జ్యోతి సహాయం చేసింది. స్నానం సమయంలో ప్రమీల తన ఒంటి మీద ఉన్న 5 తులాల బంగారు గొలుసు తీసి పక్కన పెట్టింది. రాత్రి జయరాజ్ సోదరి తన తల్లిని చూడటానికి ఇంటికి వచ్చింది. ఈ సమయంలో తల్లి వద్ద ఉండాల్సిన గొలుసు కనిపించలేదు. రాత్రి 11.30 సమయంలో జ్యోతితో పాటుగా అరవింద్ అతని ఇంటి నుంచి కిందకు దిగి జ్యోతి ఇంట్లోకి వెళ్లారు. దీంతో ఆ బంగారు గొలుసు జ్యోతి, అరవింద్‌లు దొంగిలించారంటూ జయరాజ్ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జానపదం లేకుండా పాటలేదు..

సినీ గేయరచయిత సుద్దాల అశోక్‌తేజ



సుమలతకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న సుద్దాల అశోక్‌తేజ తదితరులు

చిక్కడపల్లి: అన్నమయ్య కళాసమితి వార్షికోత్సవ వేడుకలు ఆదివారం సాయంత్రం త్యాగరాయ గానసభలో ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా సినీ గేయరచయిత సుద్దాల అశోక్‌తేజ హాజరయ్యారు. ఈ సందర్భంగా సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ.. జానపదం లేకుండా తెలుగు నేల మీద ఏ పాట పుట్టలేదని.. అది అన్నమయ్య గొప్పదనమని అన్నారు. ఈ సందర్భంగా సంగీత గురువు సుమలత శిష్యులు అన్నమయ్య సంకీర్తనలు, కూచిపూడి నృత్యప్రదర్శనలతో అలరించారు. 36 నిమిషాల్లో 72 మందితో 72 కీర్తనలు ఆలపించి తెలుగు బుక్ ఆఫ్ రికార్డును నెలకొల్పారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ జ్యూరి మెంబర్ టీవీ అశోక్ కుమార్ నిర్వహణ సంస్థ అధ్యక్షురాలు జి.సుమలతకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

బ్లాక్ మెయిల్ చేస్తున్నాడని అంతం చేశారు

- హత్య కేసును ఛేదించిన పోలీసులు
- ఐదురుగు నిందితుల అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ అంజయ్య

కుషాయిగూడ: హత్య కేసులో సాక్షిగా ఉన్న వ్యక్తి తరచుగా బ్లాక్ మెయిల్ చేస్తుండటంతో విసిగిపోయి తన మిత్రులతో కలిసి హత్యచేశాడు. ఈ నెల 19న చోటు చేసుకున్న హత్య కేసును ఛేదించిన కుషాయిగూడ పోలీసులు నిందితులను రిమాండ్‌కు తరలించారు. కేసు వివరాలను ఆదివారం ఇన్‌స్పెక్టర్ అంజయ్య వెల్లడించారు. కాప్రా, కందిగూడకు చెందిన శ్రవణ్‌కుమార్ రియల్ ఎస్టేట్ వ్యాపారి. 2018లో జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. అయితే ఈ హత్య కేసులో కంటోన్మెంట్, సర్వెంట్ క్వార్టర్స్‌లో నివాసం ఉండే జోసెఫ్ బెనర్జీ ప్రత్యక్ష సాక్షిగా ఉన్నాడు. దీంతో శ్రవణ్‌ను జోసెఫ్ తరచుగా బ్లాక్ మెయిల్ చేస్తూ డబ్బు డిమాండ్ చేసేవాడు. జోసెఫ్ వేధింపులు తాళలేని శ్రవణ్‌కుమార్ అతని అడ్డు తొలగించుకోవాలని భావించాడు. ఈ క్రమంలో ఈ నెల 19న జోసెఫ్,... శ్రవణ్ ఇంటికి వెళ్లి డబ్బుకోసం గొడవపడ్డాడు. దీంతో ఆగ్రహానికి గురైన శ్రవణ్ అతడు బతికుంటే నాకు ఎప్పటికైనా ప్రమాదమేనని భావించి అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్నాడు. విషయాన్ని కందిగూడకు చెందిన తన మిత్రులు కృష్ణారెడ్డి, షేక్ గౌస్, మహ్మద్ గౌస్ అలియాస్ అమీర్, శ్రీకాంత్‌లకు చెప్పి జోసెఫ్ హత్యకు ప్లాన్ చేశారు. అదే రోజు అంతా కలిసి మద్యం తాగారు. టీ స్టాల్ వద్ద ఉన్న జోసెఫ్‌ను తమ కారులో ఎక్కించుకొని శ్రవణ్ ఇంటి సమీపంలోకి తీసుకెళ్లి కర్రలతో కొట్టి హత్య చేశారు. చనిపోయినట్లు నిర్ధారించుకొని శవాన్ని కారులో తీసుకెళ్లి కందిగూడ శ్మశానవాటికలో పడేసి పరారయ్యారు. ఘటన స్థలం వద్ద లభ్యమైన, సీసీ కెమెరాల్లో లభించిన ఆధారాలతో విచారణ చేపట్టిన పోలీసులు నింధితులను ఆదివారం అరెస్టు చేసి చర్లపల్లి జైల్‌కు రిమాండ్‌కు తరలించారు.

4 నుంచి ఉమెన్ ఎగ్జిబిషన్



బంజారాహిల్స్: బంజారహిల్స్‌లోని తాజ్‌దక్కన్ హోటల్‌లో అక్టోబర్ 4, 5 తేదీల్లో సితార పేరుతో ఉమెన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన సన్నాహక కార్యక్రమం బంజారాహిల్స్ రోడ్ నెం. 10లో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో సినీ నటి స్రవంతితో పాటు పలువురు మోడల్స్ పాల్గొని కార్యక్రమ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించబోయే వస్త్రాభరణాలతో పాటు విభిన్న రకాల దుస్తులను ధరించి మోడల్స్ హొయలు పోయారు. రెండురోజులపాటు జరిగే ఈ ఎగ్జిబిషన్‌లో లగ్జరీ జ్యువెలరీతో పాటు డిజైనరీ దుస్తులు, ఇతర ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు వెల్లడించారు.

సోదరిని వేధిస్తున్నాడని బావను అంతం చేశాడు

గోల్కొండ: సోదరిని వేధించడంతో పాటు విడాకులు ఇవ్వాలని వేధిస్తున్న బావను బామర్ది తలనరికి కిరాతకంగా హతమార్చాడు. ఈ సంఘటన గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ తెలిపిన మేరకు.. ఆసీఫ్‌నగర్‌కు చెందిన అలీమ్ అలియాస్ సలీమ్(34)కు జమాలికుంటకు చెందిన బేగంతో 14 సంవత్సరాల క్రితం వివాహం అయింది. వీరికి ముగ్గురు పిల్లలు. పండ్లు, కూరగాయల వ్యాపారం చేసుకునే అలీమ్ గత కొన్ని నెలలుగా తనకు విడాకులు ఇవ్వాలని భార్యను వేధిస్తున్నాడు. విషయం తెలిసిన అతడి బావమర్ది అమూద్ బావకు నచ్చజెప్పాడు. సోదరిని వేధిస్తే బాగుండదని హెచ్చరించాడు కూడా. ఈ క్రమంలో మాట్లాడుకుందా రమ్మంటూ అలీమ్‌ను ఆదివారం తాము నివాసం ఉండే జమాలికుంటకు పిలిచాడు. మాటా మాటా పెరిగి కోపంతో ఆలీమ్ ఇంటి బయటకు వచ్చాడు. కాగా అమూద్ అతడిని వెంబడించి ఇంటి సమీపంలోని రోడ్డుపైనే కత్తితో దాడి చేశాడు. తల వెనుకభాగంపై కత్తితో పొడవడంతో మృతుడి మెదడు బయటకు వచ్చి రోడ్డుపై పడింది. అలీమ్ అక్కడికక్కడే మృతి చెందాడు. హత్య అనంతరం నిందితుడు అమూద్ నేరుగా పోలీసులకు లొంగిపోయినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా తనను వేధిస్తున్నాడంటూ మృతుడి భార్య గత కొన్ని నెలల క్రితం ఆసీఫ్‌నగర్, టపాచాపుత్ర పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు దంపతులకు నచ్చజెప్పి పంపినట్లు తెలిసింది. సౌత్ వెస్ట్ జోన్ అదనపు డీసీపీ అష్వాక్ సంఘటన స్థలానికి చేరుకోని వివరాలను అడిగి తెలుసుకున్నారు. గోల్కొండ ఇన్‌స్పెక్టర్ సైదులు పంచనామా చేసి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.





4 నుంచి దాండియా సందడి

బంజారాహిల్స్: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నగరంలో దాండియా కార్యక్రమాలు ఏర్పాటు చేసేందుకు పలు సంస్థలు సిద్ధమవుతున్నాయి. ఇందులో భాగంగా రంగ్‌థాలి పేరుతో అక్టోబర్ 4 నుంచి 12వ తేదీ వరకు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ రోడ్డులోని క్లాసిక్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేయనున్న బిగ్గెస్ట్ దాండియ ఈవెంట్ సన్నాహక కార్యక్రమం బంజారాహిల్స్‌లోని తాజ్‌దక్కన్ హోటల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సినీ తార చాందిని భగ్వానానితో పాటు సినీ నటి వర్ష, పలువురు మోడల్స్ పాల్గొని దాండియా నృత్యాలు చేస్తూ అలరించారు. అనంతరం కార్యక్రమాన్ని నిర్వహించనున్న సౌభాగ్య ఇన్‌ఫ్రా డెవలపర్స్ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ఈ వేడుకల్లో ప్రతిరోజు రాత్రి 7 గంటలకు అమ్మవారికి హారతి, దాండియా భజన కార్యక్రమాలు హైలెట్‌గా నిర్వహించనున్నట్లు తెలిపారు.



ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు


అధ్యాపకులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పంజగుట్ట: ఎర్రమంజిల్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. పాఠశాలలో చదువుకున్న 1969 నుంచి 2020 బ్యాచ్ విద్యార్థులందరూ ఒక్కచోట చేరి ఆటలు, పాటలు, డ్యాన్సులు, సహపంక్తి భోజనం చేస్తూ ఎంతో ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా వారికి పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించుకున్నారు. నిమ్స్ అభివృద్ధి కోసం ఈ పాఠశాల స్థలం కేటాయించడంతో పాఠశాల మరో చోట నిర్మాణం చేసి వచ్చే విద్యా సంవత్సరానికి అక్కడకు మార్చనున్న నేపథ్యంలో పూర్వ విద్యార్థులు పాఠశాల మొత్తం కలియతిరిగి చిన్నతనంలో వారు గడిపిన రోజులు గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థులు అధ్యాపకులకన్నా ప్రస్తుతం మంచి స్థాయిలో ఉండడం చూసి ఆచార్యులు ఎంతో ఆనందపడ్డారు. ఈ కార్యక్రమంలో పూర్వ అధ్యాపకులు రోహిణి, భారతి, పిచ్చయ్య, ఉమలత, ఉమ సుందరి, సునిత, రోహిణి ప్రియ, మంగమ్మ, మధు, శరత్‌బాబు, సుధాకర్, కృష్ణారెడ్డి, ప్రసాద్, జయ, లక్ష్మీలు పాల్గొన్నారు.

ప్రణాళికలతో 'సమాజ్‌వాది'ని బలోపేతం చేద్దాం

సామాజిక వేత్త దండుబోయిన నిత్యకళ్యాన్ యాదవ్


అఖిలేష్ యాదవ్‌తో కళ్యాణ్ యాదవ్

బంజారాహిల్స్: సమాజ్‌వాదీ పార్టీకి మంచి అవకాశాలున్నాయని మంచి ప్రణాళికలు రూపొందిస్తే సమాజ్‌వాది పార్టీని నగరంలో బలోపేతం చేద్దామని సామాజిక వేత్త, ఎనలిస్ట్ దండుబోయిన నిత్య కళ్యాన్ యాదవ్ అన్నారు. జూబ్లీహిల్స్‌కు చెందిన కళ్యాణ్ యాదవ్ ఆదివారం లక్నోలో ఓ సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్‌ను కలిసి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కళ్యాణ్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణలో సమాజ్‌వాదీ పార్టీలో చేరడానికి యువత ఆసక్తి చూపుతున్నారని నగరంలో యాదవ్ కమ్యూనిటీ గణనీయంగా ఉందని ఈ సందర్భంగా ఆయన వివరించారు. తనకు పార్టీలో ఏ బాధ్యత ఇచ్చినా పార్టీ కోసం కృషి చేస్తానని అన్నారు. వచ్చే జీహెచ్‌ఎంసీ, అసెంబ్లీ ఎన్నికల నాటికి తెలంగాణలో పార్టీ బలోపేతం అవుతుందని అన్నారు. ఈ సందర్భంగా అఖిలేష్ యాదవ్ కళ్యాణ్‌కు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అతనితో పాటు తెలంగాణ మాదిగ దండోరా ఫౌండర్ ప్రెసిడెంట్ నర్సింగ్ రావ్ కూడా పార్టీలో చేరారు.

పోలీస్‌శాఖకు సాయికుమార్ సేవలు ఎనలేనివి


ఎస్‌హెచ్‌ఓ వీరశేఖర్‌కు చెక్కును అందజేస్తున్న బాబా ఫసియుద్దీన్

రహమత్‌నగర్ (బోరబండ): కానిస్టేబుల్ సాయికుమార్ విధి నిర్వహణలో అందించిన సేవలు మరిచిపోలేవని జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ కొనియాడారు. తనవంతు బాధ్యతగా తన రెండు నెలల గౌరవ వేతనం సాయికుమార్ కుటుంబానికి అందజేస్తున్నానని ఆయన ప్రకటించారు. సాయికుమార్ సంతాప సభ సైట్‌-2 సర్వాయి పాపన్న కమ్యూనిటీ హాల్లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబా ఫసియుద్దీన్ మాట్లాడుతూ విధి నిర్వహణలో మంచిపేరు సంపాదించిన సాయికుమార్ అకాల మరణం కలిచి వేసిందన్నారు. ఎస్‌హెచ్‌ఓ వీరశేఖర్ మాట్లాడుతూ మృదు స్వభావిగా సాయికుమార్ పోలీసు సిబ్బంది మన్ననలు పొందాడని వాపోయారు. అనంతరం సాయికుమార్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. సెక్టార్ ఎస్‌ఐ తుల్జారాం నాయక్, డివిజన్ కాంగ్రెస్ నాయకులు నరసింహ, మహేష్‌కుమార్‌గౌడ్, కృష్ణవేణి, ఇమ్రాన్, శివకుమార్ గుప్తాతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాబా అందిస్తున్న సేవలు ప్రశంసనీయం


మాట్లాడుతున్న వేముల యాదయ్య

రహమత్‌నగర్ (బోరబండ) : బోరబండ సైట్‌-3 శ్మశాన వాటిక అభివృద్ధిలో స్థానిక కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అందిస్తున్న కృషి ప్రశంసనీయమని పీజేఆర్ ఎస్పీఆర్‌హిల్స్ ఉమ్మడి బస్తీల సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. బోరబండ శ్మశాన వాటికలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల యాదయ్య మాట్లాడుతూ రూ 1.75 లక్షల నిధులు లోకాయుక్త ఆదేశాలతో జీహెచ్‌ఎంసీ ద్వారా మంజూరు చేయించి శ్మశాన వాటిక అభివృద్ధి పనులు చేపడ్తున్నామన్నారు. పది సంవత్సరాల కాలంలో స్థానిక ఎమ్మెల్యే ఎన్ని నిధులు మంజూరు చేయించారో ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ముస్లిం వర్గానికి చెందిన బాబా ఫసియుద్దీన్ శ్మశాన వాటిక అభివృద్ధి పనులు చేయించడంలో ముందుండటం ఆయన మత సామరస్యానికి నిదర్శనమన్నారు. తమ సవాల్‌ను ఎమ్మెల్యే స్వీకరించాలని యాదయ్య డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో చైర్మన్ సీతారాంరెడ్డి, ఉపాధ్యక్షుడు ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇక్ఫాయ్ వ్యవస్థాపక దినోత్సవం


వేడుకల్లో పాల్గొన్న అతిథులు

బంజారాహిల్స్: ఇక్ఫాయ్ విశ్వ విద్యాలయం 14వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బెంగుళూరుకు చెందిన నారాయణ హృదయాలయ లిమిటెడ్ చైర్మన్ డాక్టర్ దేవీప్రసాద్ షెట్టి 'ఆధునిక వైద్య రంగంలో డిజిటల్ సేవల పాత్ర' అనే అంశంపై వర్చువల్‌గా ప్రసంగించారు. రానున్న కాలంలో మెరుగైన వైద్యం ప్రజలందరికీ అందుబాటులోకి రానున్నదని, సాంకేతికపరంగా వైద్య రంగంలో అనేక ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులు ఆరోగ్య బీమాను సొంతంగా అందజేస్తే ఇది సాధ్యమేనని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో రోగులు, ఆస్పత్రులు, బీమా సంస్థలు ఒకరికొకరు నమ్మే పరిస్థితులు లేవని, ఆ పరిస్థితిని నివారించడానికి ఆస్పత్రులు ముందుకు రావలసిన అవసరం ఉన్నదని ఆయన పిలుపునిచ్చారు. బెంగళూరులోని నారాయణ హృదయాలయ ఈ క్రమంలో రోగులకు ఉపయుక్తమైన బీమా పథకాన్ని అందుబాటులోకి తెచ్చిందని చెప్పారు. అదేవిధంగా ప్రజలు తమ వైద్య పరీక్షల వివరాలను తమ మొబైల్ ఫోన్‌లలో భద్రపరచుకుని అందుబాటులోకి తెచ్చుకుంటే అత్యవసర పరిస్థితుల్లో మళ్ళీ మళ్లీ పరీక్షలు రాసే అవసరం రాదని వివరించారు. తద్వారా వైద్యులు సత్వర చికిత్సను అందజేసి రోగుల ఆరోగ్యాన్ని పరీక్షించే అవకాశాలు మెరుగ్గా ఉంటాయన్నారు. రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్, ఇక్ఫాయ్ కులపతి రంగరాజన్ ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ అందరికీ అందుబాటులో వైద్యం అనేది గురుతర బాధ్యతగా గుర్తించి ప్రజలకు సేవలందించాలన్నార. కార్యక్రమంలో ఉప కులపతి ఎల్‌ఎస్ గణేష్, విశిష్ఠ సలహాదారుడు మహేందర్‌రెడ్డి, చైర్‌పర్సన్ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

కేబీఆర్ పార్కు వద్ద మల్టీలెవల్ పార్కింగ్..!

- టెండర్ దక్కించుకున్న సంస్థ
- త్వరలో నిర్మాణ పనులు
- 70 కార్లకు పార్కింగ్ సదుపాయం
- భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్న ప్రజలు


కేబీఆర్ పార్కును ఆనుకుని మల్టీలెవల్ పార్కింగ్ నిర్మాణం చేపట్టనున్న పార్కింగ్ స్థలం

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని ప్రతిష్ఠాత్మక కేబీఆర్ పార్కుకు వచ్చే వాకర్లు, సందర్శకుల కోసం మల్టీలెవల్ పార్కింగ్ సిస్టంను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించడమే కాకుండా ఇందుకు జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ ఆమోదం కూడా తెలిపింది. కార్ల పార్కింగ్ సమస్యలకు చెక్ పెట్టేందుకు ఈ నిర్మాణం అవసరమని నిర్ణయించి నవనిర్మాణ్ అసోసియేట్స్‌కు నిర్మాణ బాధ్యతలు అప్పగించింది. ప్రజల నుంచి వస్తున్న డిమాండ్లకు అనుగుణంగా మల్టీలెవల్ పార్కింగ్ ఏర్పాటు చేసేందుకు జీహెచ్‌ఎంసీ ముందుకు వచ్చింది. 405 చదరపు మీటర్లలో ఈ పార్కింగ్ నిర్మాణం చేపట్టనున్నారు. 72 కార్లను పార్కింగ్ చేసేందుకు కారు స్పేస్‌లు (ఈసీఎస్) కలిగి ఉంటుంది. కేబీఆర్ పార్కు మల్టీలెవల్ పార్కింగ్ సదుపాయంలో మొత్తం ఖాళీల్లో 20 శాతం బైక్‌లకు కేటాయించనున్నారు. ఈ సదుపాయం డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ మోడల్‌లో నిర్మించబడుతుంది.

పార్కింగ్‌కు టికెట్లు..

మల్టీలెవల్ కారు పార్కింగ్ సదుపాయం ఉదయం 5 నుంచి రాత్రి 11 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. పార్కింగ్ కోసం టికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. మెషన్ల ద్వారా టికెట్లు ఇస్తారు. స్మార్ట్‌కార్డుల ద్వారా కూడా టికెట్ పంపిణీ ఉంటుంది. పార్కింగ్ సదుపాయాన్ని నావిగేట్ చేయడానికి, పార్కింగ్‌ను ముందుగానే బుక్ చేసుకోవడానికి, ఇతర సేవల కోసం మొబైల్ యాప్‌ను కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు.

భిన్నాభిప్రాయాలు..

కేబీఆర్ పార్కు వద్ద నిర్మించ తలపెట్టిన మల్టీ లెవల్ కారు పార్కింగ్‌పై వాకర్లు, సందర్శకులు, స్థానిక వ్యాపారులు, ప్రజల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఇక్కడ 40 కార్ల వరకు పార్కింగ్ చేసుకునే అవకాశం ఉంది. ఈ మల్టీ లెవల్ కారు పార్కింగ్‌ను నిర్మిస్తే 70 కార్లకు మాత్రమే పార్కింగ్ సదుపాయం ఉంటుంది. కేవలం 30 కార్లు కోసం ఈ పార్కింగ్ సౌకర్యం అవసరమా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. టికెట్లు తీసుకుని పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేస్తే ఏ ఒక్కరూ ముందుకువచ్చే పరిస్థితులు కూడా కనిపించడం లేదు. ప్రకటనల ద్వారా ఆదాయాన్ని పెంచుకునేందుకే మల్టీలెవల్ కారు పార్కింగ్ నిర్మాణం చేపట్టబోతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఖరీదైన 500 గజాల స్థలాన్ని కేబీఆర్ పార్కు మెయిన్ గేటు వద్ద కేటాయించడం వల్ల ఇది పార్కింగ్ నిర్వాహకులకు పెద్దగా ఉపయోగపడేది కాదని కూడా విమర్శలు వస్తున్నాయి. కొత్తగా తీసుకువచ్చే పార్కింగ్ సిస్టంతో పార్కింగ్ చేసేవారికి పెద్దగా ఉపయోగం లేకపోగా కొంతమంది మాత్రం లాభం పొందుతారని, ప్రకటనల దందాతో లబ్ధి పొందుతారని విమర్శలు వినిపిస్తున్నాయి.

రోబోటిక్ శస్త్ర చికిత్సలతో విప్లవాత్మక మార్పులు

బంజారాహిల్స్: 'రోబోటిక్'తో శస్త్ర చికిత్సలు విప్లవాత్మక మార్పులకు నాందిగా చెప్పవచ్చని అపోలో హాస్పిటల్ సీనియర్ ఆర్థో, జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, ఏఏఎస్ కోర్సు డైరెక్టర్ డాక్టర్ మిథిన్ ఆచి తెలిపారు. ఇది ఖర్చులను కూడా గణనీయంగా తగ్గిస్తుందన్నారు. ఖచ్చితమైన వైద్య సేవలకు అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్‌తో కలిసి తెలంగాణ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్ (టీఓఎస్ఏ), ట్విన్ సిటీస్ ఆర్థోపెడిక్ సొసైటీ (టీసీఓఎస్) ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్‌లోని అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్‌లో 8వ ఆర్థ్రోప్లాస్టీ సమ్మిట్‌-2024 (ఏఏఎస్) నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రోబోటిక్ శస్త్ర చికిత్స దీర్ఘకాలిక సమర్థత ఇంకా పరిశోధనలో ఉందన్నారు. హిప్ రీప్లేస్‌మెంట్ సమయంలో ఖచ్చితమైన కప్ పొజిషనింగ్, తీవ్రమైన మోకాలి వైకల్యాలు అధిగమించడంలో దీని ప్రయోజనాలు కాదనలేనివన్నారు. ఈ పురోగతి అధునాతన చికిత్సా ఎంపికలను మరింత సులభతరం చేస్తాయన్నారు.

అక్రమంగా నల్లా కనెక్షన్.. కేసు నమోదు

బంజారాహిల్స్: ప్రధాన పైప్‌లైన్‌ను ధ్వంసం చేసి ఓ ఇంటికి నల్లా కనెక్షన్ తీసుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని జలమండలి బంజారాహిల్స్ సెక్షన్ మేనేజర్ కె.శివకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు ఓ వ్యక్తిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. వివరాల ప్రకారం... బంజారాహిల్స్ రోడ్డునెంబర్‌-11లోని గౌరీశంకర్‌నగర్‌లో జలమండలి మేనేజర్ కె. శివకుమార్ తన సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తుండగా కరీంప్లాజా అనే ఇంటికి 15 ఎంఎంతో రెండు కనెక్షన్లు ఉన్నట్లుగా గుర్తించారు. అబ్దుల్ కరీం అనే వ్యక్తి వీటిని తీసుకున్నాడని, తాము దీనికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, ఆయనపై చర్యలు తీసుకోవాలని ఆయన ఫిర్యాదు చేయగా, బంజారాహిల్స్ పోలీసులు నిందితుడిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

బంజారాహిల్స్: స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంలో భాగంగా బ్యాంక్ ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివారం బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని జీహెచ్‌ఎంసీ సిటీ మేనేజర్స్ శిక్షణా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈ ఉచిత వైద్య శిబిరంలో సర్కిల్‌-18కి చెందిన 340 మంది కార్మికులకు దంత, కంటి పరీక్షలను నిర్వహించారు. నగరంలోని పలు కీలక ఆస్పత్రులకు చెందిన వైద్యులు ఈ శిబిరంలో కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ బరోడా డీజీఎం సూర్యప్రకాశ్, రాజశేఖర్‌రెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న స్వీపర్లు


కేన్సర్‌పై అవగాహన రన్‌లో డాక్టర్లు

కేన్సర్‌పై అవగాహన రన్

ఖైరతాబాద్: టీనేజ్ అండ్ యంగ్ అడల్ట్ కేన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సచివాలయం నుంచి సంజీవయ్య పార్కు వరకు అవగాహన రన్ నిర్వహించారు. కేన్సర్‌ను ముందస్తుగా గుర్తించడం వల్ల చికిత్సలు అందుబాటులో ఉన్నాయనే విషయాలను తెలియజేస్తూ అవగాహన రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ హాస్పిటల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ సదాశివుడు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మోహర్ లక్ష్మి, డాక్టర్ రచన, ఎంఎన్‌జె హాస్పిటల్ డాక్టర్ రఘునాథ్ రావు, ఇండో అమెరికన్ కేన్సర్ సీనియర్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ కృష్ణమోహన్‌లతో పాటు 50 మంది వైద్యులు పాల్గొన్నారు.

ఏ రంగంలో ఉన్నా నైపుణ్యం ఉంటేనే రాణిస్తాం


యాదవ ఉపాధ్యాయులకు సన్మానిస్తున్న సభ్యులు

పంజగుట్ట: ఏరంగంలో ఉన్నవారైనా నైపుణ్యం ఉంటేనే వృత్తిలో రాణించగలమని అఖిలభారత యాదవ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో యాదవ్స్ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉన్న 50మంది యాదవ ఉపాధ్యాయులకు పురస్కారాలు జ్ఞాపిక, సన్మానం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ప్రస్తుతం ఎంబీఏ చదివిన విద్యార్థులు కూడా న్యూస్ పేపర్ చదవలేకపోతున్నారని అందుకే ఏ వృత్తిలో ఉన్నా అందులో నైపుణ్యం అవసరమని పేర్కొన్నారు. యాదవ్స్ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎ.శరత్ యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు డేగల శ్రీనివాస్ యాదవ్, కార్యదర్శి అరుణ్ యాదవ్, కన్వీనర్ రవిచంద్ర యాదవ్, జితేంద్ర, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ హితానికి మేము సైతం..!

- 'స్ట్రీట్ ప్లే' ప్రదర్శనల ద్వారా అవగాహన కార్యక్రమాలు
- చదువులతోపాటు నాటికల్లోనూ సత్తా
- విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ప్రిన్సిపాల్, హిందీ ఉపాధ్యాయురాలు



అవార్డు అందుకుంటున్న ఆత్మకూరి రామారావు స్కూల్ హిందీ టీచర్ రజనీదేవి

బంజారాహిల్స్: ఆ విద్యార్థులు కేవలం తరగతి గదులకు, చదువులకే పరిమితం కావడం లేదు. బాహ్య ప్రపంచంలో సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లను ఎలా అధిగమించాలో నాటికల ద్వారా అవగాహన కలిగించే కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఇందుకు ఆ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రోత్సాహం, హిందీ టీచర్ దర్శకత్వం వారిని విద్యార్థులుగానే కాకుండా కళాకారులుగా కూడా తీర్చిదిద్దుతున్నారు. వివిధ దురలవాట్లపై, పర్యావరణం, కాలుష్యం, రోడ్డు సేఫ్టీ..ఇలా మరెన్నో అంశాలపై ప్రజలకు అవగాహన కలిగించే నాటికలను ప్రదర్శిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్‌-45లోని భారతీయ విద్యాభవన్స్ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో చదువుకుంటున్న 10 మంది విద్యార్థులను ఎంపిక చేసిన ఈ స్కూల్ హిందీ టీచర్ రజనీదేవి వారిని పాత్రధారులుగా మలచి వేదికలపై సమాజాన్ని మేల్కొలిపే నాటికలను ప్రదర్శింపజేయడంలో విజయవంతం అవుతున్నారు. నుక్కడ్ నాటక్ (స్ట్రీట్ ప్లే) ద్వారా రజనీదేవి దర్శకత్వంలో ఈ విద్యార్థులంతా వివిధ ప్రాంతాల్లో నాటికలు నిర్వహిస్తూ సమాజంలో తమవంతు బాధ్యతను నెరవేరుస్తున్నారు. కాలుష్యాన్ని పారద్రోలడం, పర్యావరణాన్ని కాపాడుకోవడం ఇలా ఎన్నో అంశాల్లో వీరు ఈ నాటికలను ప్రదర్శిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని సీబీఎస్‌ఈ స్కూళ్ల నుంచి విద్యార్థులను నైపుణ్యాభివృద్ధిలోనూ, సమాజానికి ఉపయోగపడే పౌరులను తీర్చిదిద్దడంలో కృషి చేస్తున్న టీచర్లకు ఇచ్చే అవార్డును ఈ పాఠశాల టీచర్ రజనీదేవి అందుకున్నారు. హైదరాబాద్ సహోదయ స్కూల్స్ కాంప్లెక్స్ ఆధ్వర్యంలో సెలబ్రీ టీచర్‌-2024 అథెనా అరిస్టియా ఇన్‌స్పైరింగ్ టీచర్ అవార్డును ఈ పాఠశాలకు చెందిన రజనీదేవి స్ట్రీట్ ప్లే ప్రదర్శించడంలో చూపుతున్న ప్రతిభకు గాను అందజేశారు. ఈ అవార్డు అందుకోవడం పట్ల స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలతానాయర్ తన ఆనందాన్ని పంచుకున్నారు. ఈ విద్యార్థుల బృందం సేవ్ ఎన్విరాన్‌మెంట్‌పై న్యూఢిల్లీలో గృహ కౌన్సిల్ నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో కూడా పాల్గొని నాటకాన్ని ప్రదర్శించారు. ఈ విద్యార్థుల ప్రతిభ ఇప్పుడు నలుదిశలా విస్తరిస్తున్నది.



నాటికల అనంతరం స్కూల్ విద్యార్థుల బృందం

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు భరోసా


ఎల్‌ఓసీలను అందజేస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

రహమత్‌నగర్ (బోరబండ): సీఎంఆర్‌ఎఫ్ ఎంతోమంది నిరుపేదల ప్రాణాలను కాపాడుతుందని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. రహమత్‌నగర్, బోరబండ డివిజన్‌లోని 15మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన ఎల్‌ఓసీలను ఆదివారం ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అందరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మేమున్నామంటూ భరోసా


నగదును అందిస్తున్న కానిస్టేబుళ్లు

బంజారాహిల్స్: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన గోపాలపురం కానిస్టేబుల్ పి. నర్సింహరాజు కుటుంబానికి 2009 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుళ్లు అండగా నిలిచారు. ఈ సందర్భంగా 2009 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుళ్లు అంతా కలిసి రూ. 3.40 లక్షల నగదును రామంతాపూర్‌లో నివసించే నర్సింహరాజు సతీమణి మాధవికి అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ భవిష్యత్‌లో కూడా కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు.

ఇస్రో విశ్రాంత ఉద్యోగినికి వేధింపులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్‌-10లో నివసించే ఇస్రో విశ్రాంత ఉద్యోగిని నసీం రిజ్వానా తన పక్కింట్లో నివసించే అక్బర్ శంషేరీ వేధింపులకు పాల్పడుతున్నాడని బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్బర్‌తో పాటు ఆయన కొడుకు అనాఫ్ ఇద్దరూ కలిసి అసభ్యంగా ప్రవర్తిస్తూ తనపై దాడికి పాల్పడుతున్నారని ఆరోపించారు. అకారణంగా గొడవలకు దిగుతున్నారని, వీరి నుంచి తనకు ప్రాణహాని ఉందని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆకర్షిస్తున్న సిల్క్ ఇండియా వస్త్ర ప్రదర్శన




మూసాపేట: పండుగలు, వివాహాల సందర్భంగా మాదాపూర్ శిల్పకళా వేదికలో సిల్క్ ఇండియా వస్త్ర ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఒడిశా ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన చేనేత కళాకారులు, డిజైనర్లు రూపొందించిన వస్త్ర ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు మానస్ ఆచార్య తెలిపారు. ఈ వస్త్ర ప్రదర్శనలో సిల్క్ ఫ్యాబ్రిక్‌తో తయారు చేసిన అనేక రకాల చీరలు, దుస్తులు కూడా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన బంకర్ క్రాఫ్ట్ చీరలు, కంత స్టిచ్ సిల్క్ చీరలు, బేలు చీర, పశ్చిమ బెంగాల్‌కు చెందిన టాంగైల్, లక్నో చికాన్ వర్క్, బనారస్ సిల్క్ జమ్దానీ సిల్క్ చీరలు, షిఫాన్‌లతో సహా భారతదేశం నలుమూలల నుంచి కళాకారులు, హస్త కళాకారులతో తయారు చేయబడిన చీరలను ప్రదర్శించారు. రాజస్థాన్, గత్వాడా నుంచి బంధేజ్, బ్లాక్, సంగనేరి ప్రింట్, గుజరాత్ నుంచి బంధిని, పటోలా, ఖాదీ సిల్క్ టస్సార్ సిల్క్ వంటి వాటిని ఒకే చోట ప్రదర్శిస్తున్నామని తెలిపారు. అదే విధంగా ధర్మవరం స్టైల్‌లో నేసిన సూట్లు, బంగారు జరీ అంచుల చీరలు, ఆంధ్రప్రదేశ్, గద్వాల్ చీరలు వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయన్నారు. ఈ ప్రదర్శన ఈ నెల 28 వరకు ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. అన్ని డెబిట్, క్రెడిట్ కార్డుల సౌకర్యం ఉందని తెలిపారు.

జలాశయాల సంరక్షణ అందరి బాధ్యత



శామీర్‌పేట చెరువు వద్ద మాట్లాడుతున్న వేదకుమార్

శామీర్‌పేట్: నదులు, జలాశయాల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఇంటాక్ జాతీయ పాలక మండలి సభ్యుడు వేదకుమార్ మణికొండ అన్నారు. ఫోరం ఫర్ బెటర్ హైదరాబాద్(ఎఫ్‌బీహెచ్) ఆధ్వర్యంలో 'వరల్డ్ రివర్స్ డే'ను పురస్కరించుకొని ఆదివారం శామీర్‌పేట పెద్దచెరువు వద్ద వాకింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎఫ్‌బీహెచ్ మూడేళ్లుగా ప్రపంచ నదుల దినోత్సవాన్ని నిర్వహిస్తోందన్నారు. శామీర్‌పేట చెరువును కాలుష్యం బారి నుంచి రక్షించి దిగువన ఉన్న పొలాలకు నీరు అందించాలన్నారు. శామీర్‌పేట సరస్సు చుట్టూ ఉన్న అందమైన రాతి నిర్మాణం గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పలువురు పర్యావరణ ప్రేమికులు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యరంగంలో డిజిటలైజేషన్‌కు ప్రాధాన్యం

- ఎయిమ్స్ డిప్యూటీ సూపరిండెంటెంట్ డాక్టర్ మదకుల్



డిజిటలైజేషన్ ఫర్ హెల్త్ కేర్ సంస్థను ప్రారంభిస్తున్న దృశ్యం

రామంతాపూర్: ఆరోగ్యరంగంలో డిజిటలైజేషన్‌కు ప్రాధాన్యత పెరిగిందని, ఈ ప్రక్రియలో రోగి చరిత్ర ఇమిడి ఉంటుందని, చికిత్సలు సత్వరంగా చేయడానికి దోహదపడుతుందని బీబీనగర్ ఎయిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మదకుల్ అన్నారు. ఆదివారం రామంతాపూర్‌లోని ఇందిరా ఇంపీరియల్‌లో డాక్టర్ ప్రియదర్శిని వింజమూరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్లోబల్ లైఫ్ సైన్స్ డిజిటలైజేషన్ హెల్త్ కేర్ సంస్థను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఆరోగ్య గుర్తింపు కార్డు ఇవ్వడానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమియోపతి ప్రెసిడెంట్ డాక్టర్ ఎం.ఎన్.రాజు, వినోద్, సోమసుందర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ 'ఏ' గ్రూప్‌నకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలి

- మంత్రి ఉత్తమ్‌కు నేతగాని నేత దుర్గం రాజేష్ వినతి



సాక్షి సిటీ బ్యూరో: ఎస్సీ వర్గీకరణలో భాగంగా 'ఏ'గ్రూప్‌నకు 5 శాతం రిజర్వేషన్ కేటాయించాలని ఎస్సీ వర్గీకరణ కమిటీ చైర్మన్, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని నేతగాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్ కోరారు. ఈ మేరకు ఆదివారం మంత్రికి ఆయన వినతిపత్రం సమర్పించారు. నేతకాని కార్పొరేషన్‌తోపాటు చైర్మన్ పదవి ఇవ్వాలని, ఏజెన్సీలో పోడుభూముల పట్టాలు ఇవ్వాలని, ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో ప్రత్యేక స్థానం కల్పించాలన్నారు. మంత్రి ఉత్తమ్‌ను కలసినవారిలో రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ దుర్గం నర్సయ్య, చీఫ్ అడ్వైజర్ బోర్లకుంట దీపక్, నాయకులు సెగ్గం రాజేష్, గోళ్ల రాజమల్లు, అనపర్తి యువరాజ్, దుర్గం సంతోష్, రామటంకి చిరంజీవి, బీరెల్లి రజినీకుమార్, కొఠారి మల్లేష్, రామటంకి కార్తీక్ పాల్గొన్నారు. మరో రాష్ట్రమంత్రి శ్రీధర్ బాబును కూడా కలసి తమ సమస్యలను వివరించటంతోపాటు వినతిపత్రం అందజేశారు.

కేన్సర్ అవేర్‌నెస్ రన్



సాక్షి, సిటీబ్యూరో: టీనేజ్‌లో వచ్చే కేన్సర్‌పై అవగాహన కల్పించేందుకు టీనేజ్ అండ్ యంగ్ అడల్ట్ కేన్సర్ ఫౌండేషన్ ఆదివారం అవేర్‌నెస్ రన్ నిర్వహించింది. సచివాలయం నుంచి ప్రారంభమైన రన్ నెక్లెస్ రోడ్, సంజీవయ్య పార్క్, ఖైరతాబాద్ మీదుగా 5 కి.మీ., 10 కి.మీ., 15 కి.మీ. మేర సాగి తిరిగి సచివాలయం వద్ద ముగిసింది. 15 నుంచి 30 ఏళ్ల వయసు గల కేన్సర్ రోగులకు ఈ సంస్థ ఎంతగానో సహాయపడుతోంది. ఈ రన్‌లో 50 మంది వైద్యులతోపాటు 30 మంది హైదరాబాద్ రన్నర్లు పాల్గొన్నారు. నిమ్స్ ఆంకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ సదాశివుడు, నిమ్స్ అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ మెహర్ లక్ష్మి, డాక్టర్ రచన, ఎంఎన్‌జేకు చెందిన డాక్టర్ రఘునాథ్‌రావు, ఇండో–అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ సీనియర్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఎంవీటీ కృష్ణమోహన్, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి ఆంకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ శివకుమార్ తదితరులు ఈ రన్‌లో పాలుపంచుకున్నారు.

పది మంది సీఆర్‌పీలకు షోకాజ్ నోటీసులు

సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఎఫ్‌ఆర్‌సీ హాజరు తక్కువగా నమోదైన 10 పాఠశాలల క్లస్టర్ రిసోర్స్ పర్సన్(సీఆర్‌పీ)లకు జిల్లా విద్యాశాఖ షోకాజు నోటీసులు జారీ చేసింది. విధుల్లో అలసత్వం ప్రదర్శించినందుకు బహదూర్‌పురా, ఆసీఫ్‌నగర్, బండ్లగూడ, గోల్కొండ, సికింద్రాబాద్ పాఠశాలల సీఆర్‌పీలకు వివరణ కోరుతూ నోటీసులు జారీ అయ్యాయి.

28న 'గజల్ ఔర్ షాయరీ కీ షామ్'

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని మొజాంజాహి మార్కెట్ వేదికగా ఈ నెల 28న 'గజల్ ఔర్ షాయరీ కీ షామ్'కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. హిందీ, ఉర్దూ భాషల్లో కొనసాగనున్న ఈ గజల్స్ కార్యక్రమంలో నగర సాంస్కృతిక వారసత్వ వైభవాన్ని ప్రతిబింబించడానికి ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సాంస్కృతిక కార్యక్రమం సాయంత్రం 6:30 గంటల నుంచి ప్రారంభం కానుంది.

భవనాల అనుమతులపై ఆరా!

- రోడ్లు, చెరువులు, కుంటలు కుంచించుకపోవటంపై చర్యలకు సిద్ధం
- గ్రేటర్ శివారు మున్సిపాలిటీలు, జీపీల్లో ఆగని దందా

అక్రమ కట్టడాలు, లేఅవుట్లపై అధికారుల దృష్టి

సాక్షి, మేడ్చల్ జిల్లా: గ్రేటర్ శివారు పురపాలక సంఘాలతోపాటు గ్రామ పంచాయతీల్లో కొత్త భవనాల అనుమతులపై అధికార యంత్రాంగం ఆరా తీస్తోంది. పురపాలక సంఘాలు, గ్రామపంచాయతీల్లో టీఎస్ బీపాస్ విధానంతో సులువుగా అనుమతులు తీసుకునే వీలు ఏర్పడుతోంది. అన్ని పత్రాలు సక్రమంగా ఉండి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే, ఏ ఆఫీసు చుట్టూ తిరగకుండానే 21 రోజుల్లో అనుమతులు పొందే అవకాశం ఉంది. పైగా 75 గజాలు స్థలమున్న వారికి కూడా రూపాయితో అనుమతి ఇస్తున్నారు. అనుమతులు ఇవ్వడంలో అధికారులు జాప్యం చేస్తే బాధ్యులకు జరిమానా విధించడం, ఆటోమెటిక్‌గా అనుమతి జారీ కావడం ఇందులో ప్రత్యేకత. అయినప్పటికీ దరఖాస్తుదారులు ఈ విధానం పట్ల ఆసక్తి చూపకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

అనధికారికంగా...

గ్రేటర్ శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని నిజాంపేట్, బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్, మీర్‌పేట్, బడంగ్‌పేట్ నగరపాలక సంస్థలతోపాటు 23 మున్సిపాలిటీలు, 579 గ్రామ పంచాయతీల్లో కొత్తగా ఏర్పడుతున్న కాలనీల్లో ఎక్కడ పడితే అక్కడ కొత్త భవనాల నిర్మాణాలు జోరందుకున్నాయి. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలో మొత్తంగా 619 జీపీలు ఉండగా, ఇందులో 46 జీపీలు ఇటీవల సమీప పురపాలక సంఘాల్లో కలిపిన విషయం తెల్సిందే. కొందరు పాత ఇళ్లను కూల్చివేసి కొత్తగా అనధికారికంగా బహుళ అంతస్తులు నిర్మించుకుంటున్నారు. బ్యాంకు రుణాలు తీసుకునేవారు తప్ప మిగతా వారు ఇతర మార్గాల్లోనే ఇళ్లను నిర్మించుకుంటున్నట్లు బహిరంగంగానే చర్చ సాగుతోంది. వీధుల్లో ఇళ్లను నిర్మించుకుంటే ఆయా ప్రజాప్రతినిధులు ఎంతోకొంత ముట్టజెప్పనిదే పనులు చేసుకోనివ్వడం లేదని ప్రజల్లోంచి విమర్శలు వినిపిస్తున్నాయి. లేదంటే, పట్టణ ప్రణాళిక అధికారులు, సిబ్బందిని పంపించి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో అనుమతులకు బదులుగా స్థల యజమానులు సైతం అడ్డదారుల్లోకి వెళ్తున్నట్లు తెలుస్తోంది.

సెట్‌బ్యాక్ స్థలం మాయం

రహదారి, మురుగునీటి కాల్వల నిర్మాణం, భవిష్యత్తు అవసరాల కోసం భవన నిర్మాణ సమయంలో సెట్‌బ్యాక్ కోసం స్థలం వదిలి పెట్టాల్సి ఉంటుంది. అనుమతుల సమయంలో మాస్టర్ ప్లాన్ ప్రకారం కొంతమేర రోడ్డుకు స్థలాన్ని వదలాలని స్పష్టంగా ఉన్నప్పటికీ ఖాతరు చేయకుండా ఎవరికి వారు ప్రహరీలు నిర్మిస్తున్నారు. కొందరైతే రోడ్ల మీది వరకు శ్లాబులు వేస్తున్నారు. పురపాలక సంఘాల పరిధిలో ఇలాంటి ఉల్లంఘనలు అధికం. అనుమతుల ప్రకారం నిర్మాణాలు పూర్తి చేయకపోవడం, జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ, పట్టణ ప్రణాళిక అధికారులు పట్టించుకోకపోవడంతో గతంలో ఉన్న రోడ్లు, చెరువులు, కుంటలు కూడా మరింత కుచించుకుపోతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఇలాంటి వాటిపై అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ, పరిశీలన చేయాల్సిన అవసరముందంటున్నారు.



అధికారుల దృష్టి..

నగర శివారు జిల్లాలు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 13, రంగారెడ్డి జిల్లాలో 16 పురపాలక సంఘాలు ఉన్నాయి. మేడ్చల్ జిల్లాలో 34, రంగారెడ్డి జిల్లాలో 546 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో టీఎస్ బీపాస్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు భవన నిర్మాణాల వివరాలపై అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. గతంలో భారీగా వచ్చిన దరఖాస్తులు ప్రస్తుతం తగ్గిపోవడంపైనా దృష్టి సారిస్తున్నట్లుగా పేర్కొంటున్నారు. ఇప్పటి వరకు ఇచ్చిన అనుమతులు, అక్రమ నిర్మాణాలు, అదనపు కట్టడాలు, అనుమతులు తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా ఎన్ని భవనాలు ఉన్నాయనే వివరాలను సేకరిస్తున్నారు. ఈ వివరాలను అందించేందుకు పురపాలక సంఘాలు గుట్టుచప్పుడు కాకుండా కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

గ్రామీణస్థాయి క్రికెటర్లకు అవకాశాలు కరువు

శాట్ చైర్మన్ కె.శివసేనా రెడ్డి



పంజగుట్ట: తెలంగాణ జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధి కుంటుపడిందని, ప్రతిభావంతులైన గ్రామీణ క్రికెటర్లకు అవకాశాలు లభించకపోవడం దారుణమని శాట్ చైర్మన్ కె.శివసేనా రెడ్డి అన్నారు. తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షులు, శాప్ మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ క్రికెట్ దశ – దిశ అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివసేనా రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ గ్రామీణ క్రికెట్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, అవినీతిలో మునిగిపోయిందని ఇదే విషయమై బీసీసీఐకి కూడా లేఖ రాసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. తెలంగాణ జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధికి మరిన్ని సంఘాలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ క్రికెట్ అభివృద్ధి చెందాలంటే ప్రతీ జిల్లాకు అధునాతన మౌలిక సదుపాయాలతో కూడిన అకాడమీలు అవసరమని అన్నారు. రాష్ట్ర జట్టు అంటే అన్ని జిల్లాల నుంచి క్రికెటర్లకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీసీఏ జిల్లా సంఘాల ప్రతినిధులు, మాజీ క్రికెటర్లు రాఘవరెడ్డి, సోమేశ్వర రావు, భాస్కర్, కాభోజి వెంకటేశ్వర్లు, మతిన్, రామ్ నర్సింహ, బాలరాజు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణతోనే సామాజిక న్యాయం

ఆదివాసీల సంఘాల సమావేశంలో హరగోపాల్



ఆదివాసీ సంఘాల జేఏసీ సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

సుందరయ్య విజ్ఞానకేంద్రం: ఎస్సీ వర్గీకరణ తరహాలో ఎస్టీ రిజర్వేషన్లు వర్గీకరించాలన్న ఆదివాసీల డిమాండ్ న్యాయమైందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తుడుందెబ్బ, ఆదివాసీల సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఎస్టీ వర్గీకరణపై రౌంట్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని, అదే తరహాలో ఎస్టీలో ఏబీసీడీ వర్గీకరణ చేస్తేనే అన్ని తెగలవారికి సామాజిక న్యాయం చేకూరుతుందన్నారు. ఎస్టీ వర్గీకరణకు ప్రత్యేక కమిషన్ వేయాలని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మన భూమి, మన సంపద మనకు దక్కాలంటే పోరాటం తప్పదని పేర్కొన్నారు. తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య మాట్లాడుతూ గత 50 ఏళ్లుగా ఎస్టీ రిజర్వేషన్లలో ఎక్కువగా లంబాడీలే లబ్ధి పొందారని అన్నారు. రిజర్వేషన్ ఫలాలు ఆదిమ తెగలకు దక్కడం లేదని విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్, జేఏసీ చైర్మన్ పాయం సత్యనారాయణ, సలహాదారులు పొడుగు శ్రీనాథ్, వివిధ సంఘాల నాయకులు రత్నం, వెంకటేశ్వర్లు, కొమురం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలెప్పుడు జరిగినా బీజేపీదే గెలుపు

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



మెగా రక్తదాన శిబిరంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

గోల్కొండ: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆదరణ కోల్పోయిందని, అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం గుడిమల్కాపూర్ రాజలింగయ్య కబడ్డీ స్టేడియంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈటల మాట్లాడుతూ బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన వస్తోందన్నారు. బీజేపీలో కుటుంబ పాలన లేదని, ప్రధాని మోదీ ఆధ్వర్యంలో దేశంలో అవినీతి అంతమైందని పేర్కొన్నారు. సమర్థవంతమైన పాలనతో మోదీ మనదేశాన్ని అగ్రరాజ్యాల సరసన నిలిపారన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నాయకులు జి.కిరణ్, గుజ్జల ప్రేమేందర్‌రెడ్డి, గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పాండుయాదవ్, నాయకులు అన్నూ యాదవ్, మురళీగౌడ్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యూరాలజీ వైద్యవిధానాలపై సదస్సు

సాక్షి, సిటీబ్యూరో: కిడ్నీ సంబంధిత వ్యాధులు, అత్యాధునిక చికిత్సలు, వైద్యవిధానాలపై హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్స్‌లో అంతర్జాతీయ సదస్సు జరిగింది. 'ల్యాప్ యూరో–24'పేరుతో లైవ్ వర్క్‌షాప్ జరిగింది. యూరాలజీ విభాగంలో అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక సాంకేతిక పురోగతిని ప్రముఖ యూరాలజిస్టులు వివరించారు. లాప్రోస్కోపిక్ సింపుల్ నెఫ్రెక్టమీ, రెట్రో–పెరిటోనియోస్కోపిక్ నెఫ్రెక్టమీ, అడ్రినలెక్టమీ, రోబోటిక్ ప్రోస్టేటెక్టమీ వంటి వైద్య విధానాల గురించి పలువురు వివరించారు. పీడియాట్రిక్ యూరాలజీ, యూరో–ఆంకాలజీ, రీకన్‌స్ట్రక్టివ్ యూరాలజీ, రెనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌లో ఆవిష్కరణల గురించి చర్చించినట్లు యశోద హాస్పిటల్స్ సీనియర్ యూరాలజిస్ట్ డాక్టర్ గుత్తా శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అనంత్ కుమార్, డాక్టర్ అరవింద్ గన్‌పూలే, డాక్టర్ జమాల్ రిజ్వీ, డాక్టర్ శ్రీహర్ష తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణరంగ వృద్ధి జీసీఎఫ్ లక్ష్యం

- గ్లోబల్ కన్‌స్ట్రక్షన్ ఫ్రటర్నిటీ ఆవిర్భావ కార్యక్రమంలో వక్తలు
- దేశవ్యాప్తంగా 30 వేల మంది సభ్యులు



జీసీఎఫ్ వేదిక ప్రారంభ కార్యక్రమంలో నిర్మాణ సంస్థల ప్రతినిధులు

రాయదుర్గం: నిర్మాణ రంగంలో సహకారం, వ్యాపారాన్ని వృద్ధి చేయడమే తమ లక్ష్యమని, అందుకే 'ది గ్లోబల్ కన్‌స్ట్రక్షన్ ఫ్రటర్నిటీ (జీసీఎఫ్) పేరిట కొత్త వేదికను ఏర్పాటు చేశామని వక్తలు అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న నిర్మాణ రంగ సంస్థలను ఒక వేదిక మీదికి తీసుకొచ్చి ఈ వేదికను ఏర్పాటు చేశారు. శనివారంరాత్రి హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని సలార్‌పూరియా సత్వ భవనంలో నిర్మాణ రంగంలోని ప్రముఖుల సమక్షంలో ఈ జీసీఎఫ్ సంస్థను, సంస్థ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీసీఎఫ్ వ్యవస్థాపకుడు వంశీ మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఆరంభమైన ప్రాంతీయ చాప్టర్లను త్వరలో ముంబై, పుణే, మైసూర్, బెంగళూరులలో కూడా విస్తరించనున్నట్లు చెప్పారు. దేశమంతటా 250 వ్యాపారవర్గాలకు విస్తరించి 30 వేల మంది సభ్యులతో కూడిన శక్తివంతమైన సంఘంగా మారిందన్నారు. క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ వి.రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ బిల్డర్ల ప్రయోజనాలు, ప్రజాసమస్యల సమతుల్యతతోపాటు హైడ్రా వంటి ప్రభుత్వ కార్యక్రమాలను ప్రభావితం చేయడంలో సహకారం కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నారెడ్కో తెలంగాణ అధ్యక్షుడు విజయసాయి, రాధే కన్‌స్ట్రక్షన్స్ మేనేజింగ్ డైరెక్టర్ రాధే దగ్గుమళ్ల, ఈఐపీఎల్ కన్‌స్ట్రక్షన్స్ భాగస్వామి చైతన్య చల్లా, పలు నిర్మాణ సంస్థల ప్రతినిధులు, జీసీఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

'రాజ్యాంగం, న్యాయస్థానాల'పై సమాలోచన



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సంపాదకులు కె.రాంచంద్రమూర్తి

చందానగర్: సీఆర్ ఫౌండేషన్‌లో రాఘవాచారి ట్రస్ట్, నీలం రాజశేఖర్‌రెడ్డి పరిశోధన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 'రాజ్యాంగం, న్యాయస్థానాలు, చట్టసభలు' మూడవ సంపుటిపైన సమాలోచన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా సీనియర్ సంపాదకులు కె.రాంచంద్రమూర్తి, మాజీ ఎంఎల్ మానం ఆంజనేయులు, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్, రాఘవాచారి ట్రస్ట్ సభ్యుడు చందర్ మాట్లాడారు. కమ్యూనిస్టు, జర్నలిస్టు, సామాజిక, ఆధ్యాత్మిక అంశాలపైన రాఘవాచారి స్పష్టంగా తన అభిప్రాయాలు వ్యక్తం చేసేవారని రామచంద్రమూర్తి గుర్తు చేశారు. ఇంగ్లిష్ భాషపై ఎంతో ప్రావీణ్యం ఉన్నప్పటికీ ఆయన విశాలాంధ్ర పత్రికకే పరిమితం అయ్యారని కొనియాడారు. అనంతరం ఆర్.వి.రామారావు మాట్లాడుతూ వామపక్ష ఉద్యమం తన లక్ష్యాన్ని కొంత వెనక్కి తగ్గించుకుని, రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణను ప్రధాన బాధ్యతగా తీసుకోవాల్సిన దుస్థితిలో ఉన్నామన్నారు. రాజ్యాంగంలోని అనేక అంశాలను అందరికీ అర్థమయ్యేలా సులభమైన భాషలో రాఘవాచారి తన వ్యాసాల ద్వారా తెలియజేశారని పేర్కొన్నారు. బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ రాఘవాచారి న్యాయశాస్త్రాన్ని సంపూర్ణంగా సమగ్రంగా అధ్యయనం చేసి, అర్థం చేసుకున్న మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో రాఘవాచారి ట్రస్ట్ సభ్యులు డాక్టర్ అనుపమ, మేనేజింగ్ ట్రస్టీ జోత్స్న, సీఆర్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రయ్ ఆకృతి

సైనథాన్ -2024

ఘనంగా అంతర్జాతీయ సంకేత భాషల దినోత్సవం





రాయదుర్గం: గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఆదివారం అంతర్జాతీయ సంకేత భాషల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆశ్రయ్ ఆకృతి ఆధ్వర్యంలో 'సైనథాన్–2024'కార్యక్రమం అందరినీ అలరించింది. సెప్టెంబర్ 23న అంతర్జాతీయ సంకేత భాషల దినోత్సవాన్ని పురస్కరించుకొని వినికిడి లోపం ఉన్న వ్యక్తుల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని క్వాల్‌కామ్ సంస్థ టెక్నాలజీ, పేటెంట్ కౌన్సెల్ సీనియర్ డైరెక్టర్ నితిన్‌శర్మ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రెండు కిలోమీటర్ల సైన్ మార్చ్, భారతీయ సంకేత భాషపై ఇంటరాక్టివ్ సెషన్లు, విద్యార్థుల ప్రదర్శన, భారతీయ సాంకేతిక భాష జాతీయగీతాలాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రయ్ ఆకృతి వ్యవస్థాపక డైరెక్టర్ డీపీకే బాబు మాట్లాడుతూ 'సైనథాన్–2024'పేరిట 'వాక్ ఫర్ ఇన్‌క్లూజివిటీ'అనే ఇతివృత్తంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. కమ్యూనికేషన్ అంతరాలను తగ్గించడం, వినికిడి లోపం ఉన్న వారి హక్కుల పరిరక్షణలో సంకేత భాషల ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచడమే లక్ష్యంగా ఆశ్రయ్ ఆకృతి కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో హరీష్ కుమార్, జేఎస్ఆర్ ప్రసాద్, అర్చన సురేష్, మణి శ్యాం సుందర్, సునీత తంగెళ్ళ, డెఫ్ అండ్ డమ్ పాఠశాలల విద్యార్థులు 1500 మంది పాల్గొన్నారు.






► గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఆశ్రయ్ ఆకృతి సంస్థ ఆధ్వర్యంలో సైనథాన్-2024 కార్యక్రమం దృశ్యాలు

మనుషుల్లోనే దైవాన్ని చూడాలి

- ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు

రాయదుర్గం: దేవుడు, మానవాతీత శక్తుల కంటే తమ చుట్టూ మసిలే మనుషుల్లోనే దైవాన్ని చూడాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు విభాగం పూర్వ అధ్యక్షుడు, ప్రకాశిక త్రైమాసిక పత్రిక సీనియర్ ఎడిటర్ ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు అన్నారు. గురజాడ జయంతిని పురస్కరించుకొని గురజాడ ఫౌండేషన్ అమెరికా/భారత్ సంయుక్తంగా ప్రత్యేక సమావేశాన్ని ఆన్‌లైన్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ నుంచి ఆయన ఆన్‌లైన్‌లో మాట్లాడారు. దేశ సరిహద్దులను మాత్రమే కాకుండా దేశంలోని ప్రజలను కూడా ప్రేమించాలని గురజాడ దేశభక్తికి నూతన నిర్వచనమిచ్చారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురజాడ అప్పారావు 163వ జయంతిని పురస్కరించుకొని 'మానవతా దినోత్సవం'గా ప్రకాశిక త్రైమాసిక పత్రిక ప్రధాన సంపాదకుడు, గురజాడ అంతర్జాతీయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆచార్య కొవ్వలి గోపాలకృష్ణ ప్రకటించారు. అనంతరం శివాజీ తుంబలి రచించిన గీతాన్ని ఆవిష్కరించారు. ఆతర్వాత సినిమా దర్శకుడు చొక్కా తుషార్ దర్శకత్వంతో రూపొందిన 'మహాకవి గురజాడ'సినిమా ట్రైలర్‌ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పలువురు కవులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, సోమవారం, 23, సెప్టెంబర్, 2024



స్పోర్ట్స్ ఫ్యాషన్

జైపూర్ ఎమోషన్..

సాక్షి, సిటీబ్యూరో: యునైటెడ్ స్టేట్స్‌కు చెందిన పోలో అసోసియేషన్ అధికారిక బ్రాండ్ యుఎస్ పోలో.. జైపూర్‌కి చెందిన సవాయి పద్మనాభ్ సింగ్ (పాచో)తో భాగస్వామ్యాన్ని ఏర్పరచుకుని స్పోర్టీ లుక్ కోరుకునే వారి కోసం సరికొత్త కలెక్షన్ రూపొందించింది. ఈ విషయాన్ని బ్రాండ్ ప్రతినిధులు ఆదివారం తెలిపారు. జైపూర్ రాచరిక వారసత్వం, స్పోర్ట్స్ ఫ్యాషన్ జతచేసి రూపొందిన క్యాప్సూల్ లైన్‌గా ఈ స్పోర్ట్ ఔట్ ఫిట్ ఉంటుందన్నారు. జైపూర్ చరిత్ర, సాంస్కృతిక నేపథ్యం, జైపూర్ ఐకానిక్ పంచరంగ జెండా గాంభీర్యతతో పాటు జైపూర్ సిటీ ప్యాలెస్ అద్భుత నిర్మాణాలను సైతం ప్రేరణగా తీసుకుని ఈ కలెక్షన్ రూపొందించినట్టు వివరించారు. ఈ యుఎస్ పోలో అసోసియేషన్–పాచో కలెక్షన్ నగరంలోని ఎంపిక చేసిన స్టోర్లలో అందుబాటులో ఉన్నట్టు తెలిపారు.

'మానేపల్లి బృందా నవకర్' ఉత్సవం



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని సికింద్రాబాద్ క్లాసిక్ గార్డెన్స్ వేదికగా అక్టోబర్ 3 నుంచి 11 వరకూ తొమ్మిది రోజుల పాటు సంప్రదాయ పద్ధతిలో మానేపల్లి బృందా నవకర్ నవరాత్రి ఉత్సవ్–2024ను నిర్వహించనున్నారు. సలోని జైన్, కవితా జైన్ క్యూరేట్ చేయనున్న ఈ ఉత్సవ్‌కు సంబంధించిన నవకర్ ఎంటర్‌టైన్‌మెంట్ గ్రాండ్ పాస్ లాంచ్‌ను ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఐశ్వర్య షా, చింతన్ మెహతా అందించిన ఉచిత గార్బా–దాండియా వర్క్‌షాప్‌లో ప్రముఖ టీవీ నటి నేహా స్వరూప్, వినీతా సురానా, మానేపల్లి జ్యువెలర్స్ గోపీ, బ్రిందా బంగ్స్ కృష్ణ దియామోన్‌లు పాల్గొన్నారు. ఈ ఉత్సవ్‌లో ప్రముఖ బాలీవుడ్ సెలబ్రిటీ సౌరభ్ రాజ్ జైన్‌తో పాటు పలువురు తారలు పాల్గొంటారని కవితా జైన్ తెలిపారు. ఈ ఉత్సవ్‌లో ఏసీ అరేనా, 5 రోజుల పాటు కాంప్లిమెంటరీ డిన్నర్ ఉంటాయన్నారు. మహా హారతి అష్టమి రోజున పాల్గొనే వారందరికీ 25 లక్షల విలువైన ప్రత్యేక బహుమతులు అందజేస్తున్నామన్నారు. సామాజికవేత్త బీనా మెహతా, జిగ్నేష్ దోషి, గుజరాతీ సోషల్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ బ్రిజ్ భూతడా, అనుప్ చందక్, పుష్పక్ జైన్ పాల్గొన్నారు.





నగరంలో పెరుగుతున్న కొత్త కల్చర్

అనేక లాభాలు ఉన్నాయంటున్న నిపుణులు

గుండె సంబంధ సమస్యలు దూరం

ఒత్తిడి, మానసిక సమస్యలకు చెక్ పెట్టే అవకాశం

యువతతో పాటు అన్ని వయసుల వారూ ప్రాక్టీస్

జుంబా ప్రస్తుతం నగరాల్లో ట్రెండింగ్ అవుతున్న పదం.. డ్యాన్స్‌లో ఇదో కొత్త తరహా అనే చెప్పాలి. అయితే సరదా కోసం వేసే డ్యాన్స్ కాదు.. ఆరోగ్యం కోసం, వెయిట్ లాస్ కోసం చేసేదే జుంబా. ఇటు డ్యాన్స్.. అటు ఎక్సర్ సైజ్ రెండూ ఇందులో మిళితమై ఉంటాయి. అందుకే నగరంలో ఎక్కువ మంది ప్రస్తుతం జుంబాకు ఆకర్షితులవుతున్నారు. జుంబాతో శరీరానికి, గుండెకు మేలు చేసి, మానసిక ప్రశాంతత ఇవ్వడమే కాకుండా ఎన్నో వ్యాధులు దరిచేరకుండా చేస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. - సాక్షి, సిటీబ్యూరో



హైదరాబాద్ వైబ్స్

జుంబా హొయిరే..

జుంబా డ్యాన్స్‌పై యువత ఆసక్తి

ఉదయం లేవగానే ఇంటి పనులు.. ఉద్యోగం కోసం పరుగులు.. ఆఫీస్ వర్క్.. టార్గెట్స్.. టెన్షన్స్.. సాయంత్రం పొద్దుపోయాక రావడం.. అలసిపోయి ఏదో తినేసి పడుకోవడం.. మళ్లీ ఉదయంతో షరా మామూలే.. అన్నట్లు మారిపోయింది. కనీసం ఆరోగ్యం గురించి కాస్త సమయం కేటాయించడానికి కూడా కష్టం అవుతోంది. దీంతో చిన్న వయసులోనే అనారోగ్యంతో పాటు మానసిక సమస్యలతో సతమతం అవుతున్నారు. ముఖ్యంగా హృద్రోగ సమస్యలు వెంటాడుతున్నాయి. అందుకే ప్రతి రోజు కాకపోయినా వారంలో రెండు, మూడు రోజులైనా ఓ గంట పాటు వ్యాయామం చేయాలని నిపుణులు చెబుతున్నారు. అయితే జిమ్‌కు వెళ్లడం అందరికీ సాధ్యం కాకపోవచ్చు. వెళ్లినా జిమ్ చేయడం అందరి శరీరాలకు సెట్ కాకపోవచ్చు. అందుకే నగరంలో చాలా మంది జుంబా డ్యాన్స్‌ను ఎంచుకుంటున్నారు.

బరువు తగ్గేందుకు..

నగరంలో మారిన జీవన శైలి, ఆహారపు అలవాట్ల కారణంగా చాలా మందిలో ఊబకాయం, బరువు పెరగడం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. దీంతో మానసికంగానే కాకుండా సామాజికంగా కూడా ఎన్నో సమస్యలు ఎదుర్కొంటారు. అందుకే చాలా మంది బరువు తగ్గేందుకు జిమ్‌లను కాకుండా జుంబా డ్యాన్స్ క్లాసులకు వెళ్తున్నారు. జుంబా అంటే ఒక రకమైన కార్డియో వ్యాస్కులార్ ఎక్సర్‌సైజ్‌లలో ఒకటని చెప్పుకోవచ్చు. ఏరోబిక్ ఎక్సర్‌సైజ్ అని కూడా అనొచ్చు. రోజులో కనీసం గంట పాటు చెమటలు వచ్చే దాకా జుంబా డ్యాన్సులు చేయిస్తుంటారు. దీని ద్వారా శరీరంలో కేలరీలు కరిగి బరువు తగ్గుతుందని చెబుతున్నారు. ఈ జుంబా క్లాసుల్లో మ్యూజిక్ పెట్టి.. సాల్సా, కుంబియా, బచతా, మెరెంగ్యూ వంటి డ్యాన్స్ స్టెప్స్ వేయిస్తుంటారు. వీటితో పాటు సినిమా పాటలకు కూడా స్టెప్స్ వేయిస్తుంటారు. పైగా పది మందితో కలిసి డ్యాన్స్ చేస్తుంటారు కాబట్టి ఫన్ ఉంటుంది.

హార్ట్‌కు మాంచి ఎక్సర్‌సైజ్..

జుంబా డ్యాన్స్ ఏరోబిక్ ఎక్సర్‌సైజ్ కావడంతో గుండెకు ఎంతో మేలు జరుగుతుంది. రక్త పీడనం (బ్లడ్ ప్రెషర్) తగ్గించడంతో పాటు హృద్రోగ సమస్యలు దరి చేరకుండా చూస్తుంది. శరీర బరువు తగ్గడంతో పాటు శరీరాకృతిని మెరుగుపరుస్తుంది. అంటే చక్కటి శరీరాకృతి వచ్చేలా చేస్తుంది. జుంబా డ్యాన్స్‌లో చేసే స్టెప్స్ ద్వారా శరీరం ఫ్లెక్సిబుల్‌గా మారుతుంది. అంతేకాకుండా కాన్ఫిడెన్స్ పెరిగేందుకు దోహదం చేస్తుంది. ఒత్తిడిని తగ్గించడమే కాకుండా మనసు ప్రశాంతంగా ఉండేలా చేస్తుంది.

మరెన్నో లాభాలు..

జుంబా డ్యాన్స్ క్లాసులకు చాలా మంది వస్తుంటారు. వారితో తరచూ సంభాషిస్తుండటం.. కలిసి డ్యాన్సులు చేస్తుండటంతో స్నేహం పెరుగుతుంది. అలాగే మ్యూజిక్ వింటూ డ్యాన్స్ చేస్తుంటే మంచి మూడ్ పెంచే హార్మన్స్ విడుదల అవుతాయి. రోజంతా ఉల్లాసంగా ఉంటుంది. రోజులో చేయాల్సిన పనులను ఎంతో ఉత్సాహంగా చేస్తుంటాం. దీంతో ఉత్పాదకత కూడా పెరగుతుంది. ఆత్మ విశ్వాసం పెరుగుతుంది. మనపై మనకు నమ్మకం పెరుగుతుంది. డ్యాన్స్ వల్ల చెమటలు రావడంతో చర్మంపై ఉన్న రంధ్రాలు తెరుచుకుంటాయి. శరీరంలోని మలినాలు బయటకు వెళ్లి.. చర్మ సౌందర్యం కూడా పెరుగుతుంది.



వయసుతో సంబంధం లేకుండా..

వయసుతో సంబంధం లేకుండా జుంబా డ్యాన్స్ ఎవరైనా చేయొచ్చని శిక్షకులు చెబుతున్నారు. ఆడవాళ్లు మాత్రమే జుంబా డ్యాన్స్ క్లాసులకు వెళ్తారనే అపోహ చాలా మందిలో ఉంది. అయితే ఆడవారితో పాటు మగ వారు కూడా జుంబా డ్యాన్స్ చేయొచ్చని పేర్కొంటున్నారు. నిపుణుల పర్యవేక్షణలో సరైన పద్ధతిలో, సరైన రీతిలో జుంబా డ్యాన్స్ చేస్తే ఎన్నో లాభాలు ఉంటాయని వివరిస్తున్నారు.

ఎనిమిదేళ్లుగా శిక్షణ..



గత ఎనిమిది ఏళ్లుగా జుంబా డ్యాన్స్ నేర్పిస్తున్నాను. 10 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వయసు వరకూ ఎంతో మంది క్లాసులకు వస్తుంటారు. కొందరు బరువు తగ్గడానికి వస్తుంటారు. చాలా మంది ఫిట్‌నెస్ కోసం వస్తుంటారు. జుంబా క్లాసులను బాగా ఎంజాయ్ చేస్తుంటారు. రెగ్యులర్‌గా జుంబా చేస్తే ఆరోగ్య పరంగా, మానసికంగా ఎన్నో లాభాలున్నాయి.

– ప్రేమ్ శీతల్, జుంబా ట్రైనర్, డివైన్ స్టూడియో

ఆహ్లాదం.. ఆరోగ్యం..



బరువు తగ్గడమంటే చాలా మంది ఏదో బర్డెన్‌లా చూస్తుంటారు. కానీ జుంబాతో ఇటు ఎంటర్‌టైన్‌మెంట్ అటు బరువు తగ్గే వీలుంటుంది. దీని ద్వారా శరీరంలోని కొవ్వు తగ్గిస్తుంది. ఫ్లెక్సిబిలిటీ పెరిగి, శరీరాకృతి మెరుగు పడుతుంది. ఆహారంలో పెద్దగా మార్పులు ఏం అవసరం లేదు. కాకపోతే ఇంట్లో ఆహారం సమయానికి, కాస్త తక్కువగా తింటే లాభాలు కనిపిస్తాయి. రెగ్యులర్‌గా జుంబా డ్యాన్స్ చేస్తుంటే అనుకున్న ఫలితాలు చూడొచ్చు.

– బుద్ధరాజు పూజిత, జుంబా ట్రైనర్, వన్ ఆల్ ఎరేనా



'సికార'లో సినీతార..

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ సినీతార కీర్తి సురేష్ ఆదివారం నగరంలో సందడి చేశారు. బంజారాహిల్స్ వేదికగా నూతనంగా ఏర్పాటు చేసిన ఫెమీనా ఫ్లాంట్ సికార క్లినిక్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కీర్తి సురేష్ మాట్లాడుతూ.. నగరం వేదికగా ఇలాంటి లగ్జరీ ఫెమీనా ఫ్లాంట్ సెలూన్ ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఈ తరం చర్మ సౌందర్యం కోసం ఎంతో శ్రద్ధ తీసుకుంటుందని అన్నారు. ఈ వేదికగా అందిస్తున్న అధునాతన స్కిన్, హెయిర్ కేర్ సేవల గురించి నిపుణులను అడిగి తెలుసుకున్నారు. నగరంలో మొదటి సారిగా ఆవిష్కరించిన ఈ సెలూన్‌లో వినూత్నంగా అస్తోటిక్ స్టూడియోను ఏర్పాటు చేశామని సికార క్లినిక్స్ వ్యవస్థాపకులు రాఘవేంద్ర పేర్కొన్నారు.

- 32.18 శాతం మందికి జన్యులోపం
- 'ప్రిస్టిన్ కేర్' సంస్థ సర్వేలో వెల్లడి
- వెయిట్ ట్రైనింగ్, వ్యాయామంతో పరిష్కారం
- ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డా.కిషోర్‌రెడ్డి



ఫిట్ లెస్..బోన్స్..

ఆధునికుల్లోనూ అవగాహన లేమి

నగరంతో పాటు దేశవ్యాప్తంగా ప్రిస్టిన్ కేర్ సంస్థ ఇటీవలి నిర్వహించిన సర్వేలో ఎముకలు, కీళ్ల ఆరోగ్యానికి సంబంధించి ఆధునికుల్లోనూ అవగాహన లేదని తేలింది. కీళ్ల నొప్పులతో బాధపడుతున్నప్పటికీ 60 శాతం మంది వైద్య సలహా తీసుకోరని, వీరిలో సగం మందికి మాత్రమే బోన్‌హెల్త్ గురించి తెలుసని వెల్లడించింది. అలాగే 32.18 శాతం మందికి జన్యుపరంగా ఎముకలు, కీళ్ల వ్యాధులు ఉన్నాయని, 67 శాతం మందికి బోన్ డెన్సిటీ (ఎముక సాంద్రత) పరీక్షల గురించి తెలియదని తేల్చింది. ఈ విషయంపై నగరానికి చెందిన అమోర్ ఆస్పత్రి వైద్యులు ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జెన్ డా.కిషోర్‌రెడ్డి పలు విషయాలను వివరించారు.

- సాక్షి, సిటీబ్యూరో

స్వభావ సిద్ధంగానే భారతీయుల ఎముకల్లో సాంద్రత తక్కువ. సూర్యరశ్మి పుష్కలంగా ఉన్నప్పటికీ చర్మ స్వభావం కారణంగా విటమిన్ డి లోపం ఎక్కువే. దీంతో మనకు కీళ్ల, ఎముకల వ్యాధులు వచ్చే అవకాశాలు కూడా ఎక్కువ. ప్రస్తుత జీవనశైలి మార్పులు ఈ సమస్యని మరింత పెంచుతున్నాయి.

లోపం అదేనం'డి'..

ఎముకలకు బలాన్నిచ్చే క్యాల్షియం ఏటేటా రీసైకిల్ అవుతూ ఉంటుంది. ఎముకల్లో క్యాల్షియం తగ్గినప్పుడు దానిని రక్తం నుంచి భర్తీ చేసుకుంటుంది. అయితే తీసుకున్న క్యాల్షియం శరీరం గ్రహించాలంటే తగినంత విటమిన్ డి అందాలి. అయితే రకరకాల కారణాల వల్ల నగరవాసులకు నేరుగా శరీరంపై సూర్యకాంతి పడే అవకాశం లేక తీవ్రమైన డి విటమిన్ లోపం ఏర్పడుతోంది.

ఆహారం సరే గ్రహింపు ఎలా?



పాల ఉత్పత్తులు, ఆకు కూరలు, బాదం పప్పులు వంటివి క్యాల్షియం అందిస్తాయి. అయితే 1 గ్రాము క్యాల్షియం తీసుకుంటే కేవలం 10 శాతం మాత్రమే శరీరం గ్రహించగలదు. ఆహారోత్పత్తి, దానితో పాటు కలిపి తీసుకున్న ఇతరత్రా ఆహార పదార్థాలను బట్టి క్యాల్షియంను గ్రహించడం ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు పాల ద్వారా క్యాల్షియం వస్తుందనేది నిజమే కానీ, రోజూ నాలుగైదు సార్లు టీ, కాఫీల్లో పాలు కలిపి తాగితే అందులోని కెఫిన్ వల్ల శరీరం క్యాల్షియంను గ్రహించలేదు. అలాగే పాలు కాచిన తర్వాత గిన్నె అడుగున ఒక పొరలాగా పేరుకుంటుంది. దాన్ని మనం నిర్లక్ష్యం చేస్తాం అందులోనే క్యాల్షియం ఉంటుంది.

వ్యాయామం.. పరిష్కారం..

ఫిజికల్ యాక్టివిటీ లేనివారిలో బ్యాక్ పెయిన్స్, జాయింట్ పెయిన్స్, ఆస్టియోపొరోసిస్ కనపడుతున్నాయి. గతంలో 60 ఏళ్ల వరకూ కనపడని ఆస్టియో ఆర్థరైటిస్ ఇప్పుడు 40 ఏళ్ల వారిలో కూడా కనిపిస్తోంది. శరీరాన్ని చురుకుగా అటూ ఇటూ వంచే స్ట్రెచ్ వ్యాయామాల ద్వారా వీటిని నివారించవచ్చు. ఎముకల్లో సాంద్రత రావాలంటే రెడ్ మజిల్ పెరగాలి. దీనికి వెయిట్ ట్రైనింగ్ వ్యాయామం అవసరం. బరువులు ఎత్తడం, రెసిస్టెన్స్ బ్యాండ్‌లను ఉపయోగించడం వల్ల ఎముక సాంద్రత పెరుగుతుంది. స్క్వాట్‌లు, లంజెస్, డెడ్‌లిఫ్ట్ వంటి వ్యాయామాలపై దృష్టి పెట్టాలి.



లేట్ లేకుండా ట్రీట్‌మెంట్..

ఎముకలు, కీళ్ల వ్యాధులను ప్రారంభంలోనే గుర్తించి చికిత్స అందించాలి. సులభంగా ఎముకలు విరిగే పరిస్థితిని తెచ్చే ఆస్టియోపొరోసిస్‌కు టాబ్లెట్, ఇంజెక్షన్ రూపంలో చికిత్స ఉంటుంది. అలాగే సప్లిమెంట్స్ ద్వారా కూడా సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా కీళ్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ఆస్టియో ఆర్థరైటిస్‌కు పలు రకాల ఇంజెక్షన్ల ద్వారా చికిత్స చేయవచ్చు. వ్యాధి తీవ్రత బాగా పెరిగాక తప్పక పోతే సర్జరీ ఒక్కటే పరిష్కారం.



పరుగే.. పండుగై..



సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ డీ 2 సీ డెయిరీ బ్రాండ్ సిడ్స్ ఫామ్స్ గచ్చిబౌలి ప్రాక్టీస్ స్టేడియంలో తమ మొట్టమొదటి హైదరాబాద్ హెల్త్ రన్‌ను ఆదివారం ఉదయం నిర్వహించింది. ఈ రన్‌లో 10కె టైమ్డ్ రన్, 5కె టైమ్డ్ రన్, 2కె నాన్–టైమ్డ్ రన్‌ల పేరుతో నిర్వహించిన పోటీల్లో నగరవాసులు పాల్గొన్నారు. పోటీతత్వంతో పాటు వినోదభరితంగానూ సాగిన ఈ ఈవెంట్‌లో వయోబేధం లేకుండా చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ ఉత్సాహంగా పాల్గొని కేరింతలతో పరుగుల పండుగ వాతావరణాన్ని సృష్టించారు. సిడ్స్ ఫార్మ్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కిషోర్ ఇందుకూరితో పాటు, ఐఎఫ్ఎస్, టీఎస్ఐఐసీకి చెందిన డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, వియ్ హబ్ సీఈఓ సీతా పల్లచోళ్ల హాజరయ్యారు.

లడ్డూ ప్రసాదంపై

పిచ్చికూతలు, పరాచకాలు

కల్తీ నెయ్యి ట్యాంకర్లను జూలై 23నే వెనక్కి పంపించామన్న టీటీడీ ఈవో శ్యామలరావు

అయినా శ్రీవారి లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిన నెయ్యి వాడారన్న సీఎం చంద్రబాబు



సాక్షి, అమరావతి: పరమ పవిత్రమైన తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని దేశ, విదేశాల్లో భక్తులు అమృతంగా భావిస్తారు. అలాంటి శ్రీవారి లడ్డూ ప్రసాదంపై రాజకీయ ప్రయోజనాల కోసం సీఎం చంద్రబాబు పిచ్చికూతలు కూశారు. ఆవు నెయ్యితో కాకుండా జంతువుల కొవ్వుతో తిరుమల లడ్డూలను తయారు చేసి.. భక్తులకు పంపిణీ చేశారని, వాటిని భక్తులు తిన్నారంటూ దారుణమైన అబద్ధాలు చెప్పి కోట్లాది మంది భక్తుల విశ్వాసాలను, మనోభావాలను గాయపరిచారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ యధావిధిగా సీఎం చంద్రబాబుకు వంత పాడారు. నాలుగు కల్తీ నెయ్యి ట్యాంకర్లను వెనక్కి పంపేశామని.. శ్రీవారికి సమర్పించే నైవేద్యాలు, లడ్డూ ప్రసాదాల్లో కల్తీ నెయ్యిని వాడలేదని టీటీడీ (తిరుమల తిరుపతి దేవస్థానం) ఈవో జె.శ్యామలరావు జూలై 23నే స్పష్టంగా చెప్పారు. కల్తీ నెయ్యిని శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీలో వాడలేదన్నది స్పష్టమవడంతో భక్తులు, ఆధ్యాత్మికవేత్తలు, టీటీడీ అధికార వర్గాల నుంచి తన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తమవుతుండటంతో.. ఆ వ్యాఖ్యలను దేవుడే తనతో చెప్పించాడేమోనంటూ చంద్రబాబు సరికొత్త డ్రామాకు తెరతీశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మరో అడుగు ముందుకేసి ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. పరమ పవిత్రమైన శ్రీవారి లడ్డూ ప్రసాదంపై దారుణమైన వ్యాఖ్యలు చేసి.. అపవిత్రం చేసింది సీఎం చంద్రబాబు. ఆయన వల్లె వేసిన అబద్ధాలను సమర్థించడం ద్వారా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేశారని భక్తులు మండిపడుతున్నారు.

సిట్ పేరుతో సరి కొత్త డ్రామా

శ్రీవారి లడ్డూ ప్రసాదంపై సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి, సీబీఐలతో విచారణ జరిపించాలని టీటీడీ ఛైర్మన్లుగా పని చేసిన వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి సవాల్ విసిరారు. లేదంటే చేసిన తప్పునకు శ్రీవారి పాదాల చెంత క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో నిజానిజాలను నిగ్గు తేల్చి.. టీటీడీ ఔన్నత్యాన్ని, భక్తుల విశ్వాసాలను పరిరక్షించాలని కోరుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ లేఖ రాశారు. సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి, సీబీఐ విచారణ జరిగితే.. తాను చెప్పింది అబద్ధమని తేలుతుందని ఆందోళన చెందిన సీఎం చంద్రబాబు ఆదివారం రాత్రి హడావుడిగా సిట్ (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్)ను ఏర్పాటు చేసి, దర్యాప్తు చేస్తామంటూ సరికొత్త డ్రామాకు తెరతీశారు.

ఈవోకు భిన్నంగా సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు

కల్తీ నెయ్యి ట్యాంకర్లను వెనక్కి పంపేశామని టీటీడీ ఈవో శ్యామలరావు పలు సందర్భాల్లో చెప్పారు. శ్రీవారి లడ్డూల తయారీలో కల్తీ నెయ్యిని ఎన్నడూ వాడలేదని స్పష్టం చేశారు. కానీ.. ఈ నెల 18న కూటమి శాసనసభ పక్ష సమావేశంలో తాను కూసిన పిచ్చి కూతలను నిజమని చిత్రీకరించడానికి ఆదివారం సీఎం చంద్రబాబు మరోసారి జంతువుల కొవ్వు కలిసిన నెయ్యితో లడ్డూలు తయారు చేశారని పునరుద్ఘాటించారు. ఏఆర్ డైరీ ఫుడ్స్ సంస్థ కల్తీ నెయ్యి సరఫరా చేసిందని గుర్తించిన టీటీడీ మార్కెటింగ్ విభాగం.. బ్లాక్ లిస్ట్‌లో ఎందుకు పెట్టకూడదో చెప్పాలంటూ జూలై 28న షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఆ నోటీసుకు సమాధానంగా వెనక్కి పంపిన నెయ్యి ట్యాంకర్ల స్థానంలో టెండర్ నిబంధనల మేరకు కొత్తగా నెయ్యి ట్యాంకర్లు పంపుతామని ఏఆర్ ఫుడ్స్ టీటీడీకి వివరించింది. కానీ.. దానికి ఒప్పుకోని టీటీడీ ఆ సంస్థను టెండర్ నిబంధన మేరకు బ్లాక్ లిస్ట్‌లో పెడతామని స్పష్టం చేసింది. దీన్ని బట్టి చూస్తే కల్తీ నెయ్యిని శ్రీవారి లడ్డూ తయారీలో కాదు కదా కనీసం టీటీడీ గోదాములోకి కూడా అనుమతించలేదన్నది స్పష్టమవుతోంది.

జరగని తప్పుపై రాద్ధాంతం

▶ మొదటి పేజీ తరువాయి

లేదని చెప్పారు. వాస్తవం ఇలా ఉండగా కోట్లాది మంది హిందూ భక్తుల మదిలో అనుమానాలు సృష్టించిన చంద్రబాబును మందలించాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు చర్యలు ముఖ్యమంత్రి పదవికే కాకుండా ప్రజా జీవితంలో ఉన్న ప్రతి ఒక్కరి స్థాయిని దిగజార్చాయని, ప్రపంచ ప్రసిద్ధిగాంచిన టీటీడీని, ఆ సంస్థ అనుసరిస్తున్న పద్ధతుల ఔన్నత్యాన్ని దెబ్బ తీశాయని ఆవేదన వ్యక్తం చేశారు. భక్తుల విశ్వాసాలను, టీటీడీ ఔన్నత్యాన్ని దెబ్బతీసేలా అబద్ధాలను వ్యాప్తి చేసి, నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్న చంద్రబాబును గట్టిగా చీవాట్లు పెట్టాలని కోరారు. ఈ మేరకు ప్రధాని మోదీకి వైఎస్ జగన్ ఆదివారం లేఖ రాశారు. ఆ లేఖలో ప్రధానాంశాలు ఇలా ఉన్నాయి.

ప్రజల దృష్టి మళ్లించడానికే..

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పవిత్రతను, ప్రతిష్టను కోలుకోలేని విధంగా దెబ్బ తీసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రయత్నాలు చేస్తున్నారు. శ్రీ వెంకటేశ్వరస్వామికి భారతదేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు ఉన్నారు. ఈ వ్యవహారాన్ని జాగ్రత్తగా చూడకపోతే పరిస్థితులు దిగజారే ప్రమాదం ఉంది. చంద్రబాబు చెబుతున్న అబద్ధాలు అందరికీ వ్యాపించి, తీవ్ర వేదనను కలిగిస్తాయి. భవిష్యత్తులో కూడా అనేక పరిణామాలకు దారి తీస్తాయి. ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా, గొప్పలు చెప్పుకునేందుకు టీడీపీ ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. కానీ కొత్త ప్రభుత్వం పట్ల ప్రజాభిప్రాయం ప్రతికూలంగా ఉంది. ఎన్నికలకు ముందు చేసిన వాగ్దానాలను, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో, నిలబెట్టుకోవడంలో కొత్త ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఎన్నికల హామీల విషయంలో ప్రజలు ఎక్కడ నిలదీస్తారోనన్న భయంతో చంద్రబాబు కనీసం ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌ను కూడా ప్రవేశపెట్టలేకపోయారు. చంద్రబాబు పాలనా సమర్థతపై ప్రజలు నమ్మకాన్ని కోల్పోయారు. ఈ నేపథ్యంలో ప్రజల దృష్టిని మరల్చడానికే టీటీడీ అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా చంద్రబాబు పచ్చి అబద్ధాలను ప్రచారం చేశారు. కోట్లాది మంది భక్తుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో నెయ్యికి బదులు జంతువుల కొవ్వు వాడారని తప్పుడు ఆరోపణలు చేశారు. కేవలం రాజకీయ స్వార్థంతోనే చంద్రబాబు ఇలా దారుణంగా ప్రచారం చేశారు. దీని వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి.

కల్తీ నెయ్యిని లడ్డూ తయారీలో వాడనేలేదు

కల్తీ జరిగిందనే ఆరోపణలతో తిరస్కరించిన నెయ్యి ట్యాంకర్లు 2024 జూలై 12న తిరుమలకు వచ్చాయి. ఆ ట్యాంకర్లలోని నెయ్యిని లడ్డూ తయారీలో వాడలేదు. దశాబ్దాలుగా టీటీడీలో ఉన్న అత్యుత్తమ విధానాల వల్ల నెయ్యిలో సందేహాస్పద పదార్థాలు ఉంటే వెంటనే గుర్తిస్తారు. అలా ట్యాంకర్లు వెనక్కి పంపారని, ఆ నెయ్యిని లడ్డూ తయారీలో వాడలేదని తెలిసి కూడా చంద్రబాబు బాధ్యతా రాహిత్యంగా వ్యాఖ్యలు చేశారు. అది కోట్ల మంది తిరుమల భక్తుల్లో ఆవేదనకు దారి తీసింది.



టీటీడీ బోర్డు స్వతంత్ర సంస్థ

శ్రీవారి ఆలయం అవసరాలకు సంబంధించి ఎలాంటి కొనుగోళ్లు జరిపినా, వాటి విషయంలో టీటీడీ దశాబ్దాలుగా అత్యుత్తమ విధానాలు అనుసరిస్తోంది. శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ వ్యవహారాలన్నింటినీ కూడా టీటీడీ బోర్డ్ పర్యవేక్షిస్తుంది. ఇది స్వతంత్ర సంస్థ. తిరుమల ఆలయ వ్యవహారాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాత్ర పరిమితంగా ఉంటుంది. ధర్మకర్తల మండలిలో భక్తులు, వేర్వేరు రంగాల్లో ఆధ్యాత్మిక ప్రముఖులు సభ్యులుగా ఉంటారు. కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఇలాంటి వారిని టీటీడీ సభ్యులుగా సిఫార్సు చేస్తారు. ఇటీవలి టీటీడీ బోర్డులో బీజేపీకి సంబంధించిన సభ్యులు కూడా ఉన్నారు.

టీటీడీ ప్రతిష్టను ఇనుమడింపజేసింది మేమే

నిజానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ చేపట్టిన కొన్ని చర్యల పట్ల నేను గర్వపడుతున్నాను. ఆలయంలో వినియోగించే నెయ్యి సహా సరుకుల స్వచ్ఛత, నాణ్యతలపై పరీక్షలు జరపడానికి ప్రయోగశాలలను బలోపేతం చేశాం. ఈ విషయంలో ప్రఖ్యాత సీఎఫ్‌టీఆర్‌ఐ (సెంట్రల్ ఫుడ్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్) సేవలను టీటీడీ తీసుకుంది.

- నవనీత సేవను ప్రారంభించడమే కాకుండా, శుద్ధ నెయ్యి సరఫరా కోసం తిరుమలలో గోశాలను స్థాపించాం.
- టీటీడీ అర్చకుల జీతాలు రెట్టింపు చేశాం. టీటీడీ ఉద్యోగులకు ఇంటి స్థలాలు అందించాం.
- జమ్మూలో మాతా వైష్ణో దేవి పుణ్యక్షేత్రానికి సమీపంలో టీటీడీ ఆలయం నిర్మించాం. 2023లో దీన్ని ప్రారంభించామని గుర్తు చేస్తున్నాం. ముంబై, రాయ్‌పూర్, అహ్మదాబాద్‌లలో బాలాజీ కొత్త ఆలయాల నిర్మాణం ప్రారంభించాం.

స్వచ్ఛమైన ఆవు నెయ్యి, ముడి సరుకులు కొనుగోలు

- టీటీడీ అవసరాలకు అవసరమైన ఆవు నెయ్యి కొనుగోలు కోసం ఇ- టెండర్ ప్రక్రియను అనుసరిస్తోంది. ప్రతి ఆరు నెలలకు ఒకసారి టెండర్ ప్రక్రియను చేపడుతుంది. టెండర్ ప్రక్రియలో పేర్కొన్న నియమ నిబంధనలు, ప్రమాణాలకు అనుగుణంగా సరఫరా సంస్థను ఎంపిక చేస్తుంది. ఆమోదం కోసం టీటీడీ బోర్డు ముందు ఉంచుతారు. టీటీడీలో కొన్ని దశాబ్దాలుగా ఈ ప్రక్రియ కొనసాగుతోంది.
- 2014–2019 మధ్య టీడీపీ హయాంలో కూడా అదే పద్ధతి ఉంది. నెయ్యిని వినియోగించే ముందు దాని నాణ్యతను పరిశీలించడానికి తనిఖీ వ్యవస్థలు కూడా ఉన్నాయి. నెయ్యిని ఆలయానికి పంపే ముందు దాని స్వచ్ఛత, నాణ్యతలపై ఎన్‌ఏబీఎల్ (నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ ల్యాబరేటరీస్) ద్వారా గుర్తింపు పొందిన ఏజెన్సీల నుంచి తప్పనిసరిగా ధృవీకరణ ఉండాలి.
- అలాగే ఆలయంలోని వెళ్లే ముందు ప్రతి ట్యాంకర్ నుండి మూడు నమూనాలు తీసుకుని పరీక్షిస్తారు. ఈ మూడు శాంపిళ్లలో ఉత్తీర్ణత సాధించిన తర్వాత మాత్రమే నెయ్యిని ఉపయోగించడానికి అనుమతిస్తారు. ఏ పరీక్షలోనైనా సందేహాస్పద పదార్థాలు కనిపిస్తే ఆ ట్యాంకర్‌ను తిరస్కరిస్తారు. ఎట్టి పరిస్థితుల్లోనూ లోపలికి అనుమతించరు. ఇలాంటి అత్యుత్తమ విధానాలు పాటిస్తున్నందు వల్ల ప్రసాదాల తయారీలో నాణ్యత లేని పదార్థాలను ఉపయోగిస్తున్నారనే ప్రశ్నే తలెత్తదు.
- 2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో 14 నుంచి 15 సార్లు ట్యాంకర్లను ఇలాగే తిరస్కరించారు. 2019–24 మధ్య వైఎస్సార్‌సీపీ హయాంలో 18 సార్లు ట్యాంకర్లను తిరస్కరించారు. అటువంటి ధృఢమైన విధానాలు, పద్ధతులు అమలులో ఉన్నందున, కల్తీ నెయ్యితో ప్రసాదాలు తయారీకి ఆస్కారమే లేదు. ఈ విధానం గత కొన్ని దశాబ్దాలుగా టీటీడీలో అమలులో ఉంది. బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి పదవిలో ఉన్న చంద్రబాబు.. టీటీడీలో పాటిస్తున్న అత్యుత్తమ విధానాల గురించి, టీటీడీ ప్రతిష్ట గురించి ప్రజలకు చెప్పాల్సింది పోయి అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారు. సామాజిక బాధ్యత లేకుండా వ్యవహరించారు.
- గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో, ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ట్యాంకర్లను తిరస్కరించిన పద్ధతుల్లో భాగంగానే జూలై నెలలో కూడా నెయ్యి ట్యాంకర్లను తిరస్కరించారు. తిరస్కరించిన ట్యాంకర్లను ఆధారంగా చేసుకుని 100 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంలో టీడీపీ రాజకీయ సమావేశంలో చంద్రబాబు సున్నితమైన ఈ అంశంపై బాధ్యతారాహిత్యమైన వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు రాజకీయ ఉద్దేశాలు ఇట్టే అర్థం అవుతున్నాయి. కచ్చితంగా ఇది నేరం.

నిర్ధారించుకోకుండా ఆరోపణలా?

- ఎన్‌డీడీబీ కాల్ఫ్ లిమిటెడ్ నుంచి వచ్చిన నివేదికలో పేర్కొన్న ఎస్ - విలువలు నిర్దేశించిన విలువల పరిమితి కన్నా తక్కువ ఉండడంపై ల్యాబ్ కొన్ని సందేహాలను వ్యక్తం చేసింది. ఏయే పరిస్థితుల్లో ఈ పరీక్షలు తప్పు కావచ్చనే అంశాన్ని కూడా స్పష్టంగా పేర్కొంది. తాము ఇచ్చిన రిజల్ట్స్‌లో కొన్ని సందర్భాల్లో కచ్చితత్వం లోపించే అవకాశం ఉందని అందులో ఉంది.
- పోషకాహార లోపం ఉన్న ఆవుల నుంచి వచ్చే పాలతో తయారు చేసే నెయ్యి వల్ల, వెజిటబుల్ ఆయిల్స్‌ను ఆహారంగా తీసుకునే ఆవుల నుంచి వచ్చే పాలతో తయారు చేసిన నెయ్యి వల్ల, వేర్వేరు విధానాలతో తీసే నమూనాల వల్ల కచ్చితత్వం లోపిస్తుందని నివేదికలో ఉంది. పైన పేర్కొన్న పరిస్థితుల్లో ల్యాబ్ పరీక్షల్లో తప్పుడు ఫలితాలు వస్తాయని పేర్కొంది.
- ఉదాహరణకు పోషకాహార లోపం ఉన్న ఆవు నుండి వచ్చే పాల నుంచి నెయ్యి పొందినట్లయితే లేదా పామాయిల్ అధికంగా తినిపించిన ఆవు పాల నుంచి నెయ్యి పొందినట్లయితే, జంతువు కొవ్వు ఉనికిని సూచించే పరీక్షల్లో కచ్చితత్వంతో సరైన ఫలితాలు కొనుగొనేందుకు అవకాశాలు ఉండవు. పరీక్షల్లో కచ్చితత్వంపై నిర్ధారణ లేకుండా బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి దిగ్భ్రాంతి కలిగించే ఆరోపణలు చేయకూడదు.
- ప్రజా జీవితంలో తనకు అపారమైన అనుభవం ఉందంటూ పదే పదే గొప్పలు చెప్పుకునే చంద్రబాబునాయుడు లాంటి వ్యక్తి.. ప్రపంచ ప్రసిద్ధి చెందిన టీటీడీ లాంటి సంస్థ అంకిత భావాన్ని, పవిత్రతను, కోట్ల మంది ప్రజల మనోభావాలను దెబ్బ తీసేందుకు అవకాశం ఉండే ఇలాంటి అంశాలపై తప్పుగా మాట్లాడకూడదు. ఎన్‌డీడీబీ పరీక్షల నివేదికను ఈ లేఖకు జత చేస్తున్నాను. పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

టీడీపీ హయాంలోనూ కేఎంఎఫ్ సరఫరా చేయలేదు

- కొన్నేళ్లుగా తిరుమలలో కర్ణాటక కో ఆప్ మిల్క్ ప్రొడ్యూసర్స్ ఫెడరేషన్ లిమిటెడ్ (కేఎంఎఫ్) నెయ్యి సరఫరా చేసేదని, దాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిలిపేసిందని టీడీపీ నేతలు దుష్ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇది పూర్తిగా సత్యదూరం.
- 2014–19 మధ్య టీటీడీ నిర్వహించిన టెండర్లలో కేఎంఎఫ్ కొన్నిసార్లు మాత్రమే టెండర్లలో పాల్గొంది. వాస్తవానికి టీడీపీ అధికారంలో ఉన్న 2015 నుంచి 2018 అక్టోబర్ వరకు కేఎంఎఫ్ టీటీడీకి నెయ్యి సరఫరా చేయకపోవడం గమనార్హం.
- టెండర్ల ప్రక్రియలో పాల్గొని ఎల్–1 నిలిచి ఎంపికైన ప్రైవేటు సంస్థలే నెయ్యి సరఫరా చేశాయి. అలాగే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కూడా కొన్నిసార్లు కేఎంఎఫ్ ద్వారా నెయ్యి సరఫరా జరిగిన సందర్భాలు ఉన్నాయి. నందిని నెయ్యి విషయంలో టీడీపీ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారం.

రెండు నెలల తర్వాత టీడీపీ ఆఫీసులో పరీక్ష నివేదిక విడుదల

చంద్రబాబుది చిత్తశుద్ధి లేని, కపట వైఖరి అని చెప్పడానికి మరో అంశాన్ని ప్రస్తావిస్తున్నా. 2024 జూలై 12వ తేదీన తిరుమలకు చేరుకున్న నెయ్యి ట్యాంకర్‌లోని నమూనాలు సందేహాస్పదంగా ఉన్నాయని, మూడు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయాయని, వాటి నమూనాలను కూడా పంపినట్లు బహిరంగంగా వెల్లడించారు. ఆ తర్వాత ఆ నమూనాలను ఎన్‌డీడీబీ కాల్ఫ్ 2024 జూలై 17న పంపింది. వాటిని పరిశీలించి, పరీక్షలు చేసి విశ్లేషించిన ఫలితాలను 2024 జూలై 23న నివేదించారు. నెయ్యి కల్తీ జరిగిందన్న సందేహాలు వ్యక్తమైన ట్యాంకర్లు టీటీడీ ఆవరణలోకే అనుమతించ లేదన్న విషయాన్ని ఇక్కడ గమనించాలి. ఏది ఏమైనప్పటికీ చంద్రబాబు భక్తుల మనోభావాలను పూర్తిగా పట్టించుకోకుండా రాజకీయ ఉద్దేశాలతో అసత్యాలను ప్రచారం చేశారు. దుర్మార్గపు ఉద్దేశాలతో వ్యవహరించారు. 2024 సెప్టెంబరు 18న జరిగిన రాజకీయ పార్టీ సమావేశంలో ఈ అంశాన్ని వెలుగులోకి తెచ్చారు. ట్యాంకర్ తిరస్కరించిన రెండు నెలల తర్వాత టీడీపీ కార్యాలయం నుంచి ల్యాబ్ నివేదిక విడుదల చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానాల పవిత్రతను కించ పరిచేలా మొత్తం ఈ అంశాన్ని రాజకీయ లక్ష్యాల సాధన కోసం ఉపయోగించుకునేందుకు వేసిన పథకం ఇది. చంద్రబాబు బాధ్యతా రాహిత్య వైఖరిని ఇది స్పష్టం చేసింది. ల్యాబ్ రిపోర్టు వచ్చిన తర్వాత రెండు నెలలపాటు చంద్రబాబు మౌనంగా ఉన్నారు. నెయ్యిలో జంతువుల కొవ్వు కలపలేదని, ఒకవేళ అలా చేసి ఉంటే నిరంతరంగా జరిగే నాణ్యత, స్వచ్ఛత నిర్ధారణ తనిఖీల్లో అది తేలుతుందనే విషయం చంద్రబాబుకు తెలుసు కాబట్టే.. రెండు నెలలపాటు మౌనంగా ఉన్నారు. అందుకనే తదుపరి చంద్రబాబు చేసిన ఆరోపణలు బాధ్యతారాహిత్యం, పచ్చి అబద్ధం. కేవలం రాజకీయ లక్ష్యాల కోసం ఈ ఆరోపణలు చేశారు.

భక్తుల మనోభావాలకు తీవ్ర విఘాతం

- వాస్తవాలతో ప్రధానికి రాసిన లేఖను అందరూ చదవండి
- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

రాజకీయ ప్రయోజనాల కోసం హిందూ భక్తుల మనోభావాలను దెబ్బ తీస్తున్నారని, తీవ్ర విఘాతం కలిగిస్తున్నారని.. ఇలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. హిందూ భక్తుల మత పరమైన మనోభావాలను ఏ విధంగా దెబ్బ తీస్తున్నారనే విషయంపై వాస్తవాలను వివరిస్తూ ప్రధాని నరేంద్ర మోదీకి రాసిన లేఖలో పొందు పరిచానని, దయచేసి అందరూ ఆ లేఖను చదివి వాస్తవాలు తెలుసుకోవాలని కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఆ పోస్ట్‌ను దేశంలోని ప్రముఖ హిందూ దేవాలయాలు, ధార్మిక సంస్థలు, ఆధ్యాత్మిక వేత్తలకు ట్యాగ్ చేశారు. వైఎస్ జగన్ ట్యాగ్ చేసిన వాటిలో.. తిరుమల తిరుపతి దేవస్థానం, ఆర్ఎస్ఎస్, పూరి జగన్నాథాలయం, కాశీ విశ్వనాథాత్రి, షిర్డీ సాయిబాబు, సద్గురు జగ్గీ వాసుదేవ్, గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్, స్వామి ముకుందానంద, గురు గోపాల్ దాస్, బ్రహ్మకుమారి బీకే శివాని, యోగి స్వామి రామ్‌దేవ్, ఆచార్య బాలకృష్ణ, జయ కిషోరి, స్వామి అవధేషానంద్, చిదంబరం నటరాజ్ టెంపుల్, శృంగేరి మఠం, గోవర్ధన మఠం, రాజస్థాన్ జై శ్రీ నీలకంఠ మహదేవ్, కాశీ విశ్వనాథ్ టెంపుల్, ఓంకారేశ్వర్ జ్యోతిర్లింగ్, మహదేవ్ జ్యోతిర్లింగ్, శ్రీ ద్వారకాధీష్ టెంపుల్, శ్రీ నీలకంఠ మహదేవ్ టెంపుల్, పండరీపురం విఠల్ రుక్మిణీ టెంపుల్, తిరుచెందూర్ సుబ్రమణ్య టెంపుల్, కంచిమఠం, రామకృష్ణ మఠం, ఇస్కాన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్, బ్రహ్మకుమారీస్, చిన్మయ మిషన్ ఉన్నాయి. ఇంకా దేశంలోని వివిధ రాజకీయ పార్టీలు, మీడియా సంస్థలకు సైతం ట్యాగ్ చేశారు.

తిరుమల ఆలయ ప్రసాదాన్ని అప్రతిష్ట పాలు చేయొద్దు


ఆ స్టేట్మెంట్ చంద్రబాబు ఎందుకిచ్చారో అర్థం కావట్లేదు: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: తిరుపతి వెంకటేశ్వర స్వామి ఆలయ లడ్డూ వివాదంతో కోట్ల సంఖ్యలో భక్తులను ఆందోళనకు గురిచేసే విధంగా చంద్రబాబు స్టేట్మెంట్ ఇచ్చారని, ఆయన అలా ఎందుకు చేశారో అర్థం కావడం లేదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే తూర్పు జయప్రకాశ్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాజకీయాలు, కొట్లాటలు వేరే అంశాల మీద చూపాలని, దేవుడి విషయంలో కాదని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తిరుపతి వెంకన్న స్వామి అందరి దేవుడని, టీడీపీ–వైసీపీ రాజకీయ గొడవల్లో తిరుమల ఆలయ ప్రసాదాన్ని అప్రతిష్ట పాలు చేయొద్దని సూచించారు. లడ్డూ కల్తీ జరిగితే విచారణ చేయాలని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కోరుతున్నారని, అలాంటప్పుడు భక్తులు ఆందోళన చెందకుండా విచారణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ కూడా ఈ విషయంపై ఆందోళన వ్యక్తం చేశారని చెప్పారు. తక్షణమే విచారణ చేసి దోషులను శిక్షించాలని, హిందువుల మనోభావాలను కాపాడాలని జగ్గారెడ్డి కోరారు.

ఆ ట్యాంకర్లను వెనక్కి పంపలేదు

- లడ్డూలో కల్తీ నెయ్యి వాడేశారు
- ఆ దోషం పోయేందుకు నేడు శాంతి హోమం: చంద్రబాబు



సాక్షి, అమరావతి: తిరుమల లడ్డూలో నాలుగు ట్యాంకర్ల కల్తీ నెయ్యి వాడేశారని, కల్తీ ట్యాంకర్లను వెనక్కు పంపలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు మరోమారు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీనివల్ల టీటీడీతో పాటు లడ్డూ అపవిత్రం అయిపోయిందని, ఆ దోషం పోయేందుకు సోమవారం ఉ.6 గంటల నుంచి 10 వరకు శాంతిహోమం చేస్తారని ఆయన చెప్పారు. రాష్ట్రంలో అన్ని దేవాలయాలు కూడా ఆయా ఆలయాల ఆచారాల మేరకు హోమాలు చేయాలని ఆదేశించినట్లు చంద్రబాబు చెప్పారు. కల్తీ తనిఖీ చేసే ల్యాబ్ టీటీడీలో లేదన్నారు. తనపై ప్రధాని మోదీకి మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లేఖ రాయడంపై చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టీటీడీలో గత ఐదేళ్ల పాటు అపవిత్ర వ్యవహారాలు చేసి తిరిగి ఎదురుదాడి చేయడం ఏమిటంటూ ప్రశ్నించారు. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నాదెండ్ల మనోహర్ కలిసి ఆదివారం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. ఏ ధైర్యంతో తనపై అబద్ధాలతో ప్రధానికి లేఖ రాస్తావా అంటూ వైఎస్ జగన్‌పై విరుచుకుపడ్డారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..


ఐజీ నేతృత్వంలో సిట్ ఏర్పాటు..

గత ప్రభుత్వంలో టీటీడీలో జరిగిన వ్యవహారాలపై ఐజీ స్థాయి అధికారితో సిట్ ఏర్పాటుచేస్తున్నాం. ఈ నివేదిక రాగానే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. అన్ని దేవాలయాల్లోనూ వాటి పవిత్రతను పరిరక్షించేందుకు ఎస్‌ఓపీ తయారుచేయడానికి మరో కమిటీ ఏర్పాటుచేస్తాం. నాణ్యతలేని నెయ్యివల్ల లడ్డూలు మూడ్రోజుల్లోనే చెడిపోతున్నాయి. అసలు రూ.319కి పామాయిల్ కూడా రాదు.. అలాంటిది నాణ్యమైన ఆవునెయ్యి ఎలాగొస్తుంది? సుబ్బారెడ్డి భార్య బైబిల్ పట్టుకుని తిరుగుతుంది.. టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కుమార్తె పెళ్లి క్రిస్టియన్ సంప్రదాయంలో చేశారు.. ఇవన్నీ భక్తుల మనోభావాలను దెబ్బతీయడం కాదా? నాటి టీటీడీ ఈఓ ధర్మారెడ్డి కొడుకు చనిపోయినా 12వ రోజు కొండపైకి ఎలా వస్తారు? ఏదంటే అది చేసి ఎదురుదాడి చేస్తారా.. ఎంత ధైర్యం ఉంటే ప్రధానికి లేఖ రాస్తారు? నువ్వసలు మనిషి పుట్టక పుట్టావా జగన్? కరుడుగట్టిన నేరస్తుడు, ఉగ్రవాదే ఇలాంటి ఎదురుదాడి చేసి అసత్యాలతో ప్రధానికి లేఖ రాస్తారు. టీటీడీతో పాటు అన్ని దేవాలయాల పవిత్రతను కాపాడి భక్తుల మనోభావాలను పరిరక్షిస్తాం.

ఆ నెయ్యి ట్యాంకర్లను వెనక్కి పంపేశాం

- సీఎం చంద్రబాబుకు ఇచ్చిన నివేదికలో ఈఓ స్పష్టీకరణ
- దీనికి పొంతన లేకుండా ముఖ్యమంత్రి వ్యాఖ్యలు

సాక్షి, అమరావతి : తిరుమలకు సరఫరా అయిన ఆవు నెయ్యిలో



కల్తీ గుర్తించిన నాలుగు ట్యాంకర్లను అప్పుడే వెనక్కి పంపేయడంతోపాటు ఆ సంస్థ నుంచి తదుపరి సరఫరాను నిలిపివేయడమే కాక, షోకాజ్ నోటీసు కూడా జారీ చేసినట్లు టీటీడీ ఈఓ శ్యామలరావు ఆదివారం సీఎం చంద్రబాబుకు ఇచ్చిన నివేదికలో స్పష్టంచేశారు. జూలై 6న రెండు ట్యాంకర్లు, జూలై 15న మరో రెండు ట్యాంకర్లలోని నెయ్యి ఫిజికల్ వెరిఫికేషన్‌లో నాణ్యతలేదని గుర్తించడంతో వాటి నుంచి శాంపిల్స్ సేకరించి పరీక్షల నిమిత్తం గుజరాత్‌లోని ఎన్‌డీడీబీ ల్యాబ్‌కు పంపినట్లు ఆయన ఆ నివేదికలో వివరించారు. వాటికి సంబంధించి జూలై 16, 23 తేదీల్లోనే టెస్ట్ రిపోర్టులు ఆ ల్యాబ్ పంపిందని పేర్కొన్నారు. మరోవైపు.. నెయ్యి నాణ్యతను మెరుగుపరిచేందుకు నిపుణుల కమిటీ సూచనలపై ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు కూడా ఈఓ ఆ నివేదికలో తెలిపారు. మొత్తం 20 అంశాలతో కూడిన నాలుగు పేజీల నివేదిక.. మరో 36 పేజీల అనుబంధ పత్రాలను జతచేసి సీఎంకు ఈఓ అందజేశారు.

ఈఓ అలా.. సీఎం ఇలా..

ఇదిలా ఉంటే.. ఈఓ తన నివేదికలో పేర్కొన్న అంశాలకు విరుద్ధంగా సీఎం చంద్రబాబు ఆదివారం మీడియా సమావేశంలో వ్యాఖ్యలు చేశారు. కల్తీనెయ్యి ట్యాంకర్లను వెనక్కి పంపామని ఈఓ తన నివేదిక స్పష్టంగా చెబుతుంటే.. ఆ నెయ్యి లడ్డూ ప్రసాదంలో వాడేసినట్లు చంద్రబాబు పూర్తి వ్యతిరేకంగా చెప్పడం గమనార్హం.

లడ్డూ పేరుతో రాజకీయాలు సరికాదు

కల్తీ జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్య తీసుకోవాలి: రాఘవులు



సాక్షి, అమరావతి: తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడినట్లు తేలితే దోషులను పట్టుకుని శిక్షించాలిగానీ, దాన్ని కూడా రాజకీయం చేయడం సరికాదని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అభిప్రాయపడ్డారు. లడ్డూలో వాడే శనగపిండి, పంచదార ఏ కల్తీ అయినా మనకు పుణ్యం తీసుకురావని, పాపమే తెస్తాయన్నారు. ఈ అంశాన్ని కులమతాలకు అంటగట్టకుండా లౌకికతత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత రాజకీయ నేతలపై ఉందని హితవు పలికారు. సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభ విజయవాడలోని ఎంబీభవన్‌లో ఆదివారం జరిగింది. ఈ సభలో రాఘవులు మాట్లాడుతూ.. సనాతన ధర్మం బోర్డు పెట్టాలని ఒక పెద్ద మనిషి అంటున్నాడని, అసలు సనాతన ధర్మం అంటే ఏంటో అయన్ని చెప్పమనండి అని డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను పరోక్షంగా ఉద్దేశిస్తూ రాఘవులు ప్రశ్నించారు. సనాతన ధర్మం గురించి సీతారాం ఏచూరి పెద్ద పుస్తకమే రాశారని, సనాతన ధర్మంలో కీలకం కుల వ్యవస్థ అని, కులంపై అభిమానం ఉన్నవాళ్లు సనాతన ధర్మం గురించి ఎలా మాట్లాడతారన్నారు.

బాబువి నీచరాజకీయాలు: లక్ష్మీపార్వతి



బంజారాహిల్స్ : తిరుపతి లడ్డూ వ్యవహారంలో భారతీయ జనతా పార్టీ సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని.. అప్పుడే నిజాలు నిగ్గుతేలి చంద్రబాబు నైజం బయటపడుతుందని ఏపీ తెలుగు అకాడమీ మాజీ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందమూరి లక్ష్మీపార్వతి డిమాండ్ చేశారు. హైదరాబాద్ ఫిలింనగర్‌లోని తన నివాసంలో ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ తిరుపతి వెంకన్నను అడ్డుపెట్టుకుని చంద్రబాబు నీచ రాజకీయాలకు దిగజారాడని, ఆయనకు ఆ దేవుడే శాస్తి చేస్తాడని హెచ్చరించారు. తన హెరిటేజ్ కోసం తిరుపతి లడ్డూ వ్యవహారాన్ని తెర మీదకు తీసుకొచ్చి దుర్మార్గపు ఆలోచన చేస్తున్నారని మండిపడ్డారు. ఏమాత్రం విలువల్లేని వ్యక్తి చంద్రబాబు అని.. అలాగే, తండ్రికి మించిన దుర్మార్గుడు కొడుకు లోకేశ్ అని, ఇద్దరూ కలిసి రాష్ట్ర ప్రతిష్ఠను భ్రష్టు పట్టిస్తున్నారని ఆరోపించారు. జగన్‌పై నిందలు వేయడమే లక్ష్యంగా ఈ ఇద్దరూ తిరుపతి లడ్డూ ముసుగులో నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని లక్ష్మీపార్వతి ఫైర్ అయ్యారు. చంద్రబాబు వస్తేనే రాష్ట్రానికి వినాశనం దాపురిస్తుందని ప్రజలు బాధపడుతున్నారన్నారు. పాపానికి పరాకాష్టగా నిలిచిన చంద్రబాబును ఆ దేవుడు క్షమించడని అన్నారు.

మంచిమాట



ఉత్తముల లక్షణం

తమ ప్రతిభని ఎవరు ఎంతవరకు గ్రహించగలరో అంత వరకే ప్రదర్శిస్తారు ఉత్తములు. అంతే కాని తమకి ఉన్న పాండిత్యాన్ని అంతా ఎవరి వద్ద పడితే వారి వద్ద ప్రదర్శించరు.

ఒకటవ తరగతి చదివే పిల్లలకి వ్యాకరణం బోధిస్తే కంగారు పడి మళ్ళీ దాని జోలికి వెళ్ళటానికి ఇష్టపడరు. వారికి అక్షరాలు చాలు. అంత మాత్రానికే తమకి ఎంతో తెలుసు అనుకుంటారు. తనకి ఎంత తెలుసు అని కాదు, ఎదుటివారికి ఏమి కావాలి? ఎంత వరకు అర్థం చేసుకోగలరు? అన్నది ప్రధానం. ఈ మాట తుంబురుడి గాన విద్యా ప్రావీణ్యం చూసిన నారదుడు అనుకున్నది. ఒక పాఠశాల వార్షికోత్సవంలో విద్యార్థుల కోసం పాడ మంటే రాగం, తానం, పల్లవి అల పిస్తే వారు జన్మలో శాస్త్రీయ సంగీతం జోలికి వెళ్లరు. అయినా ప్రతివారి వద్ద తమ ప్రతిభని ప్రదర్శించ వలసిన అవసరం లేదు. చెవిటి వాడి ముందు శంఖం ఊదితే కొరుకుడు పడటం లేదా? సహాయం చేయనా? అని అడుగుతాడు. అంతేకాదు ఎవరి వద్ద క్లుప్తంగా చెప్పాలి, ఎవరి వద్ద వివరంగా చెప్పాలి అన్నది కూడా తెలియ వలసిన అవసరం ఉంది. మాట నేర్పరితనంలో ఇది ప్రధానమైన అంశం. దీనికి హనుమ గొప్ప ఉదాహరణం. సీతాదేవిని చూచి వచ్చిన హనుమ తన కోసం ఎదురు చూస్తున్న అంగదాదులతో ముందుగా 'చూడబడినది నా చేత సీత' అని క్లుప్తంగా చెప్పి. సావకాశంగా కూర్చొన్న తరువాత వారి కోరిక పైన తాను బయలుదేరిన దగ్గరనుండి ఆ క్షణం వరకు జరిగినదంతా పూసగుచ్చినట్టు చెప్పాడు. అందులో తన ప్రతాపం చాలా ఉంది. అది అంతా సత్యమే! అది విని ముఖ్యంగా యువరాజు, ఈ బృందనాయకుడు అయిన అంగదుడు, తన శక్తిని గుర్తించి, గుర్తు చేసి, వెన్నుతట్టి ప్రోత్సహించిన జాంబవంతుడు, కపులు సంతోషిస్తారు. పైగా కపివీరులు అవన్నీ తామే చేసినట్టు పొంగిపోయారు. అదే విషయం సుగ్రీవ శ్రీరామచంద్రులతో క్లుప్తంగా చెప్పాడు. వారు తన యజమానులు. వారి వద్ద ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. వారి సమయం విలువైనది. పైగా రాజుల వద్ద దాసులు తమ ఘనత చెప్పుకోకూడదు. అది రాచమర్యాద కాదు. అందుకే తన ప్రతాపం ఎక్కడా మాటల్లో వ్యక్తం కాకుండా జాగ్రత్త పడ్డాడు. ఒక్క మాటలో సముద్రం లంఘించి వెళ్ళాను అని తేల్చి వేశాడు. అది మర్యాద మాత్రమే కాదు, వినయశీలత. విరాటరాజు కొలువులో ప్రవేశించటానికి వెడుతున్న పాండవులకు వారి పురోహితుడు ఇచ్చిన సూచనలు అందరికీ ఉపయోగ పడేవే. రాజుకన్న విలువైన వస్త్రాలు ఆభరణాలు ధరించ కూడదు, రాజుగారి భవనాని కన్న పెద్ద, ఎత్తైన భవనంలో ఉండ కూడదు అన్నవి ఇక్కడ పేర్కొన దగినవి. తమ ఘనత సందర్భానుసారం ప్రకటించాలి. ఎదగటం లేదా ఒదగటం పరిస్థితులను అనుసరించి ఉండాలి.

పిడుగుకి బియ్యానికీ ఒకటే మంత్రం అన్నట్టు ఉండరు తెలివైన వారు. దీనికి చక్కని ఉదాహరణ చెపుతాడు పింగళి సూరన. "ఉత్తముల మహిమ నీరు కొలది తామర సుమ్మీ" అని. చెరువులో నీటి మట్టం పెరిగితే తామర కాడ చుట్లు విచ్చుకొని, పువ్వు గాని, మొగ్గ గాని ఆకు గానీ ఉపరితలం మీద తేలుతాయి. నీరు తగ్గితే కాడ చుట్టలు చుట్టుకొని పువ్వు మాత్రమే నీటి ఉపరితలం మీద ఉంటుంది. నీరు ఎండి పోతే దుంపలో తన జీవశక్తిని నిక్షిప్తం చేసి ముడుచుకొని పోయి ఉంటుంది. నీరు నిండితే చిగురిస్తుంది. ఉత్తముల గొప్పతనం కూడా అంతే!

– డా. ఎన్. అనంతలక్ష్మి

ఆధ్యాత్మికకత

నిలువెత్తు నిదర్శనం

పూనా పట్టణం నుంచి ఓ పత్రికా విలేఖరి స్వామిని చూడాలని తిరుమల కొండకు బయలుదేరాడు. స్వామి వారి దర్శన సమయానికి వైకుంఠం వద్దకు చేరాడు. అక్కడి శ్రీవారి సేవకులు దర్శన టికెట్ చూసి 'క్యూ' లోకి పంపుతున్నారు. విలేఖరి ముందు ఓ ఆరు పదులు పైబడిన వృద్ధురాలు నిలబడి ఉంది. ఆమెకు తోడుగా పన్నెండేళ్ళ మనవడు కూడా వచ్చి ఉన్నాడు. ఆమె తన సంచిలోని టికెట్ చూపడానికి చాలా అవస్థలు పడుతూ ఉంది. పత్రికా విలేఖరి ఆమెకు సహాయం చేశాడు. ముగ్గురూ క్యూలోకి ప్రవేశించారు. ఆ రిటైర్డ్ టీచర్ కి మోకాలి నొప్పులు ఎక్కువగా ఉండటంతో కష్టంగా నడుస్తోంది. మాటల్లో ఆమె రిటైర్డ్ టీచర్ అని, వారిది తమిళనాడు ఈరోడ్ అని తెలిసింది.



''నడవటానికి ఇంత కష్ట పడుతున్నారు, డాక్టర్ దగ్గరికి వెళ్ళలేదా?'' అని అడిగాడు విలేఖరి. ''మోకాలి చిప్పలు బాగా అరిగిపోయాయి. రెండు కాళ్ళకూ ఆపరేషన్ అవసరమన్నారు డాక్టర్లు. ఇంటి వ్యవహారాల వల్ల కుదరక ఆపరేషన్ చేయించుకోలేదు'' అని చెప్పింది. కొద్దిదూరం నడిచాక, సెక్యూరిటీ వారు చెకింగ్ చేయసాగారు. అక్కడ ఆమె చక్కగా నిలబడలేక తూలి పడబోయింది. పక్కనే ఉన్న మనవడు ఆమెను కింద పడనీయకుండా పట్టుకున్నాడు.

అందర్నీ క్యూ కాంప్లెక్స్ లోని కంపార్ట్ మెంట్లో కూర్చోమన్నారు. మంచి గాలి, వెలుతురు వచ్చే ప్రదేశం చూసి కూర్చున్నాడు విలేఖరి. కుంటుకుంటూ వస్తున్న రిటైర్డ్ టీచర్ కి, ఆమె మనవడికి కూడా స్థలం పెట్టి పెట్టాడు. అభిమానంగా కూర్చోమని స్థలం చూపాడు. ఆమె కూర్చోలేదు. మనవడు మాత్రం కూర్చున్నాడు.

''కొద్దిసేపు కూర్చుంటే అలసట తగ్గుతుంది, మీ మోకాలి నొప్పులు కూడా తగ్గుతాయి'' అని చెప్పాడు. ''ఫర్లేదు!'' అని చెప్పి నిలబడే ఉంది. గంట గడిచింది. కంపార్ట్ మెంట్ గేటు తీయలేదు. మరో గంట గడిచింది. అప్పుడు తీశారు. జనం 'పోలో'మని పరుగులు తీశారు. ఆ రెండు గంటలూ మోకాలి నొప్పులకి ఆమె బాధ పడుతూనే నిలబడి ఉంది. చిన్నగా మోకాళ్ళను అప్పుడప్పుడూ అదుముకుంటూ నడుస్తోంది.

ఆమె తను చెప్పినట్లు కూర్చోక పోవడం విలేఖరికి నచ్చలేదు. 'రెండు గంటలు నిలబడుకోవాల్సిన అవసరం ఏముంది. కూర్చుని ఉండవచ్చు కదా!' అనుకున్నాడు. వాళ్ళకి దూరంగా జరిగి జనంతో పాటు వెళ్ళిపోవాలనుకున్నాడు. ఎందుకో మనస్కరించలేదు. వారితో పాటే నడవసాగాడు.

తిరుమల నంబి ఆలయం వద్ద ఉండే మూవింగ్ బ్రిడ్జి దగ్గరికి వచ్చింది క్యూ లైను. తట్టుకోలేని నొప్పితో బాధ పడుతోంది ఆ రిటైర్డ్ టీచర్. ధైర్యం చెబుతున్నాడు మనవడు. అక్కడ కొద్ది సేపు కూర్చునే అవకాశం ఉంది. అప్పుడు కూడా ఆమె కూర్చోలేదు. అలా ఇబ్బందిగా నడుస్తూనే మహా ద్వారం దాటి, ధ్వజ స్తంభానికి నమస్కరించి బంగారు వాకిలి గుండా లోపలికి ప్రవేశించి దర్శనం చేసుకున్నారు.

ఉచిత లడ్డూ ప్రసాదం తీసుకుని గుడి బయటికి వచ్చాక పుష్కరిణి వద్ద కూర్చుని అవ్వా మనవడు లడ్డు తింటూ ఉన్నారు. వారితో పాటు ఉన్న విలేఖరి ''వైకుంఠం నుంచి, దర్శనం పూర్తయ్యేంతవరకు మీరు ఎందుకుకూర్చోలేదు?'' అని అడిగాడు ఆమె గుడివైపు తిరిగి చేతులెత్తి నమస్కరిస్తూ ''పెరుమాళ్ళు వేంకటేశ్వర స్వామి కొన్ని వేల సంవత్సరాలుగా అలా గర్భగుడిలో మన కోసం నిలబడే ఉన్నాడు. స్వామి వారి దర్శనం కోసం వచ్చినప్పుడు మనం కూర్చోవడం భావ్యం కాదు కదా'' అని సమాధానమిచ్చింది. ఆమెకు స్వామి వారి పట్ల ఉన్న భక్తి, గౌరవం, నమ్మకానికి విలేఖరి కళ్ళు తడి అయ్యాయి. 'స్వామీ... ఎన్ని బాధలో మనిషికి. లిప్త కాలం నిన్ను చూస్తే... ఎంత ఉపశమనమో కదా' అనుకుంటూ అక్కడి నుంచి కదిలాడు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

గృహస్థాశ్రమ వైశిష్ట్యం

ఏది ధర్మం? ఏది అధర్మం?

పంచ మహాయజ్ఞాలలో మొదటిది అధ్యాపనం అంటే ఒకరికి చెప్పడం. మరొకరికి చెప్పాలంటే ముందు మనం చదవాలిగదా! దేనికోసం... కర్తవ్యమ్. అదేమిటో ముందు మనం తెలుసుకోవాలి. అంటే కర్తవ్యమే ధర్మం. ధర్మం ఎప్పుడూ ఒక్కలాగా ఉండదు. నిరంతరం మారిపోతుంటుంది. ఎప్పుడు ఏ ధర్మాన్ని ఎలా నిర్వర్తించాలో చెప్పవలసివస్తే... చెప్పేవారు.. ఎవరి మనోభావాలనుబట్టి వారు చెవుతుంటారు. నాకేది ఇష్టమో నేనదే ధర్మమని చెబుతా. ఇంకొకాయన ఆయనకు నచ్చినది ధర్మమని చెబుతాడు. అప్పుడు నిజానికి ఏది ధర్మం?

ధర్మం చెప్పడానికి ఒక ప్రమాణం ఉండాలి. అది ఏది అంటే ... యోగమే. యోగం ఎవరు ? భగవంతుడే. నాకూ నా ఊపిరికీ తేడా లేదు. నేను ఊపిరి తీసి విడిచిపెడుతున్నంతకాలం 'నేను' ఉన్నాను–అంటారు. నా ఊపిరే నా వాక్కుగా మారుతున్నది. అలాగే భగవంతుని ఊపిరి వాక్కుగా మారితే అదే వేదం. అందుకే భగవంతుడికీ, వేదానికీ వ్యత్యాసం ఉండదు. వేదం ఎంత సనాతనమో భగవంతుడంత సనాతనం. భగవంతుడిని ఎవరూ సృష్టించలేదు. ఆయనే అన్నీ సృష్టించాడు. వేదం కూడా అంతే.. అపౌరుషేయం. దానిని ఎవరూ రాయలేదు. అందుకే వేదం, ఈశ్వరుడూ ఒకే స్వభావంతో ఉంటారు. కారణం – నిజానికి అవి రెండు కాదు కాబట్టి. అటువంటి వేదం ధర్మం చెప్పడానికి మొదటి ప్రమాణం.

నేను వేదం చదువుకోలేదని ఎవరయినా అంటే!!! వేదాంతర్గతమైన ఆచార సంబంధ నియమాలను రుషులు క్రోడీకరించి ఇచ్చారు. గౌతముడిస్తే అది గౌతమ స్మృతి అయింది. అత్రి ఇస్తే అత్రి స్మృతి, యాజ్ఞవల్క్యుడిస్తే యాజ్ఞవల్క్య స్మృతి.. అలా ఈ స్మృతి గ్రంథాలు ప్రమాణం. ఆవువెంట దూడ ఎలా వెడుతుందో శ్రుతి వెంట స్మృతి అలా వెడుతుంది..అంటాడు కాళిదాసు. కాబట్టి శ్రుతి తరువాత స్మృతి ప్రమాణం.

స్మృతిగ్రంథాలు కూడా తెలియవని అంటే...!!! పురాణం ప్రమాణం. పురాణం జరిగిపోయిన చరిత్ర కాదు. కల్పింపబడిన కథ కూడా కాదు. జాగ్రత్తగా పరిశీలించండి... కల్పనయితే అందులో రచయిత వేరు, కథావస్తువు వేరుగా ఉంటుంది. అందువల్ల ఇది కల్పన కాదు. పురాణాలను ఇతిహాసములు–అంటారు. ఇతిహాసం... అంటే ''ఇది ఇట్లే జరిగినది. అందులో అనుమానం లేదు''... అని.



రామాయణంలో వాల్మీకి మహర్షి అంతర్భాగం. ఆయన నది పాత్రకాదు. అందులో ఒక వ్యక్తి. అలాగే భారతంలో, భాగవతంలో వ్యాసుడు అంతర్భాగం. అంతేకానీ వ్యాసుడు వేరు, భారత భాగవతాదులు వేరు కావు. అది వాళ్ళ కాలంలో యథార్థంగా జరిగిన విషయాలను వాళ్ళు రచించి మనకిచ్చారు. అవి జీవుడి ప్రస్థానాన్ని పూర్తిగా చెబుతాయి. అందుకే పురాణాలు చదివితే ఒక స్పష్టత ఏర్పడుతుంది. అందువల్ల పురాణం ప్రమాణం.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

నాల్గవది. శిష్టాచారం. యద్య దాచరతి శ్రేష్ఠ స్తత్త దేవేతరోజనః / స యత్ప్రమాణం కురుతే లోక స్తదనువర్తతే'' అంటాడు గీతాచార్యుడు. శ్రేష్ఠులయిన వారు, శాస్త్రమెరిగినవారు... లోకంలో ఎలా ప్రవర్తిస్తారో దాన్ని మిగిలినవారంతా అలా అనుకరిస్తారు'' అని. ధర్మం చెప్పడానికి, అనుసరించడానికి ఈ నాలుగు మార్గాలు ప్రామాణికం.

సినిమా



మీకంటే నేనెక్కువగా బాధపడుతున్నాను - ఎన్టీఆర్

''దేవర' ప్రీ రిలీజ్ ఈవెంట్ జరగక పోవడం నిజంగా చాలా బాధాకరం. ముఖ్యంగా నాకు ఇంకా బాధగా ఉంటుందని మీ అందరికీ తెలుసు. 'దేవర' సినిమా గురించి చెప్పాలని, ఈ సినిమా కోసం మేం పడ్డ కష్టాన్ని వివరించాలని చాలా ఎగ్జైటెడ్‌గా ఉన్నాం. కానీ భద్రతా పరమైన కారణాల వల్ల ఈవెంట్‌ను క్యాన్సిల్ చేయడం జరిగింది. మళ్లీ చెబుతున్నాను. మీతో పాటు నేనూ బాధపడుతున్నాను. మీ కంటే నా బాధ చాలా పెద్దది... ఎక్కువ కూడా'' అని ఎన్టీఆర్ అన్నారు. ఎన్టీఆర్ హీరోగా నటించిన తాజా చిత్రం 'దేవర'. 'జనతాగ్యారేజ్' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత ఎన్టీఆర్ హీరోగా దర్శకుడు కొరటాల శివ తెరకెక్కించిన చిత్రం ఇది. ఇందులో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించారు. కల్యాణ్‌రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, కొసరాజు హరికృష్ణ నిర్మించిన ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. తొలి భాగం 'దేవర: పార్ట్ 1' ఈ నెల 27న తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో చిత్రయూనిట్ నిర్వహించాలనుకున్న 'దేవర' ప్రీ రిలీజ్ ఈవెంట్ భద్రతా కారణాల వల్ల రద్దు అయింది. ఈ నేపథ్యంలో అభిమానులు, ప్రేక్షకులను ఉద్దేశించి ఎన్టీఆర్ ఆదివారం రాత్రి ఓ వీడియో విడుదల చేశారు. ''మీరు నాపై కురిపించే ప్రేమకు ఆజన్మాంతం రుణపడి ఉంటాను. ఈవెంట్ క్యాన్సిల్ అయినందుకు 'దేవర' సినిమా నిర్మాతలను, ఈవెంట్ నిర్వాహకులను బ్లేమ్ చేయడం తప్పని నా భావన. కానీ ఈ రోజు మనం కలవకపోయినా సెప్టెంబరు 27న మనందరం కలవబోతున్నాం. 'దేవర' చిత్రాన్ని మీరందరూ చూడబోతున్నారు. నేను మీకు ఎప్పుడూ చెప్పినట్లే... మీరు కాలర్ ఎగరేసుకుని తిరిగేలా చేయడమే నా బాధ్యత. దాంతో వచ్చే ఆనందాన్ని నా మాటల్లో చెప్పలేను. ఈ సెప్టెంబరు 27న అదే జరుగుతుందని ప్రగాఢంగా నమ్ముతున్నాను. శివగారు ఎంతో కష్టపడి ఎంతో అద్భుతమైన సినిమా తీయడం జరిగింది. అందరూ చూడండి. అందరూ ఆనందించండి. మీ ఆశీర్వాదం ఈ 'దేవర'కు చాలా అవసరం. నాకూ చాలా అవసరం. దయచేసి మీ అశీర్వాదాన్ని మాకు అందించాలని కోరుకుంటున్నాను. ఇంకొక్కమాట.. మీరందరూ జాగ్రత్తగా తిరిగి ఇంటికి వెళ్లాలని ఇంకొక్కసారి మీకు గుర్తు చేస్తూ సెలవు తీసుకుంటున్నాను'' అని అన్నారు. ఈ సంగతి ఇలా ఉంచితే...'దేవర' సినిమా రిలీజ్ ట్రైలర్‌ను ఆదివారం ఉదయం రిలీజ్ చేశారు. ఈ ట్రైలర్‌లో ఉన్న డైలాగ్స్‌లో 'దేవర అడిగినాడంటే సెప్పినాడని' అనే డైలాగ్ ఒకటి.

శంకర్‌బాబుని పిలవండి... డ్యాన్స్ చేస్తాడనేవారు

● గిన్నిస్ వరల్డ్ రికార్డ్ అందుకున్న సందర్భంగా చిరంజీవి



● రిచర్డ్ స్టెన్నింగ్, చిరంజీవి, ఆమిర్ ఖాన్

156 చిత్రాలు... 537 పాటలు... 24 వేల డ్యాన్స్ మూమెంట్స్... ఆ 24వేల డ్యాన్స్ మూమెంట్స్ హీరో చిరంజీవి పేరు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చేరేలా చేశాయి. యాక్టర్, డ్యాన్సర్ విభాగంలో 'మోస్ట్ ప్రొలిఫిక్ ఫిల్మ్ స్టార్ ఇన్ ది ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీ' పేరిట గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ వారు చిరంజీవిని ఈ రికార్డ్‌కి ఎంపిక చేశారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బాలీవుడ్ స్టార్ ఆమిర్ ఖాన్ మెగాస్టార్ చిరంజీవికి ఈ రికార్డ్‌ని అందజేశారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధి రిచర్డ్ స్టెన్నింగ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ – ''నటనకు అవార్డులు వస్తాయని తెలుసు. కానీ ఇలా డ్యాన్సులకు రావడం అనేది ఊహించలేదు. నాకు నటన మీదకన్నా డ్యాన్స్ మీద ఆసక్తి ఎక్కువ. బహుశా అదే నాకు ఈ అవార్డు తెచ్చిపెట్టి ఉంటుందని అనుకుంటున్నా. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌కి, మనకు సంబంధం ఏంటి? అని అనుకుంటాం కదా. అందుకని ఈ రికార్డు గురించి నాకు ఊహే లేదు. డ్యాన్స్ అనేది నాకు అదనపు అర్హత అయితే నా కొరియోగ్రాఫర్‌లు, నా ఈ విజయంలో నా దర్శక–నిర్మాతలు, అభిమానుల పాత్ర మరువలేనిది.

నటనకన్నా ముందే డ్యాన్స్‌కి ఓనమాలు

చిన్నప్పుడు సాయంత్రం అయ్యేసరికి వివిధ భారతి, రేడియో సిలోన్‌లో వచ్చే పాటలకు డ్యాన్సులు చేసేవాడిని. రేడియోల్లో పాటలు రాగానే, 'శంకర్‌బాబు (చిరంజీవి అసలు పేరు శివశంకర వర ప్రసాద్) ని పిలవండి. డ్యాన్సులు వేస్తాడు' అనే వారు. ఉత్సాహంగా స్టెప్పులు వేసేవాడిని. ఎన్‌సీసీలో చేరాక సాయంత్రాల్లో తిన్నాక అల్యూమినియమ్ ప్లేట్లను తిరగేసి వాయించి డ్యాన్సులు వేసేవాడిని

కాలు జారి పడినా ఆపలేదు

ఒకసారి రాజమండ్రిలో షూటింగ్ జరుగుతున్నప్పుడు సావిత్రి, రోజా రమణి, కవిత, నరసింహరాజు... ఇలా అందరూ సాయంత్రం ఓ పంచలో కూర్చున్నారు. లైట్‌గా వర్షం పడుతోంది. నన్ను డ్యాన్స్ చేయమని అడిగారు. వర్షానికి కాలు జారి కిందపడినా ఆపలేదు. దాన్ని నాగిని డ్యాన్సులాగా మార్చేసి స్టెప్పులేశాను. అక్కడున్న కో–డైరెక్టర్ చూసి దర్శకుడు క్రాంతికుమార్‌గారికి చెప్పారు. 'ప్రాణం ఖరీదు'కి నన్ను తీసుకున్నప్పుడు 'ఏలియల్లో ఏలియల్లో ఎందాక...' అనే పాటను పెట్టారు. ఆ పాటకు స్టెప్ వేశాను. దానికన్నా ముందు 'పునాది రాళ్లు'లోనూ డ్యాన్స్ వేస్తూ, సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచాను.

చిరంజీవి ఉంటే ఎక్కువ డబ్బు అన్నారు

ఆ రోజుల్లో లింగమూర్తిగారు డిస్ట్రిబ్యూషన్‌కి చీఫ్. ఆయన ఏ నిర్మాత కథ వింటారు? ఎవరికి డబ్బులు శాంక్షన్ చేస్తారనే పరిస్థితి ఉండేది. ఒకసారి ఆయన 'చిరంజీవి అని కొత్తగా వస్తున్నాడు. అతనితో సినిమాలు చేస్తే మీకు ఇంత డబ్బు ఇస్తాను. లేదంటే లిమిటెడ్‌గా ఇస్తాను' అన్నారు. దాంతో అందరూ చిరంజీవినే పెట్టుకుందాం అనుకునేవారు. లింగమూర్తిగారికి ప్రజానాడి తెలుసు. ఆడియన్స్ ఇతని సాంగ్స్ కోసమే సినిమాలకు వస్తున్నారు. అలాంటప్పుడు ఇతనితో సినిమాలు చేస్తే నాలుగు డబ్బులు వస్తాయి కదా అని ఆయన మా నిర్మాతలతో అనడం.. వాళ్లు కూడా నాకు అవకాశాలు ఇవ్వడం అన్నది నాకు ప్లస్ అయింది'' అన్నారు.

చిరంజీవి నటించిన 'ప్రాణం ఖరీదు' 1978 సెప్టెంబర్ 22న విడుదలైంది. ఈ సినిమా విడుదలైన రోజునే చిరంజీవి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ అందుకోవడం ఓ విశేషం. కాగా సరిగ్గా చిరంజీవి పుట్టిన సంవత్సరం 1955లో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌కి శ్రీకారం జరిగింది. అయితే చిరంజీవి పుట్టిన తేదీ 22 కాగా... ఈ రికార్డ్‌కి శ్రీకారం చుట్టింది 19వ తేదీన.

25 రోజులుగా చికున్ గున్యాతో చిరంజీవి బాధపడుతున్నారని, అయినప్పటికీ ఈ కార్యక్రమానికి హాజరయ్యారని యాంకర్ పేర్కొన్నారు. ఆయన కోలుకుంటున్నారని కూడా తెలిపారు.

ఆ డ్యాన్సుల్లో మనసు కనబడుతుంది

ఆమిర్ ఖాన్ మాట్లాడుతూ – ''చిరంజీవిగారు ఫోన్ చేసి, ఈవెంట్‌కి రావాలని అడిగినప్పుడు 'అడగకూడదు... మీరు ఆర్డర్ వెయ్యాలి' అన్నాను. చిరంజీవిగారి డ్యాన్సులు ఎందుకు బాగుంటాయంటే ఆ డ్యాన్సుల్లో ఆయన మనసు కనబడుతుంది. తనని తాను ఎంజాయ్ చేస్తూ డ్యాన్స్ చేస్తారు కాబట్టి చూడ్డానికి మనకు రెండు కళ్లు సరిపోవు'' అన్నారు.

537 పాటలు చూడటం నాకో మంచి అనుభూతి

రిచర్డ్ స్టెన్నింగ్ మాట్లాడుతూ– ''చిరంజీవిగారి 46 ఏళ్ల కెరీర్‌లో రిలీజైన కమర్షియల్ సినిమాలను పరిగణనలోకి తీసుకున్నాం. 156 సినిమాలనేది అద్భుతమైన అచీవ్‌మెంట్. ఆ సినిమాల్లో ఆయన డ్యాన్స్ చేసిన పాటలను తీసుకున్నాం. 537 పాటల్లో ఆయన వేసిన 24 వేల డ్యాన్స్ మూవ్స్ చూశాం. ఆ పాటలు చూడటం వ్యక్తిగతంగా నాకు మంచి అనుభూతినిచ్చింది. ఆయనకు గిన్నిస్ రికార్డ్ అందించాలని నిర్ణయించుకున్నాం'' అన్నారు.

ఈ కార్యక్రమంలో ఆమిర్ ఖాన్‌కు చిరంజీవి ఓ పెన్నుని బహుమతిగా అందజేశారు. ఇంకా దర్శక–నిర్మాతలు కోదండ రామిరెడ్డి, కె. రాఘవేంద్ర రావు, బి. గోపాల్, గుణశేఖర్, బాబీ, వశిష్ఠ, అశ్వనీదత్, కేఎస్ రామారావు, అల్లు అరవింద్, డి. సురేష్‌బాబు, శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, తమ్మారెడ్డి భరద్వాజ, పి. కిరణ్, చిరంజీవి కుటుంబ సభ్యులు సుష్మిత, వరుణ్ తేజ్, సాయిధరమ్ తేజ్, వైష్ణవ్ తేజ్ పాల్గొన్నారు.

ఆస్ట్రేలియాలో ఆటా పాటా



● నితిన్

ఆస్ట్రేలియా వెళ్లింది 'రాబిన్‌హుడ్' టీమ్. 'భీష్మ' (2020) వంటి సూపర్‌హిట్ ఫిల్మ్ తర్వాత హీరో నితిన్–దర్శకుడు వెంకీ కుడుముల కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'రాబిన్‌హుడ్'. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ ఆస్ట్రేలియాలో జరుగుతోంది. నితిన్, శ్రీలీల కాంబినేషన్‌లో ఓ డ్యూయెట్ సాంగ్‌ను చిత్రీకరిస్తున్నారు మేకర్స్. మెల్‌బోర్న్‌లోని అందమైన లొకేషన్స్‌లో షూటింగ్ జరుపుకుంటున్న ఈ పాటకు కృష్ణకాంత్ లిరిక్స్ రాయగా, శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. ఈ సాంగ్‌తో పాటు కొంత టాకీ పార్టు చిత్రీకరణ కూడా ఆస్ట్రేలియాలో జరగనుంది. ఈ సినిమాకు జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం అందిస్తున్నారు. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబరు 20న విడుదల కానుంది.

ఏఐతో పాటలు



● ఆరాధ్య

సత్య యాదు, ఆరాధ్య దేవి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న థ్రిల్లర్ మూవీ 'శారీ'. ఈ సినిమాకు గిరికృష్ణ కమల్ దర్శకుడు. ఆర్జీవీ ఆర్వీ ప్రొడక్షన్స్ పతాకంపై రవి వర్మ నిర్మించిన ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో నవంబరులో రిలీజ్ కానుంది. 'ప్రేమా... ప్రేమా.. ప్రేమా... నీ కోసం నా నిరీక్షణ.. నీ కోసం నా అన్వేషణ' అంటూ మొదలై, 'ఐ వాంట్ లవ్... ఐ వాంట్ లవ్...' అంటూ సాగే లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు. ''మా భాగస్వామి రవివర్మతో కలిసి 'ఆర్జీవీ డెన్ మ్యూజిక్'ను ఆరంభిస్తున్నానని చెప్పడానికి థ్రిల్ అవుతున్నాను. ఇందులో ఏఐ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృతిమ మేధ) యాప్స్‌తో రూపొందిన సంగీతం మాత్రమే ఉంటుంది. 'శారీ' మొత్తం ఏఐ సంగీతంతోనే సాగుతుంది. నేపథ్య సంగీతానికి కూడా ఏఐ మ్యూజిక్‌నే వాడాం. వందేళ్ల భారతీయ చలన చిత్ర చరిత్రలో ఏఐ మ్యూజిక్‌తో వస్తున్న పూర్తి స్థాయి, మొదటి చలన చిత్రంగా 'శారీ' నిలుస్తుందని గర్వంగా చెప్పగలశ్రీశ్రీం'' అని రామ్‌గోపాల్‌వర్మ పేర్కొన్నారు.

మా అమ్మానాన్నను భయపెట్టారు!

''నేను నటి కావాలనుకున్నప్పుడు మా కుటుంబ సభ్యులు ప్రోత్సహించారు. అయితే మా బంధువులు, ఇరుగు పొరుగు వాళ్లు సినిమా ఇండస్ట్రీ మంచిది కాదు. అక్కడికి వెళితే చెడు అలవాట్లకు బానిసవుతుంది. ఆమెను పెళ్లి చేసుకోవడానికి ఎవరూ ముందుకు రారు' అంటూ ఏవేవో చెప్పి మా అమ్మానాన్నను భయపెట్టారు'' అన్నారు త్రిప్తీ డిమ్రి. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రణబీర్ కపూర్ హీరోగా నటించిన 'యానిమల్' (2023) సినిమాలో చేసిన కీలక పాత్ర ద్వారా దేశవ్యాప్తంగా గుర్తింపు సొంతం చేసుకున్నారు త్రిప్తీ. ఆ తర్వాత వరుస అవకాశాలతో దూసుకెళుతున్నారామె. తాజాగా ఓ ఇంటర్వ్యూలో త్రిప్తీ డిమ్రి మాట్లాడుతూ– ''చిన్నతనం నుంచే నాకు నటనంటే ఆసక్తి. నటి కావాలనుకున్నప్పుడు ఇంట్లో వాళ్లు కొంచెం కంగారుపడ్డారు. ఆ తర్వాత ధైర్యం చేసి ముంబై వచ్చాను.. ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నాను. అవకాశాల్లేక బాధపడిన క్షణాలున్నాయి. కొన్ని సందర్భాల్లో నమ్మకం కోల్పోయాను. చివరకు హీరోయిన్‌గా 'లైలా మజ్ను' సినిమాతో మంచి పేరు తెచ్చుకున్నాను. నా విషయంలో నా ఫ్యామిలీ మెంబర్స్ హ్యాపీ'' అని పేర్కొన్నారు.



● త్రిప్తీ డిమ్రి



280 పరుగుల తేడాతో...

- తొలి టెస్టులో భారత్ ఘనవిజయం
- రవిచంద్రన్ అశ్విన్‌కు 6 వికెట్లు
- బంగ్లాదేశ్ 234 ఆలౌట్
- 27 నుంచి కాన్పూర్‌లో రెండో టెస్టు

సొంతగడ్డపై రవిచంద్రన్ అశ్విన్ అటు బ్యాట్‌తో, ఇటు బంతితో విజృంభించిన వేళ... బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ భారీ విజయం సాధించింది. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు చేరడమే లక్ష్యంగా సాగుతున్న రోహిత్ బృందం ముందు బంగ్లాదేశ్ చేతులెత్తేసింది. కొండంత లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో అందులో సగం పరుగులైనా చేయకముందే ఆలౌటైంది. ఈ విజయంతో భారత టెస్టు క్రికెట్ చరిత్రలో తొలిసారి గెలుపోటముల నిష్పత్తిలో పరాజయాల కన్నా ఎక్కువ విజయాలు నమోదు చేసుకుంది.

చెన్నై: సమష్టి ప్రదర్శనతో సత్తా చాటిన భారత జట్టు బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో 280 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ముందంజ వేసింది. భారత్ నిర్దేశించిన 515 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 158/4తో ఆదివారం నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్ చివరకు 62.1 ఓవర్లలో 234 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ నజ్ముల్ హసన్ (127 బంతుల్లో 82; 8 ఫోర్లు, 3 సిక్సర్లు) ఒంటరి పోరాటం చేయగా... మిగిలిన వాళ్లు విఫలమయ్యారు. ఐదో వికెట్‌కు షకీబ్ అల్ హసన్ (25)తో కలిసి నజ్ముల్ 48 పరుగులు జోడించాడు. ఈ దశలో అశ్విన్ బంతి అందుకోవడంతో పరిస్థితి తలకిందులైంది. 'లోకల్ బాయ్' చక్కటి బంతితో షకీబ్‌ను ఔట్ చేయగా... లిటన్ దాస్ (1)ను జడేజా బుట్టలో వేసుకున్నాడు. మిరాజ్ (8) విఫలమయ్యాడు. భారత బౌలర్లలో ఆఫ్‌స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ 6 వికెట్లు పడగొట్టగా... రవీంద్ర జడేజా 3 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. చేతిలో ఆరు వికెట్లతో నాలుగో రోజు ఆట కొనసాగించిన బంగ్లాదేశ్ లంచ్ విరామానికి ముందే ఆలౌటైంది. ఈ ఆరు వికెట్లలో అశ్విన్, జడేజా చెరో 3 పంచుకున్నారు. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ చేయడంతో పాటు రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు తీసిన అశ్విన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య శుక్రవారం నుంచి కాన్పూర్‌లో రెండో టెస్టు ప్రారంభం కానుంది.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 376; బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్: 149; భారత్ రెండో ఇన్నింగ్స్: 287/4 డిక్లేర్డ్; బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్: జాకీర్ (సి) యశస్వి (బి) బుమ్రా 33; షాద్‌మన్ (సి) గిల్ (బి) అశ్విన్ 35; నజ్ముల్ (సి) బుమ్రా (బి) జడేజా 82; మోమినుల్ హక్ (బి) అశ్విన్ 13; ముష్ఫికర్ (సి) రాహుల్ (బి) అశ్విన్ 13; షకీబ్ (సి) యశస్వి (బి) అశ్విన్ 25; లిటన్ దాస్ (సి) రోహిత్ (బి) జడేజా 1; మిరాజ్ (సి) జడేజా (బి) అశ్విన్ 8; తస్కీన్ (సి) సిరాజ్ (బి) అశ్విన్ 5; హసన్ మహమూద్ (బి) జడేజా 7; నాహిద్ రాణా (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (62.1 ఓవర్లలో ఆలౌట్) 234. వికెట్ల పతనం:** 1-62, 2-86, 3-124, 4-146, 5-194, 6-205, 7-222, 8-222, 9-228, 10-234. **బౌలింగ్:** బుమ్రా 10-2-24-1; సిరాజ్ 10-5-32-0; ఆకాశ్‌దీప్ 6-0-20-0; అశ్విన్ 21-0-88-6; జడేజా 15.1-2-58-3.



ఇరిగేశి అర్జున్

తానియా, వంతిక, వైశాలి, దివ్య, ద్రోణవల్లి హారిక

గుకేశ్

విదిత్

ప్రజ్ఞానంద

హరికృష్ణ

బంగారం... మన చదరంగం

చెస్ ఒలింపియాడ్‌లో చరిత్ర సృష్టించిన భారత పురుషుల, మహిళల జట్లు

- ప్రతిష్టాత్మక టోర్నీలో తొలిసారి పసిడి పతకాలు సొంతం
- భారత జట్ల విజయంలో కీలకపాత్ర పోషించిన హారిక, అర్జున్
- వ్యక్తిగత విభాగాల్లోనూ స్వర్ణాలు గెలిచిన అర్జున్, గుకేశ్, దివ్య, వంతిక

బుడాపెస్ట్: ప్రపంచ చదరంగ సామ్రాజ్యంలో తమకు తిరుగులేదని భారత క్రీడాకారులు నిరూపించారు. ఏ లక్ష్యంతోనైతే చెస్ ఒలింపియాడ్‌లో బరిలోకి దిగారో ఆ లక్ష్యాన్ని భారత క్రీడాకారులు దర్జాగా పూర్తి చేశారు. ఆద్యంతం అద్వితీయ ప్రదర్శనతో అదరగొట్టారు. అంచనాలకు మించి ఎత్తులు వేశారు. తమ ప్రత్యర్థులను చిత్తు చేశారు. వెరసి ఇన్నాళ్లూ సాధ్యంకాని ఘనతను సొంతం చేసుకున్నారు. 100 ఏళ్ల చరిత్ర కలిగిన ప్రతిష్టాత్మక చెస్ ఒలింపియాడ్‌లో ఏకకాలంలో భారత పురుషుల, భారత మహిళల జట్లు చాంపియన్‌గా నిలిచి తొలిసారి స్వర్ణ పతకాలను సొంతం చేసుకొని కొత్త చరిత్రను లిఖించాయి.

- ఆదివారం ముగిసిన ఈ మెగా టోర్నీలో గ్రాండ్‌మాస్టర్లు ఇరిగేశి అర్జున్ (తెలంగాణ), దొమ్మరాజు గుకేశ్, ప్రజ్ఞానంద (తమిళనాడు), విదిత్ సంతోష్ గుజరాతి (మహారాష్ట్ర), పెంటేల హరికృష్ణ (ఆంధ్రప్రదేశ్)లతో కూడిన భారత పురుషుల జట్టు అజేయంగా నిలిచి 21 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. అమెరికా జట్టుకు (17 పాయింట్లు) రజతం, ఉజ్బెకిస్తాన్ జట్టుకు (17 పాయింట్లు) కాంస్యం లభించాయి.
- గ్రాండ్‌మాస్టర్లు ద్రోణవల్లి హారిక (ఆంధ్రప్రదేశ్), వైశాలి (తమిళనాడు), అంతర్జాతీయ మాస్టర్లు దివ్య దేశ్‌ముఖ్ (మహారాష్ట్ర), వంతిక అగర్వాల్, తానియా సచ్‌దేవ్ (ఢిల్లీ)లతో కూడిన భారత మహిళల జట్టు 19 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో నిలిచింది. కజకిస్తాన్ (18 పాయింట్లు) జట్టుకు రజతం, అమెరికా (17 పాయింట్లు) జట్టుకు కాంస్యం దక్కాయి.
- వ్యక్తిగత విభాగాల్లో గుకేశ్ (బోర్డు-1; 9 పాయింట్లు), అర్జున్ (బోర్డు-2; 10 పాయింట్లు), దివ్య దేశ్‌ముఖ్ (బోర్డు-3; 9.5 పాయింట్లు), వంతిక అగర్వాల్ (బోర్డు-4; 7.5 పాయింట్లు) అగ్రస్థానంలో నిలిచి పసిడి పతకాలను సొంతం చేసుకున్నారు.
- చివరిదైన 11వ రౌండ్ మ్యాచ్‌ల్లో భారత పురుషుల జట్టు 3.5-0.5తో స్లొవేనియాపై గెలుపొందగా... భారత మహిళల జట్టు కూడా 3.5-0.5తో అజర్‌బైజాన్ జట్టును ఓడించింది.
- పురుషుల 11వ రౌండ్ గేముల్లో గుకేశ్ 48 ఎత్తుల్లో ఫెడోసీవ్‌పై, అర్జున్ 49 ఎత్తుల్లో జాన్ సుబెల్‌పై, ప్రజ్ఞానంద 53 ఎత్తుల్లో అంటోన్ డెమ్‌చెంకోపై నెగ్గగా... మాతెజ్ సబెనిక్‌తో జరిగిన గేమ్‌ను విదిత్ 59 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు.
- మహిళల 11వ రౌండ్ గేముల్లో ద్రోణవల్లి హారిక 51 ఎత్తుల్లో గునె మమాద్‌జాదాపై, దివ్య 39 ఎత్తుల్లో గొవర్ బెదులయేవాపై, వంతిక 53 ఎత్తుల్లో ఖానిమ్ బలజయేవాపై గెలుపొందగా... ఉలివియా ఫతలెవియాతో జరిగిన గేమ్‌ను వైశాలి 47 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది.
- గతంలో భారత పురుషుల జట్టు ఈ టోర్నీలో రెండుసార్లు కాంస్య పతకాలు (2014, 2022) గెలుపొందగా... భారత మహిళల జట్టు ఒకసారి (2022) కాంస్య పతకాన్ని సాధించింది.



హారిక భావోద్వేగం

కల నిజమైంది

చెస్ ఒలింపియాడ్‌లో నా ప్రస్థానం 13 ఏళ్ల వయస్సులో 2004లో మొదలైంది. 20 ఏళ్లు గడిచాయి. ఇప్పుడు నా స్వర్ణ స్వప్నం సాకారం అయింది. స్వదేశంలో 2022లో జరిగిన ఒలింపియాడ్‌లో పసిడి పతకం సాధించే అవకాశాలున్నా ఆఖర్లో తడబడి చివరకు కాంస్య పతకంతో సంతృప్తి చెందాం. కానీ ఈసారి ఆఖరి రౌండ్‌లో ఎలాంటి తప్పిదాలకు తావివ్వకుండా ఆడి 'బంగారు' కలను నిజం చేసుకున్నాం. ఈసారి ఒలింపియాడ్‌కు నేను ప్రత్యేక సన్నాహాలు చేయకుండానే బరిలోకి దిగాను. ఈ మెగా టోర్నీలో నా అపార అనుభవం ఉపయోగపడింది. నాతోపాటు దివ్య, వంతిక, వైశాలి, తానియా సరైన సమయంలో తమ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాం. పటిష్ట జట్లతో ఆడి పోరాడి గెలిచాం. ఈ స్వర్ణ పతకానికి మేమందరం అర్హులం.

–'సాక్షి'తో హారిక

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

తెలంగాణ రాష్ట్రంలో 2,050 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులు

వైద్య, ఆరోగ్య సేవల రిక్రూట్‌మెంట్ బోర్డు(ఎంహెచ్‌ఎస్‌ఆర్‌బీ) తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలో నర్సింగ్ ఆఫీసర్(స్టాఫ్ నర్స్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 2,050.
» **శాఖల వారీగా ఖాళీలు:** డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్/డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్-1,576, తెలంగాణ వైద్య విధాన పరిషత్-332, ఆయుష్-61, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్-01, ఎంఎన్‌జే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ అండ్ రీజనల్ క్యాన్సర్ సెంటర్-80.
» **అర్హత:** జనరల్ నర్సింగ్, మిడ్‌వైఫరీ(జీఎన్ఎం) లేదా బీఎస్సీ(నర్సింగ్) ఉత్తీర్ణతతో పాటు తెలంగాణ స్టేట్ నర్సింగ్ కౌన్సిల్‌లో వివరాల నమోదు చేసుకొని ఉండాలి.
» **వయసు:** 01-07-2024 నాటికి 18 నుంచి 46 ఏళ్ల మధ్య ఉండాలి. గరిష్ట వయోపరిమితిలో దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఐదేళ్ల సడలింపు, ఎక్స్ సర్వీస్‌మెన్, ఎన్‌సీసీ సర్టిఫికేట్ ఉన్నవారికి మూడేళ్లు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
» **పే స్కేల్:** నెలకు రూ.36,750 నుంచి రూ.1,06, 990.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, అనుభవం ద్వారా ఎంపికచేస్తారు. రాతపరీక్షకు 80 పాయింట్లు ఉండగా, రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రులు, సంస్థల్లో పనిచేసిన కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సర్వీస్‌కు 20 పాయింట్ల వెయిటేజీ ఉంటుంది.
» **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, నల్గొండ, కోదాడ, ఖమ్మం, కొత్తగూడెం, సత్తుపల్లి, కరీంనగర్, మహబూబ్ నగర్, సంగారెడ్డి, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, నర్సంపేట.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 28.09.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 14.10.2024
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 16.10.2024 నుంచి 17.10.2024 వరకు.
» **పరీక్ష తేది(సీబీటీ):** 17.11.2024.
» **వెబ్‌సైట్:** https://mhsrb.telangana.gov.in

కెనరా బ్యాంక్‌లో 3000 అప్రెంటిస్‌లు

బెంగళూరులోని కెనరా బ్యాంక్ ప్రధాన కార్యాలయం హ్యూమన్ రిసోర్సెస్ విభాగంలో దేశవ్యాప్తంగా రీజియన్ల వారీగా బ్యాంకు శాఖల్లో అప్రెంటిస్‌షిప్ శిక్షణ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 3000. శిక్షణా కాలం: ఒక సంవత్సరం.
» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేట్ డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హత కలిగి ఉండాలి.
» **వయసు:** 01.09.2024 నాటికి 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, బీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది:** 21.09.2024
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 04.10.2024.
» **వెబ్‌సైట్:** https://canarabank.com

ఇస్రో-హెచ్ఎస్ఎఫ్‌సీ, బెంగళూరులో 103 పోస్టులు

బెంగళూరులోని ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో)కు చెందిన హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ సెంటర్(హెచ్ఎస్ఎఫ్‌సీ)..తాత్కాలిక ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 103.
» **పోస్టుల వివరాలు:** మెడికల్ ఆఫీసర్(ఎస్‌డీ/ఎస్‌సీ)-03, సైంటిస్ట్/ఇంజనీర్ -ఎస్‌సీ-10, టెక్నికల్ అసిస్టెంట్-28, సైంటిఫిక్ అసిస్టెంట్ -01, టెక్నీషియన్ బి-43, డ్రాఫ్ట్స్‌మ్యాన్-13, అసిస్టెంట్(రాజ్‌భాష)-05.
» **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో డిప్లొమా, బీఎస్సీ డిగ్రీ, బీఈ /బీటెక్ (సివిల్/మెకానికల్/ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రికల్), ఎంబీబీఎస్/ఎండీ, ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** అసిస్టెంట్ పోస్టులకు 28 ఏళ్లు, మిగతా పోస్టులకు 18 నుంచి 35 ఏళ్లు మించ కూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, స్క్రీనింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 19.09.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 09.10.2024
» **వెబ్‌సైట్:** https://www.hsfc.gov.in

» ఈఎస్ఈ-2025 నోటిఫికేషన్ విడుదల
» నాలుగు కేటగిరీల్లో 232 పోస్టులు
» బీటెక్ అర్హతతో పోటీ పడే అవకాశం
» నెలకు రూ. 64,749 వేతనం

కేంద్రంలో ఇంజనీర్ కొలువులు

ఇంజనీరింగ్ కోర్సు పూర్తి చేసుకొని ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది! యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. తాజాగా 232 పోస్టుల భర్తీకి ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(ఈఎస్ఈ) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంపిక ప్రక్రియలో విజయం సాధిస్తే..కేంద్ర ప్రభుత్వ శాఖల్లో గ్రూప్-ఎ, గ్రూప్-బి స్థాయి గెజిటెడ్ హోదాలో ఇంజనీర్లుగా కొలువు సొంతం చేసుకోవచ్చు!! ఈ నేపథ్యంలో.. ఈఎస్ఈ -2025 నోటిఫికేషన్, భర్తీ చేసే పోస్టులు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం, రాత పరీక్షకు ప్రిపరేషన్ తదితర వివరాలు..



యూపీఎస్సీ ఈఎస్ఈ 2025

ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ అంటే బీటెక్ అభ్యర్థుల్లో ఎంతో క్రేజ్ నెలకొంది. ఈ పరీక్షకు ఏటా వేలల్లో పోటీ పడుతున్నారు. దీనికి ప్రధాన కారణం.. ఈ పోస్టుల్లో చేరిన వారికి ఆల్ ఇండియా సర్వీసులకు సరితూగే స్థాయిలో సదుపాయాలు లభిస్తుండడమే. తీవ్ర పోటీ దృష్ట్యా దరఖాస్తు సమయం నుంచి ప్రిపరేషన్‌పై దృష్టి సారిస్తే విజయావకాశాలు మెరుగవుతాయి.

నాలుగు విభాగాల్లో 232 పోస్టులు

యూపీఎస్సీ తాజాగా విడుదల చేసిన ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2025 ద్వారా మొత్తం నాలుగు విభాగాల (బ్రాంచ్)లో 232 పోస్టల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. సివిల్ ఇంజనీరింగ్,మెకానికల్ ఇంజనీరింగ్,ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాల్లో ఈ ఖాళీలు అందుబాటులో ఉన్నాయి.

అర్హతలు

- దరఖాస్తు చేయదలచుకుంటున్న విభాగానికి సంబంధించిన బ్రాంచ్‌తో బీటెక్ ఉత్తీర్ణత ఉండాలి. ఆయా కోర్సుల చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే వీరు పర్సనల్ ఇంటర్వ్యూ సమయానికి ఉత్తీర్ణత పొంది సర్టిఫికెట్ అందించాల్సి ఉంటుంది.
- ఇండియన్ నేవల్ అర్మమెంట్ సర్వీస్ (ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్) పోస్టులకు వైర్‌లెస్ కమ్యూనికేషన్ ఎలక్ట్రానిక్స్/రేడియో ఫిజిక్స్/రేడియో ఇంజనీరింగ్ స్పెషలైజేషన్‌తో ఎమ్మెస్సీ ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- ఇండియన్ రేడియో రెగ్యులేటరీ సర్వీస్ గ్రూప్-ఎ పోస్టులకు వైర్‌లెస్ కమ్యూనికేషన్ ఎలక్ట్రానిక్స్/రేడియో ఫిజిక్స్/రేడియో ఇంజనీరింగ్/ఫిజిక్స్/రేడియో కమ్యూనికేషన్/ ఎలక్ట్రానిక్స్/టెలికమ్యూనికేషన్ స్పెషలైజేషన్‌తో ఎమ్మెస్సీ లేదా ఎంఎస్ ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **వయసు:** జనవరి 1, 2025 నాటికి 21-30 ఏళ్ల మధ్యలో ఉండాలి. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు నిబంధనల మేరకు గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ

ఇంజనీరింగ్ సర్వీసెస్ పోస్టులకు ఎంపిక ప్రక్రియ మూడు దశల్లో ఉంటుంది. మొదటి రెండు దశలు రాత పరీక్షలుగా, మూడో దశ పర్సనల్ ఇంటర్వ్యూగా పేర్కొన్నారు. అవి.. స్టేజ్-1 (ప్రిలిమినరీ ఎగ్జామినేషన్); స్టేజ్-2 (మెయిన్ ఎగ్జామినేషన్); స్టేజ్-3 (పర్సనాలిటీ టెస్ట్). ప్రిలిమినరీ పరీక్షలో సాధించిన మార్కులను సైతం తుది ఎంపిక కోసం పరిగణనలోకి తీసుకుంటారు.

ప్రిలిమినరీ పరీక్ష

- ఎంపిక ప్రక్రియలో స్టేజ్-1గా పేర్కొనే ప్రిలిమినరీ పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటుంది. ఈ పరీక్షలో అభ్యర్థులు రెండు పేపర్లు రాయాల్సి ఉంటుంది. అవి..పేపర్-1(జనరల్ స్టడీస్ అండ్ ఇంజనీరింగ్ ఆప్టిట్యూడ్), -పేపర్-2 (ఇంజనీరింగ్ సంబంధిత సబ్జెక్ట్).
- పేపర్-1ను 200 మార్కులు, పేపర్-2ను 300 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ప్రిలిమినరీ పరీక్షలో పేపర్-1 అన్ని విభాగాల అభ్యర్థులకు ఒకే మాదిరిగా ఉంటుంది. నెగెటివ్ మార్కింగ్ విధానం కూడా అమలవుతోంది.
- పేపర్-2 మాత్రం అభ్యర్థి దరఖాస్తు సమయంలో పేర్కొన్న సబ్జెక్ట్‌పై ఉంటుంది.

రెండో దశ మెయిన్ ఎగ్జామినేషన్

- ఈఎస్ఈ పరీక్ష విధానంలో రెండో దశ(స్టేజ్-2)గా పేర్కొనే మెయిన్ ఎగ్జామినేషన్ పూర్తిగా డిస్క్రిప్టివ్ విధానంలో ఉంటుంది. స్టేజ్-2లో అభ్యర్థులు తమ సబ్జెక్ట్‌కు సంబంధించి రెండు పేపర్లలో పరీక్ష రాయాల్సి ఉంటుంది. ప్రిలిమినరీ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్ట్‌కు ఏడుగురు లేదా ఎనిమిది మందిని చొప్పున మెయిన్ ఎగ్జామినేషన్‌కు ఎంపిక చేస్తారు.
- రెండు పేపర్లుగా మెయిన్ పరీక్షను నిర్వహిస్తారు. ఒక్కో పేపర్‌కు 300మార్కులు చొప్పున మొత్తం ఆరు వందల మార్కులకు పరీక్ష ఉంటుంది. అభ్యర్థులు ఎంపిక చేసుకున్న విభాగానికి సంబంధించి పేపర్లలో ఈ పరీక్ష జరుగుతుంది.

చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ

ఈఎస్ఈ ఎంపిక ప్రక్రియలో చివరి, మూడో దశ.. పర్సనాలిటీ టెస్ట్‌గా పిలిచే పర్సనల్ ఇంటర్వ్యూ. స్టేజ్-2 మెయిన్ ఎగ్జామినేషన్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా.. ఒక్కో పోస్ట్‌కు ఇద్దరిని చొప్పున (1:2 నిష్పత్తిలో) పర్సనల్ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. ఇంటర్వ్యూలో అభ్యర్థులకు ఇంజనీరింగ్ సర్వీసెస్ పట్ల ఉన్న ఆసక్తి, ప్రభుత్వ రంగంలో పని చేయాలనుకునేందుకు గల కారణాలు, వ్యక్తిత్వం వంటి అంశాలను పరిశీలిస్తారు. ఇంటర్వ్యూ ప్రక్రియను 200 మార్కులకు నిర్వహిస్తారు. ఇలా మొత్తంగా ప్రిలిమ్స్ 500 మార్కులు, మెయిన్స్ 600 మార్కులు, ఇంటర్వ్యూ 200 మార్కులకు అభ్యర్థి సాధించిన స్కోర్ ఆధారంగా తుది ఎంపిక ఖరారు చేస్తారు.

రాత పరీక్షలో రాణించేలా

కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఇంజనీరింగ్ కొలువులకు నిర్వహించే ఇంజనీరింగ్ సర్వీసెస్ పరీక్షలో విజయం సాధించాలంటే.. అభ్యర్థులు దరఖాస్తు సమయం నుంచే వ్యూహాత్మకంగా వ్యవహరించాలి. సిలబస్‌పై అవగాహన ఏర్పరచుకోవడం మొదలు తాము ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్ పేపర్‌లో పూర్తి పట్టు సాధించేలా కృషి చేయాలి.

ప్రిలిమ్స్‌కు ఇలా

- ప్రిలిమ్స్ పేపర్-1(జనరల్ స్టడీస్ అండ్ ఇంజనీరింగ్ ఆప్టిట్యూడ్)లో.. మొత్తం పది అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. వీటిలో మొదటి టాపిక్‌గా పేర్కొన్న జాతీయ,అంతర్జాతీయ ప్రాధాన్యం సంతరించుకున్న సమకాలీన అంశాలు; ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధిని మినహాయిస్తే మిగతా తొమ్మిది టాపిక్స్ కూడా ఇంజనీరింగ్ విద్యార్థులు తమ అకడమిక్స్‌లో చదివినవే. అకడమిక్స్ పరంగా బేసిక్స్, అప్లికేషన్ ఓరియెంటేషన్ ఉంటే ఈ పేపర్‌లో రాణించడం సులభమే.
- ప్రిలిమ్స్ పేపర్-2కు సంబంధించి అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకున్న విభాగానికి సంబంధించిన ప్రశ్నలతో ఉంటుంది. అకడమిక్‌గా సంబంధిత సబ్జెక్ట్‌లో పట్టున్న అభ్యర్థులు సులభంగా ఈ పేపర్‌ను గట్టెక్కొచ్చు.

మెయిన్ మరింత పటిష్టంగా

- స్టేజ్-1 ప్రిలిమినరీ పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా ఒక్కో పోస్ట్‌కు ఆరు నుంచి ఏడుగురు అభ్యర్థులను (1:6 లేదా 1:17 నిష్పత్తిలో) మెయిన్‌కు ఎంపిక చేస్తారు. మెయిన్ ఎగ్జామినేషన్‌కు అభ్యర్థులు పూర్తిగా అనలిటికల్ అప్రోచ్, అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో ముందుకు సాగాలి. ఆయా టెక్నికల్ టాపిక్స్‌కు సంబంధించి తాజా సామాజిక పరిస్థితులను అన్వయిస్తూ చదవడం ఉపకరిస్తుంది. ఉదాహరణకు టెలికమ్యూనికేషన్స్ విభాగంలో 5-జి టెక్నాలజీస్ వంటివి అనుసంధానం చేసుకుంటూ చదవాలి. అదే విధంగా మెకానికల్ ఇంజనీరింగ్‌కు సంబంధించి రోబోటిక్స్‌ను అన్వయ దృక్పథంతో అధ్యయనం చేయాలి. ఇదే వ్యూహాన్ని ఇతర విభాగాల (ఎలక్ట్రికల్, సివిల్ ఇంజనీరింగ్) అభ్యర్థులు కూడా అనుసరించాలి.

అనుసంధాన దృక్పథం

ఈఎస్ఈ అభ్యర్థులు అనుసంధాన దృక్పథంతో ప్రిపరేషన్ సాగించాలి. స్టేజ్-1 ప్రిలిమ్స్‌లోని పేపర్-2, మెయిన్ ఎగ్జామినేషన్‌లోని రెండు సబ్జెక్ట్ పేపర్లు అభ్యర్థులు చదివిన ఇంజనీరింగ్ సబ్జెక్ట్‌లకు సంబంధించినవే. వీటిని అనుసంధానం చేసుకుంటూ చదివే అవకాశం ఉంది. అభ్యర్థులు ముందుగా ప్రిలిమ్స్‌లో గట్టెక్కే విధంగా ఎక్కువ దృష్టి పెట్టాలి. యూపీఎస్సీ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం-ప్రిలిమ్స్ తర్వాత మెయిన్స్‌కు దాదాపు ఆరు నెలల సమయం అందుబాటులో ఉంది. కాబట్టి ప్రిలిమ్స్ పూర్తి చేసిన తర్వాత మెయిన్స్‌పై దృష్టి సారించాలి.

కాన్సెప్ట్స్, అప్లికేషన్ అప్రోచ్

ఇంజనీరింగ్ సర్వీసెస్‌లో విజయానికి ఆయా సబ్జెక్ట్‌లలోని కాన్సెప్ట్స్‌పై పూర్తి అవగాహన పొందడమే కాకుండా.. వాటిని అన్వయ దృక్పథంతో అధ్యయనం చేయాలి. ఫలితంగా పరీక్షల్లో ప్రశ్నలు ఎలా అడిగినా సమాధానం ఇచ్చే సంసిద్ధత లభిస్తుంది. ప్రీవియస్ పేపర్లను సాధన చేయడం, మాక్ టెస్ట్‌లకు హాజరవడం మేలు చేస్తుంది. ప్రిలిమ్స్‌లో నెగెటివ్ మార్కింగ్ ఉందనే విషయాన్ని గుర్తించాలి. మెయిన్స్ కోణంలో అకడమిక్‌గా తమకు పట్టున్న టాపిక్స్‌పై మరింత అవగాహన పెంచుకుంటే ఉపయుక్తంగా ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** 2024, అక్టోబర్ 8
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం:** 2024, అక్టోబర్ 9 నుంచి 15 వరకు;
- **ప్రిలిమినరీ(స్టేజ్-1)పరీక్ష తేదీ:** 2025,ఫిబ్రవరి 9
- **మెయిన్ ఎగ్జామినేషన్(స్టేజ్-2) పరీక్ష తేదీ:** 2025, జూన్ 22
- **వివరాలకు వెబ్‌సైట్:** www.upsc.gov.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	1,360	84,544
నిఫ్టీ ▲	375	25,791

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	17,948	▽	66
డోజోన్స్	42,063	△	38
ఎఫ్‌టీఎస్ఈ 100	8,230	▽	99
డాక్స్	18,720	▽	282
హాంగ్‌సెంగ్	2,737	△	1
నికాయ్	37,724	△	569

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎకటం	83.23	84.25
£	బ్రిటన్ పౌండ్	ఎకటం	109.42	112.04
€	యూరో	ఎకటం	92.32	94.71
¥	జపాన్ ఎన్ (100)	ఎకటం	58.25	59.59
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎకటం	56.17	58.12
S$	సింగపూర్ డాలర్	ధామసకుశ	62.37	67.04
SAR	సౌదీ రియాల్	ధామసకుశ	21.39	22.94
UAE D	యూఏఈ దిర్హామ్	ధామసకుశ	21.86	23.64
¥	చైనా యువాన్	ధామసకుశ	10.97	12.79

ఎన్‌ఆర్‌ఐలకు ఫండ్స్ రూట్!

స్వదేశంలో పెట్టుబడి అవకాశాలు
- దీర్ఘకాలంలో మెరుగైన రాబడులు
- పెట్టుబడుల పరంగా వైవిధ్యం
- భారత్‌లో విశ్రాంత జీవనానికి తగినంత నిధి
- పన్ను కోణంలోనూ ఆకర్షణీయం

మెరుగైన ఆర్థిక వృద్ధితో భారత్ పెట్టుబడులకు ఆకర్షణీయమైన చిరునామాగా నిలుస్తోంది. దేశ, విదేశీ ఇన్వెస్టర్లు పెద్ద మొత్తంలో పెట్టుబడులతో ముందుకు వస్తున్న పరిస్థితి చూస్తున్నాం. విదేశాల్లో స్థిరపడిన భారతీయులకు (ఎన్‌ఆర్‌ఐలు) సైతం భారత ఈక్విటీ అవకాశాలు మెరుగైన ఆప్షన్ అని నిపుణులు చెబుతున్నారు. తమ పెట్టుబడులను వైవిధ్యం చేసుకోవడంతోపాటు, ఆకర్షణీయమైన రాబడులు, పన్ను ప్రయోజనాలను సొంతం చేసుకోవచ్చు. తమ విశ్రాంత జీవనాన్ని స్వదేశంలో ప్రశాంతంగా, హాయిగా గడపాలని కోరుకునే వారు.. భారత ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా మెరుగైన నిధిని ఏర్పాటు చేసుకోవచ్చు. పెట్టుబడులకు అనుకూల విధానాలు, వాతావరణంతోపాటు, మెరుగైన నియంత్రణలు భద్రతకు హామీనిస్తున్నాయి. దీర్ఘకాలంలో సంపద సృష్టికి లేదా స్థిరమైన ఆదాయం కోసం ఎన్‌ఆర్‌ఐలు ఫండ్స్‌ను ఎంపిక చేసుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. – సాక్షి, బిజినెస్ డెస్క్



ప్రత్యేక బ్యాంక్ ఖాతా అవసరం

మ్యూచువల్ ఫండ్‌లు (అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు/ఏఎంసీలు) విదేశీ మారకంలో పెట్టుబడులు స్వీకరించవు. అదే విధంగా ఎన్‌ఆర్‌ఐలు భారత్‌లో సాధారణ సేవింగ్స్ ఖాతాలో డిపాజిట్‌కు విదేశీ మారకద్రవ్య చట్టం (ఫెమా) అనుమతించదు. రూపాయి మారకంలో పెట్టుబడులకే అనుమతి ఉంటుంది కనుక ఎన్‌ఆర్‌ఐలు భారత ఈక్విటీ మార్కెట్లో ఇన్వెస్ట్ చేసేందుకు వీలుగా ప్రత్యేక బ్యాంక్ ఖాతా ఉండాలి. నాన్ రెసిడెంట్ ఎక్స్‌టర్నల్ అకౌంట్ (ఎన్‌ఆర్‌ఈ), నాన్ రెసిడెంట్ ఆర్డినరీ అకౌంట్ (ఎన్‌ఆర్‌వో), ఫారీన్ కరెన్సీ నాన్ రెసిడెంట్ (ఎఫ్‌సీఎన్‌ఆర్) అకౌంట్ అందుబాటులో ఉన్నాయి.

- ఎన్‌ఆర్‌ఈ ఖాతా అయితే.. విదేశాల్లో ఆర్జించిన మొత్తాన్ని స్వదేశానికి పంపుకునేందుకు ఉపకరిస్తుంది. ఈ ఖాతాలో డిపాజిట్లపై వచ్చే వడ్డీపై పన్ను లేదు.
- ఎన్‌ఆర్‌వో ఖాతా.. భారత్‌లో ఆదాయ వనరులను ఇక్కడే డిపాజిట్ చేసుకునేందుకు ఉపకరిస్తుంది. ఈ ఖాతా ద్వారా భారత్‌లో ఆదాయాన్ని భారత్‌లోనే ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఈ ఖాతాలోని డిపాజిట్లపై వడ్డీ ఆదాయం పన్ను పరిధిలోకి వస్తుంది. ఒక ఆర్థిక సంవత్సరంలో గరిష్ఠంగా మిలియన్ డాలర్లనే ఈ ఖాతా నుంచి విదేశీ ఖాతాకు మళ్లించుకోగలరు.
- విదేశీ కరెన్సీ రూపంలో డిపాజిట్లు కలిగి ఉండేందుకు ఎఫ్‌సీఎన్‌ఆర్ ఖాతా అనుకూలిస్తుంది. ఈ ఖాతాతో కరెన్సీ మారకం రేట్ల రిస్క్ లేకుండా చూసుకోవచ్చు. ఎఫ్‌సీఎన్‌ఆర్ టర్మ్ డిపాజిట్ ఖాతా కాగా, ఎన్‌ఆర్‌ఈ పొదుపు/కరెంటు/రికరింగ్/ఫిక్స్‌డ్ డిపాజిట్ ఖాతాగా పనిచేస్తుంది.
- చెక్, డీడీ, నెఫ్ట్ లేదా ఆర్‌టీజీఎస్ ద్వారా మ్యూచువల్ ఫండ్స్ యూనిట్లను కొనుగోలు చేస్తే.. ఈ నిధుల మూలాలు తెలియజేసేందుకు వీలుగా ఫారిన్ ఇన్‌వార్డ్ రెమిటెన్స్ సర్టిఫికెట్ (ఎఫ్‌ఐఆర్‌సీ)ను సమర్పించాల్సి ఉంటుంది. బ్యాంక్ ఛానళ్లు, బ్రోకరేజీ సంస్థల సాయంతోనూ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

కేవైసీ కీలకం



భారత మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడానికి ముందు కేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలి. ఇందుకోసం పాస్‌పోర్ట్ కాపీ, పుట్టిన తేదీ ధ్రువీకరణ కాపీ, పాన్, ఫొటో, విదేశీ చిరునామా ధ్రువీకరణ కాపీలను సమర్పించాలి. ప్రస్తుత నివాసం అది శాశ్వతమైనా లేదా తాత్కాలికమైనా సరే రుజువులు సమర్పించాలి. ఫారిన్ పాస్‌పోర్ట్ కలిగిన వారు ఓసీఐ కార్డ్ కాపీని ఇవ్వాల్సి ఉంటుంది.

పెట్టుబడుల మార్గాలు..

ఎన్‌ఆర్‌ఐలు తామే స్వయంగా లేదంటే పవర్ ఆఫ్ అటార్నీ (పీవోఏ) ద్వారా ఇతరుల సాయంతో మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. నేరుగా అంటే ఎన్‌ఆర్‌ఈ/ఎన్‌ఆర్‌వో ఖాతాను తెరిచి వాటి ద్వారా మ్యూచువల్ ఫండ్స్ యూనిట్లను కొనుగోలు చేయడం లేదా సిప్ ఏర్పాటు చేసుకోవచ్చు. ఇది వీలు కానప్పుడు.. భారత్‌లో తాము విశ్వసించే వ్యక్తికి ఈ పని అప్పగిస్తూ పీవోఏ ఇవ్వొచ్చు. మీ తరఫున సంబంధిత వ్యక్తి పెట్టుబడుల వ్యవహారాలు చూస్తారు. ప్రతి లావాదేవీ నిర్వహణ సమయంలో పీవోఏ లేదా నోటరైజ్డ్ కాపీని సమర్పించాల్సి ఉంటుంది. కొన్ని మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు ఎన్‌ఆర్‌ఐ స్వయంగా హాజరు కావాలని కోరుతున్నాయి. కొన్ని మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు యూఎస్‌ఏ, కెనడాలోని ఎన్‌ఆర్‌ఐల నుంచి పెట్టుబడులు అనుమ



తించడం లేదు. ఫారిన్ అకౌంట్ ట్యాక్స్ కాంప్లియన్స్ యాక్ట్ (ఫాక్టా) నిబంధనల అమలు ప్రక్రియ సంక్లిష్టంగా ఉండడమే దీనికి కారణం. ఎన్‌ఆర్‌ఐలు, యూఎస్ పౌరుల ఆర్థిక లావాదేవీల వివరాలను అమెరికా ప్రభుత్వంతో పంచుకోవాలని ఫాక్టా నిర్దేశిస్తోంది. విదేశీ ఆదాయంపై పన్ను ఎగవేతలను నిరోధించేందుకు ఈ నిబంధన పెట్టారు. పైగా అమెరికా, కెనడా నియంత్రణ సంస్థల వద్ద భారత అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. అందుకే అన్నీ కాకుండా, కొన్ని అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు యూఎస్‌ఏ, కెనడా నుంచి ఎన్‌ఆర్‌ఐల పెట్టుబడులను కొన్ని షరతుల మేరకు అనుమతిస్తున్నాయి. కనుక అమెరికా, కెనడాలోని ఎన్‌ఆర్‌ఐలు అదనపు డాక్యుమెంట్లను సమర్పించాల్సి రావచ్చు. ఆదిత్య బిర్లా సన్‌లైఫ్, నిప్పన్ ఇండియా, క్వాంట్ మ్యూచువల్ ఫండ్, సుందరం మ్యూచువల్, యూటీఐ మ్యూచువల్ ఫండ్ పథకాల్లో ఎన్‌ఆర్‌ఐలు ప్రత్యక్షంగా హాజరు కాకుండానే ఆన్‌లైన్‌లో, ఎలాంటి పరిమితులు లేకుండా ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఎన్‌ఆర్‌ఐలు ప్రత్యక్షంగా హాజరు కావాలనే సంస్థల్లో.. 360 వన్ మ్యూచువల్ ఫండ్, యాక్సిస్ మ్యూచువల్ ఫండ్, డీఎస్‌పీ మ్యూచువల్ ఫండ్, ఐటీఐ మ్యూచువల్ ఫండ్, కోటక్ మ్యూచువల్ ఫండ్, నవీ మ్యూచువల్ ఫండ్, ఎన్‌జే ఇండియా మ్యూచువల్ ఫండ్, పీపీఎఫ్‌ఏఎస్ ఫండ్, ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్, టారస్ మ్యూచువల్ ఫండ్, వైట్‌ఓక్ క్యాపిటల్ ఉన్నాయి. మోతీలాల్ ఓస్వాల్, ఐసీఐసీఐ మ్యూచువల్ ఫండ్, హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్, ఎడెల్‌వీజ్ మ్యూచువల్ ఫండ్, బంధన్ మ్యూచువల్ ఫండ్ కేవలం అమెరికాలోని ఇన్వెస్టర్ల నుంచే పెట్టుబడులు స్వీకరిస్తున్నాయి. ఇవి కూడా ఫిజికల్ మోడ్‌లోనే (భౌతిక రూపంలో) పెట్టుబడులు అనుమతిస్తున్నాయి. ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ మొదటి లావాదేవీ భౌతిక రూపంలో, తదుపరి లావాదేవీలు ఆన్‌లైన్‌లో నిర్వహించేందుకు అనుమతిస్తోంది. https://mfuindia.com/usa-canada-residents నుంచి యూఎస్, కెనడాలోని ఎన్‌ఆర్‌ఐలు మరిన్ని వివరాలను తెలుసుకోవచ్చు.

ఎన్‌ఆర్‌ఐ.. అంటే..?

నాన్ రెసిడెంట్ ఇండియన్ (ఎన్‌ఆర్‌ఐ)కు సంబంధించి నిర్వచనాన్ని ఆర్‌బీఐ విదేశీ మారకద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) స్పష్టంగా నిర్దేశించింది. విదేశాల్లో నివసించే భారత పౌరుడు లేదా భారత సంతతి వ్యక్తి అయినా కావచ్చు. ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 6 ప్రకారం గడిచిన ఆర్థిక సంవత్సరంలో 182 రోజుల కంటే ఎక్కువ కాలం విదేశంలో ఉంటే లేదా.. ఆమె/అతడు గతేడాది (కేలండర్ సంవత్సరం) 60 రోజులకు మించి విదేశంలో ఉన్నా.. గడిచిన నాలుగేళ్లలో 365 రోజులు అంతకంటే ఎక్కువ కాలం భారత్ వెలుపల ఉన్న వారిని ఎన్‌ఆర్‌ఐగా పరిగణిస్తారు.




అవకాశాలు..

మ్యూచువల్ ఫండ్స్‌లో రెగ్యులర్, డైరెక్ట్ అని రెండు రకాల ప్లాన్లు ఉన్నాయి. రెగ్యులర్ ప్లాన్లు మధ్యవర్తుల ప్రమేయంతో పొందేవి. అంటే పంపిణీదారులకు ఈ ప్లాన్ల ద్వారా కమీషన్ ముడుతుంది. కేవైసీ, డాక్యుమెంటేషన్ ప్రక్రియ, ఎటువంటి పథకాలను ఎంపిక చేసుకోవాలి తదితర సేవలను వీరి నుంచి పొందొచ్చు. వీరికి కమీషన్ చెల్లించాల్సి రావడంతో రెగ్యులర్ ప్లాన్లలో ఎక్స్‌పెన్స్ రేషియో (ఇన్వెస్టర్ల నుంచి వసూలు చేసే చార్జీ) ఎక్కువగా ఉంటుంది. డైరెక్ట్ ప్లాన్లు దీనికి విరుద్ధం. ఇందులో మధ్యవర్తులకు కమీషన్ చెల్లింపులు ఉండవు. దీంతో ఎక్స్‌పెన్స్ రేషియో డైరెక్ట్ ప్లాన్ల కంటే తక్కువగా ఉంటుంది. దీంతో దీర్ఘకాలంలో రెగ్యులర్ కంటే డైరెక్ట్ ప్లాన్లలో రాబడులు అధికంగా ఉంటాయి. ఒక పథకానికి సంబంధించి అది రెగ్యులర్ లేదా డైరెక్ట్ ప్లాన్ ఏది అయినా కానీ.. పెట్టుబడుల పోర్ట్‌ఫోలియో ఒక్కటే ఉంటుంది. డైరెక్ట్ ప్లాన్లు ఎంపిక చేసుకునే ఎన్‌ఆర్‌ఐలు తమ పెట్టుబడులను తామే నిర్వహించుకోగల అవగాహన కలిగి ఉండాలి. అప్‌స్టాక్స్, కువేరా, ఎన్‌ఆర్‌ఐలకు సంబంధించి వాన్స్ తదితర ప్లాట్‌ఫామ్‌లు డైరెక్ట్ ప్లాన్లలో పెట్టుబడులకు వీలు కల్పిస్తున్నాయి.

ఉపసంహరణ - పన్ను బాధ్యత

భారత మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెడితే లాభంపై రెట్టింపు పన్ను చెల్లించాల్సి వస్తుందన్న భయం అక్కర్లేదు. భారత్‌తో ద్వంద పన్నుల నివారణ ఒప్పందం (డీటీఏఏ) కుదుర్చుకున్న దేశాల్లోని ఎన్‌ఆర్‌ఐలు ఒక చోట పన్ను చెల్లిస్తే సరిపోతుంది. యూఎస్, కెనడా, మధ్య ప్రాచ్య దేశాలు సహా మొత్తం 80 దేశాలతో భారత్‌కు ఈ విధమైన ఒప్పందాలు ఉన్నాయి. మ్యూచువల్ ఫండ్స్ లాభాలపై భారత పౌరులకు, ఎన్‌ఆర్‌ఐలకు ఒకే రకమైన నిబంధనలు అమలవుతున్నాయి. ఎన్‌ఆర్‌ఐలు తమ మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులను ఆన్‌లైన్‌లోనే విక్రయించుకోవచ్చు. అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు లాభంపై పన్నును మినహాయించి మిగిలిన మొత్తాన్ని ఎన్‌ఆర్‌ఈ లేదా ఎన్‌ఆర్‌వో ఖాతాకు జమ చేస్తాయి. అన్ని ఏఎంసీలు ఎన్‌ఆర్‌ఐలు పెట్టుబడులు విక్రయించిన సందర్భంలో టీడీఎస్‌ను అమలు చేయాల్సి ఉంటుంది. ఈక్విటీ ఫండ్స్ అయితే ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.25 లక్షలకు మించిన లాభంపై 12.5 శాతం, అంతకులోపు విక్రయించగా వచ్చిన లాభం (స్వల్ప కాల మూలధన లాభం)పై 15 శాతం టీడీఎస్ అమలు చేస్తాయి. అదే డెట్ ఫండ్స్‌లో లాభాలపై పన్ను ఇన్వెస్టర్ వార్షిక ఆదాయానికి కలుస్తుంది. డీటీఏఏ కింద



పన్ను ప్రయోజనాలను క్లెయిమ్ చేసుకోవాలనుకునే వారు తాము నివసిస్తున్న దేశం నుంచి ట్యాక్స్ రెసిడెన్సీ సర్టిఫికెట్ (టీఆర్‌సీ) సమర్పించాల్సి ఉంటుంది. భారత్‌లో పన్ను చెల్లించిన ఎన్‌ఆర్‌ఐలు తమ దేశంలో డీటీఏఏ కింద పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. ఈఎల్‌ఎస్ఎస్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. గల్ఫ్ దేశాల్లోని ఎన్‌ఆర్‌ఐలు భారత మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవడం ద్వారా తమ విశ్రాంత జీవనానికి తగినంత నిధి సమకూర్చుకోవచ్చని రిటైర్మెంట్ విషయంలో సలహా, సూచనలు, పరిష్కారాలు అందించే 'ద్యోత సొల్యూషన్స్'కు చెందిన కౌశిక్ రామచంద్రన్ సూచిస్తున్నారు. మధ్య ప్రాచ్య దేశాల్లో పౌరసత్వం పొందలేరు కనుక రిటైర్మెంట్ తర్వాత స్వదేశానికి రావాల్సిందేనని, అలాంటి వారికి భారత మ్యూచువల్ ఫండ్స్ అనుకూలమని పేర్కొన్నారు.

డెట్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేయొచ్చా?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

హామీతో కూడిన రాబడులు ఇచ్చే బీమా పథకాల్లో ఇన్వెస్ట్ చేయొచ్చా? ఎంత మేర ఇన్వెస్ట్ చేయొచ్చు? – వినాయకరావు

గ్యారంటీడ్ బీమా ప్లాన్లలో రాబడులు తక్కువగా ఉంటాయి. బీమా రక్షణ కూడా తక్కువగానే ఉంటుంది. ఈ ప్లాన్లు బీమాను పెట్టుబడులతో కలుపుతాయి. దీంతో పాలసీదారు కాల వ్యవధి ముగిసే వరకు జీవించి ఉన్నా కానీ రాబడులు వస్తాయి. ముందుగా ఇన్సూరెన్స్‌ను పెట్టుబడులతో కలపరాదు. బీమా అనేది పెట్టుబడి కాదు. బీమా పాలసీదారు మరణించిన సందర్భంలో కుటుంబానికి టర్మ్ ఇన్సూరెన్స్ తగిన రక్షణ కల్పిస్తుంది. కాల వ్యవధి పూర్తయ్యే వరకు జీవించి ఉంటే ఏ మాత్రం రాబడి రాదు. ఇందులో అర్థం ఏమిటంటే జీవిత బీమా అన్నది మరణానికి సంబంధించిందే కానీ, జీవించి ఉండడానికి సంబంధించినది కాదు. టర్మ్ ఇన్సూరెన్స్ అన్నది అచ్చమైన జీవిత బీమా. జీవిత బీమాలో ఉత్తమమైనది. జీవితానికి రక్షణ కోసం దీనికే పరిమితం కావాలి. తక్కువ వ్యయానికే మెరుగైన కవరేజీ ఇందులో లభిస్తుంది. పెట్టుబడుల కోసం అయితే మ్యూచువల్ ఫండ్స్ పథకాలు లేదా ప్రత్యేకమైన పెట్టుబడుల సాధనాలను పరిశీలించండి. అవి మెరుగైన రాబడులు, సౌలభ్యంతో వస్తాయి.

నేను సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో రూ.12 లక్షలు సమకూర్చుకున్నాను. పెట్టుబడులకు సంబంధించి మరో 15 ఏళ్ల కాల వ్యవధి మిగిలి ఉంది. రూ.12 లక్షల్లో కొంత మొత్తాన్ని ఈ దశలో ఉపసంహరించుకుని డెట్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేయొచ్చా? – జోసెఫ్

ఈ తరహా నిర్ణయాల వెనుక ఉండే మానసిక భావోద్వేగాలు వేరు. మీరు విక్రయించిన తర్వాత మార్కెట్ పెరిగితే.. మరింత లాభం పొందే అవకా



శాన్ని కోల్పోయామని బాధ పడొచ్చు. తిరిగి మార్కెట్‌లోకి ప్రవేశించడం కష్టంగా అనిపించొచ్చు. విక్రయించిన మొత్తాన్ని ఖర్చు చేసే రిస్క్ కూడా లేకపోలేదు. ఒకవేళ మీరు విక్రయించిన తర్వాత మార్కెట్లు పడిపోయినట్టయితే.. మార్కెట్ గమనాన్ని కచ్చితంగా అంచనా వేశామన్న తప్పుడు అభిప్రాయానికి లోనుకావచ్చు. ముఖ్యంగా గడిచిన 3–4 ఏళ్ల నుంచి మార్కెట్లు పెరుగుతూనే ఉన్నాయి. దీంతో మార్కెట్లు పడిపోవడం మొదలైన తర్వాత.. తిరిగి పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా కనిష్ఠ స్థాయి చేరే వరకు మీరు వేచి చూడొచ్చు. కానీ మార్కెట్లు అంచనాకు అందవు. మీ నిర్ణయాలకు భిన్నం కూడా జరగొచ్చు. మీరు మార్కెట్లో ఉద్ధాన పతనాలను సిప్ రూపంలో విజయవంతంగా అధిగమించగలిగారు. ఫలితంగా రూ.12 లక్షలు సమకూర్చుకున్నారు. ఆటుపోట్ల కాలంలో సెన్సెక్స్ వారంలోనే 5 శాతానికి పైగా పడిపోయిన సందర్భాలున్నాయి. ఈ సవాళ్లు అన్నింటికీ ఎదురునిలిచి ప్రస్తుత లాభం సమకూర్చుకోగలిగారు. మార్కెట్లు నూతన గరిష్ఠాలకు చేరడం ఒకవేళ మీకు ఆందోళన కలిగిస్తుంటే, మీ అసెట్ అలోకేషన్ (పెట్టుబడుల కేటాయింపులు)ను సవరించుకోండి. బలమైన అసెట్ అలోకేషన్ విధానంతో ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా ఎప్పటికప్పుడు లాభాలను స్వీకరించొచ్చు. మీకు వెంటనే నగదు అవసరం అయితే, కొంత మొత్తాన్ని స్థిరాదాయ పథకాల్లోకి (డెట్) మళ్లించుకోవచ్చు. దీర్ఘకాల లక్ష్యాలు కలిగి ఉంటే మీ సిప్‌ను ఎప్పటి మాదిరే కొనసాగించొచ్చు. మార్కెట్ల కనిష్ఠాల్లో ఇన్వెస్ట్ చేస్తే మంచి రాబడులు వస్తాయి. కానీ, అది ఎప్పుడన్నది అంచనా వేయడం చాలా కష్టమైన పని.

ఎస్‌బీఐ | బ్రోకరేజ్: మోతీలాల్ ఓస్వాల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 782 టార్గెట్: రూ. 1,015

ఎందుకంటే: ఈ ఆర్థిక సంవత్సరం (2024–25) తొలి త్రైమాసికంలో ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) అంచనాలకు అనుగుణమైన పనితీరు కనబరిచింది. వార్షికంగా ఏప్రిల్–జూన్ (క్యూ1)లో రూ. 17,040 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. ఇందుకు నిర్వహణ వ్యయాల నియంత్రణ దోహదం చేసింది. నికర వడ్డీ ఆదాయం(ఎన్‌ఐఐ) 5.7 శాతం పుంజుకుని రూ. 41,130 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు (ఎన్‌ఐఎం) 3.22 శాతంగా నమోదయ్యాయి. నిర్వహణ వ్యయాలు 1 శాతం తక్కువగా రూ. 25,840 కోట్లకు పరిమితమయ్యాయి. దీంతో ప్రొవిజన్లకుముందు నిర్వహణ లాభం(పీపీవోపీ) అంచనాలకు అనుగుణంగా 5 శాతం బలపడి రూ. 26,450 కోట్లయ్యింది. వార్షికంగా లోన్‌బుక్ 16 శాతం జంప్‌చేయగా.. డిపాజిట్లలో 8 శాతం వృద్ధి నమోదైంది. కరెంట్, పొదుపు ఖాతాల (కాసా) నిష్పత్తి 0.4 శాతం నీరసించి 40.7 శాతానికి చేరింది. సీజనల్‌గా బలహీన క్వార్టర్ కావడంతో తాజా స్లిప్పేజీలు రూ. 7,903 కోట్లుగా నమోదయ్యాయి.



క్రెడిట్ వ్యయాలు 0.32 శాతం నుంచి 0.48 శాతానికి పెరిగాయి. స్థూల మొండిబకాయిలు (ఎన్‌పీఏలు) నామమాత్రంగా మెరుగుపడి 2.2 శాతానికి చేరగా.. నికర ఎన్‌పీఏలు యథాతథంగా 0.6 శాతం వద్దే నిలిచాయి. ప్రొవిజన్ల కవరేజీ నిష్పత్తి (పీసీఆర్) 0.61 శాతం నీరసించి 74.4 శాతాన్ని తాకింది. పూర్తి ఏడాదికి క్రెడిట్ వ్యయాలు 0.5 శాతానికి చేరవచ్చని ఎస్‌బీఐ అంచనా (గైడెన్స్) వేసింది. పునర్‌వ్యవస్థీకరించిన రుణాలు (అడ్వాన్సులలో 0.4 శాతానికి సమానం) రూ. 16,000 కోట్లకు చేరాయి. ఎస్‌ఎంఏ (రుణాలలో 0.12 శాతం) పోర్ట్‌ఫోలియో రూ. 4,600 కోట్లుగా నమోదైంది.

డీదేవ్ ప్లాస్టిక్స్ | బ్రోకరేజ్: యూఎల్‌జేకే రీసెర్చ్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 333 టార్గెట్: రూ. 477

ఎందుకంటే: పీవీసీ ప్రొడక్టుల కంపెనీ డీదేవ్ ప్లాస్టిక్స్ ఇండస్ట్రీస్ (డీపీఐఎల్) మార్జిన్లు పెంచుకునే వ్యూహాత్మక ప్రణాళికలకు తెరతీసింది. దీనిలో భాగంగా తక్కువ మార్జిన్ల పీవీసీ ప్రొడక్టుల నుంచి అధిక మార్జిన్లు ఆర్జించగల ప్రొడక్టులవైపు దృష్టి మరల్చింది. ఇందుకు అనుగుణంగా ఎక్స్‌ఎల్‌పీఈ కాంపౌండ్స్ అమ్మకాలు పెంచుకునేందుకు నిర్ణయించింది. తద్వారా భవిష్యత్‌లో లాభదాయకతకు దారిచూపే వ్యూహాలను అమలు చేస్తోంది. దీంతో ఇకపై మార్జిన్లు మెరుగుపడే అవకాశముంది. సాధారణంగా విద్యుత్ ప్రసారం, పంపిణీ విభాగాలలో వినియోగించే ఎక్స్‌ఎల్‌పీఈ (క్రాస్ లింక్డ్ పాలీ ఎథిలీన్) కేబుళ్ల తయారీ అవకాశాలపై దృష్టి సారించింది. వీటి ఇన్సులేషన్‌కు ప్రధానంగా ఉపయోగపడే ఎక్స్‌ఎల్‌పీఈ కాంపౌండ్ అమ్మకాలకు ప్రాధాన్యత ఇస్తోంది. 132 కేవీ వరకూ కేబుళ్ల తయారీలో వీటిని వినియోగిస్తారు. తదుపరి కాలంలో 220 కేవీ కేబుళ్ల వరకూ సామర్థ్యాన్ని అప్‌గ్రేడ్ చేసే ప్రణాళికలు అమలు చేయనుంది. వెరసి రానున్న రెండేళ్ల(2024–25, 2025–26)లో నిర్వహణ లాభ(ఎబిటా) మార్జిన్లు 0.6 శాతం నుంచి 1.1 శాతానికి బలపడనున్నాయి. ఇందుకు అధిక విలువగల ప్రొడక్టులపై ప్రత్యేక దృష్టిని పెట్టింది. రానున్న మూడేళ్లలో దశలవారీగా రూ. 300 కోట్ల పెట్టుబడులను వెచ్చించనుంది. ఈ ఆర్థిక సంవత్సరం (2025)లో రూ. 125 కోట్లు, వచ్చే ఏడాది రూ. 70 కోట్లు, ఆపై ఏడాది మిగిలిన నిధులను కేటాయించనుంది. ఈ ఏడాది పెట్టుబడుల ద్వారా దేశ తూర్పు, పశ్చిమ ప్రాంతాలలో కొత్త ప్లాంట్ల ఏర్పాటుకు తెరతీయనుంది. ఈ బాటలో ప్రస్తుత హెచ్‌ఎఫ్‌ఎఫ్‌ఆర్ కాంపౌండింగ్ వార్షిక సామర్థ్యాన్ని 5,000 టన్నుల నుంచి 20,000 టీపీఏకు పెంచనుంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..
రికార్డుల ర్యాలీ కొనసాగొచ్చు | లగ్జరీ కార్ల పండుగ

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

23-9-2024	
విశాఖ	555-00
చిత్తూరు	553-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	550-00
విజయవాడ	555-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	525-00
వరంగల్	527-00
రిటైల్ ధర	5.85

వొడాఫోన్ ఐడియా భారీ కాంట్రాక్టులు

న్యూఢిల్లీ: టెలికం కంపెనీ వొడాఫోన్ ఐడియా (వీఐఎల్) తాజాగా భారీ కాంట్రాక్టులకు తెరతీసింది. 4జీ, 5జీ నెట్‌వర్క్ పరికరాల కొనుగోలు కోసం రూ. 30,000 కోట్ల విలువైన కాంట్రాక్టులు ఇచ్చింది. మూడేళ్లలో వీటిని సరఫరా చేసేందుకు దిగ్గజాలు నోకియా, ఎరిక్సన్, శామ్‌సంగ్‌లను ఎంపిక చేసుకుంది. వెరసి ఈ ఏడాది భారీ ఆర్డర్లను ఇచ్చిన టెలికం ఆపరేటర్‌గా వొడాఫోన్ ఐడియా నిలిచింది. మూడేళ్ల కాలంలో 6.6 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 55,000 కోట్లు) పెట్టుబడులు వెచ్చించేందుకు కంపెనీ ప్రణాళికలు వేసిన సంగతి తెలిసిందే. వీటిలో భాగంగా తొలి దశ కింద తాజా కాంట్రాక్టులకు తెరతీసింది. మూడేళ్లలో 4జీ, 5జీ కవరేజీకి వీలుగా నోకియా, ఎరిక్సన్, శామ్‌సంగ్‌లు పరికరాలు సరఫరా చేయవలసి ఉంటుందని వొడాఫోన్ ఐడియా ప్రకటన పేర్కొంది. సరఫరాలు డిసెంబర్ క్వార్టర్ నుంచి ప్రారంభం కానున్నట్లు వెల్లడించింది. తద్వారా 4జీ కవరేజీని 1.03 బిలియన్ నుంచి 1.2 బిలియన్ల జనాభాకు పెంచడం, కీలక మార్కెట్లలో 5జీ సేవలను ప్రవేశపెట్టడం, డేటా వినియోగానికి అనుగుణంగా సామర్థ్యాన్ని విస్తరించడం చేపట్టనున్నట్లు తెలియజేసింది. తొలుత 4జీ కవరేజీని 120 కోట్ల మందికి చేరువ చేయడానికి ప్రాధాన్యత ఇస్తుంది.

4జీ, 5జీపై రూ. 30,000 కోట్ల వ్యయం



వీఐఎల్ 2.0కు శ్రీకారం...

వీఐఎల్ 2.0 పేరుతో పెట్టుబడుల ప్రక్రియను ప్రారంభించినట్లు వొడాఫోన్ ఐడియా సీఈవో అక్షయ మూంద్రా తెలియజేశారు. నోకియా, ఎరిక్సన్ కంపెనీ ప్రారంభం నుంచి భాగస్వాములుకాగా.. తాజాగా శామ్‌సంగ్‌తో ప్రయాణం ప్రారంభించడం ప్రోత్సాహకర అంశమని వ్యాఖ్యానించారు. 2018లో ఐడియా సెల్యులర్‌తో విలీనం అనంతరం వొడాఫోన్ ఐడియాగా ఏర్పాటైనప్పుడు 40.8 కోట్ల మంది కస్టమర్లతో అతిపెద్ద టెలికం ఆపరేటర్‌గా అవతరించింది. అయితే ఆపై జియో, ఎయిర్‌టెల్‌తో ఎదురైన తీవ్ర పోటీలో వెనకబడటంతో ప్రతీ నెలా కస్టమర్ల సంఖ్య తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం వీఐఎల్ వినియోగదారుల సంఖ్య 21.5 కోట్లు.



ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇవేణుగోపాల్ ఆదివారం దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయగా, వేద పండితులు ఆశీర్వచనం, ఆలయ ఏఈవో ఎన్. రమేశ్‌బాబు, ఏపీఆర్వో బలరామ్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

– ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ)

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 25 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 82,406 మంది స్వామివారిని దర్శించుకోగా 31,151 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.68 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం అవుతోంది.

డబ్బు కట్టలేదని కుట్లు విప్పేశారు

- కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఘటన
- ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకున్న బాధితుడు



కామారెడ్డిలోని ప్రైవేట్ ఆస్పత్రి సిబ్బందితో బాధితుడి స్నేహితుల వాగ్వాదం

కామారెడ్డి టౌన్: గాయాలకు కుట్లు వేసినందుకు డబ్బులు చెల్లించకపోవడంతో ఆస్పత్రి సిబ్బంది రోగిపై దాడి చేసి, కుట్లు విప్పేశారు. కామారెడ్డి పట్టణంలోని అపెక్స్ ఆస్పత్రిలో ఆదివారం ఈ ఘటన చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన శ్రీను అనే వ్యక్తి బైక్‌పై వెళుతూ అదుపుతప్పి కిందపడిపోయాడు. గాయాలు కావడంతో పట్టణంలోని అపెక్స్ ఆస్పత్రికి వెళ్లాడు. కన్సల్టేషన్ ఫీజు కింద రూ.300 చెల్లించాడు. ఆస్పత్రి సిబ్బంది అతని గాయాలకు కుట్లు వేసి.. వెయ్యి రూపాయలు బిల్లు వేశారు. అయితే బాధితుడి వద్ద నగదు లేకపోవడంతో క్రెడిట్ కార్డు ద్వారా చెల్లిస్తానని చెప్పాడు. ఆస్పత్రి సిబ్బంది దీనికి అంగీకరించకపోవడంతో వాగ్వాదం జరిగింది. దీంతో ఆగ్రహించిన ఆస్పత్రి సిబ్బంది బాధితుడితో పాటు అతడి స్నేహితులపై దాడికి పాల్పడ్డారు. ఈ చర్యతో ఆస్పత్రి వద్ద ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. చివరికి రోగికి వేసిన కుట్లు విప్పేసి పంపించారు. ఆస్పత్రి సిబ్బంది తీరుపై బాధితుడు ఆందోళనకు దిగాడు. సుమారు అరగంటపాటు అతని ఆందోళన కొనసాగింది. అనంతరం బాధితుడు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకున్నాడు.



ఇది జపాన్‌లోని టడామీ లైన్.. ప్రకృతి మధ్య సాగే ఈ రైలు ప్రయాణం ఎంతో హాయిగా ఉంటుంది. పైగా.. నిశీరాతిరిలో మంచు కురిసే వేళలో అంటే.. ఊహాలోకంలో విహరించినట్లే ఉంటుంది. ఈ ఫొటోను తకేషి కామేయామా అనే ఫొటోగ్రాఫర్ తీశారు. నేచురల్ ల్యాండ్‌స్కేప్ ఫొటోగ్రఫీ పురస్కారాల్లో నైట్‌స్కేప్ విభాగంలో ఈ చిత్రం మూడో బహుమతిని గెలుచుకుంది..

బెండ'చెట్టు'!



సహజంగా బెండకాయ మొక్కలు మూడు నుంచి నాలుగు అడుగులు ఎత్తు పెరిగి కాయలు కాస్తాయి. కృష్ణా జిల్లా కోడూరు మండలం లింగారెడ్డి పాలెంలోని బెండ మొక్కలు 13 అడుగుల ఎత్తు పెరిగి అబ్బురపరుస్తున్నాయి. చిట్టిప్రోలు కేశవ్‌కుమార్ లింగారెడ్డిపాలెంలోని తనకున్న మెట్ట భూమిలో డ్రాగన్ ఫ్రూట్స్ సాగు చేస్తున్నారు. వాటి మధ్యలో రెండు బెండ మొక్కలను నాటగా.. అవి సుమారు 13 అడుగులు పెరిగి ఆశ్చర్యపరుస్తున్నాయి.

– కోడూరు

కాలకృత్యం.. నిత్య నరకం!

సంక్షేమ గురుకులాల్లో బాత్రూమ్‌లు, టాయిలెట్లు సరిగాలేక విద్యార్థులకు అవస్థలు

- చాలా చోట్ల 30 నుంచి 60 మందికి ఒక బాత్రూమ్.. టాయిలెట్లూ నామమాత్రమే
- పేరుకు ఉన్నా నీటి వసతి లేక, నిర్వహణ సరిగా లేక వాడలేని దుస్థితి
- రెండు, మూడురోజులకోసారి స్నానం చేయాల్సి వస్తోందంటున్న విద్యార్థులు
- బాలికల గురుకులాల్లో పరిస్థితి మరీ దారుణం
- పరిశుభ్రత పాటించలేక అనారోగ్యాల పాలవుతున్న తీరు

పొద్దున లేచాక పళ్లుతోముకోవాలి, కాలకృత్యాలు తీర్చుకోవాలి, స్నానం చేయాలి, బడికి వెళ్లాలి, చదువుల్లో పోటీపడాలి.. పిల్లలెవరికైనా ఇది మామూలే. కానీ రాష్ట్రంలోని సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో మాత్రం.. పొద్దున లేస్తే క్యూలైన్లలో నిల్చోవాలి. కాలకృత్యాల కోసం, స్నానం కోసం.. పోటీపడి లైన్ కట్టాలి. ఆ తర్వాతే.. బడి, చదువు. విద్యార్థుల సంఖ్యకు తగినట్లు బాత్‌రూమ్‌లు, టాయిలెట్లు లేకపోవడంతో, ఉన్నవీ పాడైపోవడంతో తీవ్ర ఇబ్బంది ఎదురవుతోంది. ముఖ్యంగా బాలికల గురుకులాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. చాలినన్ని బాత్రూములు లేక.. చాలా మంది విద్యార్థినులు రెండు, మూడు రోజులకోసారి స్నానం చేసే పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి తమ బాధను తీర్చాలని వేడుకుంటున్నారు.



ఆదిలాబాద్ గిరిజన గురుకుల పాఠశాలలో ఆరుబయటే కాలకృత్యాలు తీర్చుకుంటున్న విద్యార్థులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో కనీస వసతులు లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. విద్యార్థుల సంఖ్యకు తగినట్టుగా టాయిలెట్లు, బాత్రూమ్‌లు లేక.. ఉన్న కాసిన్ని కూడా సరిగా లేక నానా తంటాలు పడుతున్నారు. కాలకృత్యాలు కూడా సరిగా తీర్చుకోకుండా, రెండు మూడు రోజులకోసారి స్నానం చేస్తూ అనారోగ్యాల పాలవుతున్నారు. రాష్ట్రంలో ఐదు గురుకుల సొసైటీలు ఉన్నాయి. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్), తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీజీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్), మహాత్మ జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ ఈఐఎస్), తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీఎంఆర్‌ఈఐఎస్)లు ఆయా సంక్షేమ శాఖల పరిధిలో కొనసాగుతుండగా.. తెలంగాణ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(టీజీఆర్‌ఈఐఎస్) నేరుగా పాఠశాల విద్యా శాఖ పరిధిలో కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని గురుకుల సొసైటీల పరిధిలో 967 గురుకుల పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 6,18,880 మంది విద్యార్థులు చదువుతున్నారు.

డిమాండ్‌కు తగిన మేరకు లేక..

ఒక్కో గురుకుల విద్యా సంస్థలో 640 మంది విద్యార్థులుంటారు. ఐదో తరగతి నుంచి పదోతరగతి వరకు 480 మంది విద్యార్థులు కాగా.. ఇంటర్మీడియట్‌లో 160 మంది ఉంటారు. గురుకుల పాఠశాల వసతుల్లో భాగంగా కనీసం పది మంది విద్యార్థులకు ఒక బాత్రూం, కనీసం ఏడుగురికి ఒక టాయిలెట్ ఉండాలనేది నిబంధన. ఈ లెక్కన ఒక్కో గురుకుల పాఠశాలలో 64 బాత్రూమ్‌లు, 90 టాయిలెట్లు ఉండాలి. కనీసం పది మందికి ఒకటి చొప్పున ఉన్నా సర్దుకుపోయే పరిస్థితి ఉంటుంది. కానీ చాలాచోట్ల 1:20 నిష్పత్తిలో కూడా లేవు. గురుకుల విద్యా సంస్థల్లో బాత్రూమ్‌లు, టాయిలెట్ల పరిస్థితి తెలుసుకునేందుకు ఓ సంస్థ సమాచార హక్కు చట్టం కింద 29 గురుకులాల్లో వివరాలను సేకరించింది. ఆ 26 గురుకులాలు, 3 కేజీబీవీలలో ప్రస్తుతం 15136 మంది విద్యార్థులున్నారు. వారికి 1,513 బాత్రూంలు అవసరమవగా.. 870 మాత్రమే ఉన్నాయి. 1:10 నిష్పత్తిలో లెక్కించినా.. 644 బాత్రూమ్‌లు తక్కువగా ఉన్నాయి. ఇక 2,162 టాయిలెట్లు అవసరంకాగా.. 1,104 మాత్రమే ఉన్నాయి. ఇందులోనూ తలుపులు సరిగా లేనివి, నిర్వహణ సరిగా లేక పాడైపోయినవీ గణనీయంగానే ఉన్నాయి. దీంతో వీలు చిక్కినప్పుడే స్నానాలు చేస్తున్నామని.. కాలకృత్యాలు తీర్చుకోవడాన్నికూడా వాయిదా వేసుకోవాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితి ఎక్కువ కాలం కొనసాగితే వారి ఆరోగ్యంపైన తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందన్న ఆందోళన కూడా కనిపిస్తోంది. శాశ్వత ప్రాతిపదిన ఉన్న గురుకులాల్లో కంటే.. అద్దె భవనాల్లో కొనసాగుతున్న వాటిలో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంది.

అనారోగ్యాల పాలవుతున్న విద్యార్థులు

రోజూ ఉదయం లేవగానే కాలకృత్యాలు తీర్చుకోవాలి, పళ్లుతోముకుని, స్నానం చేయాలని ప్రాథమిక విద్య నుంచే బోధిస్తారు. కానీ గురుకులాల్లో ఈ పరిస్థితి ఉండటం లేదని విద్యార్థులు వాపోతున్నారు. స్నానం సరిగా చేయకపోవడం, కాలకృత్యాలు తీర్చుకోవడంలో తేడాలతో.. వివిధ రకాల అనారోగ్యాల బారినపడుతున్నామని అంటున్నారు. ఈ తీరు మంచిది కాదని వైద్య నిపుణులు కూడా స్పష్టం చేస్తున్నారు.

రాష్ట్ర రాజధానిలోనూ అలాగే..

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఉన్న సంక్షేమ గురుకులాల పరిస్థితి కూడా అధ్వానంగా ఉంది. చాలా చోట్ల బాత్రూమ్‌లు, టాయిలెట్లు నిర్వహణ సరిగా లేక పాడైపోయాయి. కాస్త బాగున్న వాటికీ తలుపులు విరిగిపోయి వాడుకోలేని పరిస్థితి ఉంది. ఉదాహరణకు కొత్తపేటలోని సరూర్‌నగర్ సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో మొత్తం 640 మంది చదువుతున్నారు. మూడు అంతస్తుల ఈ భవనంలో ఫ్లోర్‌లో 15 టాయిలెట్స్ ఉన్నా.. అందులో సగం పనిచేయట్లేదని, నీళ్లు రావడం లేదని విద్యార్థినులు వాపోతున్నారు.

ఏ గురుకులం చూసినా.. ఇదే దుస్థితి..

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేటలోని ఎస్టీ గురుకులంలో 619 మంది విద్యార్థులుంటే తొమ్మిదే బాత్రూమ్‌లు ఉన్నాయి. టాయిలెట్లు 50 మాత్రమే ఉన్నాయి.
- సంగారెడ్డి జిల్లా జిన్నారం ఎస్టీ గురుకుల పాఠశాలలో 589 మంది విద్యార్థులుంటే.. పది బాత్రూమ్‌లు, 20 టాయిలెట్లు మాత్రమే ఉన్నాయి.
- కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ ఎస్సీ గురుకుల పాఠశాలలో 511 మంది విద్యార్థులకుగాను 20 బాత్రూమ్‌లు, 40 టాయిలెట్లు ఉన్నాయి.
- ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్టీ గురుకుల పాఠశాలలో 640 మంది విద్యార్థులకు 20 బాత్రూమ్‌లు, 42 టాయిలెట్లు మాత్రమే ఉన్నాయి.
- హైదరాబాద్‌లోని బోరబండలోని బాలుర గురుకుల పాఠశాలలో 565 మంది విద్యార్థులుంటే కేవలం 7 బాత్రూమ్‌లు, 33 టాయిలెట్లు ఉన్నాయి.





ఒక్క బాత్రూమ్‌కు కూడా తలుపు లేదు

మా స్కూల్‌లో 620 మంది విద్యార్థులున్నారు. బాత్రూమ్‌లు ఉన్నా ఒక్కదానికి కూడా డోర్ లేదు. మేమంతా బయట సంపు దగ్గరే స్నానాలు చేస్తాం. ఇక 36 టాయిలెట్లు ఉన్నా.. పొద్దున్నే పెద్ద లైన్ ఉంటుంది. దీంతో సమీపంలోని చెట్ల పొదల్లోకి వెళ్లాల్సి వస్తోంది.



– విష్ణు, ఐదోతరగతి, గిరిజన గురుకుల పాఠశాల, కిన్నెరసాని

మూడే పని చేస్తున్నాయి

మా స్కూల్ ఆవరణలో 17 మరుగుదొడ్లు ఉన్నా.. మూడింటిలోనే నీళ్లు వస్తున్నాయి. మరుగు దొడ్లు కంపు కొడుతూనే ఉంటాయి. మేమంతా బయటికే వెళ్లాల్సి వస్తుంది. విద్యార్థులకు సరిపడా స్నానపు గదులు లేక.. చాలా మంది బోరు బావి నల్లా వద్దే స్నానాలు చేస్తారు. కొందరైతే నాలుగైదు రోజులకు ఒకసారి స్నానాలు చేస్తారు.



– ఆర్.ప్రసాద్, 9వ తరగతి, గిరిజన గురుకుల పాఠశాల, ఆదిలాబాద్

రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలు, విద్యార్థుల సంఖ్య లెక్కలివీ..

గురుకుల సొసైటీ	స్కూళ్లు	విద్యార్థులు
టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్	268	1,71,520
టీజీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్	165	1,05,600
ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్	295	1,88,800
టీఎంఆర్‌ఈఐఎస్	204	1,30,560
టీజీఆర్‌ఈఐఎస్	35	22,400

ఉదయం 6 గంటలకే.. కలెక్టర్ గురుకులాల బాట




గిర్మిబావిలోని పూలే గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలసి టిఫిన్ చేస్తున్న కలెక్టర్ సత్యశారద

దుగ్గొండి: వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద ఆదివారం ఉదయం దుగ్గొండి మండలంలోని పలు గురుకుల పాఠశాలలను సందర్శించారు. ఉదయం 6 గంటలకే కలెక్టర్ మల్లంపల్లిలోని కేజీబీవీ, 7 గంటలకు మండల కేంద్రంలోని బీసీ బాలుర హాస్టల్, 8 గంటలకు గిర్నిబావిలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకులాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం, కూరలు బాగా ఉండటం లేదని, దోమలు ఎక్కువగా ఉన్నాయని వారు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలసి అల్పాహారం చేశారు. ఫిర్యాదుల బాక్స్‌లను తెరిచి ఫిర్యాదులను పరిశీలించారు. అనంతరం గురుకుల్లాలో పారిశుధ్య పనులు చేపట్టి దోమలను నియంత్రించాలని సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు.

జ్ఞాపక శక్తికి ఏడు సూత్రాలు

సాక్షి, హైదరాబాద్: ఉరుకులు పరుగుల జీవితంలో ప్రతి పనికి ఏదో ఒక వస్తువుపై ఆధారపడటం సర్వసాధారణంగా మారింది. ఇది మోతాదుకు మించటంతో జ్ఞాపక శక్తిపైనా ప్రభావం చూపుతోంది. జ్ఞాపక శక్తి అనేది ముఖ్యంగా విద్యార్థులకు ఎంతో కీలకం. చదివిన అంశాలు సరిగా గుర్తుంటేనే పరీక్షల్లో విజయం సాధించగలుగుతారు. అందుకే జ్ఞాపక శక్తిని పెంచుకోవటానికి కొన్ని సూత్రాలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. విద్యార్థులు తమ జ్ఞాపక శక్తిని పెంచుకునేందుకు గ్వాలియర్‌లోని అటల్ బిహారీ వాజ్‌పేయి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ సంస్థ అసిస్టెంట్ ప్రొఫెసర్ రోష్నీ చక్రవర్తి ఏడు సూత్రాలను సూచించారు. అవి..



1 తగినంత నిద్ర అత్యంత ప్రధానం..
జ్ఞాపశక్తిని మెరుగుపరచుకోవడానికి అతిముఖ్యమైనది సరిపడినంత నిద్ర. నిద్ర పోవడం వల్ల మెదడు న్యూరాన్ల సమన్వయాన్ని పెంచుకుంటుంది. విద్యార్థులు ప్రతి రోజు రాత్రి 7–9 గంటల పాటు నిద్రపోవడంతో మంచి ఫలితం ఉంటుంది.

2 మంచి ఆహారం..
ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్స్, యాంటి ఆక్సిడెంట్స్, విటమిన్లు ఎక్కువగా ఉండే నట్స్, చేపలు, ఆకుకూరలు ఎక్కువగా తినడం మనకు మేలు చేస్తుంది.

3 శారీరక ధృఢత్వం..
వ్యాయామం అనేది మెదడుకు రక్తప్రసరణను పెంచుతుంది. ప్రతి రోజూ నడక, వ్యాయామం చేయడం.. ఆటలు ఆడడం కూడా మన శారీరక ధృఢత్వంతోపాటు మానసిక ప్రశాంతత, జ్ఞాపకశక్తిని పెంచేందుకు ఉపయోగపడుతుంది.

4 సులువుగా గుర్తుంచుకోవడం అలవర్చుకోవాలి..
ఏదైనా ఒక అంశం క్లిష్టంగా ఉంటే దానిని మనకు అనుకూలంగా, సులువుగా గుర్తుండేలా చిన్నచిన్న అంశాలుగా విడగొట్టి గుర్తుంచుకోవడం సాధన చేయాలి. దీని వల్ల జ్ఞాపకశక్తిని పెంచుకోవచ్చు.

5 కొత్త అంశాలపై ఆసక్తి పెంచుకోవాలి..
ఏదైనా ఒక కొత్త అంశం గురించి తెలుసుకోవాన్న ఆసక్తిని పెంచుకోవాలి. ఆ విషయాన్ని గురించి ప్రశ్నిస్తూ, సమగ్రంగా వివరాలు తెలుసుకోవడం వల్ల కూడా జ్ఞాపకశక్తి పెరుగుతుంది.

6 మెడిటేషన్..
ధ్యానం అనేది మానసిక ఒత్తిడిని తగ్గించుకునేందుకు మంచి మార్గం. శ్వాసపైన ధ్యాస పెట్టడం, ధ్యానం సాధన చేయడంతోనూ జ్ఞాపకశక్తి పెరుగుతుంది.

7 తరచూ మననం చేయాలి ..
ఏదైనా అంశాన్ని బాగా గుర్తుంచుకోవాలంటే ఆ విషయాన్ని ఏదో ఒక రూపంలో పునరావృతం చేసుకుంటూ మననం చేస్తూ ఉండాలి. అందుకు నోట్స్ రాసుకోవడం, ఇతరులకు బోధించడంతో మన జ్ఞాపకశక్తి పెరుగుతుంది.

సైదాబాద్‌లో ఉగ్ర డెన్!

- ఉగ్రవాది రిజ్వాన్ అలీ షెల్టర్ తీసుకుంది హైదరాబాద్‌లోనే..
- గుర్తించిన ముంబై ఎన్ఐఏ అధికారులు.. నిందితుడిని తీసుకొచ్చి సోదాలు.. ఫ్లాట్ ఓనర్ నుంచి వాంగ్మూలం నమోదు

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీలో విధ్వంసానికి కుట్ర పన్ని ఎట్టకేలకు అక్కడి స్పెషల్ సెల్ పోలీసులకు చిక్కిన మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది రిజ్వాన్ అలీ టెర్రర్ డెన్‌ను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు హైదరాబాద్‌లో గుర్తించారు. భాగ్యనగరంలోని సైదాబాద్ శంఖేశ్వర్ బజార్‌లో ఉన్న గ్రీన్ వ్యూ అపార్ట్‌మెంట్‌లోనే అతను తలదాచుకున్నట్లు తెలుసుకున్నారు. దీంతో ఆదివారం రిజ్వాన్‌ను హైదరాబాద్ తీసుకొచ్చిన ముంబై ఎన్ఐఏ అధికారులు.. ఆ అపార్ట్‌మెంట్‌లో సోదాలు చేశారు. ఫ్లాట్ ఓనర్ నుంచి వాంగ్మూలం నమోదు చేసుకున్నారు.

ఆన్‌లైన్‌లో ప్రేరణతో ఐసిస్ బాట..

ఢిల్లీకి చెందిన రిజ్వాన్ అలీ డిగ్రీ పూర్తి చేశాక 2015–16లలో ఆన్‌లైన్ ద్వారా ప్రేరణ పొంది ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా (ఐసిస్) బాటపట్టాడు. జార్ఖండ్ నుంచి వచ్చి ఢిల్లీలోని షహీన్‌బాగ్‌లో స్థిరపడిన షానవాజ్‌తో 2017లో ఏర్పడిన పరిచయం అతన్ని ఉగ్రవాద బాట పట్టించింది. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, జార్ఖండ్, మహారాష్ట్రల్లో 'ఐసిస్'మాడ్యుల్ విస్తరణతోపాటు నిధుల సమీకరణ కోసం పనిచేశాడు. యువతను ఆన్‌లైన్ ద్వారా ఆకర్షించి ఉగ్రవాద బాటపట్టించాడు. 2023 జూన్‌లో పుణే అధికారులు ఈ మాడ్యుల్ గుట్టురట్టు చేసి పలువురిని అరెస్టు చేశారు. ఈ కేసును ప్రస్తుతం ముంబై ఎన్ఐఏ దర్యాప్తు చేస్తోంది. అప్పటి నుంచి అజ్ఞాతంలోకి వెళ్లిన రిజ్వాన్.. యూపీలోని సంభాల్ ప్రాంతంలో తలదాచుకున్నాడు. అతన్ని మోస్ట్ వాంటెడ్‌గా గుర్తించిన ఎన్ఐఏ రూ. 3 లక్షల రివార్డు కూడా ప్రకటించింది. ఈ ఏడాది జనవరిలో రిజ్వాన్ కదలికలను గుర్తించిన ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు సంభాల్‌లోని ఓ స్థావరంపై దాడి చేశారు. అప్పట్లో తృటిలో తప్పించుకున్న రిజ్వాన్.. అక్కడ నుంచి తన మకాంను ఈ ఏడాది మార్చిలో హైదరాబాద్‌కు మార్చాడు.


టు లెట్ బోర్డుల కోసం వెతుకులాట..

నగరంలోని కూర్మగూడ ప్రాంతానికి చెందిన, సుదీర్ఘకాలంగా పరారీలో ఉన్న ఉగ్రవాది ఫర్హతుల్లా ఘోరీతోనూ రిజ్వాన్ అలీ సంబంధాలు కలిగి ఉన్నాడు. అతని సలహా మేరకే నాంపల్లి రైల్వే స్టేషన్ నుంచి నేరుగా సైదాబాద్‌కు వచ్చి ప్రధాన రహదారిపై 'టు లెట్'బోర్డుల కోసం వెతికాడు. శంఖేశ్వర్ బజార్‌లో ఉన్న గ్రీన్ వ్యూ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ ఖాళీగా ఉన్నట్లు బోర్డు కనిపించడంతో యజమానిని సంప్రదించాడు. వస్త్ర వ్యాపారి ముసుగులో నెలకు రూ. 4 వేలకు అద్దెకు తీసుకొని దాదాపు 6 నెలలపాటు బస చేశాడు. ఇక్కడ నుంచి కేరళ వెళ్లిన రిజ్వాన్... ఆపై స్వాతంత్ర్య వేడుకల నేపథ్యంలో విధ్వంసాలకు కుట్రపన్నాడు. దీనికోసమే ఢిల్లీ వెళ్లి గత నెలలో అక్కడి స్పెషల్ సెల్ పోలీసులు చిక్కాడు. ఢిల్లీ–ఫరీదాబాద్ సరిహద్దుల్లో రిజ్వాన్‌ను పట్టుకున్న స్పెషల్ సెల్ అతన్నుంచి తుపాకీ, తూటాలు స్వాధీనం చేసుకుంది. రిజ్వాన్‌ను పుణే కేసులో ముంబై ఎన్ఐఏ అధికారులు అరెస్టు చేశారు. గత వారం ముంబైలోని ప్రత్యేక కోర్టులో హాజరుపరిచి తదుపరి విచారణ నిమిత్తం కస్టడీలోకి తీసుకున్నారు. ఈ విచారణ నేపథ్యంలోనే సైదాబాద్ మకాం విషయం బయటపడటంతో ఆదివారం ఇక్కడకు తరలించారు. హైదరాబాద్ పోలీసులతో కలిసి అపార్ట్‌మెంట్‌ను గుర్తించడంతోపాటు రిజ్వాన్‌ను అక్కడకు తీసుకెళ్లి విచారించారు. పేలుడు పదార్థాల తయారీలో నిష్ణాతుడిగా ఉన్న రిజ్వాన్ దేశంలోని వివిధ నగరాలను టార్గెట్‌గా చేసుకున్నాడని ఎన్ఐఏ చెబుతోంది.





రిజ్వాన్ అలీ



ఫర్హతుల్లా ఘోరీ

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
సోమవారం : 23-9-2024

మందు కొడుతున్నారు

మహిళల్లో క్రమక్రమంగా పెరుగుతున్న 'మద్యపానం' అలవాటు

- జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలో వెల్లడి
- టాప్‌లో అరుణాచల్ ప్రదేశ్, నాలుగో స్థానంలో తెలంగాణ



సాక్షి, హైదరాబాద్: మనదేశ మహిళల్లో మద్యం సేవించేవారి సంఖ్య క్రమక్రమంగా పెరుగుతోంది. పట్టణ ప్రాంతాలతో పోల్చితే గ్రామీణ ప్రాంతాల్లోనే ఇది అధికంగా ఉన్నట్టుగా తేలింది. ఆల్కాహాల్ అలవాటు అనేది ప్రజారోగ్యంతో ముడిపడి.. సమాజంలోని వివిధ వర్గాల ప్రజలను ఆందోళనకు గురిచేసే అంశంగా మారింది. మద్యపానానికి అలవాటు పడడం వల్ల 60కు పైగా అనారోగ్యాలు, ఇతర సమస్యలకు దారి తీస్తున్నట్టుగా నిపుణులు హెచ్చరిస్తున్నారు. మద్యం తీసుకునే అలవాటు పెరగడం, ఓ రుగ్మతగా, మానలేని అలవాటుగా మారింది. గత పదేళ్లలో భారత్‌లో మద్యపాన వినియోగమనేది గణనీయంగా పెరిగినట్టుగా వివిధ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2019లో జర్మనీలోని టీయూ డ్రిస్‌డేన్ నిర్వహించిన అధ్యయనంలో 2010- 2017 మధ్యలో భారత్‌లో ఆల్కాహాల్ వినియోగం 38 శాతం పెరిగినట్టుగా వెల్లడైంది. ఏడాదికి ఒక్కో వయోజనుడు (అడల్ట్ పర్ ఇయర్) 4.3 లీటర్ల నుంచి 5.9 లీటర్లకు మద్యం సేవిస్తున్నట్టుగా తేలింది. ఈ కాలంలోనే స్థానికంగా విస్కీ, జిన్ వంటివి పెద్దమొత్తంలో తయారుకావడంతో పురుషులు, మహిళల్లో మద్యపానం అనేది మరింతగా పెరిగినట్టుగా అంచనా వేస్తున్నారు.

భారత్..మూడో అతిపెద్ద మార్కెట్

చైనా, రష్యాల తర్వాత.. భారత్ లిక్కర్‌కు మూడో అతిపెద్ద మార్కెట్‌గా మారింది. భారత్‌లో మద్యం వినియోగిస్తున్న వారి సంఖ్య పెరగడానికి.వివిధ రాష్ట్రాల్లోని సాంస్కృతిక, సామాజిక, ఇతర పరిస్థితులు ప్రభావితం చేస్తున్నట్టుగా తేలింది. మనదేశంలోని వివిధ ప్రాంతాల్లో మద్యపానమనేది ఉన్నతవర్గాల జీవనశైలికి ప్రతిబింబంగా గతంలో గుర్తించిన పరిస్థితులున్నాయి. ఇతర ప్రాంతాల్లో రోజువారి జీవనంలో భాగంగా ఎదురయ్యే మానసిక ఒత్తిళ్లు, భయాలు, ఆందోళనలు వంటి వాటిని అధిగమించేందుకు ఓ సాధనంగా మద్యపానాన్ని చూస్తున్నారు. అదీగాకుండా ఖరీదైన మద్యమే కాకుండా, అన్ని వర్గాల వారికి (మహిళలతో సహా) చీప్ లిక్కర్ అనేది సులభంగా అందుబాటులోకి రావడంతో మద్యం సేవించడం అనేది అలవాటుగా మారుతున్నట్టుగా అంచనా వేస్తున్నారు. ఎంతో కాలంగా కట్టుబాట్లు, సామాజికపరంగా వివక్ష, వేధింపులకు గురైన మహిళలు మద్యపానంతోపాటు ఇతర విషయాల్లోనూ తమ సొంత నిర్ణయాలు తీసుకోగలుగుతున్నారు. ఆల్కాహాల్ వినియోగం, మద్యపానం ఉపయోగించే పద్ధతులు ఒక్కో రాష్ట్రానికి ఒక్కో విధంగా భౌగోళిక పరంగానూ మారుతున్నాయి.

టాప్-7 స్టేట్స్ ఇవే...

నేషనల్ ఫ్యామిలీ హెల్త్‌సర్వే-5 2019-20 డేటాను పరిశీలిస్తే మనదేశంలోని ఏడు రాష్ట్రాల్లో మహిళలు అధికంగా మద్యపానానికి అలవాటు పడినట్టుగా వెల్లడైంది. అందులో తెలంగాణ నాలుగో స్థానంలో ఉంది.

- 15-49 ఏళ్ల మధ్య వయస్కుల్లో 26 శాతం మహిళలు మద్యం సేవిస్తుండగా, అరుణాచల్‌ప్రదేశ్ టాప్-1లో ఉంది. ఆ రాష్ట్ర సంస్కృతీ సంప్రదాయాల్లో భాగంగా ఆల్కాహాల్ తీసుకోవడం అధికంగా ఉన్నట్టుగా వెల్లడైంది. మద్యం సేవించడాన్ని అక్కడ ప్రోత్సహిస్తారు. ఆ రాష్ట్ర గిరిజన తెగల సంప్రదాయాలు, కట్టుబాట్లలో భాగంగా రైస్ బీర్ (అపాంగ్)ను అతిథులకు అందజేస్తారు.
- సిక్కింలో 16.2 శాతం మహిళలు మద్యం సేవిస్తున్నారు. ఇళ్లలోనే మద్యం తయారీకి ప్రసిద్ధిగా ఆ రాష్ట్రం గుర్తింపు పొందింది. కొన్నితరాలుగా ఈ సంప్రదాయం అక్కడ కొనసాగుతోంది. మద్యం సేవించడాన్ని సంస్కృతితో ముడిపడినట్టుగా భావిస్తారు అక్కడ.
- అస్సోంలో 7.3 శాతం మంది మహిళలు ఆల్కాహాల్ తీసుకుంటారు. ఆ రాష్ట్రంలోని గిరిజన, ఆదివాసీ తెగలు మద్యం తయారీలో కొన్ని తరాలుగా నిమగ్నమై ఉన్నాయి. అక్కడ మద్యపానం అనేది ఓ జీవనశైలిగానూ, ఓ తంతుగా పరిగణిస్తారు.
- దక్షిణాది రాష్ట్రాల్లో చూస్తే... తెలంగాణలో 6.7 శాతం మహిళలకు మద్యం అలవాటు ఉన్నట్టుగా తేలింది. పట్టణ ప్రాంతాలతో పోల్చితే గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలే అధికంగా మద్యం సేవిస్తున్నట్టుగా వెల్లడైంది.
- జార్ఖండ్‌లో 6.1శాతం మహిళలు. మరీ ముఖ్యంగా గిరిజన తెగలకు చెందిన వారిలోనే మద్యం అలవాటు అధికంగా ఉన్నట్టుగా తేలింది. వీరికి ఉద్యోగ, ఉపాధిపరంగా అవకాశాలు చాలా తక్కువగా ఉండడంతో ఈ తెగల్లోని అత్యధికులు రోజువారీ సవాళ్లను ఎదుర్కొనేందుకు మద్యపానం అలవాటుగా చేసుకున్నారు.
- అండమాన్, నికోబార్ దీవుల్లో 5 శాతం మహిళలు మద్యానికి అలవాటు పడ్డారు. సామాజిక కట్టుబాట్లు, ఒత్తిళ్లు, ఇతర ప్రభావాలతో మహిళలు మద్యం సేవిస్తున్నారు.
- ఛత్తీస్‌గఢ్‌లో 5% మంది మహిళలు ఆల్కాహాల్ తాగుతున్నారు. మహిళలకు తగిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కొరవడటం, మానసిక ఒత్తిళ్లకు గురికావడం వంటివి ఆల్కాహాల్ సేవనం పెరగడానికి ప్రధాన కారణాలుగా అంచనా వేస్తున్నారు.

కారణాలు ఎన్నో...

భారత్‌లోని మహిళల్లో మద్యపానం అలవాటుగా మారడానికి అనేక అంశాలు కారణమవుతున్నట్టుగా తేలింది. స్త్రీలలో ఆర్థిక స్వాతంత్ర్యం పెరుగుదల, సమాజంలో వస్తున్న మార్పులు, ఆధునికత పేరుతో మారుతున్న అలవాట్లు వంటివి ప్రభావితం చేస్తున్నట్టుగా నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆల్కాహాల్ మార్కెట్ బాగా విస్తరించింది. దీంతోపాటు మద్యపానానికి సంబంధించి వివిధ రకాల ఆప్షన్లు అందుబాటులోకి వచ్చాయి.

స్థానిక బ్రాండ్స్ పెరుగుదల కూడా ఒక కారణమే. ఇలా అనేక రకాలుగా మద్యం అనేది మహిళలకు సైతం సులభంగా అందుబాటులోకి వచ్చినట్టుగా చెబుతున్నారు.

యాదాద్రిలో విదేశీయుల సందడి



యాదాద్రి ఆలయ మాడ వీధిలో విదేశీ మహిళలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని బెల్జియం, న్యూజిలాండ్ దేశాలకు చెందిన ఇద్దరు మహిళలు సందర్శించారు. శ్రీస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. హైదరాబాద్ పర్యటనకు వచ్చిన వీరు.. శ్రీయాదాద్రీశుడి దర్శనానంతరం రాతి కట్టడాలను వీక్షించారు. వారితో ఫొటోలు దిగేందుకు భక్తులు పోటీ పడ్డారు.

అయిదేళ్లకే అ'దృశ్యం'

- టీవీ కొన్న అయిదేళ్లకే మొరాయింపు
- లోకల్ సర్కిల్స్ సంస్థ సర్వేలో వెల్లడి



సాక్షి, హైదరాబాద్: కాలక్షేపానికైనా.. తాజా సమాచారానికైనా టెలివిజన్ ప్రతి ఇంట్లో అత్యంత ముఖ్య సాధనం. కానీ టీవీ కొన్న ఐదేళ్లలోపే మరమ్మతులతో సతాయిస్తున్నట్టు ఎంతోమంది వినియోగదారులు వాపోతున్నారు. కొన్న తర్వాత ఐదేళ్లలో తమ టీవీలు పాడయ్యాయని 61 శాతం మంది అంగీకరించారు. టీవీల కొనుగోలు మార్కెట్, వాటి మరమ్మతులు తదితర అంశాలపై లోకల్ సర్కిల్స్ సంస్థ నిర్వహించిన సర్వేలో పలు కీలక అంశాలు వెలుగులోకి తెచ్చింది. దేశ వ్యాప్తంగా 329 జిల్లాల్లో 36 వేల మంది నుంచి ఈ సంస్థ సేకరించిన అభిప్రాయాలివి.

టీవీలు ఎక్కడ కొంటున్నారు..

కొనుగోలు	శాతం
ఎలక్ట్రానిక్స్ స్టోర్ నుంచి	57 %
ఎలక్ట్రానిక్స్ స్టోర్ నుంచి హోం డెలివరీ	6%
ఈ కామర్స్ ప్లాట్‌ఫాంలో ఆర్డర్	35%
చెప్పలేం	2%

మీ టీవీలు ఎన్నేళ్లకు మరమ్మతులకు గురవుతున్నాయి?

ఏళ్లు	శాతం
5 లేదా అంతకంటే ఎక్కువ	61 శాతం
3-5 ఏళ్లు	19 శాతం
2-3 ఏళ్లు	9 శాతం
1-2 ఏళ్లు	3 శాతం
ఏడాది లోపు	1 శాతం
బాగానే ఉంది	5 శాతం
చెప్పలేం	2 శాతం

టీవీ మరమ్మతులు ఎక్కడ చేయిస్తున్నారు?

కంపెనీ దగ్గరే చేయించాం.. అదనంగా చెల్లించాం	29 శాతం
కంపెనీ దగ్గరే చేయించాం.. రీజనబుల్‌గా చెల్లించాం	3 శాతం
వారంటీలోనే చేయించాం..	3 శాతం
స్థానిక మెకానిక్ వద్ద చేయించాం	31 శాతం
రిపేర్‌కు బదులు కొత్త టీవీ కొన్నాం..	16 శాతం
పాత టీవీ బదులు అదనపు ఫీచర్లతో కొత్త టీవీ కొన్నాం	15 శాతం
చెప్పలేం	3 శాతం

హో'హాకా'రాలు!

- రైతుల సంక్షేమాన్ని గాలికొదిలి..
- 'హాకా' పేరు మీద కాంట్రాక్టులు పొంది..
- 2 శాతం కమీషన్‌తో ఇతరులకు అప్పగింత
- కాంట్రాక్టు పనుల నాణ్యతపై గందరగోళం
- ప్రభుత్వానికి పట్టని వ్యవస్థ
- దండుకుంటున్న దళారులు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ:

నల్లగొండ జిల్లాలో ఓ వ్యాపారికి కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు, మోడల్ స్కూళ్లలో కిరాణా సామాను సరఫరా పనులను 'హాకా' పేరుతో అధిక ధరలకు కొనుగోళ్ల కమిటీ కట్టబెట్టింది. ఆ తరువాత అవే రేట్లతో 'హాకా' పేరుతో జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, గిరిజన, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో కిరాణా సామాను సరఫరా పనులను నామినేషన్‌పై జిల్లా యంత్రాంగం కట్టబెట్టింది. ఇలా మొత్తంలో 200 విద్యాసంస్థల్లో కిరాణా సామాను సరఫరాను అధిక ధరలకు ఇచ్చేసింది. ఈ తతంగంలో అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు కీలకంగా వ్యవహరించాడు. అధిక ధరలతో ప్రభుత్వానికి భారీగా నష్టం వాటిల్లేలా 'హాకా' పేరుతో సదరు వ్యాపారే రూ.కోట్ల విలువైన పనులను దక్కించుకున్నట్లు, 'హాకా' కేవలం 2 శాతం కమీషన్‌పై ఈ పనులను సదరు వ్యాపారికి అప్పగించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక్కడే కాదు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని మైనారిటీ గురుకులాల్లో స్టేషనరీ, బూట్లు, ఫర్నిచర్, ఎస్సీ గురుకులాల్లో బ్లాంకెట్లు, వైద్య, ఆరోగ్య శాఖలో సామగ్రి సరఫరా పనులను కూడా 'హాకా' పేరుతో తీసుకొని, 2 శాతం కమీషన్‌పై ఇతరులకు అప్పగించారన్న ఆరోపణలున్నాయి.

'హాకా'కే ఇవ్వాలనుకుంటే టెండర్లు ఎందుకు?

ప్రభుత్వ సంస్థ అయిన 'హాకా' ద్వారానే విద్యా సంస్థలకు కిరాణా సామాను, ఇతరత్రా పరికరాలు, వివిధ శాఖలకు అవసరమైన ఫర్నిచర్ వంటివి సరఫరా చేయాలని ప్రభుత్వం అనుకుంటే టెండర్లు పిలువడం ఎందుకు? 'హాకా'కే నేరుగా ఇచ్చేస్తే తక్కువ ధరకు నాణ్యమైన వస్తువులు లభిస్తాయనే చర్చ సాగుతోంది. పైగా టెండర్లు పిలిచినప్పుడు వాటిలో ప్రైవేట్ వ్యాపారులు పాల్గొనేలా చేసి, అధిక ధరకు 'హాకా' దక్కించుకుంటోందని, మళ్లీ కమీషన్లపై ప్రైవేట్ సంస్థలకు అప్పగించి సరఫరా చేయడం ద్వారా ప్రభుత్వ ఖజానాకు నష్టం జరుగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు 'హాకా'కు సరఫరా చేసే సామర్థ్యమే లేదన్న చర్చ సాగుతున్న తరుణంలో ఈ పనులను పొందిన కాంట్రాక్టర్లు, సంస్థలు నాసిరకం కిరాణా సామాను, వస్తువులను సరఫరా చేస్తే దానికి బాధ్యులెవరు? 2 శాతం కమీషన్‌తో ఆ పనులను పొందిన వ్యాపారులు, సంస్థలు బాధ్యత వహిస్తాయా? 'హాకా' బాధ్యత వహిస్తుందా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

వ్యాపారుల దందాతో నాణ్యత గాలికి..

ప్రభుత్వ సంస్థల్లో కొన్ని పనులను 'హాకా'నే కాంట్రాక్టుకు తీసుకొని వ్యాపారం చేయొచ్చు.. కానీ అలా చేయడం లేదు. 'హాకా' పేరుతో కాంట్రాక్టు తీసుకుంటూ ఇతర వ్యాపారులకు కమీషన్‌పై పనులను అప్పగిస్తోందన్న ఆరోపణలున్నాయి. కొన్ని సందర్భాల్లో 'హాకా' పేరుతో వ్యాపారులే అధిక ధరలకు టెండర్లు దాఖలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిని సంస్థ కనీసం పరిశీలన చేయడం లేదు. పైగా ఈ తతంగంలో అందులోని కొందరు అధికారులు పెద్ద ఎత్తున మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఇక ఆ పనులను పొందిన వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వస్తువుల నాణ్యతను పాటిస్తున్నారా? లేదా చూసే వారు లేకుండాపోయారు. కనీసం ప్రభుత్వం కూడా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ సంస్థ అయిన 'హాకా' పేరుతో వ్యాపారులు దర్జాగా తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నల్లగొండ జిల్లాలో 200 విద్యాసంస్థల్లో దాదాపు రూ.కోట్ల విలువైన పనులను 'హాకా' పేరుతో టెండర్లలో అధిక ధరకు కోట్ చేసి వ్యాపారులు దక్కించుకొని ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే తంతు కొనసాగుతున్నా స్పందించడం లేదు.

మూలాలను మరిచిన 'హాకా'..

రైతుల సంక్షేమానికి పనిచేస్తూ.. రైతులను లాభాల బాటలో నడిపించేందుకు ఏర్పడిందే హైదరాబాద్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ సొసైటీ (హాకా). గతంలో వ్యాపారుల బ్లాక్ మార్కెటింగ్ కారణంగా రైతులు ఎరువులు, విత్తనాలను అధిక ధరకు కొనుగోలు చేసి తీవ్రంగా నష్టపోయే వారు. ఈ నేపథ్యంలో రైతులకు మేలు చేసేందుకు, ఎరువులు, విత్తనాలను సరఫరా చేసేందుకు, తద్వారా రైతు సంక్షేమానికి పాటు పడేందుకు ప్రభుత్వం హైదరాబాద్ కేంద్రంగా 'హాకా'ను ఏర్పాటు చేసింది. ఆ తరువాత జిల్లాల్లోనూ తన కార్యాలయాలను విస్తరించి రైతులు నష్టపోయకుండా చూసేది. అలాంటి సంస్థ ఇప్పుడు తన ముఖ్య లక్ష్యాన్ని వదిలేసి గాడి తప్పుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రైతులతోపాటు ఆహారానికి సంబంధించిన ఇతర సంస్థల్లోనూ వ్యాపారం చేసే వెసులుబాటు 'హాకా'కు ఉంది. దాన్ని ఆసరాగా తీసుకొని ప్రధానమైన రైతుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందన్న చర్చ సాగుతోంది. వివిధ ప్రభుత్వ సంస్థల్లో కాంట్రాక్టులు పొంది 2 శాతం కమీషన్‌తో ఇతర వ్యాపారులకు ఆయా కాంట్రాక్టులను అప్పగిస్తోందన్న ఆరోపణలున్నాయి. పూర్తిగా కమీషన్ వ్యాపార దృక్పథంతోనే ముందుకు సాగుతోందన్న విమర్శలున్నాయి.



గురునానక్ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయన చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



ఆదివారం కూకట్‌పల్లి నల్లచెరువు వద్ద హైడ్రా కూల్చివేతల దృశ్యం

క్లుప్తంగా...

ట్రిపుల్ ఐటీలో టీడీపీ కార్యకర్తల హల్‌చల్

వేంపల్లి: ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో శనివారం టీడీపీ కార్యకర్తలు హల్‌చల్ చేయగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. అనుమతి లేకుండా క్యాంపస్‌లోకి 10 మంది చొరబడి బెదిరింపులకు పాల్పడ్డారు. ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లో విద్యార్థులు, అధ్యాపకులు కలిపి 9,000 మంది ఉండగా వీరి అవసరార్థం అధికారులు 3 క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు వీటిని వైఎస్సార్‌సీపీకి చెందిన వారు నడుపుతున్నారు. అయితే ట్రిపుల్ ఐటీ అధికారులు అక్టోబర్ 12న లోపల క్యాంటీన్లను ఖాళీ చేయాలని నోటీసులు పంపారు. కొత్త క్యాంటీన్లకు టెండర్లు వేసిన తర్వాతనే ప్రస్తుతం ఉన్న వాటిని రద్దు చేయాలి...అలా కాకుండా వచ్చే నెలలో ఖాళీ చేయాలని నోటీసులు పంపారని క్యాంటీన్ యజమానులు వాపోతున్నారు. అంతలోపే టీడీపీ కార్యకర్తలు క్యాంటీన్ వద్దకు వచ్చి మా ప్రభుత్వం వచ్చింది.. మీరు ఖాళీ చేయాలని బెదిరింపులకు దిగడం దారుణం అన్నారు.

'మహిళలకు త్వరలో ఉచిత బస్సు ప్రయాణం'



రాయచోటి టౌన్: మహిళలకు త్వరలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆదివారం అన్నమయ్య జిల్లా రాయచోటి రూరల్ పరిధిలోని శిబ్యాల గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దీపావళి నుంచి అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి 3 సిలిండర్లు ఉచితంగా అందజేయడానికి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

బీమా ప్రీమియంపై జీఎస్టీని ఉపసంహరించాలి

ఎస్‌సీజెడ్ఐఈఎఫ్ డిమాండ్



కృష్ణలంక (విజయవాడ తూర్పు): బీమా, ఆరోగ్య బీమా ప్రీమియంపై కేంద్రం విధిస్తున్న 18 శాతం జీఎస్టీని వెంటనే ఉపసంహరించాలని సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(ఎస్‌సీజెడ్ఐఈఎఫ్) ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. ఆరోగ్య బీమా ప్రీమియంపై జీఎస్టీ విధించటం వల్ల కోట్లాది మంది ఈ సౌకర్యాన్ని పొందలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం జీఎస్టీని ఎత్తివేయని పక్షంలో ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రాఘవయ్య పార్కు సమీపంలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ (ఐసీఈయూ) మచిలీపట్నం డివిజన్ 56వ మహాసభ జరిగింది. ఇందులో రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం బీమా రంగాన్ని మరింత శక్తివంతం చేస్తే జీడీపీలో ప్రీమియం వాటా పెరుగుతుందన్నారు.

రైతుల సమస్య పరిష్కారమయ్యే వరకు ఆందోళన

సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ



నింద్ర: రైతుల సమస్య పరిష్కరమయ్యే వరకు ఆందోళన ఆగదని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ స్పష్టం చేశారు. ఆదివారం మండలంలోని పాదిరి గ్రామం హైవే వద్ద రైతులతో కలిసి ఆయన ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ హైవే కోసం రైతులు తమ పొలాలను విక్రయించారని, ఆ సమయంలో సర్వీసు రోడ్డు తమ పొలాలకు, గ్రామాలకు వెళ్లడానికి ఏర్పాటు చేసేందుకు హైవే అధికారులు ఒప్పుకున్నారని తెలిపారు. అయితే నేడు చిత్తూరు–తచ్చూరు నేషనల్ హైవే పూర్తయినా సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయకపోగా.. రోడ్డుకు ఇరువైపులా ఫెన్సింగ్ వేయడం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతులతో కలిసి రోడ్డుపైనే వంటావార్పు చేపట్టారు. సమస్యపై చిత్తూరు ఎంపీ, కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడగా..వారు మంగళవారం వచ్చి హైవేను పరిశీలించి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్టు నారాయణ తెలిపారు.

ఇసుక ఆన్‌లైన్ విధానంతో దళారులకే మేలు



నిరసన వ్యక్తం చేస్తున్న లారీ యజమానులు

తగరపువలస: ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ఇసుక ఆన్‌లైన్ విధానంతో దళారులకు మేలు జరుగుతుండగా, వినియోగదారునికి నష్టం, లారీ యజమానులకు కష్టం మిగులుతోందని జిల్లా క్వారీ లారీ యజమానుల సంఘం ప్రతినిధులు వాపోయారు. విశాఖజిల్లా ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ బోయపాలెం వద్ద ఆదివారం జరిగిన ఆత్మీయ సమావేశంలో పలువురు మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రైవేట్ యాజమాన్యం ఆధ్వర్యంలో ఇసుకను ఆన్‌లైన్‌లో ఉంచినప్పుడు వినియోగదారునికి, లారీ యజమానులకు మేలు జరిగేదన్నారు. కూటమి ప్రభుత్వం ఉచితం పేరుతో ఆన్‌లైన్‌లో ఉంచిన ఇసుక కారణంగా వినియోగదారునిపై మోయలేని భారం, లారీ యజమానులకు అవమానాలు మిగులుతున్నాయన్నారు.

దుష్ప్రచారంలో దిట్ట

చంద్రబాబు పాలనలోనే ఆలయాల్లో అనేకానేక అపచారాలు

- మతం, దేవుడిని అడ్డుపెట్టుకుని చంద్రబాబు నిత్యం జగన్‌పై అభాండాలు
- ఆరోపణలు తప్ప వాటిపై విచారణ మాత్రం శూన్యం
- జగన్ సీఎంగా ఉన్నప్పుడూ తిరుమల కొండపై శిలువ అంటూ నానాయాగీ
- తిరుమలలో వెయ్యి కాళ్ల మండపం ధ్వంసం చేసినా..
- విజయవాడ దుర్గగుడిలో క్షుద్రపూజల జరిగినా అన్నీ బాబు హయాంలోనే..



సాక్షి, అమరావతి: అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా మతాన్ని, దేవుడిని అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా నోటికొచ్చినట్లు ఆరోపణలు చేయడంలో సీఎం చంద్రబాబు ఆయన భజన బృందం దిట్ట. తన ఆరోపణలకు సంబంధించి నిజానిజాలు నిగ్గుతేల్చేందుకు ఆయన ఏనాడూ ఉన్నతస్థాయి విచారణకు ముందుకురాలేదు. ఈ విషయంలో ఆయనపై మొదట నుంచీ విమర్శలున్నాయి. అలాగే, చంద్రబాబు హయాంలోనే అనేక అపచారాలూ చోటుచేసుకున్నాయని భక్తులు గుర్తుచేస్తున్నారు. ఉదా..

- తాజాగా.. చంద్రబాబు పాలనలోనే తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీనెయ్యి అంశం వెలుగుచూసింది. కానీ, ఆయన సిగ్గూఎగ్గూ లేకుండా గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వానికి అంటగడుతూ వివాదానికి తెరలేపారు.
- రెండేళ్ల క్రితం జగన్ సీఎంగా కొనసాగుతున్న సమయంలో టీడీపీ, ఆ పార్టీ శ్రేణులు తిరుమల కొండపై శిలువ అంటూ సామాజిక మాధ్యమాల్లో నానా రభస సృష్టించిన విషయం తెలిసిందే. అప్పట్లో టీటీడీ ఈ అసత్య ప్రచారాన్ని తీవ్రంగా ఖండించడంతో పాటు బాధ్యులపై న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతో ఆ దుష్ప్రచారానికి తెరపడింది.
- అలాగే, గత ఏడాది ఆగస్టులో కూడా తిరుమల కాలిబాటలో పులుల సంచారం వెలుగులోకి వస్తే భక్తుల భద్రతకోసం ప్రతి 250 మెట్లకు ఒక గార్డు చొప్పున 70 మందిని భక్తులకు కాపలా ఉంచేందుకు నిర్ణయించడంతో పాటు అత్యవసర సమయంలో ఉపయోగకరంగా ఉంటుందని భక్తులకు ఉచితంగా కర్రలను అందించాలని టీటీడీ సంకల్పించింది. దీనినీ పచ్చ బ్యాచ్ వక్రీకరిస్తూ కర్రకు పది రూపాయలు రుసుం పెట్టి, టీటీడీ కర్రల వ్యాపారం చేసిందని పెద్దఎత్తున దుష్ప్రచారం చేస్తే, అప్పట్లో టీడీపీయే దానిని ఖండించుకుంది.
- ఇక అదే నెలలో తిరుపతి గోవిందస్వామి రాజస్వామి ఆలయ గోపురం అంశంలోనూ దుష్ప్రచారమే చేశారు.
- ఇలా తిరుమల ఆలయానికి మాత్రమే పరిమితం కాకుండా దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాలకు సంబంధించి ఇదే తరహా దుష్ప్రచారాలకు పచ్చమూకలు తెగబడ్డాయి.
- గత ఏడాది ఆగస్టులో కాణిపాకం ఆలయంలో పంచామృత అభిషేకం టికెట్ ధర రూ.700 నుంచి రూ.5,000లకు పెంచకుండానే పెంచారంటూ దుష్ప్రచారం చేశాయి.

బాబు హయాంలోనే దుర్గగుడిలో క్షుద్ర పూజలు..

ఇక పవిత్ర పూజా కార్యక్రమాల్లో బూట్లు వేసుకుని తరచూ పూజల్లో పాల్గొనే చంద్రబాబు గత కృష్ణా పుష్కరాల సమయంలో ఆయన విజయవాడలో దాదాపు 30 గుళ్లను నేలమట్టం చేశారు. ఆ విగ్రహాలను చెత్త ట్రాక్టర్లలో తరలించి భక్తుల మనోభావాలను దారుణంగా దెబ్బతీశారు. మరోవైపు.. 2014–19 మధ్య చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలోనే విజయవాడ దుర్గగుడిలో క్షుద్ర పూజల కలకలం రేగింది. దీనికి సంబంధించి ఆలయ గర్భగుడిలో గుర్తుతెలియని వ్యక్తులు సంచరించినట్లు వీడియోలు కూడా బయటకొచ్చాయి.

- అంతేకాదు.. 1995–2004 మధ్య 1472 సంవత్సరం నాటి తిరుమల వెయ్యికాళ్ల మండపాన్ని కూల్చివేసిన ఘటన కూడా చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లోనే జరిగింది.

'వీఆర్వో'లకు ప్రమోషన్లు ఇవ్వాలి

ఏపీ డైరెక్టు రిక్రూట్‌మెంట్ వీఆర్వోస్ అసోసియేషన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ వీఆర్వోలకు ఉద్యోగోన్నతులు కల్పించాలని ఏపీ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న కుమార్ డిమాండ్ చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. 2012లో వీఆర్వోల నియామకం జరిగిందని, నాటి నుంచి నేటి వరకు ప్రమోషన్లకు నోచుకోలేదని పేర్కొన్నారు. డిగ్రీలు, పీజీలు చదివి నేరుగా వీఆర్వోలుగా నియమితులైనా ప్రమోషన్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. సీనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులు పొంది రెండేళ్లు దాటినా డిపార్ట్‌మెంటల్ టెస్టులు పాస్‌కాని వారిని తక్షణమే వీఆర్వోలుగా రివర్స్ చేయాలని డిమాండ్ చేశారు. జీవోను సవరించి డిపార్ట్‌మెంట్ టెస్టులు, సర్వే ట్రైనింగ్ పూర్తి కాకపోయినా సీనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులు కల్పించే నిబంధనను తొలగించాలని డిమాండ్ చేశారు. కామన్ సబార్డినేట్ రూల్స్ ప్రకారం ఉద్యోగంలో చేరిన ప్రతి ఉద్యోగికి తదుపరి ప్రమోషన్లలో 70 శాతం కోటా ఉన్నప్పటికీ అమలు కాలేదన్నారు. డిపార్ట్‌మెంట్ టెస్టులు, సర్వే ట్రైనింగ్ పాసయిన వారికి మాత్రమే సీనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు కల్పించాలన్నారు. ప్రభుత్వం స్పందించి వన్ టైం సెటిల్‌మెంట్ కింద డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ వీఆర్వోల ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు.

అక్రమ భవనంలో ఉంటూ ఆక్రమణలు తొలగిస్తారా?

సీఎం చంద్రబాబు తీరుపై పర్యావరణవేత్తలు, సాగు నీటి నిపుణుల విస్మయం

నదీ పరిరక్షణ చట్టాన్ని ఉల్లంఘించి కరకట్ట లోపల బంగ్లాలో బాబు నివాసం

- బుడమేరు ఆక్రమణలు తొలగిస్తామంటూ గాంభీర్యంగా ప్రకటనలు
- నాడు లింగమనేని బంగ్లాతోపాటు 35 అక్రమ కట్టడాలను తొలగిస్తామన్న దేవినేని ఉమా



కరకట్ట వద్ద చంద్రబాబు నివాసం

సాక్షి, అమరావతి: దయ్యాలు వేదాలు వల్లించడమంటే ఇదే! చట్టాన్ని తుంగలో తొక్కి కరకట్ట అక్రమ సౌధంలో నివసిస్తున్న సీఎం చంద్రబాబు బుడమేరు ఆక్రమణలు తొలగిస్తామంటూ పదే పదే ప్రకటించడంపై పర్యావరణవేత్తలు, సాగు నీటిరంగ నిపుణులు తీవ్ర విస్మయం వ్యక్తం చేస్తున్నారు. స్వయంగా చట్టానికి తూట్లు పొడిచిన చంద్రబాబుకు ఆక్రమణలు తొలగిస్తామని చెప్పే నైతిక హక్కు ఎక్కడుందని నిలదీస్తున్నారు. నదీ పరిరక్షణ చట్టం 1884 ప్రకారం ప్రవాహానికి ఆటంకం కల్పించేలా ఎలాంటి కాంక్రీట్ కట్టడాలను నదీ గర్భంలో, కరకట్ట లోపల నిర్మించకూడదు. చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు లాంటి జలవనరుల భూ భాగాన్ని ఆక్రమించడం చట్ట ప్రకారం విరుద్ధం. సుప్రీం కోర్టు కూడా పలు కేసుల్లో ఇదే చట్టాన్ని ఉటంకిస్తూ అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని తీర్పులు ఇచ్చింది. ఈ చట్టం ప్రకారమే తమిళనాడు, తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో నదీ గర్భం, కరకట్ట, వాగులు, వంకలు, జలవనరుల భూభాగాన్ని ఆక్రమించి నిర్మించిన కట్టడాలను కూల్చి వేస్తున్నారు. నదులు, జల వనరులు, పర్యావరణాన్ని పరిరక్షిస్తున్నారు.

కూల్చేస్తామని హడావుడి చేసి..

ప్రకాశం బ్యారేజీకి ఎగువన.. కృష్ణా కరకట్ట లోపల భూములు, లంక భూములను పంటల సాగు కోసం పలువురు 33 ఏళ్ల లీజుకు తీసుకున్నారు. పంటల సాగు పేరుతో లీజుకు తీసుకున్న ఆ భూముల్లో లింగమనేని రమేష్‌తోపాటు 35 మంది అక్రమంగా భారీ భవంతులను నిర్మించారు. విభజన అనంతరం 2014లో అధికారం చేపట్టిన టీడీపీ ప్రభుత్వంలో దేవినేని ఉమామహేశ్వరరావు జలవనరుల శాఖను నిర్వహించారు. నాడు ప్రకాశం బ్యారేజీ బలవిస్తరణ ప్రాంతంలో పడవలో విహరించిన ఆయన లింగమనేని రమేష్‌తోసహా 35 మంది నిర్మించిన అక్రమ సౌధాలను కూల్చివేస్తామని తొలి రోజుల్లో హడావుడి చేశారు. నదీ పరిరక్షణ చట్టాన్ని ఉల్లంఘించిన 35 మంది లీజులు రద్దు చేసి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామంటూ బీరాలు పలికారు. ఈ క్రమంలో లింగమనేని అక్రమంగా నిర్మించిన భవనాన్ని చంద్రబాబు తన అధికారిక నివాసంగా మార్చుకున్నారు. అప్పటి నుంచి 2019 మే 29 వరకూ అంటే చంద్రబాబు దిగిపోయే వరకూ అక్రమ నిర్మాణాలపై దేవినేని ఉమా ఎందుకు నోరు మెదపలేదని పర్యావరణవేత్తలు, సాగునీటిరంగ నిపుణులు నిలదీస్తున్నారు.

లబ్ధికి ప్రతిఫలంగానే..

రాజధాని భూసమీకరణ నుంచి లింగమనేని రమేష్ భూములను తప్పించడంతోపాటు ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లోనూ ఆయనకు చంద్రబాబు ప్రభుత్వం అప్పట్లో భారీ లబ్ధి చేకూర్చింది. ఇందుకు ప్రతిఫలంగానే క్విడ్ ప్రోకో కింద ఉండవల్లి కరకట్ట లోపల అక్రమ భవనాన్ని చంద్రబాబుకు లింగమనేని ఇచ్చేశారనే ఆరోపణలున్నాయి. భూసమీకరణ కరకట్ట భవంతిని లింగమనేని ప్రభుత్వానికి అప్పగించారని, అది ప్రభుత్వ ఆస్తి అని నాడు ప్రకటించిన చంద్రబాబు ఆ తర్వాత దానికి అద్దె చెల్లిస్తున్నట్లు ప్లేటు ఫిరాయించారు. అయితే అద్దె చెల్లించినట్లు లింగమనేని రమేష్ ఐటీ రిటర్న్స్‌లో చూపించలేదు. దీన్ని బట్టి లింగమనేని క్విడ్ ప్రోకో కింద తన భవనాన్ని ఇచ్చేసినట్లు స్పష్టమవుతోంది. ఇప్పుడు ఆ అక్రమ భవనాన్ని కాపాడుకోవడానికే నదీ పరిరక్షణ చట్టాన్ని తుంగలో తొక్కారని పర్యావరణవేత్తలు మండిపడుతున్నారు. కృష్ణా నదికి ఐదారు లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా ఆ 35 అక్రమ భవనాల వల్ల ప్రవాహానికి ఆటంకం కలుగుతుందని స్పష్టం చేస్తున్నారు. ఇక భారీ వరద వస్తే అక్రమ కట్టడాలు బ్యారేజీ ఉనికినే ప్రశ్నార్థకంగా మారుస్తాయనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

'స్కిట్' నిలిచేనా?!

మూతపడే స్థితిలో శ్రీకాళహస్తీశ్వర ఇంజనీరింగ్ కళాశాల

జేఎన్‌టీయూ (ఏ) పరిధిలోకి తెచ్చేందుకు కసరత్తు

- సాధ్యాసాధ్యాల పరిశీలనకు కమిటీ నియామకం
- గతంలోనూ రెండు దఫాలు కమిటీలు చేసి సిఫారసుల బుట్టదాఖలు
- ఈసారైనా ఆచరణలోకి తెచ్చి కాలేజీని కాపాడాలంటున్న విద్యావేత్తలు



అనంతపురంలో స్కిట్ కళాశాల

అనంతపురం: వేలాది మందికి ఉజ్వల భవిష్యత్తు ఇచ్చి.. మంచిపేరు ప్రఖ్యాతులు గాంచిన శ్రీకాళహస్తీశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (స్కిట్) కాలగర్భంలోకి కలిసి పోకుండా కాపాడాలని విద్యావేత్తలు కోరుతున్నారు. శ్రీ కాళహస్తీశ్వర ఆలయానికి అనుబంధంగా 1997–98 విద్యా సంవత్సరంలో స్కిట్ ఇంజినీరింగ్ కళాశాల ప్రారంభించారు. మొదట ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, కంప్యూటర్ సైన్సెస్ కోర్సులకు అనుమతించారు. ఒక్కొక్క కోర్సులో 60 సీట్లు కేటాయించారు. ఆ తర్వాత కొంతకాలానికి సివిల్ ఇంజినీరింగ్ కోర్సుకు కూడా అనుమతిచ్చారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ కళాశాల నిర్వహించే విధంగా ప్రభుత్వం నిర్ణయించింది.

రూ.750 కోట్ల ఆస్తులు

రాష్ట్రంలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఏకైక ఇంజినీరింగ్ కళాశాల కావడం..బోధన బాగా ఉండటం.. మంచి ఫలితాలు వస్తుండడంతో అనతి కాలంలోనే స్కిట్‌కు మంచి ఖ్యాతి వచ్చింది. ప్రధాన బ్రాంచ్‌ల్లో అదనపు సీట్లు పెంపుదల చేశారు. దీనికి తోడు డిప్లొమో కోర్సులూ నిర్వహించారు. ఆదాయ పెంపుదల ప్రధానం కాకుండా గ్రామీణ విద్యార్థులకు సాంకేతిక విద్య అందించాలనే ప్రధాన ఆశయంతో ఈ కళాశాల అప్పట్లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ కళాశాల ఆస్తుల విలువ రూ.750 కోట్లు ఉంటాయని అంచనా. విద్యార్థుల నుంచి వచ్చే ఫీజులతోనే కళాశాల ఉద్యోగులకు జీతాలు ఇచ్చే విధంగా నియమ నిబంధనలు రూపొందించారు. ముక్కంటి ఆలయం వారు తొలి కామన్ డిపాజిట్ కోసం రూ.50 లక్షలు ఇచ్చారు. ఆ తరువాత కళాశాల నుంచి వచ్చే ఆదాయమే జీతాలకు, అభివృద్ధి పనులకు సరిపోయేది. 1997 నుంచి 2013 వరకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా కళాశాల నిర్వహించారు.

ఇప్పటికే రెండు దఫాలు కమిటీ ఏర్పాటు

స్కిట్‌ను జేఎన్‌టీయూ (అనంతపురం) పరిధిలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికే రెండు దఫాలు కమిటీలను నియామకం చేసి, సిఫారసులను బుట్టదాఖలు చేశారు. మరో దఫా కమిటీని నియమించారు. ఈసారైనా ఆచరణ సాధ్యమయ్యేనా? లేక మొక్కుబడిగా కమిటీ వేసి కాలయాపన చేస్తారా? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. పూర్తిగా జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలోకి తెచ్చి.. గతంలో మాదిరి విద్యార్థుల ఫీజులతోనే కళాశాలను నిర్వహించాలని, స్కిట్‌లో పనిచేసే ఫ్యాకల్టీని అక్కడికే పరిమితం చేసి జీతాలు చెల్లించాలని, ఉద్యోగులను వర్సిటీ పరిధిలోకి తెస్తే సాంకేతిక, న్యాయపరమైన చిక్కులు వస్తాయని నిపుణులు అంటున్నారు.

2013 నుంచి తగ్గుముఖం

విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోవడం ప్రారంభమైంది. ఆలయ అధికారులు పట్టించుకోకపోవడం, కళాశాలలో వర్గ రాజకీయాలు అధికం కావడం, రాజకీయ జోక్యం మితిమీరడం వంటి కారణాలతో కళాశాల పతన దిశగా పయనించడం ప్రారంభం అయింది. విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. 2016 నవంబర్ నాటికి అక్కడ పనిచేసే ఉద్యోగులకు వేతనాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. ప్రతి నెలా రూ.25 లక్షల వంతున ముక్కంటి దేవాలయం వారు చెల్లిస్తున్నారు. కళాశాల ఉద్యోగుల వేతనాలకు ఇప్పటి దాకా దేవాలయం వారు రూ.14 కోట్లు చెల్లించారు. ఈ భారం అధికం కావడంతో రాష్ట్ర దేవదాయశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్థితిగతులను అధ్యయనం చేశారు. 2019–20 సంవత్సరంలో పూర్తిగా అడ్మిషన్లు లేవు. అంతకు ముందు సంవత్సరాల్లో చేరిన విద్యార్థులు బీటెక్‌లో 15 మంది, డిప్లొమోలో 12 మంది ఉన్నారు. చివరి సంవత్సరం విద్యార్థులు కోర్సులు ముగిసి బయటకు వెళ్లిపోతారని, కళాశాలను మూసివేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఈ కళాశాలలో 29 మంది బోధన, 36 మంది బోధనేతర ఉద్యోగులు ఉన్నారు.



ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజా కార్యక్రమంలో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపనలు చేశారు.

25 నుంచి సప్తనదీ జలాభిషేక ఉత్సవాలు



కాళ్ల: పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం కాళ్లకూరులోని స్వయం భూః వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 25 నుంచి సప్తనదీ జలాభిషేకాలు, పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్టు దేవస్థానం ఈవో మోకా అరుణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం పవిత్రోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గోదావరి, సరస్వతి, యమునా, గంగ, కృష్ణ, కావేరి, నర్మద నదుల జలాలతో స్వామివారికి అభిషేకాలు చేస్తామన్నారు. తొలిరోజు బుధవారం విశ్వక్సేన పూజ, దీక్షాధారణ, అంకురార్పణ, యాగశాలర్చన, హోమాలు నిర్వహిస్తామన్నారు. 28న హోమాలు, పవిత్ర విసర్జన, సప్తనదీ జలాల అభిషేకాలతో పాటు శాంతి కల్యాణాలు నిర్వహిస్తామన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుదీర్చారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.



శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారిపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.


భక్తులతో కిటకిటలాడిన రెడ్డెమ్మకొండ

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ఉదయాన్నే పలు రకాల నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సంతాన ప్రసాదించే తల్లిగా ప్రసిద్ధి పొందిన అమ్మవారి ఆలయంలో ఉదయం నుంచే భక్తుల సందడి మొదలైంది. తడిబట్టలతో అమ్మవారి ముందు సంతానం కోసం మహిళలు వరపడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీర సారెలతో మొక్కుబడులు చెల్లించుకొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు



విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పటమటలోని సీహెచ్ఆర్‌కే ఇండోర్ స్టేడియంలో రెండు రోజుల పాటు ఉత్కంఠభరితంగా సాగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) అండర్–19 రాష్ట్ర స్థాయి బాల,బాలికల టేబుల్ టెన్నిస్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లోని విజేతలకు డీఐఈఓ ట్రోఫీలు, మెడల్స్, సర్టిఫికెట్‌లను డీఐఈవో సి.ఎస్.ఎస్.ఎన్.రెడ్డి అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. కఠోర శ్రమ, అత్యుత్తమ శిక్షణతో క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చి ఈ పోటీలకు ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.





ఎన్‌సీసీ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

వైవీయూ: ఎన్‌సీసీ శిక్షణను కేడెట్స్ సద్వినియోగం చేసుకుని రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపిక కావాలని 30 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సతీందర్ దహియా సూచించారు. కడప నగరం తెలుగుగంగకాలనీలో నిర్వహిస్తున్న 7వ కంబైన్డ్ ఆన్యువల్ ట్రైనింగ్ క్యాంపును తిరుపతి గ్రూప్ కమాండర్ ఆదివారం పరిశీలించారు. కమాండర్ మాట్లాడుతూ కడప ఎన్‌సీసీ బెటాలియన్‌లో శిక్షణ, ఫైరింగ్ రేంజ్, ఇతర సౌకర్యాలు చక్కగా ఉన్నాయన్నారు. రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనేందుకు ఎన్‌సీసీ కేడెట్స్‌కు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం క్యాంపులో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిక్షణ, డ్రిల్, ఫైరింగ్ తదితర అంశాలను పరిశీలించారు. అంతకు ముందుకు ఎన్‌సీసీ కేడెట్స్ గ్రూప్ కమాండర్‌కు గార్డ్ ఆఫ్ హానర్ చేశారు.

● కాంచన్‌జంగ

ఎవరెస్ట్ చెల్లెలు

కాంచన్‌జంగ... మనదేశంలో ఎత్తైన శిఖరం. ప్రపంచ శిఖరాల జాబితాలో మూడవస్థానం. తొలిస్థానంలో ఎవరెస్టు ఉంటే రెండో స్థానంలో కేటూ ఉంది. కేటూ శిఖరం పాక్ ఆక్యుపైడ్ కశ్మీర్ పరిధిలో ఉండడంతో మనదేశంలో తొలి ఎత్తైన శిఖరం రికార్డు కాంచన్‌జంగకు వచ్చింది. ప్రపంచంలో అద్భుతంగా విస్తరించిన అరుదైన నేషనల్ పార్కుల్లో కూడా కాంచన్‌జంగ నేషనల్ పార్కుది ప్రత్యేకమైన స్థానం. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొంది విదేశీ ట్రెకర్‌లను ఆకర్షిస్తున్న కాంచన్‌జంగ నేషనల్ పార్కు, పర్వత శిఖరాలను వరల్డ్ టూరిజమ్ డే (27, సెప్టెంబర్) సందర్భంగా మనమూ చుట్టి వద్దాం...



స్వర్గానికి కొంచెమే తక్కువ

పక్షులు, జంతువులు, పర్వతసానువులు, మంచు శిఖరాలను సంతృప్తిగా వీక్షించాలంటే ట్రెకింగ్‌ను మించినది లేదు. కంచన్‌జంగ నేషనల్ పార్కు, పర్వత శిఖరాలకు ట్రెకింగ్ చేయాలనుకునేవాళ్లకు దారులు పెంచింది సిక్కిం రాష్ట్రం. ట్రెకింగ్‌లో త్వరగా గమ్యాన్ని చేరాలని హడావుడిగా నడిచే వాళ్లు తమ చుట్టూ ఉన్న సౌందర్యాన్ని ఆస్వాదించలేరు. ప్రశాంతంగా అడుగులు వేస్తూ సరస్సులు, హిమనీ నదాలు, రోడోడెండ్రాన్ పూల చెట్లు, ఓక్ చెట్లు, ఔషధవృక్షాలను మెదడులో ముద్రించుకోవాలి. ఎప్పుడు కంటికి కనిపిస్తాయో తెలియని కస్తూరి జింక, మేక జాతికి చెందిన హిమాలయ తార్, అడవి కుక్కలు, హిమాలయాల్లో మాత్రమే కనిపించే నీలం గొర్రెలు, మంచు చిరుత, ఎర్రటి పాండా, నల్ల ఎలుగుబంటి, టిబెట్ గాడిదల కోసం కళ్లను విప్పార్చి శోధించాలి. కాంచన్‌జంగ నేషనల్ పార్క్ ట్రెకింగ్‌లో కాళ్ల కింద నేలను చూసుకోవడంతోపాటు అప్పుడప్పుడూ తలపైకెత్తి కూడా చూస్తుండాలి. తలదించుకుని ముందుకుపోతే పక్షులను మిస్సవుతాం. పక్షిజాతులు 500కు పైగా ఉంటాయి. వాటిని గుర్తించడం కూడా కష్టమే. ఆకుపచ్చరంగులో మెరిసే రెక్కలతో ఏషియన్ ఎమరాల్డ్‌కూ వంటి అరుదైన పక్షులు కనువిందు చేస్తాయి. కాంచన్‌జంగ పర్వత శిఖరాన్ని చేరడానికి మౌంటనియరింగ్‌లో శిక్షణ ఉండాలి. ట్రెకింగ్ చేయడానికి సాధారణం కంటే ఒక మోస్తరు ఎక్కువ ఫిట్‌నెస్ ఉంటే చాలు.

నదం నదవుతుంది!

కశ్మీర్‌లో చలికి గడ్డకట్టిన దాల్ లేక్‌ను చూస్తాం. కంచన్‌జంగ టూర్‌లో జెమూ గ్లేసియర్‌ను తప్పకుండా చూడాలి. ఈ హిమానీనదం దాదాపు పాతిక కిలోమీటర్లకు పైగా ఉంటుంది. మంచులా బిగుసుకుపోయిన నీరు రాతికంటే గట్టిగా తగులుతుంది. ఎండాకాలంలో కరిగి నీరయి ప్రవహిస్తూ అనేక ఇతర నదులకు చేరుతుంది. తీస్తా నదికి కూడా ఈ గ్లేసియరే ఆధారం.

శిఖరాలను చూడవచ్చు!

హిమాలయాలను ఏరియల్ వ్యూలో చూడడానికి విమాన ప్రయాణంలోనే సాధ్యం. కంచన్ జంగ నేషనల్ పార్కుకు చేరాలంటే సిలిగురి, బాగ్‌డోగ్రా ఎయిర్‌పోర్టు నుంచి 220కిమీల దూరం ప్రయాణించాలి. ఈ దూరం రోడ్డు మార్గాన వెళ్ల వచ్చు లేదా హెలికాప్టర్‌లో 20 నిమిషాల ప్రయాణం. రైలు ప్రయాణాన్ని ఇష్టపడే వాళ్లు జల్‌పాయ్‌గురిలో దిగాలి. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో వెళ్లాలి. పరిసరాలను, ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించడానికి రైలు, రోడ్డు ప్రయాణాలు బెస్ట్. ఒకవైపు ఫ్లయిట్ జర్నీ, మరో వైపు ట్రైన్ జర్నీ ప్లాన్ చేసుకుంటే టూర్ పరిపూర్ణమవుతుంది. ఇక్కడ పర్యటించడానికి ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు అనుకూలం. మనదేశంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని నిషేధించిన తొలి రాష్ట్రం సిక్కిం. పర్యాటకులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. మనుషులను, లగేజీని సోదా చేసి ప్లాస్టిక్ వస్తువులను బయటవేస్తారు.



ఆర్ట్

టైమ్ ఆర్ట్... అన్వేషణకు మరో రూపం

సమయాన్ని కేవలం గడియారాలు, క్యాలెండర్‌లలో కొలవకుండా చెన్నైలోని వినూత్న కళాకారులు బ్రష్‌స్ట్రోక్‌లు, మెటల్, వీడియో స్క్రీన్‌ల ద్వారా అన్వేషించిన ప్రపంచంలోకి మనల్ని ఆహ్వానిస్తున్నారు. కళాకారుడు జితా కార్తికేయన్‌చే నిర్వహించిన పల్లాడియంలోని లగ్జరీ ఆర్ట్ షో, 'టైమ్'కు సంబంధించిన అనేక కోణాల్లో ఆకర్షణీయమైన అన్వేషణగా మార్చింది.



ఈ విలాసవంతమైన వాచ్ షో మనల్ని ఆలోచనాత్మకంగా మార్చేస్తుంది. 'మేం గడియారం గురించి చదవడం కాదు సమయాన్ని అన్వేషించాలనుకుంటున్నాం. అందుకే, మా ప్రదర్శనలో ఉన్న విలాసవంతమైన గడియారాలతో పాటు సమయం మన జీవితాలను, పరిసరాలను ఎలా ప్రభావితం చేస్తుందనే దానిపై ఆలోచన కలిగించాలనుకున్నాం. అందుకే, ఈ ఎగ్జిబిషన్ ప్రతి ఒక్కరినీ అర్థవంతమైన మార్గాల్లో ఆలోచించమని ఆహ్వానిస్తుంది' అని ఆర్టిస్ట్ జితా కార్తికేయన్ ఈ సందర్భంగా తెలియజేశారు.

ప్రకృతితో ఉన్న బంధం

మనిషికి– పర్యావరణానికి మధ్య ఉన్న పరస్పర సంబంధాన్ని హైలైట్ చేయడానికి శ్రీలక్ష్మి కెఎస్ తన కళాకృతిని ఉపయోగించారు. ఆమె ప్రకృతిపై వాతావరణ మార్పులు, పారిశ్రామికీకరణ ప్రభావాన్ని నొక్కి చెబుతాయి. సహజ ప్రపంచాన్ని అభినందించడానికి, రక్షించడానికి ఏం చేయాలో చెబుతూ 'నా పని పర్యావరణం, మానవుల మధ్య సంబంధాన్ని హైలైట్ చేస్తుంది. ప్రకృతితో మనకు ఉన్న సున్నితమైన సమతుల్యత దృష్టిని ఆకర్షించాలని కోరుకుంటున్నాను' అని తెలియజేసింది.

వ్యక్తిగత గుర్తింపు

ఎళిలరాసన్ ఎజుమలే తన కళ ద్వారా సామాజిక ప్రభావం, వ్యక్తిగత గుర్తింపు, ఇతివృత్తాలను అన్వేషించారు. అతని ఆర్ట్ సామాజిక నిర్మాణాలలో వ్యక్తిగత పాత్ర, అభివృద్ధిని ఎలా రూపొందిస్తాయో ప్రతిబింబిస్తుంది. 'కాలక్రమేణా మనం మన గుర్తింపులను ఎలా అభివృద్ధి చేసుకుంటాం, ఈ నిర్మాణాలు మనల్ని ఎలా ప్రభావితం చేస్తాయో ఆలోచించమని ప్రేక్షకులను కోరుతున్నాను' అని తెలియజేశారు.



స్త్రీత్వం.. పరివర్తన

కొచ్చికి చెందిన సూరజా కెఎస్ శరీరం, వస్తువుల మధ్య సంబంధాన్ని పరిశోధించే చిత్రాల శ్రేణిని ప్రదర్శించారు. ఆమె కళారూపం స్త్రీత్వం, పరివర్తనకు సంబంధించిన అనుభవాలను ప్రతిబింబిస్తుంది. ఇందులో జనార్ధనన్ రుద్రమూర్తి భౌతిక పరిమితులను అధిగమించాలనే మానవ కోరికను సూచించే శిల్పాలను ప్రదర్శించారు. 'ఎయిర్‌బోర్న్', స్వేచ్ఛ, ఆశయం ఇతివృత్తాలను అన్వేషిస్తూ ఎగరాలని, కొత్త ఎత్తులను చేరుకోవాలనే ఆకాంక్షను సూచిస్తుంది.

వీడియో ఆర్ట్

ప్రణయ్ దత్తా 'బినీత్ ఎ స్టీల్ స్కై' పేరుతో ఒక వీడియో ఆర్ట్ పీస్‌ను అందించారు. ఈ పని మానవులు, విస్తారమైన ప్రకృతి దృశ్యాల మధ్య సంబంధాన్ని పరిశీలిస్తుంది,. కృత్రిమ గదులలో పరిమితమైన ప్రకృతి దృశ్యాలను చిత్రీకరిస్తుంది.

పల్లవుల వాస్తు శిల్పం

కె.శివ పల్లవుల వాస్తుశిల్పం నుండి ప్రేరణ పొందిన సిరామిక్ శిల్పాలను ప్రదర్శించారు. చారిత్రక కళారూపాలకు సహజ రంగులను ఉపయోగించారు.

రీసైకిల్ కళాకృతులు

ఎ. గురునాథన్ తన కళాకృతులలో రీసైకిల్ మెటల్‌ను ఉపయోగించారు. 'కళకు ఉపరితలం దాటి ఆలోచింపజేసే శక్తి ఉంది. ఒక్క క్షణం ఆగి సమయం గురించి ఆలోచించాలని కోరుకుంటున్నాం. ఈ భాగాలలో డైవింగ్ చేయడం ద్వారా, సందర్శకులు సమయం అంటే ఏమిటో ఆలోచించే అవకాశం లభిస్తుందని' అని వివరిస్తారు జితా.

గడియారానికి వ్యతిరేకంగా పోటీ పడుతున్న ప్రపంచంలో ఈ లగ్జరీ ఆర్ట్ షో కళాకారుల దృష్టిలో మాత్రం సమయం కొలిచేది మాత్రమే కాదు. ఇది మనం జీవించడం, అనుభవించడం, చివరికి ఆకారం అని గుర్తుచేసుకున్నాం' అని వివరిస్తున్నారు కళాకారులు.

ప్రకృతిని గౌరవించాలి!

27న వరల్డ్ టూరిజం డే

ఎకో టూరిజం

పర్యాటకులు ప్రతి ఒక్కరూ ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తారు. అది అభిరుచి. అలాగే ప్రకృతిని ప్రేమించాలి. అది బాధ్యత. ఎకో టూరిజమ్‌లో ఏం చేయాలి, ఏం చేయకూడదనే నియమావళి స్పష్టంగా ఉంది.

- పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ బాటిళ్లు, ఒకసారి వాడి పారేసే పాలిథిన్ కవర్‌లను తీసుకెళ్లరాదు.
- పిల్లలు, డయాబెటిస్ పేషెంట్‌లు, పెద్దవాళ్లతో వెళ్లేటప్పుడు బ్రెడ్, బిస్కట్, చాక్లెట్‌ల వంటివి దగ్గర ఉంచుకోవడం తప్పనిసరి. అలాంటప్పుడు తమతో తీసుకువెళ్లిన నాన్ డీ గ్రేడబుల్ వస్తువులను పర్యాటక ప్రదేశంలో పడవేయకుండా అక్కడ ఏర్పాటు చేసిన మున్సిపాలిటీ డస్ట్‌బిన్‌లలో వేయాలి.
- పవిత్రస్థలాలు, సాంస్కృతిక ప్రదేశాలు, స్మారకాలు, ఆలయాలు, ప్రార్థనామందిరాలు ఇతర ధార్మిక ప్రదేశాలలో స్థానిక విశ్వాసాలకు అనుగుణంగా వ్యవహరించాలి.
- నేచర్ ప్లేస్‌లకు వెళ్లినప్పుడు శబ్దకాలుష్యాన్ని నివారించాలి. రేడియో, టేప్‌రికార్డర్, డీజే, మైక్‌లు పెద్ద సౌండ్‌తో పెట్టకూడదు.
- మలమూత్ర విసర్జన కోసం గుడారాల వంటి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకునేటప్పుడు వాటర్‌బాడీలకు కనీసం వంద అడుగుల దూరాన్ని పాటించాలి. అలాగే విసర్జన తర్వాత మట్టి లేదా ఇసుకతో కప్పేయాలి.
- పర్యాటక ప్రదేశాల్లో ఫొటోలు తీసుకునేటప్పుడు ఇతరులకు ఇబ్బంది కలిగించరాదు. వారితో కలిసి ఫొటో తీసుకోవాలనుకుంటే వారి అనుమతితో మాత్రమే తీసుకోవాలి. వారికి తెలియకుండా వారిని ఫ్రేమ్‌లోకి తీసుకునే ప్రయత్నం చేయరాదు.
- చెట్ల ఆకులు, కొమ్మలు, గింజలు, కాయలు, పూలను కోయరాదు. ఇది నేరం కూడా. నియమాన్ని ఉల్లంఘిస్తే శిక్ష తప్పదు. ముఖ్యంగా హిమాలయాల వంటి సున్నితమైన ప్రదేశాల్లో జీవవైవిధ్యత సంరక్షణ కోసం నియమాలు చాలా కఠినంగా ఉంటాయి.
- నది, కాలువ, సరస్సు, తటాకాల్లో సబ్బులతో స్నానం చేయడం, దుస్తులు ఉతకడం నిషిద్ధం.
- నిప్పు రవ్వలు ఎగిరిపడితే అడవులు కాలిపోతాయి. కాబట్టి అడవులలో వంట కోసం కట్టెలతో మంట వేయరాదు. అలాగే సిగరెట్ పీకలను కూడా నేలమీద వేయకూడదు.
- అడవుల్లో ఆల్కహాల్, డ్రగ్స్ సేవనం, మత్తు కలిగించేవన్నీ నిషేధం.
- స్థానికులకు చాక్లెట్లు, స్వీట్స్, ఆహారపదార్థాల ఆశ చూపించి వారిని ప్రభావితం చేసే ప్రయత్నం చేయరాదు. అలాగే ఆయా ప్రదేశాల్లో నెలకొన్న సంప్రదాయ విశ్వాసాలను గౌరవించాలి. వారి అలవాట్లను హేళన చేయరాదు.



ఎకో ఊటీ

నీలగిరి సౌందర్యం





ఊటీకి టూరెళ్దామా? అంటే ఎగిరి గంతేసిన బాల్యం వృద్ధాప్యంలోకి అడుగుపెట్టింది. మధ్యతరం ఊటీలో ఏముంది అవే టీ తోటలు, అదే దొడబెట్ట, అదే టాయ్ ట్రైన్, బొటానికల్ గార్డెన్, పాటలు చిత్రీకరించిన కూనూరు... అని పెదవి విరిచేశాయి. డెబ్బై, ఎనభైల దక్షిణాది సినిమాల్లో చూసిందే కదా ఊటీ అని తేల్చేయడమూ కరెక్టే. అయితే ఊటీ అంటే సినిమాల్లో చూసిన ఊటీ మాత్రమే కాదు. ఇంకా చూడాల్సిన ఊటీ చాలానే ఉంది. ముఖ్యంగా ఎకో టూరిజమ్‌లో ఊటీకి పాతిక కిలోమీటర్ల దూరాన నీలగిరుల్లో విస్తరించిన అవలాంచే సరస్సు వైపు అడుగులు వేద్దాం.

మెల్లగా సాగే ప్రయాణం... ఊటీ ఎకో టూరిజమ్ అవలాంచె చెక్‌పోస్ట్ నుంచి మొదలవుతుంది. ఇరవై కిలోమీటర్ల ప్రయాణం మధ్యలో మూడు వ్యూ పాయింట్లు ఉంటాయి. షోలా ఫారెస్ట్ వ్యూ పాయింట్. మరికొంత దూరంలో భవానీ ఆలయం, లక్కిడి. ఈ మూడు పాయింట్లను కలుపుతూ రౌండ్ ట్రిప్ ఇది. ప్రయాణం వేగంగా గమ్యానికి చేరాలన్నట్లు ఉండదు. ప్రదేశాన్ని ఆసాంతం కళ్లారా చూడడానికి రెండు గంటల సేపు సాగుతుంది. తిరిగి అవలాంచె చెక్‌పోస్టు దగ్గర దింపుతారు.

పశ్చిమం నుంచి తూర్పుకు ప్రయాణం... అవలాంచె సరస్సు చేరడానికి సన్నటి రోడ్డు మీద సాగే ప్రయాణం. ప్రకృతి సౌందర్యంతో పాటు కొండ శిఖరాలను చూడవచ్చు. భవానీ ఆలయం నుంచి అరకిలోమీటరు దూరం నడిస్తే అందమైన జలపాతం, అప్పర్ భవానీ డ్యామ్ బ్యాక్ వాటర్స్ కనువిందు చేస్తాయి. భవానీ నది కేరళలోని పశ్చిమ కనుమలలో పుట్టి తూర్పు దిశగా ప్రవహిస్తూ తమిళనాడుకి వచ్చి కావేరినదిలో కలుస్తుంది.

గిరి జనపథం... ఊటీ ఎకో టూరిజమ్ జోన్‌లోకి ప్రైవేట్ వాహనాలను అనుమతించరు. పర్యాటకుల వాహనాలు అవలాంచె చెక్‌పోస్ట్ దగ్గర ఆగిపోవాలి. అక్కడి నుంచి టూరిజమ్ డిపార్ట్‌మెంట్ వాహనంలోకి మారాలి. విడిగా ట్రిప్ కావాలనుకుంటే ఎనిమిది మందికి ఒక జీపు ఏర్పాటు చేస్తారు. ఈ టూర్‌లో నీలగిరుల్లో టోడా గిరిజన తెగ నివసించే ప్రదేశాలను కూడా చూడవచ్చు. వారి ఇళ్ల నిర్మాణం, దుస్తుల మీద వారు చేసే ఎంబ్రాయిడరీ ప్రత్యేకమైనవి. ఒక చేతిరుమాలైనా కొనుక్కుంటే ఆ కళకు ప్రోత్సాహం గానూ, టూర్‌కి గుర్తుగానూ ఉంటుంది.

నృత్య కళ

డ్యాన్స్ గురు

ఓ ఆధ్యాత్మిక ప్రయాణం

పద్దెనిమిదేళ్ళ వయసులో ఇంటి నుంచి పారిపోయి ప్రపంచ స్థాయిని అందుకున్న భరతనాట్య నృత్యకారిణి సోనాల్ మాన్‌సింగ్ ఓ అద్భుత శిఖరం. ఆమె ఎనిమిది పదుల జీవితం ఎంతో మందికి స్ఫూర్తిదాయకం. భారత శాస్త్రీయ నృత్య ప్రపంచంలో సోనాల్ మాన్‌సింగ్ పేరు మాత్రమే కాదు ఆమె ధిక్కరణ, ధైర్యం, అభిరుచికి నిలువెత్తు చిహ్నం. చిన్ననాటి నుండి ఆమె నృత్యం కేవలం ప్రదర్శనగా మాత్రమే ఉండాలనుకోలేదు. నృత్యం ద్వారా జీవితానికి నిజమైన అర్థాన్ని కనుక్కోవాలనుకుంది. ఆధ్యాత్మిక ప్రయాణం, సామాజిక నిబంధనలను సవాల్ చేయడానికి నృత్యం ఒక మార్గంగా భావించింది.



''నాకు 15, 20, 50, 60 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు ఎవరైనా అడిగితే ప్రదర్శనలు ఇస్తున్నాను అని చెప్పేదాన్ని. కానీ డ్యాన్స్ నాకు ఇప్పుడు ఆధ్యాత్మికంగా మారింది' అని 80 ఏళ్ల ఈ భారత శాస్త్రీయ నృత్యకారిణి, భరతనాట్యం, ఒడిస్సీ నృత్య గురువు సోనాల్ మాన్‌సింగ్ వివరిస్తారు. పద్మ భూషణ్ (1992), పద్మ విభూషణ్ (2003) గ్రహీత, పార్లమెంటు, రాజ్యసభ సభ్యురాలు కావడానికి నామినేట్ అయిన సోనాల్ ప్రతి నృత్య అడుగు మనకు ఓ పాఠంగా అవుతుంది.

'కృష్ణ' ప్రదర్శన మాత్రమే కాదు

డ్యాన్స్ అంటే నాకు ప్రాణం. అందుకే డ్యాన్స్‌తో పాటు వృత్తిని కొనసాగించమని అడిగితే ఇంటి నుంచి పారిపోయి, బెంగళూరుకు వెళ్లి, అక్కడ నాట్య గురువుల ఇంట్లో ఆశ్రయం పొందాను. ప్రొఫెసర్ యు.ఎస్.కృష్ణారావు, చంద్రభాగ దేవిల వద్ద శిక్షణ పొందాను. ఇటీవల ఇండియా హాబిటాట్ సెంటర్‌లో 'కృష్ణ' అనే నాట్య కథను ప్రదర్శించాను. దీని గురించి ఎందుకు చెబుతునాన్నంటే ఈ ఆలోచన నా చిన్నప్పటి నుండి ఉండేది. చదివిన సాహిత్యం.. ముఖ్యంగా మన పురాణాలు, మహాభారతం నుండి వచ్చింది. 'కృష్ణ' అన్నింటి మిశ్రమం.

ప్రమాదం జరిగినా ఎదురీతే!

చిన్ననాటిబు నుంచి వేషం వేసుకుని దరువులకు డ్యాన్స్ చేయడం మొదలుపెట్టేదాన్ని. నాలుగేళ్ల వయసులో క్లాసికల్ మణిపురి డ్యాన్స్ కాస్ట్యూమ్ ధరించి డ్యాన్స్ చేశాను. భరతనాట్యం ప్రశాంతతను ఇచ్చేది. 1974లో జర్మనీలో కారు ప్రమాదంలో చాలా గాయాలు అయ్యాయి. ఇకపై డ్యాన్స్ చేయలేనని వైద్యులు చెప్పారు. అయినప్పటికీ, పట్టువదలలేదు. ఫిజియోథెరపీ సెషన్ల తర్వాత ఏడాదిలోనే ప్రదర్శన ఇచ్చాను. డ్యాన్స్ నుండి మాత్రమే శక్తిని పొందుతాను. నా జీవితంలో నేను ఎప్పుడూ డిప్రెషన్‌గా భావించలేదు. ఎప్పుడూ నిరాశ చెందలేదు.

స్త్రీత్వం గురించి గర్వం

ఒంటరిగా ఉన్న అమ్మాయి తన ఇంటిని వదిలిపెట్టి నృత్యాన్ని నమ్ముకొని, ప్రదర్శనలూ ఇచ్చే స్థాయికి ఎదిగింది అంటే ఎవరూ నమ్మరు. క్లాసికల్ డ్యాన్స్ ఎప్పుడూ స్త్రీత్వానికి సంబంధించినది. పురుషులు ఎప్పుడూ ఉపాధ్యాయులు, మహిళలు నృత్యకారులుగా ఉన్నారు. కానీ ఇప్పుడు ఎక్కువ మంది పురుషులు ప్రదర్శనలు ఇవ్వడానికి వస్తున్నారు. వారేం చేసినా నృత్యంలో స్త్రీలే రాజ్యమేలారు. అందుకే నా నృత్యాల్లో 'పంచకన్య', 'ద్రౌపది', 'మీరా'. స్త్రీ శక్తికి సంబంధించినవి ఉంటాయి. ' నృత్యం నేర్చుకోవాలని తపించేవారు ఎప్పుడూ వ్యక్తిగతంగానే గురువును వెతకాలని' అంటూ నృత్య పాఠాలను వివరిస్తుంది సోనాలి మాన్‌సింగ్.

వారసత్వ సంపద

ప్రపంచంలో ఎక్కువ మంది సందర్శించే అద్భుతాలు మనవే!



ప్రపంచ వారసత్వ ప్రదేశాలకు గుర్తింపునిచ్చే యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్స్‌లో అత్యధికంగా భారతీయ సందర్శనీయ స్థలాలే ఉన్నాయి. దీనికి కారణం ప్రపంచంలో అతి ఎక్కువ మంది సందర్శిస్తున్న దర్శనీయ స్థలాలలో ఈ ప్రాచీన వారసత్వ సంపద ప్రముఖంగా నిలిచాయి.

ఖజరహో శిల్పాలు

దేశంలోనేకాదు ప్రపంచంలోనే ఎన్ని చారిత్రక కట్టడాలు ఉన్నా ఖజరహో శిల్పకళకు మరేదీ సాటిరాదని మరోసారి రుజువైంది. మధ్య ప్రదేశ్ ఛత్తర్‌పూర్ జిల్లాలో కొలువై ఉన్న ఖజరహోను ప్రపంచంలో ఎక్కువ మంది సందర్శించే కళా వైభవం గల స్థలంగా పేరొందింది. శిల్పసోయగాలతో ఆకట్టుకునే ఖజరహో గ్రూప్ ఆఫ్ మాన్యుమెంట్స్ గురించి కళ్లారా చూడాల్సిందే తప్ప ఒక్క మాటలో వివరించలేం. అలాంటి ఖజరహో శిల్పాలతో పాటు బుద్ధిస్ట్ మాన్యుమెంట్స్, సాంచీ అండ్ రాక్స్ షెల్టర్స్ ఆఫ్ భీమ్‌బెట్కా కూడా ఈ జాబితాలో ఉన్నాయి.

ఎల్లోరా గుహలు

మహారాష్ట్రాలోని ఎల్లోరా, అజంతా, ఎలిఫెంటా గుహలు, ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్‌తో పాటు విక్టోరియన్ అండ్ ఆర్ట్ డెకో కూడా ఈ జాబితాలో ఉన్నాయి.

నేషనల్ పార్క్



పింక్ సిటీగా పేరొందిన జైపూర్ సిటీ, రాజస్థాన్ హిల్ ఫోర్ట్స్, కొలడియో నేషనల్ పార్క్, జంతర్ మంతర్‌ను ప్రపంచంలో ఎక్కువ మంది సందర్శించిన స్థలాలుగా పేరొందాయి.

వెన్నెల దీపం

యునెస్కో హెరిటేజ్ సైట్స్‌లో ప్రపంచ వ్యాప్తంగా ఎక్కువ మంది సందర్శించిన జాబితాలో నాల్గవ స్థానంలో తాజమహల్. దీంతో పాటు ఆగ్రా ఫోర్ట్, ఫతేపూర్ సిక్రీ ఉన్నాయి.

రాణీకి వావ్

గుజరాత్‌లోని యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్స్‌లో రాణీ కి వావ్, ది హిస్టోరిక్ సిటీ ఆఫ్ అహ్మదాబాద్ అండ్ చంపనీర్–పవగడ్, ఆర్కియలాజికల్ పార్క్ లు ఉన్నాయి.




అత్యున్నత స్థానం కోసం కృషి చేయండి
అక్కడికి చేరలేకపోయినా, ఉన్నత స్థానాన్ని సాధిస్తారు..
- లెస్ బ్రౌన్, అమెరికన్ వ్యక్తిత్వ వికాస నిపుణులు

సాక్షి ప్లస్
సోమవారం। 23-9-2024

లగ్జరీ కార్ల పండుగ

భారీ అమ్మకాలపై కంపెనీల ఆశలు ★ పలు మోడల్స్‌లో ప్రత్యేక ఎడిషన్లు

న్యూఢిల్లీ: దేశీయంగా లగ్జరీ కార్లకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఏడాది పండుగ సీజన్‌లో హైఎండ్ కార్ల అమ్మకాలు రికార్డు స్థాయిలో ఉంటాయని వాహన దిగ్గజాలు అంచనా వేస్తున్నాయి. దేశ ఆర్థిక మూలాలు పటిష్టంగా ఉన్న నేపథ్యంలో లగ్జరీ సెగ్మెంట్‌పై వినియోగదారుల ఆసక్తి పెరుగుతోందని బీఎండబ్ల్యూ గ్రూప్ ఇండియా ప్రెసిడెంట్ విక్రమ్ పావా చెప్పారు. 'బీఎండబ్ల్యూ గ్రూప్ ఇండియాకు ఆర్డర్లు భారీగా ఉన్నాయి. కస్టమర్లకు వాటిని వేగంగా అందించేందుకు ప్రయత్నం చేస్తున్నాం. దసరా, దీపావళి సందర్భంగా అదనపు బుకింగ్స్ కూడా వస్తాయి కాబట్టి ఈ ఏడాది గణనీయ వృద్ధినే నమోదు చేస్తాం' అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఓనంతో ప్రారంభించి దీపావళితో ముగిసే పండుగ సీజన్ సందర్భంగా ఇప్పటికే పలు మోడల్స్‌లో ప్రత్యేక ఎడిషన్స్‌ను ప్రవేశపెట్టినట్లు విక్రమ్ వివరించారు. దేశీయంగా మొత్తం ప్యాసింజర్ వాహనాల మార్కెట్లో లగ్జరీ కార్ల వాటా 2 శాతం లోపు ఉంటుంది.

రెండంకెల స్థాయిలో వృద్ధి..

సాధారణంగా ఈ సీజన్‌లో గరిష్ట రెండంకెల స్థాయిలో విక్రయాల వృద్ధి నమోదవుతుందని మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ సంతోష్ అయ్యర్ తెలిపారు. మొత్తం ప్యాసింజర్ వాహనాల మార్కెట్లో లగ్జరీ విభాగం చాలా చిన్నదే అయినప్పటికీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అమ్మకాల పరిమాణం రికార్డు స్థాయిలో పెరిగే అవకాశం ఉందన్నారు. అయితే, అన్ని కంపెనీలూ అదే స్థాయిలో వృద్ధి చెందడం లేదని చెప్పారు. కొన్ని సంస్థల అమ్మకాలు ఒక మోస్తరుగా ఉండగా, కొన్నింటి విక్రయాలు క్షీణించాయని, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని ఆయన వివరించారు. అయినప్పటికీ ఈ ఏడాది లగ్జరీ కార్ల విక్రయాలు 50,000–51,000 స్థాయిలో ఉండొచ్చని ఈ విభాగంలో కీలకమైన కంపెనీగా అంచనా వేస్తున్నట్లు అయ్యర్ వివరించారు. మరోవైపు, పండుగ సీజన్‌లో సానుకూల కొనుగోలు ధోరణులు కొనసాగుతాయని భావిస్తున్నట్లు ఆడీ ఇండియా హెడ్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ తెలిపారు. ఏ4, ఏ6, క్యూ3, క్యూ3 స్పోర్ట్‌బ్యాక్ మొదలైన వాటికి డిమాండ్ గణనీయంగా ఉంటోందని వివరించారు. అలాగే ఈ–ట్రాన్ శ్రేణికి కూడా ఆదరణ కనిపిస్తోందన్నారు.



ఈవీ చార్జింగ్ స్టేషన్లకు ఉమ్మడి ప్లాట్‌ఫాం..

ఎలక్ట్రిక్ వాహనాలకు సంబంధించి వివిధ సర్వీస్ ప్రొవైడర్లు నిర్వహించే చార్జింగ్ స్టేషన్ల సమగ్ర వివరాలు ఉండేలా ఒక ఉమ్మడి ప్లాట్‌ఫాం ఉండాలని మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ సంతోష్ అయ్యర్ అభిప్రాయపడ్డారు. వాహనదారులకు సౌకర్యంగా ఉండటంతో పాటు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని మరింతగా ప్రోత్సహించేందుకు కూడా ఇలాంటి యాప్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం చార్జింగ్‌కు సంబంధించి ఒకదానితో మరొకదానికి సంబంధం లేని 3–4 యాప్‌లను వాహనదారులు ఉపయోగించాల్సి వస్తోందని అయ్యర్ చెప్పారు. అలా కాకుండా యూపీఐ ఆధారిత సిస్టమ్ తరహాలో ప్రభుత్వం దీనికి కూడా ఒక ప్లాట్‌ఫామ్‌ను ఏర్పాటు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

వృద్ధి బాటలో అదానీ ఎనర్జీ


- ఆదాయం, ఇబిటా పురోగతిపై బ్రోకరేజీ అంచనాలు



న్యూఢిల్లీ: విద్యుత్ ప్రసార కంపెనీ అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 18.5 బిలియన్ డాలర్ల(సుమారు రూ. 1,54,660 కోట్లు) ఎంటర్‌ప్రైజ్ విలువను సాధించినట్లు బ్రోకరేజీ కాంటర్ ఫిట్జ్‌గెరాల్డ్ పేర్కొంది. పటిష్ట వృద్ధిలోనున్న బిజినెస్ కారణంగా కంపెనీ ఆదాయం, పన్నుకుముందు లాభాల్లో భారీ పురోగతికి వీలున్నట్లు అంచనా వేసింది. రానున్న మూడేళ్లలో ఆదాయం వార్షిక ప్రాతిపదికన 20 శాతం, పన్నుకుముందు లాభాలు 29 శాతం చొప్పున పుంజుకోగలవని అభిప్రాయపడింది. కంపెనీ విద్యుత్ ప్రసారం, పంపిణీ ఆస్తులతోపాటు.. స్మార్ట్ మీటరింగ్ బిజినెస్‌లను కలిగి ఉంది. మూడేళ్ల(2024 నుంచి 2027) కాలంలో వార్షిక ప్రాతిపదికన ఆదాయం 20 శాతం, నిర్వహణ లాభం(ఇబిటా) 29 శాతం చొప్పున పురోగమించనున్నట్లు కాంటర్ ఫిట్జ్ అంచనా వేసింది.

రికార్డుల ర్యాలీ కొనసాగొచ్చు

- నిఫ్టీ 26,000 అందుకునే ఛాన్స్
- విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు కీలకం
- అంతర్జాతీయ పరిణామాలపైనా దృష్టి
- ఈ వారం ట్రేడింగ్‌పై స్టాక్ నిపుణుల అంచనా



ముంబై: స్టాక్ సూచీల రికార్డు ర్యాలీ ఈ వారం కూడా కొనసాగే వీలుందని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. దేశీయ స్థూల ఆర్థిక గణాంకాలు సానుకూలంగా ఉండటం, అమెరికా ఆర్థిక మందగమనంపై ఆందోళనలు తగ్గడంతో పాటు విదేశీ పెట్టుబడులు పెరుగుతుండటం తదితర అంశాలు సూచీలను లాభాల దిశగా నడిపిస్తాయని చెబుతున్నారు. ఇక అంతర్జాతీయ పరిణామాలు, ఎఫ్అండ్ఓ ఎక్స్‌పైరీ అంశాలు ట్రేడింగ్‌ను ప్రభావితం చేయొచ్చంటున్నారు. వీటితో పాటు రూపాయి విలువ, క్రూడాయిల్ ధరలు, యూఎస్ బాండ్ ఈల్డ్స్ అంశాలపైనా ఇన్వెస్టర్లు దృష్టి సారించవచ్చని నిపుణుల అభిప్రాయం.

''ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపుతో ఇన్వెస్టర్లు 'పతనమైన ప్రతిసారి కొనుగోలు' వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. వినియోగ, ఆటో, ఫైనాన్స్, రియల్టీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించవచ్చు. డాలర్ విలువ బలహీనపడటంతో ఎగుమతి ఆధారిత రంగాల ఫార్మా, ఐటీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనవచ్చు. కొనుగోళ్లు కొనసాగితే నిఫ్టీ 26,000 స్థాయిని అందుకోవచ్చు. దిగువున 25,500 – 25,450 శ్రేణిలో తక్షణ మద్దతు ఉంది'' అని స్వస్తిక ఇన్వెస్ట్‌మార్ట్ రీసెర్చ్ హెడ్ సంతోష్ మీనా తెలిపారు.

అమెరికా నాలుగేళ్ల తర్వాత వడ్డీ రేట్లను అంచనాలకు మించి 50 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో ఈక్విటీ మార్కెట్లు సరికొత్త శిఖరాలను అధిరోహించాయి. బ్యాంకులు, ఫైనాన్స్ షేర్లు రికార్డుల ర్యాలీకి ప్రాతినిధ్యం వహించాయి. గతవారం మొత్తంగా సెన్సెక్స్ 1653 పాయింట్లు, నిఫ్టీ 434 పాయింట్లు లాభపడ్డాయి.

గురువారం డెరివేటివ్స్ కాంట్రాక్టుల ముగింపు

ఈ గురువారం (సెప్టెంబర్ 22న) నిఫ్టీ సెప్టెంబర్ సిరీస్ డెరివేటివ్స్ కాంట్రాక్టుల గడువు ముగియనుంది. అదేరోజున బ్యాంక్ నిఫ్టీ వీక్లీ ఎక్స్‌పైరీ కూడా ఉంది. ట్రేడర్లు తమ పొజిషన్లపై తీసుకొనే స్క్వేర్ ఆఫ్ లేదా రోలోవర్ నిర్ణయానికి అనుగుణంగా మార్కెట్ స్పందించవచ్చని నిపుణులు చెబుతున్నారు. సాంకేతికంగా నిఫ్టీకి 26,000 వద్ద కీలక నిరోధం ఉంది. ఈ స్థాయిని నిలుపుకోగలిగితే 26,100 – 26,350 శ్రేణిని పరీక్షిస్తుందని ఆప్షన్ డేటా సూచిస్తోంది.

విదేశీ పెట్టుబడులు

ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు, దేశీయ మార్కెట్ స్థిర్వతం కారణంగా ఈ సెప్టెంబర్‌లో ఇప్పటి వరకు (1– 21 తేదీల మధ్య) విదేశీ ఇన్వెస్టర్లు రూ.33,700 కోట్ల విలువైన ఈక్విటీలను కొనుగోలు చేశారు. ''నాలుగేళ్ల తర్వాత ఫెడ్ వడ్డీరేట్లను 50 బేసిస్ పాయింట్లను తగ్గిస్తూ.., రేట్ల తగ్గింపు ప్రక్రియ ప్రారంభమైనట్లు సంకేతాలిచ్చింది. వచ్చే ఏడాది (2025) చివరికి ఫెడ్ ఫండ్స్ రేట్లు 3.4 శాతానికి పరిమితం చేసేందుకు ప్రయత్నిస్తోంది. అమెరికా బాండ్లపై రాబడులు తగ్గుముఖం పట్టడంతో భారత్‌లో పెట్టుబడులు మరింత పెరగొచ్చు'' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వీకే విజయ్ కుమార్ తెలిపారు.

స్థూల ఆర్థిక గణాంకాల ప్రభావం

దేశీయంగా హెచ్ఎస్‌బీసీ కాంపోజిట్ సెప్టెంబర్ తయారీ పీఎంఐ, సేవల పీఎంఐ గణాంకాలు నేడు (సోమవారం) వెలువడనున్నాయి. అమెరికా ఆగస్టు నెల తయారీ, కన్జూమర్ కాన్ఫిడెన్స్ డేటా మంగళవారం విడుదల కానుంది. బ్యాంకు ఆఫ్ జపాన్ ద్రవ్య కమిటీ సమావేశ వివరాలు(మినిట్స్), అమెరికా క్యూ2 జీడీపీ వృద్ధి డేటా గురువారం వెల్లడి కానుంది. సెప్టెంబర్ 13తో ముగిసిన వారం బ్యాంకు రుణాలు, డిపాజిట్ల వృద్ధి గణాంకాలు, ఆగస్టు 20తో ముగిసిన వారం ఫారెక్స్ నిల్వల డేటాను ఆర్‌బీఐ శుక్రవారం విడుదల చేస్తుంది. ఆయా దేశాల ఆర్థిక స్థితిగతులను ప్రతిబింబిపజేసే ఈ స్థూల ఆర్థిక గణాంకాలు ఈక్విటీ మార్కెట్ల ట్రేడింగ్‌ను ప్రభావితం చేయగలవు.

రెండు ఐపీఓలు, మూడు లిస్టింగులు

నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ అయిన మన్బా ఫైనాన్స్ రూ.151 కోట్ల సమీకరణ లక్ష్యంతో ఐపీఓకు వస్తోంది. సెప్టెంబర్ 23న ప్రారంభమై 25న ముగుస్తుంది. కేఆర్ఎన్ హీట్ ఎక్స్ఛేంజర్ అండ్ రిఫ్రిజిరేషన్ ఇష్యూ 25–27 తేదీల మధ్య ఉంటుంది. తద్వారా రూ. 342 కోట్లు సమీకరించనుంది. ఎస్ఎంఈ విభాగంలో కంపెనీలతో కలిసి మొత్తం 11 సంస్థలు మార్కెట్ నుంచి రూ.900 కోట్లను సమీకరించనున్నాయి. అలాగే ఇటీవల పబ్లిక్ ఇష్యూను పూర్తి చేసుకున్న వెస్ట్రన్ క్యారియర్స్ ఇండియా, ఆర్కేడ్ డెవలపర్స్, నార్తర్న్ ఆర్క్ క్యాపిటల్ షేర్లు ఒకేరోజున మంగళవారం (సెప్టెంబర్ 24న) స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ కానున్నాయి.

ఎల్ఐసీ నుంచి మాన్యుఫాక్చరింగ్ ఫండ్

- అక్టోబర్ 4 వరకు పెట్టుబడుల స్వీకరణ
- నెలవారీ రూ.200తో సిప్
- మార్చి నాటికి రూ.60,000 కోట్ల ఏయూఎం
- ఎల్ఐసీ మ్యూచువల్ ఫండ్ ఎండీ ఆర్కే ఝా

ముంబై: ఎల్ఐసీ మ్యూచువల్ ఫండ్ తయారీ రంగంలో పెట్టుబడుల అవకాశాలతో 'మాన్యుఫాక్చరింగ్ ఫండ్'ను ప్రారంభించింది. అక్టోబర్ 4 వరకు ఈ పథకంలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చని తెలిపింది. నిఫ్టీ ఇండియా మాన్యుఫాక్చరింగ్ ఇండెక్స్ ఈ పథకానికి ప్రామాణికంగా ఉంటుందని పేర్కొంది. తయారీ రంగంలో వైవిధ్యమైన కంపెనీలతో కూడిన పోర్ట్‌ఫోలియోని ఈ పథకం అందిస్తుందని, ఆటో మొబైల్స్, ఫార్మాస్యూటికల్స్, కెమికల్స్, హెవీ ఇంజనీరింగ్ ఉత్పత్తులు, మెటల్స్, షిప్ బిల్డింగ్, పెట్రోలియం ఉత్పత్తుల కంపెనీలకు ఇందులో చోటు ఉంటుందని వివరించింది. ఈ సందర్భంగా కొత్త పథకం (ఎన్ఎఫ్ఓ) వివరాలను ఎల్ఐసీ మ్యూచువల్ ఫండ్ ఎండీ, సీఈవో ఆర్కే ఝా వెల్లడించారు. తయారీ థీమ్ లోని కంపెనీల్లో ఈ పథకం పెట్టుబడులు పెడుతుందని, ఇన్వెస్టర్లకు మంచి సంపద సమకూర్చడమే మాన్యుఫాక్చరింగ్ ఫండ్ ఆవిష్కరణ ఉద్దేశ్యమని చెప్పారు. ఇన్వెస్టర్లు రోజువారీగా రూ. 300 లేదా నెలవారీగా రూ.1,000 నుంచి, త్రైమాసికం వారీగా అయితే రూ.3,000 చొప్పున ఈ పథకంలో సిప్ చేసుకోవచ్చని తెలిపారు. ''ఈ పథకం అక్టోబర్ 16 నుంచి తిరిగి పెట్టుబడులకు అందుబాటులోకి వస్తుంది. అప్పుడు రోజువారీ సిప్ రూ.100కు, నెలవారీ సిప్ రూ.200కు తగ్గుతుంది. తక్కువ ఆదాయంలో ఉన్న వారు సైతం ఈ పథకంలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు'' అని ఝా వివరించారు. ఏకమొత్తంలో ఇన్వెస్ట్ చేయాలనుకుంటే రూ.5,000 నుంచి చేసుకోవచ్చని చెప్పారు. పరిశ్రమ వ్యాప్తంగా 11 మాన్యుఫాక్చరింగ్ ఫండ్స్ ఉన్నాయని, వీటి నిర్వహణలో రూ.34,700 కోట్ల ఆస్తులు న్నట్టు తెలిపారు.

యాక్సిస్ క్రిసిల్-ఐబీఎక్స్ ఎస్‌బీఎఫ్‌సీ ఇండెక్స్ ఫండ్

యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా 'క్రిసిల్-ఐబీఎక్స్ ఎఎఎ ఎస్‌బీఎఫ్‌సీ ఇండెక్స్–జూన్ 2027 ఫండ్'ను ఆవిష్కరించింది. ఇందులో కనీసం రూ. 5,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. సెప్టెంబర్ 23తో ఇది ముగుస్తుంది. నిర్దిష్ట ఇండెక్స్‌లోని ఫిక్స్‌డ్ ఇన్‌కం సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా ఇన్వెస్టర్లకు మెరుగైన రాబడులు అందించడం ఈ ఫండ్ లక్ష్యం. ఇది ఎన్‌బీఎఫ్‌సీ రంగ ఆధారిత తొలి టార్గెట్ మెచ్యూరిటీ మ్యూచువల్ ఫండ్ పథకమని సంస్థ ఎండీ బి. గోపకుమార్ తెలిపారు.

పసిడిలో వ్యూహాత్మక పెట్టుబడులు..


భారతీయ సంస్కృతిలో పసిడికి తరతరాలుగా ఒక విశిష్టమైన స్థానం ఉంది. సంపదకు, హోదాకు, సంప్రదాయానికి ప్రతీకగా ఉంటూ ఒక పటిష్టమైన అసెట్‌గా, హెడ్జింగ్ సాధనంగా, విశ్వసనీయమైన పెట్టుబడి సాధనంగా పసిడి కొనసాగుతోంది. దేశం వేగంగా వృద్ధి చెందుతున్న నేపథ్యంలో పసిడి, ఇన్వెస్టర్ల మధ్య బంధం మరింతగా బలపడుతోంది. ఆదాయ స్థాయిలు పెరిగే కొద్దీ ఇటు వ్యక్తిగత వినియోగం అటు పెట్టుబడి కోణంలోనూ బంగారానికి డిమాండ్ గణనీయంగా పెరిగింది. అయితే, పోర్ట్‌ఫోలియోకి స్థిరత్వాన్నిచ్చే పుత్తడిలో పెట్టుబడుల పెట్టే విషయంలో వ్యూహాత్మకంగా ఎలా వ్యవహరించాలనేది ఇన్వెస్టరుకు ప్రశ్నార్థకంగా ఉంటోంది. బంగారం అంటే కొనుక్కుని అట్టే పెట్టుకోవడం మాత్రమే కాదు విస్తృత పెట్టుబడి వ్యూహంలో దాన్ని సమర్థంగా ఎలా ఉపయోగించుకోవచ్చనేది కూడా తెలిసినప్పుడే ప్రయోజనకరంగా ఉంటుంది.



వికాశ్ వాడేకర్,
హెడ్, ప్యాసివ్ బిజినెస్,
యాక్సిస్ మ్యూచువల్ ఫండ్

పోర్ట్‌ఫోలియోకు స్థిరత్వం..

ఒడిదుడుకులకు లోనయ్యే పోర్ట్‌ఫోలియోకి పసిడి దీర్ఘకాలిక స్థిరత్వాన్ని అందించగలదు. కాలం గడిచినా విలువను కోల్పోని చరిత్ర పసిడికి ఉంది. అందుకే సంపద సంరక్షణకు దీన్ని పరిగణనలోకి తీసుకోవచ్చు. దీర్ఘకాలంలో సంపదను పెంచుకోవాలనుకునే వర్ధమాన ఎకానమీల ఇన్వెస్టర్లలో ఈ అభిప్రాయం మరింతగా ఉంది. ఇక, బంగారం ధరల కదలికలనేవి స్టాక్స్, బాండ్స్ వంటి సంప్రదాయ అసెట్స్‌కి వ్యతిరేక దిశలో ఉంటాయి. అంటే, స్టాక్ మార్కెట్ తగ్గుతుంటే, పసిడి ధరలు పెరగవచ్చు. తద్వారా పోర్ట్‌ఫోలియోకు డైవర్సిఫికేషన్ ప్రయోజనాలను పసిడి అందిస్తుంది.



వివిధ మార్గాల్లో ఇన్వెస్ట్‌మెంట్..

బంగారంలో పెట్టుబడులు పెట్టడమే కాకుండా ఏ రూపంలో ఇన్వెస్ట్ చేస్తున్నారనేది కూడా ముఖ్యమే. ఫిజికల్ గోల్డ్, ఈటీఎఫ్‌లు, గోల్డ్ మైనింగ్ స్టాక్స్ – ఇలా ఒక్కో విధానంలో ఒక్కో రకమైన ప్రయోజనాలు, రిస్కులు ఉన్నాయి. ఫిజికల్ గోల్డ్ అనేది స్పష్టమైన భద్రతనిస్తుంది. కానీ లిక్విడిటీపరంగా సమస్యలు ఉండొచ్చు. మరోవైపు, ఈటీఎఫ్‌లు, ట్రేడ్ చేసేందుకు సరళంగాను, సులభతరంగాను ఉంటాయి. నేటి తరం డిజిటల్, వేగవంతమైన ఆర్థిక పరిస్థితులకు అనువుగా ఉంటాయి. ఇన్వెస్టర్లు తమ రిస్కు సామర్థ్యాలు, లక్ష్యాలను బట్టి సమతూకంగా వ్యవహరిస్తే, పసిడిలో పెట్టుబడి ఇటు పోర్ట్‌ఫోలియోకు రక్షణగా ఉండటంతో పాటు అటు సంపద వృద్ధికి అవకాశాన్ని కల్పించేదిగా కూడా ఉంటుంది.

నియంత్రణల ప్రభావం..

వర్ధమాన మార్కెట్లలో పాటించే రెగ్యులేటరీ విధానాలు బంగారం లభ్యత, దాని ధరలను నేరుగా ప్రభావితం చేస్తాయి. ఉదాహరణకు భారత్‌ను చూస్తే, పసిడి దిగుమతి సుంకాల విషయంలో ప్రభుత్వ విధానాలనేవి మార్కెట్ పరిస్థితులపై గణనీయంగా ప్రభావం చూపుతాయి. కాబట్టి పసిడిలో ఎప్పుడు, ఎలా పెట్టుబడులు పెట్టాలనే విషయంలో ఇలాంటి మార్పుల గురించి ఇన్వెస్టర్లు అప్‌డేటెడ్‌గా ఉండాలి. భారత్‌లాంటి వర్ధమాన మార్కెట్లు వృద్ధి చెందే కొద్దీ బంగారం ప్రాధాన్యత మరింత ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. యాక్టివ్ ఇన్వెస్టరుకు బంగారం అంటే హెడ్జింగ్ సాధనం మాత్రమే కాదు, వైవిధ్యమైన, వ్యూహాత్మకమైన పోర్ట్‌ఫోలియోలో కీలకమైన అంశంగా ఉంటుంది. సరైన విధానం పాటిస్తే బంగారమనేది సుస్థిరమైన సంపద.


ఐటీ వెబ్‌సైట్‌ను సందర్శించండి..



కె.సీహెచ్. ఏ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

ప్రతి రోజూ కాకపోయినా వారానికొకసారైనా ఇన్‌కంట్యాక్స్ వెబ్‌సైట్‌ని చూస్తూ ఉండండి. రోజు, తిథి, వారం, నక్షత్రాల్లాగా, వాతావరణం రిపోర్ట్‌లాగా, బంగారం రేట్లలాగా, షేర్ మార్కెట్ల ధరల్లాగా, చూడక తప్పదు. సైటు తెరవగానే హోమ్‌పేజీలో ఇంపార్టెంట్ విషయాలు ఇరవై ఉంటాయి. వీటిని తెరిస్తే మీకు ఉపయోగపడే సమాచారం కనిపిస్తుంది. వీటిలో ముఖ్యమైనవి.. ఈ–వెరిఫికేషన్ స్టేటస్, పాన్ స్టేటస్, చెల్లించిన పన్ను స్టేటస్, మీ అధికారి ఎవరు, మీ రిఫండ్ స్టేటస్, ఆధార్‌తో అనుసంధానం వివరాలు, నోటీసు వివరాలు.

మీకు అవసరమైన విండోని ఓపెన్ చేస్తే అందులో ఉన్న కాలాలు అన్నీ పూరిస్తే, వివరాలు తెలుస్తాయి. రిటర్న్ ఫైల్ చేసిన తర్వాత చాలా మంది రిఫండ్ ఇంకా రాలేదేంటి అని ప్రశ్నించడం మొదలెడతారు. అలాగే, అసెస్‌మెంట్ స్టేటస్‌కు సంబంధించి సాధారణంగా మీ రిజిస్టర్డ్ మొబైల్‌కు సమాచారం వస్తుంది. ఓటీపీతో మొదలు అన్ని స్టేజీల్లోనూ మీకు సమాచారం అందుతూనే ఉంటుంది. ఆ సమాచార స్రవంతిని ఫాలో అవ్వండి. ఒకరోజు టీవీ, సీరియల్స్‌ని మిస్ అయినా ఫర్వాలేదు. ఈ ట్రాక్‌ని వదలకండి. పోస్టులో మీ ఇంటికి వచ్చి, తలుపు కొట్టి నోటీసులు ఇచ్చే రోజులు కావివి. అంతా ఆన్‌లైన్. అంతే కాకుండా నోటీసులు కూడా పంపుతున్నారు. ఈ మెయిల్స్‌ని ట్రాక్ చేయండి. అప్పుడప్పుడు నోటీసులు, సమాచారాలు ఈమెయిల్ బాక్సులో స్పామ్‌లోకి వెళ్లిపోతాయి. అలా పోయినా మనకు నోటీసు ఇచ్చినట్లుగానే భావిస్తారు డిపార్ట్‌మెంట్ వారు. ఫోన్‌లో మెసేజీ వచ్చిన వెంటనే మెయిల్ రాకపోవచ్చు. పది, పదిహేను రోజులు ఆగండి.



ఇవన్నీ కాకుండా 'టాక్స్ కాలెండర్' కనిపిస్తుంది. అందులో ప్రతి తేదీని క్లిక్ చేస్తూ పోతే, ఆ రోజు మీరేం చేయాలో తెలుస్తుంది. ఉదాహరణకు సెప్టెంబర్ 15 అనుకోండి.. ఈ తేదీలోపల మీరు ఏయే ఫారాలు వెయ్యాలో, మీ ఎన్నో వాయిదా అడ్వాన్స్ ట్యాక్స్ కట్టాలో చెబుతుంది. మీకు ఏ విషయంలో వారి సహాయం కావాలో, ఆ సలహా, సహాయం అందిస్తారు. మార్గదర్శకాలను కూడా చెబుతారు. ఫైలింగ్, టీడీఎస్, ట్యాక్స్, పాన్, టాన్, వార్షిక సమాచార నివేదికకి సంబంధించిన తప్పొప్పులు.. ఇలాంటి వాటి గురించి ఫోన్ ద్వారా సంప్రదించవచ్చు. ఇవన్నీ ఫ్రీ కాల్స్! మీరు దాఖలు చేసే ప్రతి ఫారం 1,2,3,4,5,6,7.. ఇలాంటి వాటికి సంబంధించి ఈమెయిల్ ఐడీలు ఉన్నాయి. మీరు నేరుగా సంప్రదించవచ్చు. సంప్రదించే ముందు మీ వివరాలు, అంటే పాన్, పేరు, పుట్టిన తేదీ, పన్నుకి సంబంధించిన వివరాలు ఉండాలి. అప్పటికప్పుడే మీకు సమాచారం దొరుకుతుంది. అలాగే మీ మెయిల్స్‌కి రెస్పాన్స్ వస్తుంది.

ఇంకొక మంచి అవకాశం ఏమిటంటే, మీరు ఫిర్యాదులు కూడా చేయొచ్చు. ముఖ్యంగా ఐటీ రిఫండ్ విషయం ఉంటుంది. అవసరం అనిపిస్తే ఫిర్యాదులు చేయండి. మీ ఫిర్యాదుని నమోదు చేసుకుంటారు. ఎక్నాలెడ్జ్ చేస్తారు. దానికో నంబర్ కేటాయిస్తారు. ఆ ఫిర్యాదుల స్టేటస్‌ని తెలుసుకోవచ్చు. వెంటనే దర్శించి, అన్నీ తెలుసుకోండి. మీ పాన్ నంబరు, పాస్‌వర్డ్ మీ దగ్గరుండాలి. ఈ సైట్ స్నేహపూర్వకమైనది. చాలా సులభతరమైనది. మీకు అన్నీ అర్థమయ్యేలా ఉంటుంది. ఇది ఉచితం. త్వరగా పని పూర్తవుతుంది. రెస్పాన్స్ బాగుంటుంది. వృత్తి నిపుణుల సహాయం అక్కర్లేదు. మధ్యవర్తుల ప్రమేయం ఉండదు. ఈ సైట్ డైనమిక్ అండోయ్!!

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

స్థిరమైన రాబడుల కోసం..

మోతీలాల్ ఓస్వాల్ ఫోకస్డ్ 25 ఫండ్



దీర్ఘకాలానికి ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసుకోవడం ద్వారా మెరుగైన రాబడులు సొంతం చేసుకోవచ్చని చారిత్రక డేటా తెలియజేస్తోంది. ఈక్విటీల్లోనూ ఏదో ఒక విభాగంలో కాకుండా, లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ కంపెనీల మధ్య పెట్టుబడులను కేటాయించుకోవడం రిస్కును వైవిధ్యం చేసుకున్నట్టు అవుతుంది. తద్వారా దీర్ఘకాలంలో మంచి రాబడులకూ అవకాశం ఉంటుంది. ఈ విధమైన పెట్టుబడుల అవకాశాలు కలిపిస్తున్న వాటిల్లో మోతీలాల్ ఓస్వాల్ ఫోకస్డ్ 25 ఫండ్ ఒకటి.

రాబడులు

ఈ పథకానికి మెరుగైన రాబడుల చరిత్ర ఉంది. ఏడాది కాలంలో పెట్టుబడులపై 40 శాతం రాబడిని అందించింది. మూడేళ్ల కాలంలో ఏటా 15.77 శాతం చొప్పున, ఐదేళ్లలో 19.59 శాతం చొప్పున డైరెక్ట్ ప్లాన్‌లో రాబడులు ఉన్నాయి. ఇక ఏడేళ్లలోనూ 14.73 శాతం, పదేళ్ల కాలంలో 15.28 శాతం చొప్పున ఇన్వెస్టర్లకు ప్రతిఫలాన్ని తెచ్చిపెట్టింది. స్వల్ప కాలం కంటే దీర్ఘకాలంలోనే ఈ పథకంలో రాబడులు స్థిరంగా కనిపిస్తాయి. కనుక ఏడేళ్లు అంతకుమించిన దీర్ఘకాల లక్ష్యాల కోసం పరిశీలించొచ్చు. కనీసం రూ.500 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

పెట్టుబడుల విధానం

ఫోకస్డ్ ఫండ్స్ విధానం మిగిలిన పథకాలకు కాస్తంత భిన్నం. ఇవి పోర్ట్‌ఫోలియోలో పరిమితమైన స్టాక్స్‌నే కలిగి ఉంటాయి. 50–100 స్టాక్స్‌ను కలిగి ఉండవు. మరీ ముఖ్యంగా మోతీలాల్ ఓస్వాల్ ఫోకస్డ్ 25 ఫండ్ అన్నది.. గరిష్టంగా 25 స్టాక్స్ వరకే ఎంపిక చేసుకుంటుంది. కనుక ఈ తరహా పథకాల్లో రిస్క్ ఎక్కువగా ఉంటుందని మర్చిపోవద్దు. ఎందుకంటే ఎంపిక చేసుకునే కొన్ని కంపెనీల్లో ఒకటి రెండు బెడిసి కొట్టినా, ప్రతికూల ప్రభావం పడుతుంది. కానీ, రాబడులు కూడా అదే స్థాయిలో ఉంటాయి. ఫండ్ పరిశోధనా బృందం ఈ రిస్క్‌ను దాదాపుగా ముందే అంచనా వేసి, మెరుగైన కంపెనీలనే ఎంపిక చేసుకుంటుంది. అవి ఫలితమిచ్చే వరకు కొనసాగిస్తుంది. మార్కెట్లలో అస్థిరతలు అధికంగా ఉన్న సందర్భాల్లో మినహాయిస్తే.. మిగిలిన అన్ని కాలాల్లోనూ ఈ పథకం తన నిర్వహణలోని పెట్టుబడులను పూర్తిగా ఈక్విటీలకు కేటాయిస్తుండడాన్ని గమనించొచ్చు. ఇన్వెస్టర్లు ఈ అంశాలన్నింటినీ పరిశీలించి తమ రిస్క్, రాబడుల లక్ష్యాలకు అనుగుణంగా తుది నిర్ణయం తీసుకోవాలి. ఈ విషయంలో అవసరమైతే నిపుణుల సాయం తీసుకోవడం సూచనీయం.

టాప్ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడుల శాతం
రెలిగేర్ ఎంటర్‌ప్రైజెస్	9.96
జెడ్ఎఫ్ కమర్షియల్	9.15
స్టార్ హెల్త్	9.08
సంవర్ధన మదర్సన్	9.01
ఎఫ్ఎస్ఎన్ ఈ-కామర్స్	8.89
ఎల్అండ్‌టీ టెక్నాలజీ	7.57
పిరమల్ ఎంటర్‌ప్రైజెస్	7.10
డ్రీమ్‌ఫోక్స్	5.60
హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్	4.03
వన్97 కమ్యూనికేషన్స్	3.45

పోర్ట్‌ఫోలియో

ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో రూ.2,142 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 99 శాతం ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసింది. పోర్ట్‌ఫోలియోలో 22 స్టాక్స్ ఉన్నాయి. ముఖ్యంగా టాప్–10 స్టాక్స్‌లోనే 73 శాతం మేర పెట్టుబడులు ఉండడాన్ని గమనించాలి. అందుకే ఇది అధిక రిస్క్ విభాగంలోకి వస్తుంది. పెట్టుబడులను గమనిస్తే లార్జ్‌క్యాప్ కంపెనీలకు 28 శాతం కేటాయించగా, మిడ్‌క్యాప్ కంపెనీల్లో 49 శాతం, స్మాల్‌క్యాప్ కంపెనీల్లో 23 శాతం వరకు పెట్టుబడులు కలిగి ఉంది. అత్యధికంగా బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగానికి 34 శాతం కేటాయింపులు చేసింది. ఆ తర్వాత కన్జ్యూమర్ డిస్క్రీషినరీ కంపెనీలకు 32.54 శాతం, ఇండస్ట్రియల్స్ కంపెనీలకు 16 శాతం వరకు కేటాయించింది.


రికీ భుయ్

విజయంతో ముగింపు...

- చివరి మ్యాచ్‌లో భారత్ 'డి' గెలుపు
- రికీ భుయ్ అజేయ శతకం
- ఆరు వికెట్లతో అదరగొట్టిన అర్ష్‌దీప్

సాక్షి, అనంతపురం: దులీప్ ట్రోఫీలో శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని భారత్ 'డి' జట్టు ఊరట విజయం సాధించింది. తొలి రెండు మ్యాచ్‌ల్లో పరాజయం పాలైన భారత్ 'డి' జట్టు... ఆదివారం ముగిసిన ఆఖరి పోరులో భారత్ 'బి' జట్టుపై 257 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. 373 పరుగుల విజయ లక్ష్యంతో నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్ 'బి' జట్టు 22.2 ఓవర్లలో 115 పరుగులకు ఆలౌటైంది. ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి (43 బంతుల్లో 40 నాటౌట్; 7 ఫోర్లు, ఒక సిక్సర్) ఒక్కడే ఫర్వాలేదనిపించగా.. కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ (19), సూర్యకుమార్ యాదవ్ (16) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. నారాయణ్ జగదీశన్ (5), సుయశ్ ప్రభుదేశాయ్ (2), ముషీర్ ఖాన్ (0), వాషింగ్టన్ సుందర్ (5) విఫలమయ్యారు. జగదీశన్‌తో ప్రారంభమైన వికెట్ల పతనం ఏ దశలోనూ ఆగలేదు. మధ్యలో నితీశ్ కుమార్ రెడ్డి కాస్త బ్యాట్‌కు పనిచెప్పడంతో భారత్ 'బి' జట్టు కనీసం వంద పరుగుల మార్క్ దాటగలిగింది. భారత్ 'డి' బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ 6, ఆదిత్య 4 వికెట్లు పడగొట్టారు. అర్ష్‌దీప్ కెరీర్ అత్యుత్తమ ప్రదర్శన కనబర్చాడు. ఈ మ్యాచ్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి అర్ష్‌దీప్ 90 పరుగులు ఇచ్చి 9 వికెట్లు పడగొట్టాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 244/5తో ఆదివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ 'డి' జట్టు చివరకు 58.3 ఓవర్లలో 305 పరుగులు చేసి ఆలౌటైంది. ఆంధ్ర ఆటగాడు రికీ భుయ్ (124 బంతుల్లో 119 నాటౌట్; 15 ఫోర్లు, 3 సిక్సర్లు) అజేయ సెంచరీతో ఆకట్టుకున్నాడు. భారత్ 'బి' బౌలర్లలో ముకేశ్ కుమార్ 4, నవ్‌దీప్ సైనీ మూడు వికెట్లు పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో అర్ధసెంచరీ, రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీతో చెలరేగిన భారత్ 'డి' ఆటగాడు రికీ భుయ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

స్కోరు వివరాలు

భారత్ 'డి' తొలి ఇన్నింగ్స్: 349; భారత్ 'బి' తొలి ఇన్నింగ్స్: 282; భారత్ 'డి' రెండో ఇన్నింగ్స్: 305; భారత్ 'బి' రెండో ఇన్నింగ్స్: అభిమన్యు ఈశ్వరన్ (సి) ఆకాశ్ సేన్‌గుప్తా (బి) అర్ష్‌దీప్ సింగ్ 19; నారాయణ్ జగదీశన్ (ఎల్బీడబ్ల్యూ) ఆదిత్య 5; సుయశ్ ప్రభుదేశాయ్ (సి) శ్రేయస్ అయ్యర్ (బి) అర్ష్‌దీప్ సింగ్ 2; ముషీర్ ఖాన్ (బి) ఆదిత్య 0; సూర్యకుమార్ యాదవ్ (సి) శ్రీకర్ భరత్ (బి) అర్ష్‌దీప్ సింగ్ 16; నితీశ్ కుమార్ రెడ్డి (నాటౌట్) 40; వాషింగ్టన్ సుందర్ (బి) ఆదిత్య 5; రాహుల్ చాహర్ (సి) సంజూ సామ్సన్ (బి) ఆదిత్య 6; మోహిత్ అవస్థి (సి) సంజూ సామ్సన్ (బి) అర్ష్‌దీప్ సింగ్ 0; నవ్‌దీప్ సైనీ (బి) అర్ష్‌దీప్ సింగ్ 0; ముకేశ్ కుమార్ (బి) అర్ష్‌దీప్ సింగ్ 0; ఎక్స్‌ట్రాలు: 22; **మొత్తం (22.2 ఓవర్లలో)115. వికెట్ల పతనం:** 1-31, 2-34, 3-35, 4-39, 5-74, 6-79, 7-94, 8-99, 9-107, 10-115. **బౌలింగ్:** అర్ష్‌దీప్ సింగ్ 11.2-3-40-6; ఆదిత్య 11-1-59-4.

అఫ్గాన్‌పై దక్షిణాఫ్రికా విజయం

షార్జా: ఇప్పటికే అఫ్గానిస్తాన్ చేతిలో సిరీస్ కోల్పోయిన దక్షిణాఫ్రికా జట్టు... చివరి వన్డేలో ఊరట విజయం దక్కించుకుంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆదివారం జరిగిన చివరి వన్డేలో దక్షిణాఫ్రికా 7 వికెట్ల తేడాతో అఫ్గానిస్తాన్‌ను చిత్తు చేసింది. మొదట అఫ్గానిస్తాన్ 34 ఓవర్లలో 169 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ గుర్బాజ్ (94 బంతుల్లో 89; 7 ఫోర్లుర, 4 సిక్సర్లు) ఒంటరి పోరాటం చేయగా... ఘజన్‌ఫార్ (15 బంతుల్లో 31 నాటౌట్; 2 ఫోర్లు, 3 సిక్సర్లు) చివర్లో మెరుపులు మెరిపించాడు. రహమత్ షా (1), అబ్దుల్ మాలిక్ (9), కెప్టెన్ హష్మతుల్లా (10), అజ్మతుల్లా (2), ఇక్రామ్ (4), నబీ (5) విఫలమయ్యారు. సఫారీ బౌలర్లలో ఎంగిడి, పీటర్, ఫెలుక్వాయో తలా రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో దక్షిణాఫ్రికా 33 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 170 పరుగులు చేసింది. ఎయిడెన్ మార్క్‌రమ్ (67 బంతుల్లో 69 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) ఆకట్టుకున్నాడు.

దులీప్ ట్రోఫీ విజేత భారత్ 'ఎ'



దులీప్ ట్రోఫీతో భారత్ 'ఎ' జట్టు

- భారత్ 'సి' జట్టుపై 132 పరుగులతో విజయం
- అన్షుల్ కంబోజ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు

సాక్షి, అనంతపురం: దేశవాళీ సీజన్ ఆరంభ టోర్నీ దులీప్ ట్రోఫీలో మయాంక్ అగర్వాల్ సారథ్యంలోని భారత్ 'ఎ' జట్టు చాంపియన్‌గా నిలిచింది. తాజా టోర్నీలో భారత్ 'ఎ' జట్టుకు ఇది రెండో విజయం కాగా... 12 పాయింట్లతో పట్టికలో అగ్రస్థానానికి దూసుకెళ్లి ట్రోఫీ కైవసం చేసుకుంది. మూడు మ్యాచ్‌ల్లో ఒక విజయం, ఒక 'డ్రా', ఒక ఓటమితో 9 పాయింట్లు ఖాతాలో వేసుకున్న భారత్ 'సి' జట్టు రెండో స్థానంలో నిలిచింది. ఆదివారం ముగిసిన చివరి రౌండ్ మ్యాచ్‌లో భారత్ 'ఎ' జట్టు 132 పరుగుల తేడాతో భారత్ 'సి' జట్టును చిత్తు చేసింది. 350 పరుగుల విజయ లక్ష్యంతో ఆదివారం చివరి రోజు రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన రుతురాజ్ గైక్వాడ్ నాయకత్వంలోని భారత్ 'సి' జట్టు 81.5 ఓవర్లలో 217 పరుగులకు ఆలౌటైంది. సాయి సుదర్శన్ (206 బంతుల్లో 111; 12 ఫోర్లు) ఒంటరి పోరాటం చేయగా... రుతురాజ్ గైక్వాడ్ (93 బంతుల్లో 44; 5 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. రజత్ పాటిదార్ (7), ఇషాన్ కిషన్ (17), విజయ్ కుమార్ వైశాఖ్ (17), అభిషేక్ పొరెల్ (0), పులకిత్ నారంగ్ (6), మానవ్ సుతార్ (7) విఫలమయ్యారు. రుతురాజ్ గైక్వాడ్, సాయి సుదర్శన్ నిలకడగా ఆడటంతో ఒక దశలో 113 పరుగులకు ఒక వికెట్ మాత్రమే కోల్పోయి పటిష్ట స్థితిలో నిలిచిన భారత్ 'సి' ఆ తర్వాత వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయి లక్ష్యానికి 132 పరుగుల దూరంలో నిలిచిపోయింది. భారత్ 'ఎ' బౌలర్లలో ప్రసిధ్ కృష్ణ, తనుశ్ కొటియాన్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 270/6తో ఆదివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ 'ఎ' జట్టు మరో 16 పరుగులు జోడించి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. రియాన్ పరాగ్ (101 బంతుల్లో 73; 5 ఫోర్లు, ఒక సిక్సర్), శాశ్వత్ రావత్ **(67 బంతుల్లో 58; 4 ఫోర్లు, ఒక సిక్సర్) రాణించారు. భారత్ 'సి' జట్టు బౌలర్లలో గౌరవ్ యాదవ్ 4, అన్షుల్ కంబోజ్, మానవ్ సుతార్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. తొలి** ఇన్నింగ్స్‌లో సెంచరీ, రెండో ఇన్నింగ్స్‌లో అర్ధ సెంచరీతో భారత్ 'ఎ' జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన మిడిలార్డర్ ప్లేయర్ శాశ్వత్ రావత్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు గెలుచుకున్నాడు. భారత్ 'సి' బౌలర్ అన్షుల్ కంబోజ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు దక్కింది.


భారత్ 'సి' జట్టు కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌కు రన్నరప్ ట్రోఫీ అందిస్తున్న ఆంధ్రప్రదేశ్ మంత్రి పయ్యావుల కేశవ్

స్కోరు వివరాలు

భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్: 297; భారత్ 'సి' తొలి ఇన్నింగ్స్: 234; భారత్ 'ఎ' రెండో ఇన్నింగ్స్: 286/8 డిక్లేర్డ్; భారత్ 'సి' రెండో ఇన్నింగ్స్: రుతురాజ్ గైక్వాడ్ (సి) కుమార్ కుషాగ్ర (బి) అఖీబ్ ఖాన్ 44; విజయ్ కుమార్ వైశాఖ్ (రనౌట్) 17; సాయి సుదర్శన్ (సి) తనుశ్ కొటియాన్ (బి) ప్రసిధ్ కృష్ణ 111; రజత్ పాటిదార్ (బి) అఖీబ్ ఖాన్ 7; ఇషాన్ కిషన్ (సి) కుమార్ కుశాగ్ర (బి) తనుశ్ కొటియాన్ 17; అభిషేక్ పొరెల్ (సి) మయాంక్ అగర్వాల్ (బి) తనుశ్ కొటియాన్ 0; పులకిత్ నారంగ్ (సి అండ్ బి) తనుశ్ కోటియాన్ 6; మానవ్ సుతార్ (సి) మయాంక్ అగర్వాల్ (బి) షమ్స్ ములానీ 7; అన్షుల్ కంబోజ్ (ఎల్బీడబ్ల్యూ) ప్రసిధ్ కృష్ణ 0; బాబా ఇంద్రజిత్ (సి) తిలక్ వర్మ (బి) ప్రసిధ్ కృష్ణ 0; గౌరవ్ యాదవ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (81.5 ఓవర్లలో ఆలౌట్) 217. వికెట్ల పతనం** : 1-36, 2-113, 3-133, 4-174, 5-178, 6-188, 7-212, 8-216, 9-216, 10-217, **బౌలింగ్:** ప్రసిధ్ కృష్ణ 13.5-3-50-3; ఆవేశ్ ఖాన్ 14-2-34-0; అఖీబ్ ఖాన్ 14-6-26-2; షమ్స్ ములానీ 19-6-46-1, తనుశ్ కొటియాన్ 18-3-47-3; రియాన్ పరాగ్ 3-0-7-0.



నోరిస్

సూపర్ నోరిస్

- సింగపూర్ గ్రాండ్‌ప్రి టైటిల్ సొంతం
- ఈ సీజన్‌లో మూడో విజయం
- వెర్‌స్టాపెన్‌కు రెండో స్థానం

సింగపూర్: ఫార్ములావన్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భాగంగా ఆదివారం జరిగిన సింగపూర్ గ్రాండ్‌ప్రిలో మెక్‌లారెన్ డ్రైవర్ లాండో నోరిస్ (బ్రిటన్) టైటిల్ కైవసం చేసుకున్నాడు. క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో అగ్రస్థానంలో నిలిచి 'పోల్ పొజిషన్'తో రేసు ప్రారంభించిన నోరిస్ అందరికంటే వేగంగా, అందరికంటే ముందుగా 1 గంట 40 నిమిషాల 52.571 సెకన్లలో లక్ష్యాన్ని చేరి విజేతగా నిలిచాడు. డ్రైవర్ చాంపియన్‌షిప్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్న రెడ్‌బుల్ రేసర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ (నెదర్లాండ్స్) 1 గంట 41 నిమిషాల 13.516 సెకన్లలో గమ్యాన్ని చేరి రెండో స్థానంతో సరిపెట్టుకోగా... మెక్‌లారెన్‌కే చెందిన ఆస్కార్ పియాస్ట్రి 1 గంటల 41 నిమిషాల 34.394 సెకన్లతో మూడో స్థానంతో ముగించాడు. ఈ ప్రదర్శన ద్వారా నోరిస్ 25 డ్రైవర్ చాంపియన్‌షిప్ పాయింట్లు ఖాతాలో వేసుకోగా... వెర్‌స్టాపెన్‌కు 18 పాయింట్లు, పియాస్ట్రికి 15 పాయింట్లు దక్కాయి. 62 ల్యాప్‌ల ఈ రేసులో రెండో స్థానంలో నిలిచిన వెర్‌స్టాపెన్ కంటే నోరిస్ 20.945 సెకన్ల ముందు లక్ష్యాన్ని చేరాడు. జార్జ్ రసెల్ (మెర్సిడెస్; 1 గంట 41 నిమిషాల 53.611 సెకన్లు), చార్లెస్ లెక్‌లెర్క్ (ఫెరారీ; 1 గంట 41 నిమిషాల 55.001 సెకన్లు) వరుసగా నాలుగో, ఐదో స్థానాల్లో నిలిచారు. బ్రిటన్ స్టార్ డ్రైవర్ లూయిస్ హామిల్టన్ (మెర్సిడెస్; 1 గంట 42 నిమిషాల 17.819 సెకన్లు) ఆరో స్థానంతో సరిపెట్టుకున్నాడు. 24 రేసుల ఫార్ములావన్ సీజన్‌లో సింగపూర్ గ్రాండ్‌ప్రి 18వ రేసు కాగా... మరో ఆరు రేసులు మిగిలుండగా... ప్రస్తుతం డ్రైవర్స్ చాంపియన్‌షిప్‌లో 331 పాయింట్లతో వెర్‌స్టాపెన్ 'టాప్'లో కొనసాగుతున్నాడు. నోరిస్ 279 పాయింట్లతో రెండో ర్యాంక్‌లో, లెక్‌లెర్క్ 245 పాయింట్లతో మూడో ర్యాంక్‌లో ఉన్నారు. రెండో స్థానంలో ఉన్న నోరిస్ కంటే వెర్‌స్టాపెన్ 52 పాయింట్లు ఆధిక్యంలో కొనసాగుతున్నాడు. సీజన్‌లోని తదుపరి రేసు యునైటెడ్ స్టేట్స్ గ్రాండ్‌ప్రి అక్టోబర్ 20న ఆస్టిన్ నగరంలో జరుగుతుంది.

సింగపూర్ గ్రాండ్‌ప్రి ఫలితాలు

స్థానం	డ్రైవర్	జట్టు	సమయం	వ్యత్యాసం	పాయింట్లు
1	నోరిస్	మెక్‌లారెన్	1:40:52.571		25
2	వెర్‌స్టాపెన్	రెడ్‌బుల్	1:41:13.516	20.945 సెకన్లు	18
3	పియాస్ట్రి	మెక్‌లారెన్	1:41:34.394	41.823 సెకన్లు	15
4	జార్జ్ రసెల్	మెర్సిడెస్	1:41:53.611	61.040 సెకన్లు	12
5	లెక్‌లెర్క్	ఫెరారీ	1:41:55.001	62.430 సెకన్లు	10
6	హామిల్టన్	మెర్సిడెస్	1:42:17.819	85.248 సెకన్లు	8
7	సెయింజ్	ఫెరారీ	1:42:28.610	96.039 సెకన్లు	6
8	అలోన్సో	ఆస్టన్ మార్టిన్	1:40:53.444	1 ల్యాప్	4
9	హల్కెన్‌బర్గ్	మనీగ్రామ్	1:40:55.711	1 ల్యాప్	2
10	పెరెజ్	రెడ్‌బుల్	1:40:57.195	1 ల్యాప్	1


రచిన్

68 పరుగులా! 2 వికెట్లా?

- రసకందాయంలో శ్రీలంక, న్యూజిలాండ్ తొలి టెస్టు
- న్యూజిలాండ్ లక్ష్యం 275; ప్రస్తుతం 207/8

గాలె: శ్రీలంక, న్యూజిలాండ్ జట్ల మధ్య జరుగుతున్న తొలి టెస్టు రసకందాయంలో పడింది. 275 పరుగుల లక్ష్యఛేదనకు దిగిన న్యూజిలాండ్ ఆదివారం నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 68 ఓవర్లలో 8 వికెట్లకు 207 పరుగులు చేసింది. చేతిలో రెండు వికెట్లున్న కివీస్ విజయానికి ఇంకా 68 పరుగులు చేయాల్సి ఉంది. ఆల్‌రౌండర్ రచిన్ రవీంద్ర (158 బంతుల్లో 91 బ్యాటింగ్; 9 ఫోర్లు, ఒక సిక్సర్) అద్వితీయ పోరాటం కనబర్చాడు. మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ (30), వికెట్ కీపర్ టామ్ బ్లండెల్ (30), టామ్ లాథమ్ (28) మంచి ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచడంలో విఫలమయ్యారు. కాన్వే (4), డారిల్ మిషెల్ (8), గ్లెన్ ఫిలిప్స్(4), సాన్‌ట్నర్ (2) విఫలమయ్యారు. శ్రీలంక బౌలర్లలో రమేశ్ మెండిస్, ప్రభాత్ జయసూర్య చెరో 3 వికెట్లు పడగొట్టారు. శ్రీలంకలో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా శనివారం టెస్టు మ్యాచ్‌కు విశ్రాంతినివ్వగా... ఆదివారం ఓవర్‌నైట్ స్కోరు 237/4తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక 94.2 ఓవర్లలో 309 పరుగులకు ఆలౌటైంది. ఏంజెలో మాథ్యూస్ (111 బంతుల్లో 50; 5 ఫోర్లు) ధనంజయ డిసిల్వ (40) ఆకట్టుకున్నారు. న్యూజిలాండ్ బౌలర్లలో ఎజాజ్ పటేల్ 6, విలియమ్ రూర్కె మూడు వికెట్లు పడగొట్టారు. నేడు ఆటకు ఆఖరి రోజు కాగా... రచిన్ రవీంద్రతో పాటు ఎజాజ్ పటేల్ క్రీజులో ఉన్నాడు.

అన్‌మోల్‌కు రెండో టైటిల్



న్యూఢిల్లీ: భారత బ్యాడ్మింటన్ రైజింగ్ స్టార్ అన్‌మోల్ ఖరబ్ రెండు వారాల వ్యవధిలో రెండో టైటిల్‌ను సాధించింది. ఆదివారం ముగిసిన పోలాండ్ ఇంటర్నేషనల్ సిరీస్ టోర్నీలో హరియాణాకు చెందిన 17 ఏళ్ల అన్‌మోల్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఫైనల్లో అన్‌మోల్ 21-12, 21-8తో ఏడో సీడ్ మిలెనా ష్నిదెట్ (స్విట్జర్లాండ్)పై గెలిచింది. టైటిల్ సాధించే క్రమంలో అన్‌మోల్ తన ప్రత్యర్థులకు ఒక్క గేమ్ కూడా కోల్పోకపోవడం విశేషం. తొలి రౌండ్‌లో అన్‌మోల్ 21-17, 21-16తో టాప్ సీడ్ అమెలీ షుల్జ్ (డెన్మార్క్)పై, రెండో రౌండ్‌లో 21-9, 21-17తో సమంత గొలుబైకెటె (లిథువేనియా)పై, క్వార్టర్ ఫైనల్లో 21-12, 21-7తో సోఫియా లవరోవా (ఉక్రెయిన్)పై, సెమీఫైనల్లో 21-15, 21-12తో ఫ్రెడెరికె లుండ్ (డెన్మార్క్)పై విజయం సాధించింది. గతవారం అన్‌మోల్ బెల్జియం ఓపెన్ ఇంటర్నేషనల్ సిరీస్ టోర్నీలో విజేతగా నిలిచి తన కెరీర్‌లో తొలి అంతర్జాతీయ టైటిల్‌ను కైవసం చేసుకుంది.



కేరళ బ్లాస్టర్స్ తొలి విజయం

కొచ్చి: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో కేరళ బ్లాస్టర్స్ జట్టు తొలి విజయం నమోదు చేసుకుంది. ఆదివారం జరిగిన పోరులో కేరళ బ్లాస్టర్స్ జట్టు 2-1 గోల్స్ తేడాతో ఈస్ట్ బెంగాల్ జట్టుపై విజయం సాధించింది. కేరళ బ్లాస్టర్స్ తరఫున నోహ్ సాదోయ్ (63వ నిమిషంలో), క్వామె పెప్రా (88వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. ఈస్ట్ బెంగాల్ తరఫున విష్ణు వెళప్పిల్ (59వ నిమిషంలో) ఏకైక గోల్ అందించాడు. తొలి అర్ధ భాగంలో ఇరు జట్లు గోల్ నమోదు చేయలేకపోగా... ద్వితీయార్ధం ఆరంభంలో విష్ణు గోల్ కొట్టడంతో ఈస్ట్ బెంగాల్ ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే నాలుగు నిమిషాల తేడాతో కేరళ స్కోరు సమం చేసింది. ఇక మరి కాసేపట్లో మ్యాచ్ ముగుస్తుందనగా పెప్రా మరో గోల్ బాదడంతో కేరళ బ్లాస్టర్స్ జట్టు తాజా సీజన్‌లో తొలి విజయం ఖాతాలో వేసుకొని పాయింట్ల పట్టికలో ఆరో స్థానానికి చేరింది. ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడిన ఈస్ట్ బెంగాల్ జట్టు పట్టికలో 12వ స్థానానికి పరిమితమైంది. తదుపరి మ్యాచ్‌లో ఈ నెల 27న గోవా ఫుట్‌బాల్ క్లబ్‌తో ఈస్ట్ బెంగాల్ జట్టు... 29న నార్త్ ఈస్ట్ జట్టుతో కేరళ బ్లాస్టర్స్ జట్టు తలపడనున్నాయి.

సాక్షి ప్లస్
సోమవారం। 23-9-2024

వాచీలోనే క్యూఆర్ కోడ్... అదిరిందయ్యా ఆటో డ్రైవర్!

రైల్వే మంత్రి వైష్ణవ్ ప్రశంసలు

బెంగళూరుకు చెందిన ఈ 'స్మార్ట్'ఆటో డ్రైవర్ రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ అభినందనలు అందుకున్నాడు. ఎందుకంటే మనవాడు యూపీఐ చెల్లింపుల కోసం క్యూఆర్ కోడ్ స్మార్ట్ వాచ్‌ను వాడుతున్నాడు



మరి! సదరు ఫొటోను ఓ నెటిజన్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశాడు. దాంతో అది తెగ వైరలవుతోంది. అలా రైల్వే మంత్రి దృష్టినీ ఆకర్షించింది. ఆ ఫోటోను ఆయన రీట్వీట్ చేశారు. 'యూపీఐ కా స్వాగ్! చెల్లింపులు మరింత సులువయ్యాయి'అంటూ కామెంట్ చేశారు. ఆటోడ్రైవర్‌కు సోషల్ మీడియాలో ప్రశంసలు వెలుల వెత్తుతున్నాయి. ఐటీలో ట్రెండ్ సెట్టర్ అయిన బెంగళూరు ఆ సాంకేతిక పరిజ్ఞానం వాడకంలోనూ ట్రెండ్ సెట్ చేస్తోం దంటూ యూజర్లు కామెంట్ చేస్తున్నారు. 'నవ భారత ముఖచిత్రమిది'అని ఒకరు, 'డిజిటల్ ఇండియా మ్యాజిక్'అని మరొకరు పోస్ట్ చేశారు. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా 2016లో ప్రారంభించిన యూపీఐ బ్యాంకుల మధ్య తక్షణ బదిలీలకు వీలు కల్పించడం ద్వారా చెల్లింపుల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. – సాక్షి, నేషనల్ డెస్క్

ఫుడ్ ప్యాక్‌లో ఎలుక

విమానం అత్యవసర ల్యాండింగ్

అవున్నిజమే! విమానంలో ఎలుక కనిపించింది. అంది కూడా ఓ ప్రయాణికురాలికి అందించిన ఫుడ్ పార్సిల్లో. ఆమె పార్సిల్ తెరవగానే ఎలుక అమాంతం బయటికి దూకి సీట్ల కింద దూరింది! దాంతో విమానంలో కలకలం రేగింది. నార్వే రాజధాని ఓస్లో నుంచి స్పెయిన్‌లోని మలగాకు వెళ్తున్న స్కాం డినేవియన్ ఎయిర్‌లైన్స్ విమానంలో జరిగిందీ ఘటన. ఆ దెబ్బకు విమానాన్ని అత్యవసరంగా కోపెన్‌హాగన్‌లో దించారు. ప్రయాణికులను వేరే విమానంలో మలగాకు పంపించారు. విమానాల్లోని ఎలక్ట్రికల్ వైరింగ్ తదితరాలను ఎలుకలు కొరికాయంటే అంతే సంగతులు. అందుకే అవి విమానంలోకి రాకుండా ఎయిర్‌లైన్స్ చాలా జాగ్రత్తలు తీసుకుంటాయి! అలాంటిది ఏకంగా ఫుడ్ పార్సల్లోనే బతికున్న ఎలుక రావడాన్ని ఎయిర్‌లైన్స్ సంస్థ సీరియస్‌గా తీసుకుంది. ఆహార పంపిణీ సంస్థను వెంటనే బ్లాక్ లిస్టులో పెట్టింది. ప్రయాణికులను క్షమాపణ కోరింది. ఇలాంటివి పునరావృతం కాకుండా చూస్తామని చెప్పుకొచ్చింది. ఇటీవల దక్షిణ ఇంగ్లాండ్‌లో రెండు ఉడతలు రైలెక్కడంతో చివరకు ఆ సర్వీసును రద్దు చేయాల్సి వచ్చింది! – సాక్షి, నేషనల్ డెస్క్

నిద్రలో నడుస్తూ అడవిలోకి...!

- వణికించే చలిలో చెప్పులైనా లేకుండా రోజంతా అడవిలోనే
- అంతసేపూ నిద్రిస్తూనే గడిపిన చిన్నారి!



అమెరికాలో లూసియానా రాష్ట్రంలోని వెబ్‌స్టర్ పారిష్‌కు చెందిన ఓ పాపకు నిద్రలో నడిచే అలవాటుంది. శనివారం రాత్రి ఇంట్లో పడుకున్న బాలిక మరునాడు ఉదయం ఇంట్లో కనిపించలేదు. నిద్రలో నడుస్తూ కాస్త దూరం ఎటైనా వెళ్లిందేమోనని తల్లిదండ్రులు చుట్టుపక్కలంతా వెదికారు. ఎక్కడా కనిపించకపోవడంతో మర్నాడు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇంటి చుక్కపక్కల సీసీటీవీ కెమెరాలన్నింటినీ జల్లెడ పట్టారు. కనీసం బూట్లు లేకుండా బాలిక సమీపంలోని అడవుల్లోకి నడిచి వెళ్తూ ఓ కెమెరాకు చిక్కింది. వెంటనే గాలింపు చేపట్టారు. చిన్నారి నడిచి వెళ్లిన ప్రాంతమంతా జల్లెడ పట్టారు. ట్రాకింగ్ డాగ్స్, డ్రోన్లతో పాటు చివరికి హెలికాప్టర్‌ను కూడా రంగంలోకి దించారు. విషయం తెలిసి వందలాది మంది స్వచ్ఛందంగా ముందుకొచ్చి వెదుకులాటకు దిగారు. పోలీసులు, ప్రభుత్వ ఏజెన్సీలతో పాటు ప్రైవేటు సంస్థలు కూడా సెర్చ్ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. చివరకు రాత్రి 11 గంటల వేళ రోడ్డుకు సమీపంలో అడవిలో చిన్నారిని ఓ డ్రోన్ థర్మల్ ఇమేజింగ్ ద్వారా కనిపెట్టింది. అప్పటికి ఒక రోజు గడిచినా చిన్నారి ఇంకా గాఢనిద్రలోనే ఉండటం విశేషం! పోలీసులు, తల్లిదండ్రుల పిలుపులతో ఉలిక్కిపడి లేచింది. నెమ్మదిగా ఏడుపందుకుంది. తల్లిదండ్రులు ఊరడించడంతో మెల్లిగా తేరుకుంది. ఈ దృశ్యాలు అందరినీ కదిలించాయి. 'అడవిలో, వణికించే చలిలో ఆ చిన్న పాప ప్రశాంతంగా నిద్రపోతూ దొరికిన క్షణాలు హృదయాలను కదిలించాయి. సాంకేతిక పరిజ్ఞానం ఇలా సామాజిక ప్రయోజనానికి ఉపయోగపడటం నిజంగా బాగుంది' అంటూ నెటిజన్లు సంబరపడుతున్నారు. – సాక్షి, నేషనల్ డెస్క్

దయాగుణం కలిగి ఉండండి

యువ గ్రాడ్యుయేట్లకు సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ ఉద్బోధ



ఎన్ఎల్ఎస్ఐయూ అకడెమిక్ బ్లాక్ విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న సీజేఐ జస్టిస్ చంద్రచూడ్

బెంగళూరు: గొప్ప తెలివితేటలే కాదు, తోటివారి పట్ల దయాగుణం కలిగి ఉండటం ఎంతో అవసరమని యువ పట్టభద్రులకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ ఉద్బోధించారు. ఆదివారం ఆయన బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీ(ఎన్ఎల్ఎస్ఐయూ)లో జరిగిన 32వ స్నాతకోత్సవంలో ప్రసంగించారు. అకడెమిక్ బ్లాక్ విస్తరణ పనులకు అనంతరం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ డీవై చంద్రచూడ్ ప్రసంగించారు. 'నిజమైన నాయకత్వ ప్రతిభ గలవారు తమ బలాలతోపాటు బలహీనతలను కూడా గుర్తించగలరు. తమకున్న బలంతో ఇతరులకు తోడ్పాటునిస్తూ, తమ బలహీనతలను అధిగమించేందుకు ఇతరుల సాయం తీసుకుంటారు'అని సీజేఐ వివరించారు. అడ్డంకులను అధిగమించే క్రమంలో కుటుంబంతోపాటు స్నేహితుల మద్దతు ఎంతో అవసరమని చెప్పారు. తమ వ్యక్తిత్వాన్ని కాపాడుకుంటూ, నిర్ణయాలు తీసుకునేటప్పుడు ఎంతో సహనంతో మెలగాలన్నారు. 'నిర్ణయం తీసుకునే ప్రక్రియ అనిశ్చితితో కూడి ఉంటుంది, అయినా భయపడాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఈ అనిశ్చితి కొనసాగేది కొంతకాలమే. మీరు ఎంచుకునే మార్గం ఏదైనప్పటికీ, భవిష్యత్తులో మీ సొంత నిర్ణయాలు సానుకూల పరిణామాలను కలిగిస్తాయి. ఈ క్రమంలో సహనం, వినయం అనే సద్గుణాలను ఎన్నడూ వీడరాదని కోరుతున్నాను'అని జస్టిస్ చంద్రచూడ్ చెప్పారు. 'వేగంగా మారుతున్న ప్రపంచం, అవసరాలు, వాతావరణ మార్పులు, సోషల్ మీడియా వంటి కొత్త వినోద సాధనాలు, సామాజిక దురాచారాలను మార్చాలనే ఆత్రుత సంక్లిష్ట సమస్యలకు స్వల్పకాలిక ఫలితాలను కోరేలా చేస్తున్నాయి'అంటూ ఆయన ఇలాంటి సమయంలో సహనంతో మెలగాల్సిన అవసరం ఎంతో ఉందని నొక్కిచెప్పారు. 'హడావుడిగా తీసుకునే నిర్ణయాలకు ఎక్కువ శక్తిని వెచ్చించాల్సి ఉంటుంది. ఇలాంటివి దీర్ఘకాలంలో మీ మానసిక ఆరోగ్యానికి చేటు కల్గిస్తాయి. దీర్ఘకాలంలో సానుకూల లక్ష్యాలను సాధించడం కూడా కష్టమవుతుంది. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది'అని ఆయన యువ న్యాయవాదులను హెచ్చరించారు. న్యాయమూర్తిగా 24 ఏళ్లపాటు పనిచేశాక నాకో విషయం అర్థమయింది. మనదేశంలోని కోర్టుల్లో మనం మూడో వ్యక్తిగా కాకుండా మొదటి వ్యక్తిగా వాదిస్తాం ఎందుకంటే.. కోర్టుల్లో మనం క్లయింట్ల కోసం వాదించం. మనమే క్లయింట్లుగా వాదనలు సాగిస్తాం. వారికి ప్రతినిధులుగా మాత్రమే కాదు, వారి గొంతుక, వారి లాయర్‌గా, విజేతలుగా ఉంటాం'అని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు.



అలాస్కాలోని వల్డెజ్ గ్లేసియర్‌లో తేలియాడే ఐస్‌బర్గ్‌లో సరదాగా కయాకింగ్

గ్లేసియర్ టూరిజం... ప్రాణాంతకం!

- విషాదాంతమవుతున్న పర్యటనలు
- శరవేగంగా కరిగిపోతున్న గ్లేసియర్స్
- మంచులో చిక్కి పర్యాటకుల దుర్మరణం

తెల్లని రంగులో మెరిసిపోతూ చూడగానే మనసుకు హాయిగొలిపే హిమానీ నదాలు (గ్లేసియర్స్) మనసును ఇట్టే ఆకర్షిస్తాయి. వాటికి సమీపంలోకి వెళ్లాలని, మంచును బంతులుగా చేసి ఆడుకోవాలని, మంచు ముద్దలతో గుహలాగా చేసుకొని అందులో సేదదీరాలని పర్యాటకులు ఆరాటపడుతుంటారు. అందుకే గ్లేసియర్ టూరిజానికి ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన డిమాండ్ ఉంది. గ్లేసియర్స్ ఉన్న దేశాలకు ఈ పర్యాటకంతో భారీ ఆదాయం లభిస్తోంది. హిమానీనదాలను ప్రత్యక్షంగా చూసేందుకు జనం పోటెత్తుతున్నారు. అయితే ఆనందం మాటున విషాదం అన్నట్లుగా గ్లేసియర్ టూరిజం ప్రాణాంతకంగా మారుతోంది. గ్లోబల్ వార్మింగ్ దెబ్బకు కొన్నేళ్లుగా గ్లేసియర్స్ శరవేగంగా కరిగిపోతుండటం పర్యాటకుల పాలిట శాపమవుతోంది. హిమానీ నదాలను సందర్శించే క్రమంలో కొన్నేళ్లలో పదుల సంఖ్యలో మృతి చెందారు. మంచులో చిక్కి విగత జీవులయ్యారు. వాతావరణాన్ని ముందుగానే అంచనా వేయడానికి ఆధునిక టెక్నాలజీ అందుబాటులోకి ఉన్నా గ్లేసియర్లలో పరిస్థితులు అనూహ్యం. అవి ఎప్పుడు ఎలా మారుతాయో చెప్పలేమని గ్లేసియర్ గైడ్లు అంటున్నారు. "అప్పటిదాకా రాయిలా స్థిరంగా కనిపించే మంచు క్షణాల్లో కరిగిపోతుంది. ఆ సమయంలో అక్కడు వాళ్లంతా మంచులో కూరుకుపోయి మరణించాల్సిందే" అని చెబుతున్నారు...!

వాతావరణ మార్పులతో ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఫలితంగా ధ్రువాల్లో మంచు కరిగిపోతోంది. భూమిపై ఉన్న మొత్తం గ్లేసియర్లలో 2100 నాటికి సగం అంతరించిపోతాయని సైంటిస్టులు చెబుతున్నారు. ఇప్పటికే అవి చాలావరకు కరిగిపోయాయి కూడా. అందుకే సాహసికులు త్వరపడుతున్నారు. గ్లేసియర్లను సందర్శించడం చాలామందికి ఒక కల. దాన్ని నిజం చేసుకోవడానికి ధ్రువపు ప్రాంతాలకు పరుగులు తీస్తున్నారు. గ్లేసియర్ పర్యాటకాన్ని 'లాస్ట్–చాన్స్ టూరిజం'గా భావిస్తున్నట్లు యూనివర్సిటీ ఆఫ్ ఒట్టావా అసోసియేట్ ప్రొఫెసర్ జాకీ డాసన్ చెప్పారు.

కరిగే మంచు.. పెను ముప్పు

సాధారణంగా ఎండాకాలంలోనే గ్లేసియర్ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్టు నిపుణులు గుర్తించారు. గ్లేసియర్ల ఉపరితలంపై మంచు కరుగుతుండడంతో వాటిపై ఒత్తిడి పెరుగుతోంది. దాంతో ముక్కలుగా విచ్ఛిన్నమవుతున్నాయి. స్థిరంగా ఉన్న గ్లేసియర్ కంటే కరుగుతున్నవి మరింత ప్రమాదకరం. వాటికి దూరంగా ఉండాలని అసోసియేషన్ ఆఫ్ ఐస్‌లాండ్ మౌంటెయిన్ గైడ్స్ ప్రతినిధి గరార్ సిగుర్‌జాన్సన్ చెప్పారు. కొన్నేళ్ల క్రితం వరకు గ్లేసియర్లపై సమ్మర్ స్కీయింగ్‌కు జనం అమితాసక్తి చూపేవారు. ప్రమాదాల నేపథ్యంలో వేసవి కాలంలో స్కీయింగ్‌ను చాలా దేశాలు రద్దు చేశాయి. ప్రమాదాలు, మరణాల పెరుగుతున్నా పర్యాటకుల సంఖ్య తగ్గడం లేదు!

ఎన్నెన్ని విషాదాలో...!

- 2019లో అలాస్కాలోని వాల్డెజ్ గ్లేసియర్‌లో చిక్కుకొని ముగ్గురు పర్యాటకులు మరణించారు. వీరిలో ఇద్దరు జర్మన్లు, ఒకరు ఆస్ట్రేలియన్.
- 2018లో అలాస్కా గ్లేసియర్లలో రెండు ప్రమాదాల్లో 32 ఏళ్ల మహిళ, ఐదేళ్ల బాలుడు చనిపోయారు.
- 2022 జూలైలో ఉత్తర ఇటలీలో మార్మోలడా గ్లేసియర్ నుంచి 64 వేల మెట్రిక్ టన్నుల మంచు, నీరు, రాళ్లు విరిగి పడ్డాయి. మంచు మొత్తం నదిలా పారుతూ దిగువన పర్యాటకులను ముంచెత్తింది. దాంతో 11 మంది మరణించారు.
- 2023లో ఐస్‌లాండ్‌లోని ఓ గ్లేసియర్‌లో మంచు గుహ హఠాత్తుగా కుప్పకూలడంతో అమెరికన్ టూరిస్టు మృతి చెందాడు. ఇది ఐస్‌లాండ్‌లో సంచలనం సృష్టించింది. గ్లేసియర్ టూరిజం సంస్థలు వేసవిలో ఐస్ కేవ్ టూర్లను నిలిపేశాయి. పర్యాటకుల భద్రతపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్



ఐస్‌ల్యాండ్‌లోని బ్రెయిమెర్‌కుర్‌జుకుల్ గ్లేసియర్‌లోని మంచుగుహలో పర్యాటకుడు

గతంలో బాబ్రీ మాదిరిగానే శిథిలావస్థలో కాంగ్రెస్: యోగి

చండీగఢ్: అయోధ్యలో ఒకప్పటి బాబ్రీ మసీదు మాదిరిగానే నేడు కాంగ్రెస్ పార్టీ కూడా శిథిలావస్థకు చేరుకుందని ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ వ్యాఖ్యానించారు. రామ భక్తుల కారణంగా బాబ్రీ స్థానంలో అక్కడ రామాలయ నిర్మాణం జరిగిందన్నారు. ఆదివారం యోగి ఆదిత్యనాథ్ హరియాణాలో బీజేపీ తరఫున ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నా రు. కుల రాజకీయాలను తిరస్కరించాలని ప్రజల కు పిలుపునిచ్చారు. హరియాణా అభివృద్ధి వేగం పుంజుకునేందుకు బీజేపీకే మళ్లీ పట్టం కట్టాలని కోరారు. ఇండియన్ నేషనల్ లోక్ దళ్(ఐఎన్ఎల్‌డీ), కాంగ్రెస్ పార్టీలు కుటుంబ రాజకీయా ల్లో బిజీగా ఉన్నాయని విమర్శించారు. గతంలో నాన్‌కానా సాహిబ్ కారిడార్ నిర్మాణానికి కాంగ్రెస్ అడ్డంకులు కల్పించిందన్నారు. ఆ పార్టీ నేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనల్లో దేశ వ్యతిరేక ప్రకటనలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

మోదీ పేరు మరిచిన బైడెన్!

డెలావెర్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు మతిమరుపు పెరిగిపోతోంది. ఆదివారం ఉదయం డెలావెర్‌లో క్యాన్సర్ మూన్‌షాట్ కార్యక్రమంలో ఆయన ప్రధాని మోదీ పేరు మర్చిపోయారు! వేదికపైకి మోదీని ఆహ్వానించి, పరిచయం చేయాల్సి ఉండగా, బైడెన్ ఉన్నట్టుండి మతిమరుపునకు లోనయ్యారు. ''ఇప్పుడు నేను ఎవరిని పరిచయం చేయాలి? తదుపరి ఎవరున్నారు?'' అని ప్రశ్నించారు. కార్యక్రమ నిర్వాహకులు వెంటనే అప్రమత్తమయ్యారు. మోదీని వేదికపైకి ఆహ్వానించారు. మోదీ వేదికపైకి రాగానే ఆయన భుజంపై బైడెన్ చెయ్యి వేశారు. దాంతో ఆయన మతిమరుపుపై సోషల్ మీడియాలో మరోసారి జోక్‌లు పేలుతున్నాయి. 81 ఏళ్ల బైడెన్ ఇటీవలి కాలంలో పలు సందర్భాల్లో తడబడ్డారు. ఒకరి పేరుకు బదులు ఇతరుల పేర్లు ప్రస్తావించారు. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌పై పోరాటాన్ని బలోపేతం చేస్తామని మోదీ ఈ సందర్భంగా చెప్పారు. సర్వైకల్ క్యాన్సర్ టెస్టింగ్, స్క్రీనింగ్, చికిత్సకు 7.5 మిలియన్ డాలర్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. బాధితులకు సులువైన, చౌకైన చికిత్స అందించాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఈ చికిత్సలో భారత అనుభవం, నైపుణ్యాలను ఇతర దేశాలతో పంచుకొనేందుకు సిద్ధమన్నారు. ఇండో–పసిఫిక్ దేశాలకు 40 మిలియన్ డోసుల వ్యాక్సిన్ అందించబోతున్నట్లు స్పష్టంచేశారు.



పురాతన కళాఖండాలు భారత్‌కు అప్పగింత

అమెరికా ప్రభుత్వం 297 పురాతన కళాఖండాలను భారత్‌కు అప్పగించింది. గతంలో ఇవి భారత్‌లో అపహరణకు గురయ్యాయి. స్మగ్లర్లు వీటిని అమెరికాకు చేరవేసి విక్రయించారు. అమెరికా ప్రభుత్వం ఈ కళాఖండాలను స్వాధీనం చేసుకొని భద్రపర్చింది. మోదీ పర్యటన సందర్భంగా ఆదివారం తిరిగి భారత్‌కు అందజేసింది. విలువైన కళాఖండాలను తిరిగిచ్చినందుకు బైడెన్‌కు మోదీ కృతజ్ఞతలు తెలియజేశారు. 2014 నుంచి ఇప్పటిదాకా విదేశాల నుంచి భారత్‌కు 640 కళాఖండాలు తిరిగివచ్చాయి. వీటిలో అమెరికా నుంచి 578 వచ్చినట్లు అధికారులు చెప్పారు.

బైడెన్‌కు మోదీ 'రైలు' బహుమతి

బైడెన్‌కు మోదీ రైలు బహుమతి అందజేశారు. వెండితో రూపొందించిన రైలు నమూనాను బహూకరించారు. మహారాష్ట్ర కళాకారులు దీన్ని రూపొందించారు. ఇందులో 92.5 శాతం వెండి ఉంది. భారత్–అమెరికా సంబంధాలను ప్రతిబింబిస్తూ ఈ రైలు నమూనాపై ఢిల్లీ–డెలావెర్, ఇండియన్ రైల్వేస్ అని లిఖించారు. అమెరికా ఫస్టు లేడీ జిల్ బైడెన్‌కు అగ్గిపెట్టెలో ఉంచి పాష్మినా శాలువాను మోదీ బహూకరించారు.



ట్రంప్ భద్రతలో వైఫల్యం

ఆ ర్యాలీలో మా 'కమ్యూనికేషన్' పేలవం
యూఎస్ సీక్రెట్ సర్వీస్ అంగీకారం



వాషింగ్టన్: మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై జూలైలో హత్యాయత్నం జరిగిన ర్యాలీలో భద్రతా వైఫల్యాలను యూఎస్ సీక్రెట్ సర్వీస్ అంగీకరించింది. తమ సమీక్షలో వెల్లడైన వైఫల్యాలను శుక్రవారం వివరించింది. రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి ట్రంప్ నిర్వహించిన ఔట్‌డోర్ కార్యక్రమంలో షూటర్ థామస్ మాథ్యూ క్రూక్స్ కాల్పులు జరపడం, కుడి చెవికి గాయంతో ఆయన త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకోవడం తెలిసిందే. పెన్సిల్వేనియాలోని బట్లర్‌లో జరిగిన ఈ ర్యాలీలో కాల్పుల్లో ఇద్దరు గాయపడగా, అగ్నిమాపక సిబ్బంది మరణించారు. కాల్పులు జరిపిన క్రూక్స్‌ను సీక్రెట్ సర్వీస్ సిబ్బంది కాల్చి చంపారు. ఈ ఘటన తరువాత సీక్రెట్ సర్వీస్ డైరెక్టర్ కింబర్లీ చీట్లే రాజీనామా చేశారు. సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు సెలవులో వెళ్లారు. దీనిపై సమీక్ష నిర్వహించిన సీక్రెట్ సర్వీస్ ప్రణాళిక, దాని అమలులో లోపాలను గుర్తించిందని తాత్కాలిక డైరెక్టర్ రోనాల్డ్ రోవ్ జూనియర్ తెలిపారు. అడ్వాన్స్ టీంలోని కొందరు చాలా శ్రద్ధగా వ్యవహరించగా, మరికొందరి అలసత్వం భద్రతా ప్రోటోకాల్స్ ఉల్లంఘనకు దారితీసిందన్నారు.

హెచ్చరికలు లేవు..

స్థానిక యంత్రాంగంతో పేలవమైన కమ్యూనికేషన్, మొబైల్ పరికరాలపై అతిగా ఆధారపడటం, సమాచారం పక్కదారి పట్టడం వంటి సమస్యలను గుర్తించామని రోవ్ తెలిపారు. స్థానిక కాలమానం ప్రకారం సుమారు 18:10 గంటలకు కౌంటర్ స్నైపర్ రెస్పాన్స్ ఏజెంట్‌కు సీక్రెట్ సర్వీస్ సెక్యూరిటీ రూమ్ కాల్ చేసి.. ఏజీఆర్ భవనం పైకప్పుపై ఒక వ్యక్తి ఉన్నట్లు తెలిపింది. అయితే సీక్రెట్ సర్వీస్ రేడియో నెట్‌వర్క్ ద్వారా ఆ కీలక సమాచారం ప్రసారం కాలేదు. ఏదైనా ఘటన జరిగినప్పుడు దానికి ప్రతిస్పందించేందుకు కాక, ఏదీ జరగకుండా నివారించేందుకు సీక్రెట్ సర్వీస్‌కు అదనపు నిధులు, సిబ్బంది, పరికరాలు అవసరం... ట్రంప్‌పై హత్యాయత్నాన్ని దర్యాప్తు చేస్తున్న కాంగ్రెషనల్ టాస్క్‌ఫోర్స్ తెలిపింది. ఉద్యోగులను జవాబుదారీ చేయడం విషయంలో రోవ్‌ను అనుసరించాలని, స్వతంత్ర దర్యాప్తునకు సహకరించాలని, సీక్రెట్ సర్వీస్‌లో అలసత్వానికి స్థానం ఉండకూడదని సూచించింది.

అధ్యక్షుడితో సమాన భద్రత..

గత వారాంతంలో ఫ్లోరిడాలోని వెస్ట్‌పామ్ బీచ్‌లోని గోల్ఫ్‌కోర్స్‌లో ట్రంప్‌పై రెండోసారి హత్యాయత్నం జరగడంతో భద్రతకు డిమాండ్ పెరిగింది. అధ్యక్షుడు, ఉపాధ్యక్షులతో సమానంగా అధ్యక్ష అభ్యర్థులకు సీక్రెట్ సర్వీస్ భద్రతను పెంచే బిల్లును అమెరికా ప్రతినిధుల సభ శుక్రవారం ఏకగ్రీవంగా ఆమోదించింది. సెనేట్‌లో ఓటింగ్, అధ్యక్షుడు జో బైడెన్ సంతకం పూర్తయితే ఈ బిల్లు చట్టరూపం దాల్చుతుంది. అయితే ట్రంప్‌కు ఇప్పుడు అధ్యక్షుడితో సమానమైన రక్షణ కల్పిస్తున్నామని రోవ్ చెప్పారు. సీక్రెట్ సర్వీస్ పనిచేసే వాతావరణానికి ముప్పు విపరీతంగా ఉందని ఆదివారం జరిగిన ఘటన రుజువు చేస్తోందని రోవ్ అన్నారు. ఇక ఫ్లోరిడాలో గన్‌మెన్ ట్రంప్‌వైపు చూడను కూడా చూడలేదని, ముందే అతన్ని అరెస్టు చేశామని తెలిపారు.

పార్లమెంట్‌ను చీకటి గదిలా మార్చేశారు: టీఎంసీ

న్యూఢిల్లీ: 18వ పార్లమెంట్ ఏర్పాటై 100 రోజులు పూర్తయినా స్టాండింగ్ కమిటీలు ఏర్పాటు కాకపోవడంపై టీఎంసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. పార్లమెంట్ 'లోతైన చీకటి చాంబర్'లా మారిపోయిందంటూ వ్యాఖ్యానించింది. రాజ్యసభలో టీఎంసీ నేత డెరెక్ ఓ బ్రియాన్ ఆదివారం ఈ మేరకు 'ఎక్స్'లో పలు వ్యాఖ్యలు చేశారు. 15వ లోక్‌సభలో 10 బిల్లులకు గాను ఏడింటిని సంబంధిత శాఖల పార్లమెంటరీ కమిటీల పరిశీలనకు పంపగా, గత లోక్‌సభలో 10 బిల్లులకు గానే కేవలం రెండు మాత్రమే కమిటీల పరిశీలనకు వెళ్లాయి'అంటూ మండిపడ్డారు.

'హంగ్' రావొద్దనే...

కాంగ్రెస్‌తో పొత్తుపై ఒమర్

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో ఎన్నికల అనంతరం హంగ్ పరిస్థితి రాకుండా ప్రజలకు ఒక అవకాశం కల్పించేందుకే కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నట్లు నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ) ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దులా వివరించారు. ప్రభుత్వం ఏర్పాటు కాదేమోనన్న అనుమానాలు అక్కర్లేదని ఆయన కుండబద్దలు కొట్టారు. దాల్ సరస్సులో ఆదివారం షికారా(పడవ)లతో చేపట్టిన ర్యాలీలో అబ్దుల్లా మాట్లాడారు. ఎన్నికల తర్వాత జమ్మూకశ్మీర్‌లో హంగ్ ఏర్పడాలని బీజేపీ కోరుకుంటోందని, తద్వారా లెఫ్టినెంట్ గవర్నర్ పాలనను పొడిగించాలని చూస్తోందని ఆరోపించారు. అయితే, ప్రజలు బీజేపీకి ఆ అవకాశం ఇవ్వబోరని చెప్పారు. కశ్మీర్ లోయలో ప్రచారంతో ఫలితం ఉండదని ముందుగానే గ్రహించిన బీజేపీ నేతలు జమ్మూలో మాత్రమే పర్యటిస్తున్నారని ఒమర్ వ్యాఖ్యానించారు. బీజేపీ తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే జమ్మూకశ్మీర్‌లో మూడు కుటుంబాల పాలన అంటూ విమర్శలు చేస్తోందన్నారు.



షికారా ర్యాలీలో పార్టీ జెండాతో ఒమర్ అబ్దుల్లా

సాక్షి ప్లస్
సోమవారం। 23-9-2024

మానవ సేవే మాధవ సేవ

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

మత, సాంఘిక సంస్కరణ ఉద్యమాలు

పాశ్చాత్య దేశాల్లో మేధాసంపత్తి, వ్యక్తి వాదం ఆధిక్యంలో ఉన్నప్పుడు భారతీయులకు పశ్చిమ దేశాలతో సాన్నిహిత్యం ఏర్పడింది. తొలి దశలో పాశ్చాత్య విద్యను అభ్యసించిన భారతీయులు విదేశీ సంస్కృతిపై వ్యామోహంతో వారి వేషధారణ, అలవాట్లు, మత భావాల పట్ల ఆకర్షితులయ్యారు. ఈ క్రమంలోనే 19వ శతాబ్దంలో భారతీయుల్లో జాతీయ భావం అంకురించింది. రాజా రామ్మోహన్‌రాయ్ తదితరులు మత, సాంఘిక సంస్కరణోద్యమాలు సాగించారు. ఫలితంగా హిందూ సమాజంలో సంస్కరణలొచ్చాయి. ఈ సంస్కర్తల ప్రభావం జాతీయోద్యమంపై ప్రసరించింది.

రాజా రామ్మోహన్‌రాయ్

హిందూ మత సాంస్కృతిక పునరుజ్జీవనానికి రాజా రామ్మోహన్‌రాయ్ (1772–1833) నాంది పలికాడు. ఈయన బెంగాల్‌లోని రాధానగరంలో ఉన్నత బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. ఇతడి తండ్రి రమాకాంత్ రాయ్ జమీందారు. రాయ్ చిన్నతనంలోనే బెంగాలీ, అరబిక్, పర్షియన్, సంస్కృత భాషలను నేర్చుకున్నాడు. తర్వాత ఇంగ్లిష్, ఫ్రెంచ్, లాటిన్, గ్రీకు, హిబ్రూ భాషలపై పట్టు సాధించాడు. హిందూ, ముస్లిం, క్రైస్తవ గ్రంథాలను కూలంకషంగా చదివాడు. రాయ్ 1805లో ఈస్టిండియా కంపెనీలో చేరి తొమ్మిదేళ్లు ఉద్యోగం చేశాడు. కానీ ఉద్యోగంలో సంతృప్తి కలగలేదు. సనాతన హిందూ ఆచారాల్లోని దోషాలు నశించి, సమాజం అభివృద్ధి చెందాలంటే ఆంగ్ల విద్య నేర్చుకోవాలని, తద్వారా ప్రజలను చైతన్యవంతం చేయడం సాధ్యమవుతుందని భావించాడు.

బ్రహ్మ సమాజ స్థాపన (1828)

రాయ్ 1828లో బ్రహ్మసమాజాన్ని స్థాపించాడు. దేవుడొక్కడేనని, ఉపనిషత్తుల్లో పేర్కొన్న మార్గమే మోక్షసాధన అని బోధించాడు. విగ్రహారాధను నిరసించాడు. సర్వమానవ సమానత్వాన్ని బోధించాడు. పరమత సహనం చూపాలని, మానవకోటిని ఉద్ధరించాలని ప్రబోధించాడు. ఈ మతం హిందూ మతాన్ని వదల్లేకపోయినా పాశ్చాత్య ఉదార వైఖరి అవలంబించిందని మెకనాల్ విశ్లేషించాడు.

సాంఘిక దురాచారాలపై..

మత బోధనలే కాకుండా హిందూ మతంలోని సాంఘిక దురాచారాలను రూపుమాపడానికి రాయ్ నడుం బిగించాడు. 1811లో తన సోదరుడు జగన్‌మోహన్ రాయ్ మరణించినప్పుడు ఆయన భార్యను కూడా చితిపై ఉంచి దహనం చేయడం చూసి రాయ్ హృదయం ద్రవించింది. సతీసహగమనం, బాల్యవివాహాలను నిర్మూలించాలని భావించాడు. ఉపన్యాసాలు, పత్రికల ద్వారా తన భావాలను ప్రచారం చేశాడు. విలియం బెంటింగ్ 1829లో సతీసహగమన నిషేధ చట్టాన్ని రూపొందించడంలో రాజా రామ్మోహన్‌రాయ్ కృషి దాగి ఉంది. బాల్యవివాహాలను రద్దు చేయడానికి, కులవ్యవస్థ నిర్మూలనకు, స్త్రీ జనోద్ధరణకు నిర్విరామ కృషి చేశాడు.

విద్యాసేవ

ఆంగ్ల విద్యను అభ్యసించనిదే దేశం బాగుపడదని భావించిన రాయ్ ఆంగ్ల విద్యను ప్రోత్సహించాడు. 1830లో అలెగ్జాండర్ డఫ్ ఆంగ్ల పాఠశాలను నెలకొల్పినప్పుడు, మెకాలే ఇంగ్లిష్ విద్యను ప్రవేశపెట్టినప్పుడు సమర్థించాడు. తన భావాలను ప్రచారం చేయడానికి సంబంధకౌముది అనే బెంగాలీ వార పత్రికను, మీరట్- ఉల్- అక్బర్ అనే పారశీక పత్రికను నడిపాడు. పత్రికా స్వాతంత్ర్యం కోసం పాటుపడ్డాడు. 1833లో బ్రిస్టల్ నగరంలో రాయ్ మరణించాడు. అతడి మరణానంతరం దేవేంద్రనాథ్ ఠాగూర్, కేశవచంద్రసేన్ బ్రహ్మ సమాజ ఆశయాలను కొనసాగించారు.

స్వామి దయానంద సరస్వతి

ఆర్య సమాజ స్థాపకుడు స్వామి దయానంద సరస్వతి (1824–1883). ఈయన గుజరాత్‌లోని మోర్వి గ్రామంలో జన్మించాడు. ఇతణ్ని హిందూ సాంస్కృతిక పునరుజ్జీవనానికి మూల పురుషుడిగా పేర్కొంటారు. దయానంద సరస్వతి అసలు పేరు మూల్‌శంకర్ తివారి. ఇతడికి చిన్నతనం నుంచే ఆధ్యాత్మిక చింతన ఎక్కువ. ఇది వయస్సుతో పాటు పెరగడంతో వివాహాన్ని తిరస్కరించి ఇల్లు వదిలివెళ్లాడు. అనేక పుణ్యక్షేత్రాలు, పుణ్య పురుషలను దర్శించి సన్యాసాశ్రమం స్వీకరించాడు. చివరకు మధురలో విరజానందుడనే గురువు వద్ద వేదాలు అభ్యసించాడు. సత్యార్థ్ ప్రకాశ్ అనే గ్రంథాన్ని రచించాడు. ఇందులో తన భావాలను ప్రకటించాడు. అవి..

1) దేవుడొక్కడే 2) విగ్రహారాధన పనికిరాదు 3) వేదాలు విజ్ఞాన గనులు. వేదోక్తమయిన హిందూమతం అన్నిటికన్నా మిన్న 4) మోక్షానికి సత్ప్రవర్తన అవసరం 5) జాతి ఐక్యతకు ఏకమతం ఉండాలని భావించాడు. వేరే మతాల్లో చేరిన హిందువులను తిరిగి సొంత మతంలోకి మార్చడానికి శుద్ధి అనే పద్ధతిని ప్రవేశపెట్టాడు. ఈ సిద్ధాంతాలే ఆర్య సమాజానికి మూల సూత్రాలయ్యాయి. తన సిద్ధాంతాలను ప్రచారం చేయడానికి 1875లో ఆర్య సమాజాన్ని స్థాపించాడు. కులభేదం, అంటరానితనం, బాల్య వివాహాలను ఖండించి స్త్రీ జనోద్ధరణ, వెనుకబడిన జాతుల అభివృద్ధి కోసం కృషి చేశాడు. 1883లో ఆయన మరణించాక స్వామి శ్రద్ధానందుడు, లాలా లజపతిరాయ్, లాలా హంసరాజ్ మొదలైనవారు ఆర్యసమాజాన్ని ప్రచారం చేశారు.

రామకృష్ణ పరమహంస

భారతీయ ఆధ్యాత్మిక తత్వానికి మారోరూపం రామకృష్ణ పరమహంస. ఈయన అసలు పేరు గదాధర్ చటోపధ్యాయ్. 1833లో బెంగాల్‌లోని కామర్పుకూర్ గ్రామంలో జన్మించాడు. ఈయన గొప్ప భక్తుడు. చిన్నతనం నుంచి ఆధ్యాత్మిక చింతన ఎక్కువ. కలకత్తాలోని దక్షిణేశ్వర్‌లో ఇతడి సోదరుడు రామ్ కుమార్ ఛటర్జీ అర్చకుడిగా పనిచేసేవాడు. దీంతో రామకృష్ణుడు కూడా దక్షిణేశ్వర్‌లో నివసించేవాడు. కొద్ది కాలానికి రామకృష్ణ పరమహంస అక్కడి కాళీమాత ఆలయానికి అర్చకుడయ్యాడు. ఆమెను ధ్యానం చేస్తూ ధ్యాన సమాధిలో మునిగిపోయేవాడు. 'తోతాపురి' అనే యోగి ఆయన సమాధి స్థితిని సరి చేయడంతో రామకృష్ణుడు పరిపూర్ణుడయ్యాడు. తర్వాత..

1) దేవుడొక్కడే, అతడు సర్వాంతర్యామి 2) భగవంతుణ్ని తెలుసుకోవడమే జ్ఞానం 3) అన్ని మతాలు భగవంతుణ్ని చేరే మార్గాలను చూపుతాయి 4) మోక్ష సాధనకు కోర్కెలను విసర్జించాలి 5) మానవ సేవే మాధవసేవ అని బోధించాడు. తన బోధనలను వ్యాప్తం చేసే బాధ్యతను ప్రియ శిష్యుడైన స్వామి వివేకానందుడికి అప్పగించి 1886లో పరమపదించాడు.

ప్రభావం: భారతదేశ సంస్కృతిపై రామకృష్ణ పరమహంస ప్రభావం పరోక్షంగా ఉంది. ఆయన వివేకానందుణ్ని తీర్చిదిద్దాడు. వివేకానందుడు ప్రపంచానికి భారతదేశ గొప్పతనాన్ని చాటాడు. అతడి వల్ల ప్రపంచం భారతదేశ ఔన్నత్యాన్ని గ్రహించింది.

స్వామి వివేకానంద (1863-1902)

19వ శతాబ్దం నాటి సంస్కర్తలందరూ దేశంలో హిందూ మత సంస్కరణకు పూనుకున్నారు. అయితే స్వామి వివేకానంద హిందూ మత ఔన్నత్యాన్ని, భారతీయ మత శాస్త్ర లోతులను ప్రపంచానికి చాటాడు. వివేకానందుడి అసలు పేరు నరేంద్రనాథ్ దత్తా. ఇతడు 1863లో కలకత్తాలో జన్మించాడు. మొదట బ్రహ్మసమాజం పట్ల ఇతడికి అభిమానం ఏర్పడింది. కానీ కుటుంబంలో వచ్చిన కొన్ని కల్లోలాల కారణంగా భగవంతుడిపై నమ్మకం పోయింది. ఆ సందర్భంలో రామకృష్ణ పరమహంస గురించి తెలుసుకున్నాడు. ఆయనను చూడటానికి వచ్చి 'నీవు భగవంతుణ్ని చూశావా? నాకు చూపిస్తావా?' అని ప్రశ్నించాడు. రామకృష్ణుడు చూపిస్తానని తన బొటన వేలితో వివేకానందుణ్ని తాకాడు. దీంతో వివేకానందుడు అనిర్వచనీయమైన అనుభూతి పొందాడు. తర్వాత నాస్తిక భావాన్ని వదిలి రామకృష్ణుడికి శిష్యుడయ్యాడు. సన్యాసిగా, గొప్ప వేదాంతిగా మారాడు. వివేకానందుడు గొప్ప వక్త, మధుర గాయకుడు. రామకృష్ణుడి భావాలను ప్రచారం చేసేందుకు అమెరికాలోని చికాగోలో జరిగిన ప్రపంచ మతాల సదస్సుకు హాజరయ్యాడు. తన ఉపన్యాసంతో కొద్ది నిమిషాల్లోనే సభికులను ఆకట్టుకున్నాడు. సభికుల కోరికపై ఉపన్యాసాన్ని కొనసాగించి అద్వైత సిద్ధాంతాన్ని 5 గంటల పాటు వివరించాడు. భారతీయ ఆధ్యాత్మిక తత్వబోధనలను వారికి తెలియజేశాడు. రామకృష్ణుడి బోధనలు ప్రచారం చేయడానికి కలకత్తాలోని బేలూరు వద్ద మఠం నిర్మించాడు. అందులో రామకృష్ణుడి విగ్రహం ప్రతిష్ఠించి 'రామకృష్ణ' అనే సంస్థను స్థాపించాడు. ఈ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా విస్తరించింది. నేటికీ రామకృష్ణుడి బోధనలను ప్రచారం చేస్తూ సంఘ సేవలో పాలుపంచుకుంటోంది. నిర్వీర్యమవుతున్న భారత జాతిని మేల్కొలుపుతూ వివేకానందుడు అనేక బోధనలు చేశాడు.

వివేకానందుడు ప్రచారం చేసిన సిద్ధాంతాలు

1) సర్వమతాల వేదాంతానికి మూలం హిందూ మతం.
2) హిందూ మతంలో జీవముంది. దాన్ని పునరుద్ధరించడమే మన కర్తవ్యం.
3) పాశ్చాత్యులను అనుసరించడం నాగరికత కాదు. అది దుర్బలుల లక్షణం. నీ సంస్కృతి గొప్పది. దానికి దూరం కావొద్దు.
4) నువ్వు నీ దేశానికి దూరం కావొద్దు.
5) మానవ సేవే మాధవసేవ. కాబట్టి సాటి మనుషులకు సేవ చేయి.



6) భారతదేశం నశిస్తే ప్రపంచంలో ఆధ్యాత్మిక తత్వం నశిస్తుంది.

ఇంకా దేశభక్తికి దృఢ దీక్ష అవసరమని బోధించాడు. ఆకలితో అల్లాడే సాటి భారతీయులను ఆదుకోండని దేశ ప్రజలను కోరాడు. ఇలా అభ్యర్థిస్తూ మైసూరు మహారాజుకు ఒక ఉత్తరం రాశాడు. హిందూ సంస్కృతి వ్యాప్తికి అహోరాత్రాలు కృషి చేసి 1902లో తన 39వ ఏట మరణించాడు.

దివ్యజ్ఞాన సమాజం - అనిబిసెంట్

మేడమ్ బ్లావట్‌స్కీ, కల్నల్ ఆల్‌కాట్ 1875లో అమెరికాలో థియోసోఫికల్ సొసైటీని స్థాపించారు. ఐర్లాండ్‌కు చెందిన అనిబిసెంట్ ఈ సొసైటీ శాఖను 1893లో మన దేశంలో ప్రారంభించారు. ఈ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనిబిసెంట్ హిందూ మత గ్రంథాలన్నింటినీ సమగ్రంగా అధ్యయనం చేసి, హిందూ మత గొప్పదనాన్ని తెలుసుకున్నారు. హిందూ సంస్కృతిని కాపాడి ఆ మతాన్ని పునరుద్ధరించాలని నిశ్చయించుకున్నారు. దివ్యజ్ఞాన సమాజం సర్వసమాన సౌభ్రాతృత్వం, పరమత సహనం, సర్వమత సమానత్వాలను ప్రచారం చేసింది. కులవ్యవస్థను ఖండించి సంఘంలోని వెనుకబడిన జాతుల సంక్షేమానికి పాటుపడింది. భారతీయులకు విద్యాబుద్ధులు నేర్పడానికి అనిబిసెంట్ కాశీలో హిందూ కళాశాలను స్థాపించారు. కొద్ది కాలం తర్వాత మదన్‌మోహన్ మాలవ్య ఈ కళాశాలను హిందూ విశ్వవిద్యాలయంగా అభివృద్ధి చేశారు.

హోమ్ రూల్ లీగ్

అనిబిసెంట్ సంఘ సేవ చేయడమే కాకుండా భారత రాజకీయాల్లోకి ప్రవేశించారు. 1916 సెప్టెంబర్‌లో మద్రాసులో 'హోమ్‌రూల్ లీగ్' ప్రారంభించారు. 27,000 మందితో దేశమంతా దీని శాఖలు ఏర్పడ్డాయి. వారి సహాయంతో ఆమె దేశమంతా హోమ్‌రూల్ ఉద్యమాన్ని నడిపారు. చాలా పట్టణాల్లో బహిరంగ సభల్లో ఉపన్యాసాలు ఇచ్చి దేశభక్తిని ప్రబోధించారు. ఆమె కృషి వల్ల దేశమంతటా జాతీయభావం బలపడింది. ఆమె విదేశీ వనిత అయినా భారతదేశాన్ని మతృభూమిగా భావించి గొప్ప సేవ చేశారు. 1917లో బ్రిటిష్ ప్రభుత్వం ఆమెను జైల్లో నిర్బంధించింది. అనిబిసెంట్ గొప్ప పండితురాలు. ఆమె తొలి పేరు మిస్ ఉడ్. ఐర్లాండ్‌లో చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి దివ్యజ్ఞాన సమాజ సభ్యురాలిగా భారత్‌కు వచ్చారు.

ఈశ్వర చంద్ర విద్యాసాగర్

రాజా రామ్మోహన్‌రాయ్ తర్వాత హిందూ సమాజానికి అంతటి సేవ చేసిన మహనీయుడు ఈశ్వర చంద్ర విద్యాసాగర్. ఇతడి అసలు పేరు ఈశ్వర చంద్రుడు. హిందూ శాస్త్రాల్లో విద్యాసాగర్ అనే పట్టాను పొందడంతో విద్యాసాగర్ అని పేరుతో కలిసిపోయింది. ఈయన 1820లో బెంగాల్‌లో వీరశింఘ అనే గ్రామంలో జన్మించాడు. ధర్మ, వేదాంత, జ్యోతిష శాస్త్రాల్లో గొప్ప పండితుడు. ఉపాధ్యాయుడిగా జీవితం ప్రారంభించి విద్యాశాఖాధికారి అయ్యాడు. కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేశాడు. విద్యావ్యాప్తి కోసం విశేష కృషి చేశాడు. విద్యాశాఖాధికారిగా ఉన్న కాలంలో 40 పాఠశాలలను, కలకత్తాలో మెట్రోపాలిటన్ కాలేజీని స్థాపించాడు. స్త్రీ విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చాడు. ఈయన కృషి వల్ల చాలామంది బెంగాలీ స్త్రీలు విద్యావంతులయ్యారు. సత్పురుషుల చరిత్ర, బెంగాల్ చరిత్ర, సీతావనవాసం అనే గ్రంథాలను రచించాడు. సులభంగా సంస్కృతం నేర్చుకోవడానికి వీలుగా అనేక సంస్కృత పుస్తకాలు రాశాడు.

సంఘ సంస్కరణలు

రాజా రామ్మోహన్‌రాయ్‌లా ఈశ్వరచంద్రుడు స్త్రీ జనోద్ధరణకు విశేష కృషి చేశాడు. బాల్యవివాహాలు, బహుభార్యత్వం, వరకట్న దురాచారాలను ఖండించాడు. వితంతు వివాహాలను చట్టబద్ధం చేయాలని ప్రచారం చేసి వితంతు వివేకం అనే గ్రంథాన్ని రాశాడు. తన కుమారుడికి వితంతువును ఇచ్చి వివాహం చేసి ఆదర్శప్రాయుడయ్యాడు. ఈయన కృషి వల్ల 1856లో డల్హౌసీ వితంతు పునర్వివాహ చట్టం చేశాడు. తన సంపాదనంతా సంఘ సంస్కరణలకు ఖర్చు చేశాడు. ఈశ్వరచంద్రుడు 1891లో మరణించాడు.

రెండు శాస్త్రాల మధ్య సహసంబంధం అంటే?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ - మెథడ్స్ (ఎస్‌ఏ)

బోధన ఉద్దేశాలు-విలువలు

మన కళ్ల ముందు కనపడుతూ చేసే ప్రతి పనికి దిశా నిర్దేశం చేస్తూ గమ్యం చేరడానికి ఉపయోగపడేదే ఉద్దేశం. జాన్‌డ్యూయి ప్రకారం ఉద్దేశం మన జయాపజయాన్ని మాపనం చేసే సాధనం. ఉద్దేశం విస్తృత అర్థాన్ని కల్గి ఉంటుంది. విశాలమైంది, సుదూరమైంది. ఇది సాధించడానికి ఎక్కువ కాలం పడుతుంది. ఇది అస్పష్టమైంది. సాధించామా లేదా తెలుసు కోవటం కష్టం.

ఉదాహరణలు:

- శాస్త్రజ్ఞానాన్ని పెంపొందించడం
- జీవశాస్త్ర ప్రాథమిక జ్ఞానాన్ని అందించడం
- పరిసరాల గురించిన అవగాహన కల్పించడం
- శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం
- సాంకేతిక అభివృద్ధిని సాధించడం
- విద్యార్థి సంపూర్ణ మూర్తిమత్వాన్ని పెంపొందించడం
- మంచి పౌరునిగా తీర్చిదిద్దడం
- ఉపాధ్యాయుడు ఎప్పుడూ నిర్దిష్ట కాలంలో సాధించే లక్ష్యాలను ఏర్పర్చుకుంటాడు
- ఉద్దేశాలను రాజకీయవేత్తలు, విద్యావేత్తలు నిర్దేశిస్తారు.
- ప్రతి ఉద్దేశానికి అనేక లక్ష్యాలు ఉంటాయి.

విలువలు:

- విలువ మంచి చెడులకు సంబంధించింది.
- విలువ యోగ్యతను తెలియజేస్తుంది.
- వ్యక్తి వికాసం, సామాజిక లేదా జాతీయ ప్రగతికి దోహదపడేదిగా ఉండాలి. అప్పుడే ఆ వ్యక్తి మంచి విలువ కలిగి ఉన్నాడని అంటాం.

మాదిరి ప్రశ్నలు

1. కిందివాటిలో ఉద్దేశానికి సంబంధించి సరైన ప్రవచనాలు?
ఎ) నిర్దిష్టమైంది
బి) సాధించడానికి ఎక్కువ కాలం పడుతుంది
సి) అస్పష్టంగా ఉంటుంది
డి) పరిమిత అర్థం కలిగి ఉంటుంది
1) ఎ, డి 2) ఎ, బి
3) బి, సి 4) సి, డి

2. ఉద్దేశానికి సంబంధించి కిందివాటిలో సరికానిది?
1) విద్యార్థికి పరిసరాల పట్ల అవగాహన కల్పించడం
2) విద్యార్థి సంపూర్ణ మూర్తిమత్వాన్ని అభివృద్ధి చేయడం
3) విద్యార్థిని మంచిపౌరునిగా తీర్చి దిద్దడం
4) విద్యార్థిని వృక్ష, జంతు కణాల మధ్య తేడాలను గుర్తించేలా చేయడం

3. ఉద్దేశాలు ఎవరు నిర్దేశిస్తారు అని అడిగిన ప్రశ్నకు కిందివాటిలో సరైనవి?
ఎ) రాజకీయవేత్తలు బి) ఉపాధ్యాయుడు
సి) విద్యావేత్తలు
డి) ప్రధానోపాధ్యాయుడు
1) బి, డి 2) ఎ, సి
3) బి, సి 4) ఎ, డి

4. ఉద్దేశం గురించి జాన్‌డ్యూయి తెలిపిన ప్రవచనం?
1) ఉద్దేశం తరగతిలో ఉపాధ్యాయుడికి మార్గదర్శకత్వం చేసేది
2) ఉద్దేశం మన జయాపజయాన్ని మాపనం చేసే సాధనం
3) ఉద్దేశం అనేది అమూర్త గమ్యం
4) ఉద్దేశం, లక్ష్యం రెండూ ఒకటే

5. కిందివాటిలో దేని ఆధారంగా బీఈడీ కోర్సులో ఏయే సబ్జెక్టులు ఉండాలో నిర్ణయిస్తారు?.
1) లక్ష్యం 2) స్పష్టీకరణ
3) ఉద్దేశం 4) విలువ

6. రాకేష్ జీవశాస్త్ర పట్టభద్రుడైన తర్వాత తేనెటీగల పెంపకం చేస్తూ జీవనం కొనసాగి స్తున్నాడు. అతనిలో పెంపొందించిన విలువ?
1) నైతిక విలువ
2) ఉపయోగాత్మక విలువ
3) సాంస్కృతిక విలువ
4) వృత్తి పరమైన విలువ

7. జీవశాస్త్ర అధ్యయనం తర్వాత విద్యార్థుల్లో పెంపొందించిన విలువలు వరుసగా
ఎ) భరత్ తన శరీరాన్ని పరిశుభ్రంగా ఉంచుకుంటున్నాడు
బి) భారతి శాస్త్రవేత్తగా మారింది
సి) భగీరథ్ నిజాయితీగా వ్యవహరిస్తు న్నాడు
1) భరత్-నైతికవిలువ, భారతి-ఉపయోగాత్మక, భగీరథ్ - సాంస్కృతిక విలువ
2) భరత్-ఉపయోగాత్మక, భారతి-నైతిక, భగీరథ్- సృజనాత్మక
3) భరత్- సాంస్కృతిక, భారతి - సృజనాత్మక, భగీరథ్- ఉపయోగాత్మక
4) భరత్-ఉపయోగాత్మక, భారతి - వృత్తిపరమైన, భగీరథ్-నైతిక

8. కింది ఏ విద్యార్థిలో బౌద్ధిక విలువ ఏర్పడిందని తెలుపగలం?
1) కొత్త ఆలోచనలను సంతరించుకోవడం
2) గోళ్లను కత్తిరించుకోవడం
3) జీర్ణవ్యవస్థలోని అవయవాలను జ్ఞప్తికి తెచ్చుకోవడం
4) ప్రకృతిని అభినందించడం

9. విలువలను అమూర్త గమ్యాలు అంటారు ఎందుకు?
1) అవి విద్యార్థిలో ఎప్పుడు ప్రవేశిస్తాయో చెప్పలేం
2) వాటిని విద్యార్థి సాధించడం కష్టం
3) విద్యార్థులు ప్రతి తరగతిలో సాధించేవి
4) అవి విద్యకు సంబంధించినవి కాదు

10. ప్రయోగాలు చేయడం వల్ల విద్యార్థిలో నిజాయితీ, సత్యశీలత, నిష్పాక్షికత, ఓర్పు వంటి లక్షణాలు అభివృద్ధి చెందుతాయి. దీనికి సంబంధించిన విలువ?
1) సృజనాత్మక విలువ 2) నైతిక విలువ
3) శాస్త్రీయ పద్ధతి
4) ఉపయోగాత్మక విలువ

11. పార్వతి విజ్ఞానశాస్త్ర అధ్యయనం చేసినప్పటికీ ఇంటి గడపకు తరచూ పసుపు పూస్తోంది. ఆమెలో ప్రతిబింబించిన విలువ?
1) సృజనాత్మకత 2) నైతిక
3) సాంస్కృతిక 4) బౌద్ధిక

12. ఉపాధ్యాయుడు చెప్పిన విధంగా కాకుండా భిన్నంగా, కొత్తరకంగా ఆలోచించే విద్యా ర్థిలో పెంపొందించిన విలువ?
1) సృజనాత్మక 2) బౌద్ధిక
3) నైతిక 4) ఉపయోగాత్మక

13. పవన్ వ్యవసాయ శాస్త్రంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సు చేస్తున్నాడు. సెలవు లకు ఇంటికి వచ్చిన అతను తన తండ్రి చేస్తున్న వ్యవసాయంలో సలహాలు ఇచ్చా డు. అతనిలో పెంపొందించిన విలువ?
1) వృత్తిపరమైన 2) బౌద్ధిక
3) నైతిక 4) ఉపయోగాత్మక

14. విలువకు సంబంధించి సరికాని ప్రవచనం?
1) విలువ యోగ్యతను తెలియజేస్తుంది
2) విలువ మంచి చెడులకు సంబం ధించింది
3) విలువలను అమూర్త గమ్యాలు అని కూడా అంటారు
4) విద్యార్థుల్లో విలువలను ఉపాధ్యాయు డు సాధించలేడు

15. ఆహారం, పీల్చేగాలి, తాగునీరు అనే పాఠ్యాంశాలు పెంపొందించగలిగే విలువ?
1) వృత్తిపరమైన 2) నైతిక
3) ఉపయోగాత్మక 4) బౌద్ధిక

16. అరకులోయ అందాలను చూసి సృష్టిని అభినందించిన అనితలో నెరవేరిన విలువ?
1) సృజనాత్మక విలువ
2) సాసంస్కృతిక విలువ
3) సౌందర్య విలువ
4) నైతిక విలువ

17. ఉద్దేశాన్ని నిర్దేశించేవారు?
1) విద్యార్థులు 2) విద్యావేత్తలు
3) ఉపాధ్యాయుడు
4) విద్యార్థి తల్లిండ్రులు

18. కిందివాటిలో దేన్ని సాధించడానికి ఎక్కువ కాలం పడుతుంది?
1) ఉద్దేశం 2) లక్ష్యం
3) స్పష్టీకరణ 4) 1, 2

19. ఉద్దేశాలు, లక్ష్యాలకు సంబంధించి కిందివాటిలో సరైంది?
1) ఉద్దేశాలు, లక్ష్యాలకు సంబంధం లేదు
2) ఉద్దేశాలు నిర్దిష్టం, లక్ష్యాలు అస్పష్టం
3) ఉద్దేశాలు లక్ష్యాలను ఏర్పరుస్తాయి
4) ఉద్దేశాలు దీర్ఘకాలికం, లక్ష్యాలు స్వల్ప కాలికం

20. ఉద్దేశాలకు సంబంధించి కిందివాటిలో రెండు సరైన ఉదాహరణలు?
ఎ) విద్యార్థి మూడు విత్తనాల ప్రయోగాన్ని సొంత మాటల్లో వివరించడం
బి) జీర్ణక్రియ అంటే ఏమిటో తెలుసు కునేలా చేయడం
సి) విద్యార్థిని మంచి పౌరునిగా తీర్చి దిద్దడం
డి) పరిసరాల గురించి అవగాహప కల్పించడం
1) ఎ, బి 2) బి, సి
3) సి, డి 4) ఎ, డి

సమాధానాలు

1) 3; 2) 4; 3) 2; 4) 2; 5) 3; 6) 4; 7) 4; 8) 3; 9) 1; 10) 2; 11)3; 12)1; 13) 4 14) 4; 15) 3; 16) 3; 17) 2; 18) 1; 19) 4; 20) 3.

సహసంబంధం

1. జీవశాస్త్ర బోధనలో సహసంబంధాన్ని వినియోగించడంలో ఉన్న ప్రయోజనాల్లో లేనిది?
1) అభ్యసన సులభతరం అవుతుంది
2) విద్యార్థికి ఇతర శాస్త్రం పట్ల ఉన్న ఆసక్తి ద్వారా జీవశాస్త్రంపై అభిరుచి పెంచుకుంటాడు
3) నేర్చుకున్న విషయం ఎక్కువ కాలం గుర్తుంటుంది
4) సహసంబంధం అంటే ఏమిటో నేర్చుకుంటాడు

2. రెండు శాస్త్రాల మధ్య సహసంబంధం అంటే?
1) రెండు శాస్త్రాలను క్షుణ్నంగా చదవడం
2) ఒక శాస్త్ర విషయం మరో శాస్త్రాన్ని బోధించడంలో ఉపయోగపడక పోవ డం
3) రెండు శాస్త్ర విషయాల మధ్య తేడా లను బోధించడం
4) ఒక శాస్త్ర విషయం సారూప్యత ఉన్న మరో శాస్త్ర విషయం బోధించడంలో ఉపయోగపడటం

3. 'ద్రవాలు ఎక్కువ పీడనం నుంచి తక్కువ పీడనం వైపునకు ప్రవహిస్తాయి' అనే భౌతిక శాస్త్ర భావన జీవశాస్త్రంలో కింది ఏ పాఠ్యాంశ బోధనలో ఉపయో గపడుతుంది?
1) శ్వాస వ్యవస్థ 2) జీర్ణవ్యవస్థ
3) రక్తప్రసరణ వ్యవస్థ 4) నాడీ వ్యవస్థ

4. జీవశాస్త్ర సంబంధిత విటమిన్‌లు, పోషక పదార్థాలు బోధించే ఉపాధ్యాయుడు కింది ఏ శాస్త్ర పరిజ్ఞానాన్ని ఉపయోగించవచ్చు?
1) గణిత శాస్త్రం 2) రసాయన శాస్త్రం
3) భౌగోళిక శాస్త్రం 4) భౌతిక శాస్త్రం

5. కిందివారిలో ఏ ఉపాధ్యాయునికి జీవ - భౌతికశాస్త్రాల సహసంబంధాన్ని వినియో గించుకునే వీలుంటుంది?
1) జీర్ణక్రియ బోధించే ఉపాధ్యాయునికి
2) DNA నిర్మాణం బోధించే ఉపాధ్యాయునికి
3) అమీబాలో ద్రవాభిసరణక్రమత బోధించే ఉపాధ్యాయునికి
4) జన్యు ఉత్పరివర్తనలు బోధించే ఉపాధ్యాయునికి

6. ఏ ఇద్దరు ఉపాధ్యాయులకు జీవ శాస్త్రం, గణిత శాస్త్రాల మధ్య సహసంబంధాన్ని ఉపయోగించే అవకాశం ఉంది?
ఎ) జీవుల మధ్య అన్యోన్యాశ్రయత బోధిస్తున్నవారు
బి) శ్వాసక్రియ విధానాన్ని బోధిస్తున్న వారు
సి) మెండల్ సూత్రాల్లో F_1, F_2 తరాల గురించి బోధిస్తున్నవారు
డి) జనాభా విద్యను బోధిస్తున్నవారు
1) ఎ, సి 2) బి, సి
3) సి, డి 4) ఎ, బి

సమాధానాలు

1) 4 2) 4 3) 3 4) 2 5) 3 6) 3

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ప్రయోగాల పరిశీలనలు నిజాయతీతో నిర్వహించాలి అనే అంశాన్ని కలిగి ఉన్న విలువ?
1) క్రమశిక్షణ విలువ
2) సృజనాత్మక విలువ
3) నైతిక విలువ
4) బౌద్ధిక విలువ

2. మొక్కల్లో నీటి ప్రసరణ అనే పాఠ్యాం శంలో జీవశాస్త్రంతో సహసంబంధం ఉన్నది/ ఉన్నవి?
1) భూగోళ శాస్త్రం
2) శరీరధర్మ శాస్త్రం, భౌతిక శాస్త్రం
3) భూగోళ శాస్త్రం, రసాయన శాస్త్రం
4) రసాయన శాస్త్రం

3. జీవశాస్త్ర బోధన ఉద్దేశం కానిది?
1) వివిధ శాస్త్రాల మధ్య సంబంధం, పరస్పరాధారం గురించిన పరిజ్ఞానం
2) విలువలను బోధన గమ్యాలుగా గుర్తింపజేయడం
3) జీవశాస్త్రం పట్ల సరైన దృక్పథాన్ని పెంచడం
4) జీవశాస్త్ర ప్రాముఖ్యాన్ని మరింత కచ్చితంగా స్వభావానికి అనుగుణంగా గుర్తించడం

4. వింధ్య జీవశాస్త్ర అధ్యయనం చేసి ఎలాంటి వత్తిడులకు లోనుకాకుండా, నిష్పాక్షికంగా నిర్ణయాలను తీసుకోగలిగే సామర్థ్యాన్ని సంతరించుకుంది. ఆమెలో పెంపొందిన విలువ?
1) నైతిక విలువ 2) బౌద్ధిక విలువ
3) క్రమశిక్షణ విలువ
4) శాస్త్రీయ విలువ

5. రిచర్డ్ వైట్ పీల్డ్ ప్రకారం ఉదేశాలు, లక్ష్యాలకు మధ్య సంబంధం?
1) ఉద్దేశాలు, లక్ష్యాలు రెండూ ఒకటే
2) లక్ష్యాల నుంచి ఉద్దేశాలు ఉద్భవిస్తాయి
3) ఒక గొలుసు రూపంలో ఉంటుంది
4) వేటికవే ప్రత్యేకతలు కలిగి ఉన్నాయి

6. జీవశాస్త్ర ఉపాధ్యాయునికి 'శ్వాసక్రియ'ను బోధించడంలో ఏ సబ్జెక్టుల పరిజ్ఞానం దోహదపడుతుంది?
1) భౌతికశాస్త్రం
2) రసాయన శాస్త్రం
3) రసాయన, భౌతిక, గణిత శాస్త్రాలు
4) రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం

సమాధానాలు

1) 3 2) 2 3) 1
4) 1 5) 3 6) 3

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com


సాక్షి ప్లస్
సోమవారం: 23-9-2024

‘రేడియో అన్నయ్య’ అని ఎవరిని పిలిచేవారు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ



మాదిరి ప్రశ్నలు

1. ‘తూర్పు దేశాల్లో విప్లవ ప్రతీక’ అని ఎం.ఎన్. రాయ్‌ని ప్రశంసించిందెవరు?
 1) స్టాలిన్ 2) లెనిన్
 3) మావోట్సేటుంగ్ 4) చౌ-ఎన్-లై
2. రాజకీయాల్లో జోక్యం కల్పించుకున్న తొలి సిక్కు మత గురువు ఎవరు?
 1) గురు తేజ్‌బహదూర్
 2) గురు అంగద్ 3) గురు అర్జున్‌సింగ్
 4) గురు గోవింద్‌సింగ్
3. కింది వాటిలో సరైన జత ఏది?
 1) సర్ విలియం స్లీమన్ - థగ్గులను అణిచి వేశాడు
 2) కాంప్‌బెల్ - పాలెగాళ్లను అణిచి వేశాడు
 3) సర్ థామస్ హిస్లాప్ - పిండారులను అణిచి వేశాడు
 4) పైవన్నీ సరైనవే
4. కలకత్తాలో ‘టెలిఫోన్ ఎక్స్ఛేంజ్’ను వైస్రాయ్ రిప్పన్ కాలంలో ఏ సంవత్సరంలో స్థాపించారు?
 1) 1881 2) 1882 3) 1883 4) 1884
5. ‘ఆర్కాట్’ను రాబర్ట్ క్లైవ్ ఏ సంవత్సరంలో ఆక్రమించాడు?
 1) 1752 2) 1754 3) 1756 4) 1757
6. ‘గ్రంథాలయ గాంధీ’ అని ఎవరిని పిలిచేవారు?
 1) బసవరాజు అప్పారావు
 2) వెలగా వెంకటప్పయ్య
 3) రావిచెట్టు రంగారావు
 4) చెన్నాప్రగడ భానుమూర్తి
7. 1901లో వ్యవసాయదారులకు రుణాలు ఇవ్వడానికి వ్యవసాయ బ్యాంక్ స్థాపించాలని సూచించిన కమిటీ ఏది?
 1) సర్ జేమ్స్ లయల్ కమిటీ
 2) సర్ రిచర్డ్ స్ట్రాచీ కమిటీ
 3) సర్ ఆంథోనీ మాక్ డోనాల్డ్ కమిటీ
 4) సర్ జాన్ ఉడ్ కమిటీ
8. ‘రేడియో అన్నయ్య’ అని ఎవరిని పిలిచేవారు?
 1) మాదాల వీరభద్రరావు
 2) చిలుకూరి వీరభద్రరావు
 3) న్యాయపతి రాఘవరావు
 4) వెన్నెలకంటి రాఘవయ్య
9. భారత జాతీయ సైన్స్ కాంగ్రెస్‌ను కలకత్తాలో ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
 1) 1908 2) 1910 3) 1912 4) 1914
10. స్వదేశీ సంస్థానాల రాజులకు వ్యక్తులను దత్తత తీసుకునే హక్కును బ్రిటిషర్లు ఏ సంవత్సరంలో కల్పించారు?
 1) 1858 2) 1859 3) 1860 4) 1861
11. అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం తొలి సమావేశం (1943) తాపీ ధర్మారావు అధ్యక్షత ఎక్కడ నిర్వహించారు?
 1) తెనాలి 2) నూజివీడు
 3) ప్రొద్దుటూరు 4) నంద్యాల
12. 1929లో ‘నవజీవన్ ట్రస్ట్’ను గాంధీజీ ఏ ప్రాంతంలో ఏర్పాటు చేశారు?
 1) అహ్మదాబాద్ 2) చంపారన్
 3) ఎరవాడ 4) పోరుబందరు
13. ‘రజనీగంధ’ కవితా సంకలనం రాసిన వారెవరు?
 1) కాత్యాయనీ విద్మహే
 2) వోల్గా 3) రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి
 4) పాపినేని శివశంకర్
14. బ్రిటిషర్లకు వ్యతిరేకంగా ‘భిల్లులు’ ఎవరి నాయకత్వంలో తిరుగుబాటు చేశారు?
 1) సామ్ బిసాయ్ 2) సేవారాం
 3) చిత్తుర్‌సింగ్ 4) కన్హు
15. 1935లో ‘భారత చరిత్ర కాంగ్రెస్’ తొలి సమావేశం ఎక్కడ నిర్వహించారు?
 1) పుణె 2) నాగ్‌పూర్
 3) కటక్ 4) వారణాసి
16. 1921 ఫిబ్రవరి 8న సంస్థానాధీశుల మండలిని ఢిల్లీలో ప్రారంభించిందెవరు?
 1) ఐదో జార్జి 2) ఆరో జార్జి
 3) డ్యూక్ ఆఫ్ కానాట్ 4) ప్రిన్స్ ఆఫ్ వేల్స్
17. ఖైదీల సౌకర్యాల కోసం 64 రోజులు దీక్ష చేసిన జతిన్ దాస్ ఏ తేదీన మరణించారు?
 1) 1928 మార్చి 23 2) 1928 ఏప్రిల్ 16
 3) 1929 సెప్టెంబర్ 13
 4) 1929 డిసెంబర్ 13
18. ‘సర్వోదయ ఉద్యమం’ నాయకుడెవరు?
 1) మినూమసానీ
 2) జయప్రకాశ్ నారాయణ్
 3) అచ్యుత్ పట్వర్ధన్ 4) ఎం.ఎన్. రాయ్
19. 1932లో ఆంధ్రలో బి.ఎ. ఉత్తీర్ణులైన తొలి మహిళ ఎవరు?
 1) పొణకా కనకమ్మ
 2) ఆచంట రుక్మిణీ లక్ష్మీపతి
 3) డొక్క సీతమ్మ
 4) న్యాయపతి కామేశ్వరి
20. కింది వాటిలో సరైన జత ఏది?
 1) రాజేంద్ర సింహాజీ - ఆపరేషన్ పోలో
 2) బట్లర్ కమిటీ - 1927
 3) సూర్యసేన్ - మాస్టర్‌దా
 4) పైవన్నీ సరైనవే
21. అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయ నిర్మాణం ఏ సంవత్సరంలో పూర్తయింది?
 1) 1601 2) 1602 3) 1604 4) 1606
22. నిజాం రాజ్యం (హైదరాబాద్)లోకి ఆయుధాలను చేరవేసిన సిడ్నీకాటన్ ఏ దేశస్థుడు?
 1) జర్మనీ 2) ఆస్ట్రేలియా
 3) ఇటలీ 4) పోర్చుగల్
23. ‘రంగీలీరాజా’ అని ఏ మొగల్ రాజును పిలిచేవారు?
 1) రెండో అక్బర్ 2) షాఆలం
 3) మహమ్మద్‌షా
 4) రెండో బహదూర్‌షా
24. కార్మిక సంఘాలతో వామపక్షాన్ని రూపొందించడానికి భారత్ వచ్చిన బ్రిటిషర్ ఎవరు?
 1) జార్జి రస్సెల్ 2) జార్జి ఎలిజన్
 3) సర్ స్ట్రాఫర్డ్ క్రిప్స్
 4) ఎ.వి. అలెగ్జాండర్
25. ప్లాసీ యుద్ధ (1757) సమయంలో బెంగాల్ గవర్నర్ ఎవరు?
 1) రాబర్ట్ క్లైవ్ 2) కార్టియర్
 3) డ్రేక్ 4) వారన్ హేస్టింగ్స్
26. గాంధీజీ.. సబర్మతి ఆశ్రమం నుంచి ఎన్ని రోజులు యాత్ర నిర్వహించి, దండిలో ఉప్పు చట్టాలను ఉల్లంఘించారు?
 1) 21 2) 23 3) 24 4) 26
27. ఏఐసీసీకు ఎన్నికైన తొలి తెలుగు మహిళ ఎవరు?
 1) పొణకా కనకమ్మ
 2) భారతీదేవి రంగా
 3) దువ్వూరి సుబ్బమ్మ
 4) దుర్గాబాయి దేశ్‌ముఖ్
28. కింది వాటిలో సరైన జత ఏది?
 1) లాండ్ హోల్డర్స్ సొసైటీ - కలకత్తా
 2) రామకృష్ణ మిషన్ - బేలూరు
 3) గేట్‌వే ఆఫ్ ఇండియా - బొంబాయి
 4) పైవన్నీ సరైనవే
29. లీడర్ పత్రిక స్థాపకుడెవరు?
 1) డబ్ల్యు.సి. బెనర్జి
 2) మదన్ మోహన్ మాలవ్య
 3) విఠల్‌భాయ్ పటేల్
 4) మహమ్మద్ ఇక్బాల్
30. ‘నిషాన్-ఎ-పాకిస్తాన్’ బిరుదు పొందిన ఏకైక భారతీయుడెవరు?
 1) మహాత్మాగాంధీ 2) జె.బి. కృపలానీ
 3) చరణ్‌సింగ్ 4) మొరార్జీ దేశాయ్
31. రెగ్యులేటింగ్ చట్టం - 1773 ప్రకారం భారత్‌లో ఈస్టిండియా కంపెనీ వ్యాపారం ఎన్ని ఏళ్లకు పరిమితం చేశారు?
 1) 15 2) 20 3) 25 4) 30
32. కింది వాటిలో చివరగా జరిగిన చారిత్రక సంఘటన ఏది?
 1) మీర్ ఉస్మాన్ అలీఖాన్ లొంగుబాటు
 2) గోవా విముక్తికి ‘ఆపరేషన్ విజయ్’ నిర్వహణ
 3) అల్లూరి సీతారామరాజు మరణం
 4) క్రిప్స్ రాయబారం
33. ‘సర్వెంట్స్ ఆఫ్ ద పీపుల్ సొసైటీ’ స్థాపకుడెవరు?
 1) లాలా లజపతిరాయ్
 2) సురేంద్రనాథ్ బెనర్జీ
 3) జార్జియాల్ 4) గోపాలకృష్ణ గోఖలే
34. రవీంద్రనాథ్ ఠాగూర్ ‘గీతాంజలి’ గ్రంథాన్ని బెంగాలీ భాషలో ఏ సంవత్సరంలో ముద్రించారు?
 1) 1910 2) 1911 3) 1912 4) 1913
35. మహాత్మాగాంధీ తన ఐదో కుమారుడిగా ఎవరిని ప్రకటించారు?
 1) ఖాన్‌అబ్దుల్ గఫార్‌ఖాన్
 2) జి.డి. బిర్లా 3) పొట్టి శ్రీరాములు
 4) జమ్నాలాల్ బజాజ్
36. హిందూ, ముస్లిం వాస్తు శైలిలో నిర్మించిన నిర్మాణం ఏది?
 1) విఠలాలయం 2) పద్మమహల్
 3) ముత్యాలశాల 4) బులందర్వాజా
37. 1914లో కలకత్తాలో నిర్వహించిన తొలి ‘భారతీయ సైన్స్ కాంగ్రెస్’ సమావేశానికి అధ్యక్షుడెవరు?
 1) శాంతిస్వరూప్ భట్నాగర్
 2) జమ్నాలాల్ బజాజ్
 3) ప్రఫుల్ల చంద్రరాయ్
 4) అశుతోష్ ముఖర్జీ
38. షాజహాన్ పాలనా కాలంలో భారత్‌ను సందర్శించిన ఇటలీ యాత్రికుడెవరు?
 1) నికోలాయ్ మనుక్కి 2) ట్రావెర్నియర్
 3) బెర్నియర్ 4) నికోలాకోంటి
39. లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ జయంతిని అక్టోబర్ 11ను ఏ పేరుతో నిర్వహిస్తారు?
 1) కుష్టువ్యాధి నిర్మూలనా దినోత్సవం
 2) జాతీయ సమైక్యతా దినోత్సవం
 3) ప్రజాస్వామ్య పరిరక్షణ దినం
 4) కిసాన్ దినోత్సవం
40. బిపిన్ చంద్రపాల్ రాజకీయ గురువు ఎవరు?
 1) బాలగంగాధర తిలక్
 2) మహాదేవ గోవింద రనడే
 3) డబ్ల్యు.సి. బెనర్జీ
 4) సురేంద్రనాథ్ బెనర్జీ
41. ‘భరత ఖండంబు చక్కని పాడియావు..’ అనే దేశభక్తి గేయాన్ని రాసిందెవరు?
 1) కాశీనాథుని నాగేశ్వరరావు
 2) చిలకమర్తి లక్ష్మీనరసింహం
 3) రాయప్రోలు సుబ్బారావు
 4) గురజాడ అప్పారావు
42. భారతదేశంలో మొదటి మహిళా న్యాయవాది ఎవరు?
 1) లీలా శాంసన్ 2) టి. మీనాకుమారి
 3) దుర్గాబాయి దేశ్‌ముఖ్
 4) కార్నేలియా సోరాబ్జీ
43. నేతాజీ బోస్.. విమాన దుర్ఘటనలో తైపీ ప్రాంతంలో ఏ తేదీన అదృశ్యమయ్యారు?
 1) 1946 ఆగస్టు 18
 2) 1945 అక్టోబర్ 18
 3) 1945 ఆగస్టు 18
 4) 1946 నవంబర్ 16
44. తొలి తెలుగు పత్రిక ‘సత్యదూత’ ఎక్కడ ప్రచురించారు?
 1) మద్రాస్ 2) బెంగళూరు
 3) బళ్లారి 4) కోయంబత్తూరు
45. హైదరాబాద్ రాజ్యంలో ‘కామ్రేడ్స్ అసోసియేషన్’ను ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
 1) 1939 2) 1941
 3) 1943 4) 1944
46. దేశ తొలి రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్ జయంతిని డిసెంబర్ 3న ఏ దినోత్సవంగా నిర్వహించాలని నిర్ణయించారు?
 1) యోగా దినోత్సవం
 2) అమరవీరుల సంస్మరణ దినోత్సవం
 3) కార్మిక దినోత్సవం
 4) వ్యవసాయవిద్యా దినోత్సవం
47. ‘సైనికత్వం, సామ్రాజ్యవాదం.. పెట్టుబడిదారీ వ్యవస్థకు జన్మించిన కవల పిల్లలు’ అని అన్నదెవరు?
 1) బిపిన్ చంద్రపాల్
 2) బాలగంగాధర తిలక్
 3) లాలా లజపతిరాయ్
 4) అరవింద ఘోష్
48. ‘హైదరాబాద్ కంటింజంట్’ సైన్యాన్ని ఏర్పాటు చేసిన వారెవరు?
 1) విలియం పామర్
 2) హెన్రీ రస్సెల్
 3) హెచ్.సి. బ్రిగ్స్
 4) కల్నల్ డేవిడ్‌సన్
49. త్యాగశీలి దొడ్డి కొమరయ్య ఏ తేదీన మరణించారు?
 1) 1946 జూలై 4 2) 1946 ఆగస్టు 14
 3) 1946 సెప్టెంబర్ 16
 4) 1946 అక్టోబర్ 4
50. బ్రిటిషర్ల కాలంలో మద్రాస్ నగరంలో ‘కరణం’ను ఏమని పిలిచేవారు?
 1) బనియా 2) తలవరి
 3) దుబాసీ 4) కనకపిళ్లై
51. ‘తెలంగాణ సాయుధ పోరాటం - దాని పాఠాలు’ రాసిందెవరు?
 1) రావి నారాయణరెడ్డి
 2) చంద్ర రాజేశ్వరరావు
 3) పుచ్చలపల్లి సుందరయ్య
 4) తరిమెల నాగిరెడ్డి
52. ‘జనగణమన’ జాతీయ గీతాన్ని ఏ జాతీయ కాంగ్రెస్ సమావేశంలో తొలిసారి ఆలపించారు?
 1) 1911 - కలకత్తా
 2) 1916 - లక్నో 3) 1917 - కలకత్తా
 4) 1920 - నాగ్‌పూర్
53. ‘తెలంగాణ కాలాపానీ’ అని పిలిచే జైలు ఏది?
 1) వరంగల్ జైలు 2) మామునూర్ జైలు
 3) నిజామాబాద్ జైలు
 4) చంచల్‌గూడ జైలు
54. హైదరాబాద్‌లో విక్టోరియా మెమోరియల్ అనాథాశ్రమాన్ని ఎవరు స్థాపించారు?
 1) మీర్ మహబూబ్ అలీఖాన్
 2) సికిందర్‌జా 3) మీర్ ఉస్మాన్ అలీఖాన్
 4) అఫ్జల్ ఉద్దౌలా
55. ప్రాచీన కట్టడాల సంరక్షణ చట్టాన్ని కర్జన్ కాలంలో ఏ సంవత్సరంలో చేశారు?
 1) 1901 2) 1902
 3) 1903 4) 1904
56. 1534లో పోర్చుగీసులు బొంబాయి ద్వీపాన్ని ఎవరి నుంచి పొందారు?
 1) హుమాయూన్ (మొగల్)
 2) బహదూర్ షా (గుజరాత్)
 3) శ్రీకృష్ణదేవరాయలు (విజయనగరం)
 4) ప్రతాపరుద్ర గజపతి (ఒడిశా)
57. సబర్మతి ఆశ్రమం (ప్రస్తుత నిర్మాణం) రూపశిల్పి ఎవరు?
 1) చార్లెస్ ఢఫ్ 2) అలెగ్జాండర్ రే
 3) చార్లెస్ కొర్రెయ్ 4) గ్రూసెట్
58. భారత్‌లో జాతీయ సైనిక దినోత్సవం ఏ తేదీన నిర్వహిస్తారు?
 1) జనవరి 15 2) జనవరి 25
 3) జనవరి 12 4) ఫిబ్రవరి 9

సమాధానాలు

1) 2	2) 3	3) 4	4) 2	5) 1
6) 2	7) 3	8) 3	9) 4	10) 3
11) 1	12) 1	13) 4	14) 2	15) 1
16) 3	17) 3	18) 2	19) 4	20) 4
21) 3	22) 2	23) 3	24) 2	25) 3
26) 4	27) 1	28) 4	29) 2	30) 4
31) 2	32) 2	33) 1	34) 1	35) 4
36) 2	37) 4	38) 1	39) 3	40) 4
41) 2	42) 4	43) 3	44) 1	45) 1
46) 4	47) 3	48) 2	49) 1	50) 4
51) 3	52) 1	53) 2	54) 1	55) 4
56) 2	57) 3	58) 1		

The antonym of ameliorate is



BANK EXAMS

ENGLISH LANGUAGE

MODEL QUESTIONS

Directions (Q.No. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. India expresses concern (1)/ regarding the ongoing violence (2)/ in Myanmar's Rakhine province that has triggered (3)/ an exodus of the Rohingya into Bangladesh. (4)/ No error (5)
2. Despite growing pressure (1)/ from family and visible signs of threats, (2)/ the rationalist say he knows (3)/ no other way but to fight till the end. (4)/ No error (5)
3. According to Deloitte India is poised to emerge (1)/ an economic superpower, (2)/ driven in part by its young population, (3)/ while China and the Asian Tigers age rapidly. (4)/ No error (5)
4. The Centre told the Supreme Court (1)/ that the Rohingya Muslims are illegal immigrants in the country (2)/ and there continuous stay posed (3)/ serious national security ramifications. (4)/ No error (5)
5. To improve its efficiency (1)/ all income tax officers (2)/ will be provided (3)/ with laptops by next year. (4) / No error (5)

Directions (Q.No.6-10): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) Winds dropped to a quite potent 185 kph by the time Irma made landfall on Marco Island, on the Florida Peninsula, still a major and dangerous hurricane yet not near its 297 kph former self when it set a record on Tuesday for the most powerful storm in the open Atlantic.

B) Irma hit the Sunshine State as a big wide beast, though not quite the monster it once was shaping up to be.

C) And on top of that, Irma avoided what could have been its most destructive paths along the Florida Peninsula over Miami and the heavily developed Atlantic seaboard.

D) Irma's assault so soon after Harvey's deluge of Houston marked the first time the U.S. was hit by two Category 4 storms in the same year.

E) Before crashing into Florida, Hurricane Irma set all sorts of records for brute strength as it flattened Caribbean islands and swamped the Florida Keys.

F) Earlier, it was the most powerful recorded storm in the open Atlantic.

6. What is the FIRST sentence after rearrangement?
 1) A 2) B 3) C 4) D 5) E
7. What is the SECOND sentence after rearrangement?
 1) A 2) B 3) C 4) D 5) F
8. What is the FOURTH sentence after rearrangement?
 1) A 2) B 3) D 4) E 5) F
9. What is the FIFTH sentence after rearrangement?
 1) A 2) B 3) C 4) D 5) F
10. What is the LAST sentence after rearrangement?
 1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q. No.11-15): Each question below has a blank/two blanks, each blank indicating that something has been omitted. Choose the word/set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. Prime Minister Narendra Modi on Monday ____ for innovation and ____ skills among the youth and asked them to work for a modern India.
 1) batted, promoting
 2) tapped, proposing
 3) bet, developing
 4) proposed, primary
 5) enlightened, technical
12. The Centre has ____ funds for the purchase of bullet-proof vehicles for Jammu and Kashmir Police ____.
 1) allotted, person
 2) located, people
 3) allocated, personnel
 4) altered, populace
 5) owed, body
13. ____ promises by politicians year after year, VIP culture continues to ____ in India
 1) Despite, thrive
 2) Inspite, strive
 3) Further, diminish
 4) Although, perish
 5) However, flourish
14. Mass education system ____ lot of ____ on teaching and very little on learning.
 1) claims, regards
 2) teaches, elements
 3) absorbs, works 4) lays, stress
 5) finds, shortcomings
15. Hardly ____ he reached the jetty ____ the boat sank.
 1) did, than 2) as, when
 3) had, when 4) when, than
 5) does, than

Directions (Q.No. 16-20) Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

Despite the latest move by the Army to induct 800 women into its ranks, cold facts show that the Indian military is the last bastion of male dominance in the government. Many women in uniform are hoping that the country's first full-time women Defence Minister will take bold decisions against what they allege are systemic discrimination against women. Though Indian military has only a minuscule number of women in service, a noticeably large number of them are fighting court cases or complaints against discrimination in various forums. Over the past three years, with the government's focus on women's empowerment, the three services have taken some steps for expanding avenues for women, but several issues still remain. However, recruitment numbers of the past few years are almost at the same level with a decline in women joining the Army. While the issue of women in combat roles gets traction often, another aspect mostly neglected is the issue of permanent commission. The Navy is now taking women as pilots and observers on fixed-wing aircraft. This is the Short Service Commission (SSC) because they cannot be promoted as they cannot do sea service. The biggest catch is that women officers are taken under the SSC which is up to 14 years. Due to this, those leaving are left without any pension as pensionable service is 20 years. Commander Edayilliam stated that the ATC officers' course that they had undergone at the Air Force Academy in Dindigul was not recognized at par with the civil course at the Civil Aviation Training College, Allahabad. "So it is extremely difficult to get a second career based on it," she told.

"Navy is a wonderful service. We want more and more qualified people to join it," she added, longing for the uniform she once donned.

This is where there would be great expectations from Ms. Sitharaman to understand the intricacies and open the services. A group of Military Nursing Service members have been fighting the government for over a decade, demanding that they be treated as full officers. The Supreme Court has taken a firm stand, asking the military to ameliorate their condition. They are also hoping that the new defence minister will appreciate their plight. Former Defence Minister Manohar Parrikar had stated that the three services would induct women in combat roles in a phased manner as infrastructure had to be created.

The Indian Air Force has long had women pilots in transport and helicopters streams and last year commissioned three women fighter pilots on an experimental basis. Similarly, the Army gives permanent commission for women only in education, law and medical streams. But given the operational conditions and spread, the Army has been the most reluctant to take women in combat roles.

16. All the sentences are true except one from the following:
 1) The bitter fact is Indian Military is predominantly male dominated
 2) Women are optimistic about bold decisions against discrimination
 3) A large number of women are averse to court cases
 4) Inspite of some steps taken by the three services, several issues still trouble
 5) Recruitment numbers of the past few years see no change
17. Identify the correct statements from the following:
 a) The army has been keen to take women in combat roles
 b) The state-of-the-art facilities are available for women in the three services
 1) Only a 2) Only b
 3) Both a & b 4) Neither a nor b
 5) Either a or b
18. The synonym of **bastion** is:
 1) Citadel 2) Epitaph
 3) Cenotaph 4) Monument
 5) Antique
19. **Donned** means:
 1) Take off 2) Put on
 3) Pull out 4) Get in
 5) Throw off
20. The antonym of **ameliorate** is:
 1) Modernize 2) Mitigate
 3) Promote 4) Aggravate
 5) Progress

Directions: (Q.No.21-25) Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct. If there is no error mark (5) No correction required as your answer.

21. The book has withstood the advent of the cinema, television, and personal computer and are likely to be there in centuries to come
 1) The book has withstood the advent of the cinema, television, personal computer and are likely
 2) The book has withstood the advent of the cinema, television, and personal computer and are liable
 3) Books have withstood the advent of the cinema, television, and personal computer and are likely
 4) The book withstood the advent of the cinema, television, personal computer and is likely
 5) No correction required
22. We are eliminating languages, traditional diets, and eroding cultural practices at an alarming rate.
 1) We are eliminating languages, changing traditional diets, and cultural practices at an alarming rate.
 2) We are eliminating languages, changing traditional diets, and eroding cultural practices at an alarming rate.
 3) Languages, traditional diets, and cultural practices are being eroded at an alarming rate.
 4) Languages, traditional diets, and cultural practices are being eliminated alarmingly fast.
 5) No correction required
23. We decided to begin the meeting till he arrives.
 1) since he arrives
 2) when he arrives
 3) when he arrived 4) on arrival
 5) No correction required
24. The employees successfully carried out his instructions.
 1) carried on 2) carried of
 3) carry 4) carry to
 5) No correction required
25. You cannot dismiss him unless you had a good reason.
 1) until having 2) without
 3) except you have
 4) until to have
 5) No correction required

KEY

1) 1	2) 3	3) 2	4) 3	5) 1
6) 5	7) 4	8) 5	9) 1	10) 3
11) 1	12) 3	13) 1	14) 4	15) 3
16) 3	17) 4	18) 1	19) 2	20) 4
21) 3	22) 3	23) 3	24) 5	25) 2